శ్రీ రస్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.



శ్రీమదాంధ్ర

వచనరామాయణము

సుందరకాండము

సంస్కృతరామాయణమునకు సరియైన తెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామశాస్త్రిగారిచే

విరచితము



Vol. V

294.5922
SRE

చెన్నపురి:

పస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము

All Rights Reserved.] [*Price Rs.* 3—00

CI

శ్రీ రా మ

శ్రీరామచంద్రపర బ్రహ్మణే నమః.



శ్రీమదాంధ్ర

వ చ న రా మా య ణ ము

సు ం ద ర కా ం డ ము

సంస్కృతరామాయణమునకు సరియైన తెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామశా స్త్రిగారిచే

వి ర చి త ము



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11263

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11263

చ న్న పు రి:

వావిళ్ల రామస్వామిశా స్త్రులు అండ్ సన్న

వా రి చే బ్ర క టి త ము

All Rights Reserved.

294.5922
SRE

Printed by
V. VENKATESWARA SASTRULU TRUST
For V. RAMASWAMY SASTRULU & SONS
AT THEIR 'VAVILLA' PRESS
MADRAS—1964.—1000 Copies.

AOUA102B104


విషయసూచిక

సర్గము.		పుట.
1.	హనుమంతుఁడు సముద్రమును దాఁటుట ...	1
	హనుమంతునకు మైనాకుఁ డెదురగుట ...	8
	హనుమంతుఁడు సురసను నిరాకరించుట ...	12
	హనుమంతుఁడు సింహికను నిరాకరించుట ...	15
2.	హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశింప వేచియుండుట ...	17
3.	హనుమంతుఁడు లంకలోపలికిఁ బ్రవేశింపఁబూనుట ...	22
4.	హనుమంతుఁడు లంకలోపలఁ బ్రవేశించుట ...	25
5.	హనుమంతుఁడు రావణుని యంతఃపురంబున వెదకుట ...	27
6.	హనుమంతుఁడు రావణాదిగృహంబుల వెదకుట ...	31
7.	హనుమంతుఁడు రావణునియంతఃపురమున సీతను వెదకుట ...	33
8.	పుష్పకవిమాన వర్ణనము ...	36
9.	హనుమంతుఁడు రావణాంతఃపురమున సీతను వెదకుట ...	37
10.	హనుమంతుఁడు రావణునిఁ జూచుట ...	44
11.	హనుమంతుఁడు రాక్షస స్త్రీలను గాంచుట ...	48
12.	హనుమంతుఁడు సీతను జూడక వగచుట ...	52
13.	హనుమంతుఁడు విచారపడుట ...	54
14.	హనుమంతుఁ డశోకవనమునకుఁ బోవుట ...	60
15.	హనుమంతుఁడు సీతాదేవిఁ గాంచుట ...	64
16.	హనుమంతుఁడు సీతనుగూర్చి వగచుట ...	69
17.	హనుమంతుఁడు సీతను జూచుట ...	72
18.	రావణాసురుఁడు సీతను జూడవచ్చుట ...	75
19.	రావణుఁడు సీతను చూచుట ...	77
20.	రావణుఁడు సీతను బ్రతిమాలుట ...	79
21.	సీత రావణునిపలుకులకుఁ దృణముతోఁ బ్రత్యుత్తర మొసఁగుట	82
22.	రావణుఁడు సీతకు బదులుసెప్పుట ...	86
23.	రాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుట ...	90
24.	రాక్షసులు సీతను బెదరించుట ...	92
25.	సీత చింతించుట ...	95
26.	సీత చింతించుట ...	97
27.	త్రిజట తనస్వప్నవృత్తాంతము చెప్పుట ...	101
28.	సీత చింతించుట ...	105
29.	సీతాదేవికి శుభశకునము లగుట ...	108
30.	హనుమంతుఁడు సీతాదేవినిగూర్చి చింతించుట ...	109
31.	హనుమంతుఁడు రామునిచరితము గీర్తించుట ...	112
32.	సీత హనుమంతునిఁ జూచి విచారపడుట ...	114

సర్గము.

33. హనుమంతుఁడు సీతాదేవి నడుగుట ... 115
34. హనుమంతుఁడు సీతతో సంభాషించుట ... 118
35. హనుమంతుఁడు రామునిగుణంబుల వర్ణించుట ... 121
36. హనుమంతుఁడు సీతాదేవి కంగుళీయకము నొసంగుట ... 129
37. హనుమంతుఁడు సీతాదేవికి స్వస్వరూపము చూపుట ... 133
38. సీతాదేవి హనుమంతుని కానవా లిచ్చుట ... 138
39. హనుమంతుఁడు సీతను వీడ్కొనుట ... 144
40. హనుమంతుఁడు ప్రయాణమగుట ... 148
41. హనుమంతుఁ డశోకవనము పాడుచేయుట ... 150
42. రావణుఁడు హనుమంతునిమీఁదికి రాక్షసులను బంపుట ... 152
43. హనుమంతుఁడు చైత్యప్రాలురను నుగ్గుసేయుట ... 155
44. హనుమంతుఁడు ప్రహస్తసుతునిఁ జంపుట ... 157
45. హనుమంతుఁడు మంత్రిపుత్రుల నేడ్వురఁ బరిమార్చుట ... 159
46. రావణుఁడు సేనాధిపతుల నేవురను బంపుట ... 160
47. హనుమంతుఁ డక్షకుమారునిఁ జంపుట ... 163
48. రావణుఁ డింద్రజిత్తును బంపుట ... 167
49. హనుమంతుఁడు రావణుని వర్ణించుట ... 173
50. రావణుఁడు హనుమంతుని నడుగుట ... 174
51. హనుమంతుఁడు రావణునికి నీతిచెప్పుట ... 176
52. విభీషణుఁడు రావణునికి హితంబు సెప్పుట ... 180
53. రాక్షసులు హనుమంతుని తోఁకకు నిప్పంటించుట ... 183
54. హనుమంతుఁడు లంకను గాల్చుట ... 186
55. హనుమంతుఁడు సీత నశించెనని వగచుట ... 190
56. హనుమంతుఁడు లంకనుండి ప్రయాణమగుట ... 193
57. హనుమంతుఁడు సముద్రము దాఁటివచ్చుట ... 196
58. హనుమంతుఁడు తనవృత్తాంతము దెల్పుట ... 199
59. హనుమంతుఁడు లంకలోని సంగతులఁ దెల్పుట ... 211
60. అంగద జాంబవంతుల సంభాషణము ... 214
61. వానరులు మధువనంబు ప్రవేశించుట ... "
62. వానరులు మధువును గ్రోలుట ... 216
63. దధిముఖుఁడు సుగ్రీవునికడకు వచ్చుట ... 219
64. వానరులు సుగ్రీవునికడకుఁ బోవుట ... 221
65. హనుమంతుఁడు సీతాదేవివృత్తాంతము రాముని కెఱిఁగించుట ... 224
66. శ్రీరాముఁడు చూడామణిని జూచి దుఃఖించుట ... 225
67. హనుమంతుఁడు సీతాదేవి చెప్పినవృత్తాంతము రాముని కెఱిఁగించుట 227
68. హనుమంతుఁడు సీతాదేవి చెప్పినసంగతి రామున కెఱిఁగించుట 229

ر



హనుమంతుడు సముద్రమున దాటుట. సుం—1

శ్రీ రస్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః.

శ్రీమదాంధ్ర

వచనరామాయణము

సుందరకాండము

1-వసర్గము

హనుమంతుఁడు సముద్రమును దాఁటుట

అవతారిక :—పూర్వకాండమున నెన్ని తెఱఁగులనైనను మిత్ర రక్షణము చేయఁదగినది యని చెప్పఁబడినది. ఈ సుందరకాండమున దూత యిట్లిట్లుండవలయుననియు, పతివ్రతయగు భామ యీ యీ తీరున నడచుకొనవలయు ననియుఁ బ్రతిపాదింపఁబడుచున్నది.

ఱట్లు జాంబవంతుఁడు ప్రోత్సాహపఱచినతరువాత శత్రువులను నశింపఁజేయఁగల హనుమంతుఁడు రావణునిచే నపహృతయైన సీతాదేవి యున్న తావు గనుఁగొనుటకై, చారణు లనెడి దేవయోనివిశేషులు సంచరించెడి యాకాశమార్గమునఁ బోవఁగోరి, చేయనలవికాని కార్యము నడ్డులేకుండఁ జేయఁగోరినవాఁడై, ఎత్తయిన తలయు, మెడయుఁగల, యాఁబోతువలె వెలుఁగుచుఁ, బెంపొందిన సింహమువలెఁ బఱ్ఱులను బెదరించుచు, ఱొమ్ముతోఁ జెట్లను గ్రిందఁద్రోయుచుఁ బెక్కు మృగములను జంపుచు, పచ్చలవంటి వన్నెగలవియయి, జలమువలె చల్లనైయుండు పచ్చికపట్టులందు బలగర్వములు మెఱయించుచుఁ దిరుగుచుండెను.

నీలి యెఱుపుఁ బసుపు నాకు పచ్చవన్నెలుఁ దెలుపు నలుపు వన్నెలుం గలయట్లు స్వభావముచే నేర్పడియున్న పలురంగులుగల గైరికాదిధాతువులు మిక్కుటంపుసొంపు గలిగింప, కోరినరూపమెత్తఁగల

దేవతుల్యులైన యక్ష కిన్నర గంధర్వ లంతటఁ దిరుగఁ బెక్కుమవపు
టేనుఁగులు విహరింపవెలయు నామహేంద్రపర్వత ప్రదేశమున నుండు
నా హనుమంతుఁడు కొలనియం దుండు నేనుఁగుకైవడి వెలుఁగు
చుండెను.

నేర్పరియగు హనుమంతుఁడు సూర్యునికిని, వేల్పు తేనికిని, బ్రహ్మదేవునికిని, భూతములకును దోసిలియొగ్గి, ప్రయాణము సలుపఁ దలఁచి, తూర్పుతట్టునకుఁ దిరిగి తన తండ్రియగు వాయుదేవునకు మ్రొక్కులిడి, దక్షిణదిశకుఁ బోవ నుంకించి, తనదేహమును బెంచి, కపివీరులు చూచుచుండ, రామునికార్యమునకై యెగురఁదలఁచిన వాఁడై, పర్వకాలములందలి సముద్రముచాడ్పున నుప్పొంగి, పరిమితి లేని యొడలితో నొప్పుచు, సముద్రమును దాఁటఁగోరి, చేతులతోను, గాళ్లతోను నాపర్వతమున నూఁది యుడియఁ బోయెను.

మహేంద్రము కదలనిడియైనను, ముహూర్తకాల మా హను మంతుని కాలుసేతుల త్రొక్కిడిచే బిట్టుగఁ గదల, నాపర్వతమునందలి పూచిన తరువులకొనలనుండి పువ్వు లవ్వారిగ రాలెను. ఇట్లు చెట్ల కొనలనుండి రాలిన సుగంధికుసుమరాసు లంతటఁ గ్రమ్ముకొనఁ బుష్ప మయంబోయన నాగిరి యొప్పుమీఱఁ, సాటిలేని మగటిమిగల హను మంతునివలన నదుమఁబడుచు, మదపుటేనుఁగు మదజలము గార్చు చందమున నీటిధారల నెడలించెను.

బలిమిగలవాఁడగు నా హనుమంతుఁడు తట్టిన తట్టున కాపర్వ తమునందలి బంగారు వెండి కాటుకయుఁగల బండలు చీలఁగా, నా బండల పగుళ్లనడుమనుండి వెండి బంగారు కాటుకవన్నెగల ధారలు వెలువడెను. అగ్నిహోత్రునుండి నడిమి దను ధూమ్రవర్ణయను వేరుగల జ్వాలతో పొగగుంపులు లేచుచందమున మణిశిలలతోఁగూడిన పఱిపు గల బండ లాపర్వతమునుండి దొఱలెను. హనుమంతుఁ డడిమిన యదు మునకు మహేంద్రపర్వతమడలఁగా, నా పర్వతగుహాలలోనున్న జంతువులెల్లఁ దొట్రుపడి వికృతధ్వనులతోఁ గూసెను. ఆ పర్వతపు రాయిడివలనఁ బుట్టిన యా గొప్పజంతువుల ధ్వని యుద్యానములం దును, భూమియందును, దెసలందును నిండి మెండుకొనెను.

ఆ పర్వతమునందలి సర్పము లా రాయిడి కోర్వఁజాలక, కోపము గొనుచుఁ దమపడగలమీఁది రేఖలు బయలుపడ గొప్పపడగలు పైకెత్తి గుభుల్గుభులుమని మండుచున్న యగ్నిని గ్రక్కుచుఁ దమ వాఁడికోఅలతో నా పర్వతమునందలి శిలలను గఅవఁగా, నా పాములు కోపముతో విషమెక్కునట్లు కొఱికినందున నా పర్వతమునందలి గొప్ప బండలెల్ల నగ్నిజ్వాలలతోఁగూడి, మండుచుఁ బటపట పగిలి పెక్కు ప్రయ్యలయ్యెను. అప్పర్వతమునఁ బొడమియుండు మూలికలు విషము నడఁపఁజాలిన వయినను, ఆ సర్పములవిషముఁ బోఁగొట్టఁజాలకుండెను.

అంతఁ దాపసులును, భూతము లీపర్వతముం బగుల నడం చెడినో యని భయంపడిరి. మఱియు నాపర్వతమున పుష్పమాలలు ధరించి మడించి, యెఱ్ఱని వన్నెగల పూలదండలను దాల్చి, కుంకు మారుణమగు చందనము నలఁదికొని, స్వాభావికముగాఁ దెలిదామర పువ్వువంటి వన్నెగలవయ్యు మద్యపానముచే నెఱ్ఱనై యున్న కన్నులు గల విద్యాధరు లులికిపడి, మద్యపానము చేయుస్థలమునందలి బంగరు కల్లుకుండలను, వెలగల పానపాత్రలను, బంగారు గిండ్లను, నానా విధములగు లేహ్యములను, భక్ష్యములను, పెక్కుతెఱఁగులైన మాంసములను, ఋషభచర్మముతోఁ జేయఁబడిన కేడెములను, బంగారు పిళ్లగల కత్తులను విడిచి, ముత్యాలసరమును, అందెలను, వంకీలను, కంకణములను దాల్చిన తమతమ రమణీమణులను దోడ్కొని, యుప్పర మున కెగురఁగా, నాయతివలు విస్మయపడుచు లేనగవుతో నొప్పుచు నాకసమున నిలఁబడియుండిరి.

విద్యాధరశ్రేష్ఠు లాప్రకారము నిలఁబడి, తమ యణిమాద్యష్ట సిద్ధుల నుపయోగించుచు నాకసమున గుంపులుగూడి యా మహేంద్ర పర్వతమును జూచిరి. పరబ్రహ్మధ్యానము చేయుతాపసులును, నిర్మల మగు నాకాశమున నుండు సిద్ధులును చారణులును, "పర్వతమువలె నెత్తైనవాఁడగు హనుమంతుఁడు రామునికార్యము నెఱవేర్చుటకును, తన వానరులకొరకును జేయనలవికాని పని చేయఁగోరి గడు వేగముతో నెగిరి, దాఁటనలవిగాని సముద్రమును దాఁటి లంకాపురమునకుఁ బోవ నున్నాఁడు" అని యొండొరులతోఁ జెప్పుచుండఁగా, నా విద్యాధరు

లామహర్షుల పలుకులు విని, కొలఁదియిడరాని మేనుగల వానరశ్రేష్ఠుఁడగు హనుమంతునిఁ జూచిరి.

అంతటఁ బర్వతముకైవడి నొప్పుమీఱు నప్పవమాననందనుఁడు రోమములు విదిర్చి, యొడలు కదలించి, కడు గొప్పదగు కాఱుమబ్బు ఉఱుముచందమున నొప్పు గొప్ప బొబ్బరింత పెట్టి, తా నుప్పరమున కెగయఁబోవుచు ఆదోఁకపాటున రోమములతో నంఁటియున్న తోఁకను వేడెబెట్టి, గరుత్మంతుఁ డురగంబునుం బోలెఁ బైకిఁజిమ్మెను. ఉరవడిఁ బూనిన యా హనుమంతుఁడు చుట్టి పైకివిసరిన యాతనితోఁక యాతని వెంబడి గరుఁడుఁ డెత్తికొనిపోవు సర్పముకైవడి నొప్పుచుండెను. మహా బలుఁడగు హనుమంతుఁడు గొప్ప గుదియలంబోలు భుజములను స్తంభింపఁజేసి దేహము గ్రుంగఁబట్టి పాదములును, చేతులును ముడిచి కొని, మెడ గుదియించి, తేజమును గైకొని, సత్త్వ మెచ్చుకొని, మగఁటిమిఁబూని, పైకిఁ జూపు నిగిడించి, కడుదూరమునకు మార్గమ్మును చూచి, యాకాశమును జూచుచుఁ బ్రాణముల బిగియఁబట్టి, మిక్కిలి దిట్టముగాఁ బాదము లూని, చెవులు రెండు నిక్కించి యెగయఁబూని యా వానరవీరులం జూచి యిట్లనియె:

"ఓ కపీంద్రులారా! ఏను రాముఁడు ప్రయోగించిన సాయకము చందమున, వాయువేగముబోలు వేగముగలవాఁడనై రావణుఁ డేలెడి లంకాపురమునకుఁ బోయి చేరెదను. అచ్చట నారాముని పత్నిని జానకీ దేవిని గాంచనేని, యిదే పరుగుతో స్వర్గలోకమునకుఁ బోయెదను. స్వర్గలోకమునను సీతను గాంచ నేని, అలఁతనొందక రాక్షసేంద్రుఁడగు రావణుని పెడతెక్కలు విఱిచికట్టి, యీడ్చి తెచ్చెదను. ఎట్టకేలకుఁ గార్యంబు సాధించికొని సీతనుదోడ్కొని వచ్చెదను. కాదేని యీ లంకాపట్టణమును రావణునితోఁగూడఁ బెళ్లగించి తెచ్చెదను." అని వానరో త్తముఁడగు వడిగలవాఁడయిన హనుమంతుఁడు వానరులతోఁ జెప్పి, పడిగాఁ పైకెగిరి, తన్ను గరుడునిఁబోలినవానిఁగఁ దలఁచెను.

ఆ హనుమంతుఁ డుప్పరమున కెగయుటయు, ఆతఁ డెగురు వేగమునకు నా పర్వతమునందలి వృక్షములు కొమ్మలన్నింటితోఁగూడఁ బెళ్లగిలి పైకెగిరినవి. ఆ హనుమంతునితొడలవేగమునకు క్రొవ్విన కొక్కెరలతోఁగూడిన కొన్ని వృక్షములు పుష్పములచే నొప్పారుచు

నిర్మలమగు నాకాశమున కెగిరి, యూరికిఁబోవు తమ బంధువును గొంత దూరము దారివిడువఁబోవునట్లును, సేనలు రాజును వెంబడించిపోవు నట్లును గొంతదూరము పోయినవి. అట్లు పుష్పించిన కొనలతోఁగూడిన పెక్కు-వృక్షములు వెంబడింప, పర్వతాకారుఁడయిన హనుమంతుఁడు చూపఱకు మహానందముఁగలిగించెను. మఱియుఁ జేవకల కొన్ని మహా వృక్షము లుప్పునీటిసముద్రమునఁబడి, పర్వతములు వేయిగన్నులవేల్పు నకు వెఱచి సముద్రమున మునుఁగుచున్నవో యనునట్లు తోఁచెను.

నానావిధములగు పుష్పములును, మొగ్గలును, అంకురములును నాపర్వతోపముఁడైన హనుమంతుని చుట్టు నిండియుండుటంజేసి, యా హనుమంతుఁడు మిణుఁగురులతోఁగూడిన పర్వతముకైవడిఁ దోఁచెను. జనులు తమబంధువులను సాగనంపుటకై నీటివఱకుఁబోయి మఱలి వచ్చు చందమున, నతనివేగమునకుఁ బెళ్ళగిలి పైకి పోయిన వృక్ష ములు పువ్వులఁదొఱఁగి, సాగరమునఁ బడినవి. మఱియు హనుమంతుని వేగమునకు నెక్కు-వ బలముగలవృక్షములు సముద్రమునఁ బడినవి. తక్కు-వబలముగల వృక్షము లా హనుమంతునిఁ గొంతదవ్వు వెంబ డించి, మఱలి సముద్రమునఁ బడినవి. నానావృక్షములందలి విచిత్ర కుసుమములు మఱింత తేలికయైనవగుటచేతఁ గడుద వ్వ్యాపించి వెంబడి నేగి, సముద్రమునఁ బడుటంజేసి, మహాసముద్రము నక్షత్రములచే శోభిత మైన యాకాశముపగిదిఁ దోచెను. నానావిధములగు పుష్పములరాసు లా హనుమంతునిఁ గొంతదవ్వు వెంటనంటిపోవఁగా, నాకాశమున నా హనుమంతుఁడు మెఱపులగుంపుతోఁ గూడిన మేఘమువడువున వెలుఁగుచుండెను. ఆ హనుమంతునివడిచే నెగిరివచ్చిపడిన కుసుమనికర సముద్రోదకముదయమునొంది చెలువుమీఱియున్న రిక్క-లగుంపుచేత సొబగుమీఱు గగనతలముమాడ్కి- వెలుఁగుచుండెను.

హనుమంతుఁ డెగిరిపోవునప్పుడు చాఁచిన యయిదువేళ్లతోఁ గూడిన యాతని బాహువులు పర్వతాగ్రమునుండి వెలువడిన యైదు తలలం బొలుపొందు పాముల భ్రాంతిదోపఁగా, మహాతేజుఁడగు నాతఁడు సముద్రమునైనఁ బోవునపు డలలతోఁ గూడ మహాసముద్రమును గ్రోలఁగడఁగినవిధమునను, మఱింతఁ బైనఁ బోవునపు డాకసము నప్ప ళింపఁ బూనినట్లును తోఁచెను. వాయుమార్గమునఁ బోవునట్టి వానర

శ్రేష్ఠుఁడగు హనుమంతునియొక్క నయనములు మెఱుపువంటి కాంతి గలవియగుటంజేసి, పర్వతంబునుండియుప్పతిల్లిన యగ్నులకైవడిని, పచ్చనికాంతిగలిగి, విఱివిమాఱి గుండ్రనివై యుండుటచే నేకకాలమున నుదయమగు సూర్యచంద్రులభాతినిఁ బ్రకాశించినవి. ఎఱ్ఱనిముక్కుచేఁ గెంజాయమీఱిన మోము సంధ్యారక్తిమతోఁ గూడిన సూర్యమండలముపగిదిఁ దోఁచెను. ఆకాశమున నేగుచుండు నా పవననందనుఁడు పైకెత్తిన యాతని వాల మున్నతమయిన యింద్రధ్వజముగతిఁ దోఁతెంచుచుఁ దెల్లని కోఱలతో నొప్పుచున్న తనకుఁ జుట్టుకొనఁగా, నతఁడు పరివేషముతోఁగూడిన సూర్యునిమాడ్కి వెలుఁగుచుండెను.

ఆ కపీంద్రుఁడంతట నెఱ్ఱనైనకటిప్రదేశముగలవాఁడై ప్రయ్యలయిన గొప్ప కావిఱాయిగల పర్వతముపగిదిఁ బరిఢవిల్ల నాతని ప్రక్కల నిండియుండు వాయువు జీమూతముచందంబున గర్జిల్లుచుండ, ఉత్తరదిక్కునుండి యాకాశమునకు వెడలినతోఁకతోఁగూడిన దట్టపు మిణుఁగురులుగల తోకచుక్కచందమునఁ దోఁచుచు, నడచుచుండు సూర్యుండువోలె వెలుఁగుచు నతిదీర్ఘకాయుఁడై, నడుమునపట్టగట్టుటచే నిడుపుపెరిగిన యేనుఁగుమాడ్కిఁ బొలుపారుచుండెను. హనుమంతుఁడు నీటిపైనఁ దెలియు శరీరమును, నీటిలోపలఁ గనఁబడు మేని ప్రతిబింబము నొక్కటియై కనఁబడుచుండ, సముద్రములోపల మునిఁగిన అడుగుభాగమును, బైనున్న పైభాగమును గలదై వాయువశమునఁ బోవుచున్న నావమాడ్కి నొప్పుచుండెను. ఆ హనుమంతుఁడు సముద్రమునఁబోయిన చోటులెల్ల నాతని యూరువేగమునకు సుడులు పడుట, నుఱుగులు వెలువరించుట, ధ్వనించుట మొదలగునవి గలవగుటచేత, సముద్రము మూర్ఛారోగముగలవానికైవడిఁ దోఁచెను. అప్పుడు మహావీరుఁడగు హనుమంతుఁడు పర్వతములవలె నెత్తయిన యలలవరుసలను బోలుయొక్క వేగముచేఁ బుట్టినగాలితో నణఁగఁగొట్టుచు మహాసముద్రమును ఘాటుఁ దొడఁగెను. వడిగల యాకపీంద్ర గమనవేగసంజనితమైన వాయువును మేఘువాయువును గలిసి స్వాభావికముగా గర్జించుచుండుసముద్రమున మఱింత ధ్వనిగలుగునట్లు చేసెను. ఆ కపిశార్దూలుఁడు లవణసముద్రమునందలి గొప్ప యలలగుంపును భూమ్యంతరిక్షములందుఁ జల్లు పెల్లున వెల్లివిరియఁజేయుచు, మేఘ

మందరపర్వతములంబోలి, మహాసముద్రోద్భవములైన తరంగములను లెక్కించువాఁడునుంబోలెఁ గడువేగిరముగా సముద్రముఁ గడవ దాఁటెను. అతఁడెగురువేగముచేఁ బైకెగిరిన జలము మేఘములతోఁ గూడినదై, యంతట వ్యాపించిన శరత్కాలమేఘశకలముల మాడ్కిఁ బ్రకాశించెను. అప్పుడు కట్టుబట్టలవిడిచిన శరీరుల యవయవములు చక్కఁగాఁ దెలియునట్లు, సముద్రమునందలి జలము పైకెగురుటచే నందలి చిఱుచేఁపలు, సొఱచేఁపలు, మొసళ్లును జక్కఁగాఁ గానవచ్చు చుండెను. ఆ సముద్రముననుండు సర్పములు సముద్రమును బైనదాఁటు చున్న యా హనుమంతునిఁ జూచి, తమ్ముఁ బట్టుకొనివచ్చిన గరుత్మంతుఁ డని వెఱచినవి.

పదియోజనముల వెడల్పును, ముప్పదియోజనముల నిడివియుఁ గలిగి గొప్పదయి మిక్కిలి సొంపుమీఱిన యా హనుమంతుని నీడ సముద్రమునఁ బర్వఁజేసిన నిర్మలమేఘముల దట్టంపువరుసమాడ్కి వెలయుచుండెను. మఱి యమ్మహాతేజుఁడగు గొప్పమేనివాఁడైన కపీంద్రుఁడు నిరాధారమయిన యాకాశమున తెక్కలుగల పర్వతము మాడ్కిఁ శోభిల్లెను. ఆ మహాసముద్రమునఁ గపికుంజరుఁడు జవసత్త్వ ములు మెఱయఁ బోవుమార్గమున సముద్రము దోనెగాఁ జేయఁబడి నట్లు తోఁచెను. కపిశ్రేష్ఠుఁడు పక్షులు దిరుగు మార్గమున గరుత్మంతుని మాడ్కిఁ బోవుచు, వాయువువలె మేఘములసమూహము నీడ్చి కొనుచు నతివేగమునఁ బోవుచుండ, నాహనుమంతునివేగముచే నీడ్వఁ బడినవై తెల్లనివి, ఎఱ్ఱనివి, నీలివి, పసుపుపచ్చనివియైన మహామేఘము లంతట వ్యాపించుచుఁ జెన్నుమీఱియుండెను. ఆకపివీరుఁడు కొంత తడవు మేఘములఁ జొఱఁబొఱుచు మఱుల మఱుల వెలువడుచు సారె సారెకు మేఘాచ్ఛాదితుఁడై, వెలువడు చంద్రునికైవడిఁ గనఁబడెను.

అత్తెఱఁగున నాకాశమునఁ బోవుచుండు నాప్లవగోత్తమునిఁ జూచి దేవగంధర్వదానవులు విరులవానఁ గురిపించిరి. సూర్యుఁడు వేఁడిమిగలిగింపఁడయ్యె. సీతాన్వేషణరూపమయిన రామునికార్యము సాధింపఁబోవు తన పుత్రునికి బడలిక లేకుండుటకై పవనుఁడుచల్లగా వీచెను. ఋషులు స్తోత్రములు సల్పిరి. దేవగంధర్వ లతని గొప్ప బలిమిని గొనియాడుచు గానములు సల్పిరి. మహాసముద్రమును దాఁటుచుఁ

గొంచెమేనియు శ్రమంబుఁగాంచని యాహనుమంతునిఁ జూచి, దేవ గంధర్వాయక్షరక్షఃపన్నగులు స్తోత్రములు సల్పిరి.

హనుమంతునకు మైనాకుఁ డెదురగుట

ప్లవంగమశ్రేష్ఠుఁడయిన యా హనుమంతుఁడు తన్ను దాఁటు చుండఁగా, సముద్రుఁడు తాను సగరునిచే నెలకొనినవాఁడగుటచే నా యిక్ష్వాకువంశస్థుల సమ్మానింపఁగోరినవాఁడై, తనలోఁ దానిట్లని వితర్కించెను: "నేనిప్పుడీ హనుమంతునికిఁ దోడ్పాటుచేయనేని, నే నందజీనోళ్లలోను బడిపోవుదును. నేనిక్ష్వాకువంశ ప్రధానుఁడయిన సగరునివలనఁ బెంపువడసితిని. ఇతఁడన్ననో యీ యిక్ష్వాకువంశము వారిమాత్ర. ఇతఁడు శ్రమపడఁజనదు. ఈ కపిసత్తముఁడు గొంతతడవు నాయందు బడలికదీర్చుకొని, తక్కినదారి సులువుగదాఁటిపోవునట్టి యుపాయము సేయవలయు" అని మంచితలంపుసేసి, తనలోపల నీటిలో దాఁగియున్న బంగారు శిఖరములుగల మైనాకమను పర్వతోత్తమముఁ జూచి యిటనెను :

ఓ పర్వతశ్రేష్ఠుఁడా! నిన్ను దేవేంద్రుఁడు పాతాళలోకమున నుండు దానవులకు గడియ వ్రాఁకునుగా నాయందు స్థాపించినవాఁడు. నీవు మహావీర్యసంపన్నులైన రాక్షసులు మాటిమాటికి వచ్చుచుండు నప్రమేయమగు పాతాళద్వారము నడ్డగించుకొని యున్నాఁడవు. మైనాకమా! నీకు మిాఁదికిని, క్రిందికిని, యడ్డముగను బెరుగుటకు శక్తిగలదు గావున నిన్నుఁ బ్రేరించెదను. గిరిసత్తమా! పైకిపైక్ష్మ. భీకరములగు పనులుసేయు వీరుఁడగు హనుమంతుఁడు సీతాన్వేషణ మను రాముని కార్యమునిమిత్తమై యిదిగో నీమిాఁదుగ నాకసమునఁ బోవుచున్నాఁడు. చూడుము. ఇక్ష్వాకువంశమువారికి సేవకుఁడయిన యీతనికి నేను సాయముచేవలయును. ఇక్ష్వాకువంశపురాజులు నాకు మిక్కిలి పూజింపఁదగినవారుగదా! నాకంటె నీకు మఱింత పూజింపఁ దగినవారు. కావున మనకార్యము సెడకుండ నీవు సాహాయ్యమొన ర్పుము. ఏకార్యమేని ముఖ్యముగాఁ జేయవలసినదియయి యుండు నప్పుడు దానిని జేయకుండినయెడల సాధువుల కాగ్రహము పుట్టును. కావున మైనాకుఁడా! నీవు నీటిలోనుండి పైకిరమ్ము. ఈ వానరుఁడు

నీయందుఁ గొంతతడవు విశ్రమించి తక్కిన దారి సాగిపోవును. ఈ వానరశ్రేష్ఠుఁడు మనచే మర్యాదసేయఁదగినవాఁడు. పసిండి శిఖరము గలవాఁడవు, దేవగంధర్వులచేఁ గొల్వఁబడువాఁడవునైన యో మైనాకుఁడా! హనుమంతుఁడు గొంతసేపు నీయందు విశ్రమించి, యావల మిగిలినదారిని దాఁటిపోవును. ఇదిగో వీర్యవంతుఁడగు నాకపిశ్రేష్ఠుఁడు నీమీఁదుగఁ బోవుచున్నాఁడు. రాముని దయాళుత్వమును, సీత విదేహ మున సుండుటయు హనుమంతుఁడు పడుప్రయాసముఁ దలఁచి నీవు వెంటనేలేచి పైకిరమ్ము" అని సముద్రుఁడు చెప్పెను.

బంగారు శిఖరములుగల మైనాకుఁడు సముద్రుఁడు నెప్పిన మాట విని, గొప్పచెట్లను తీఁగెలను గూడఁ దీసికొని, సూర్యుఁడు తన వేఁడివెలుఁగులఁ బ్రసరింపఁజేయుచు మేఘమండలము భేదించుచు వెలు వడునట్లు సముద్రజలమును భేదించికొని వెలువడి, నీటిచే గ్రమ్మఁబడి, కిన్నరులు మహోత్సవములుగల్గి, సూర్యోదయమువలె వెలుఁగుచు నింగి నొఱయుమాడ్కినున్న పసిఁడి శిఖరములమెఱుఁగులు ఇనుమువలె నల్ల నైన యాకాశమును బంగారువన్నెగల దానినిఁ జేయఁగా, తమంత వెలుఁగు బంగారు శృంగములతోఁగూడి సూర్యరు సూర్యులమాడ్కిఁ దోఁతెంచెను.

కడువేగముతోఁ బోవుచున్న హనుమంతుఁ డొక్కటిగాఁ దన యెదుట బొడమియున్న యాపర్వతముఁజూచి, మహోసముద్రమునఁ దనకిది యొక్క యాటంకమని తలఁచినవాఁడై, మిక్కిలి యెత్తయి యున్న యాపర్వతమును మారుతుఁడు మేఘముంబోలె ఱొమ్ముతోఁ బడఁగొట్టెను. మైనాకుండు హనుమంతునిచే నట్లుత్రోయఁబడి, యాతని వేగమునెఱిఁగి మనమున హర్షమునొంది రోమాంచితదేహుఁడై మానవరూపముతోఁ దనశిఖరాగ్రమున నిలిచి యాకాశమునఁ బర తెంచు కపీంద్రుఁజూచి సంతోష విస్మయంబులు పెనఁగొన నిట్లనియె:

వానరోత్తమా! నీవితరజన దుస్సాధ్యమయిన యీపని చేయఁ బూనితివి. శిఖరములపై వాలి కొంతతడవు స్వేచ్ఛగా బడలిక దీర్చి కొనుము. రఘువంశోద్భవులైన సగరులచే సాగరము పెంపొందింపఁ బడినది. ఆసాగరుఁడు రఘురాముని కార్యార్థమేగు నీకుఁ బూజసల్పఁ గలవాఁడు. ఉపకారికిఁ బ్రత్యుపకారమొనరించుట యనాదిసిద్ధమయిన

ధర్మము. కావున నీసముద్రుఁ డయ్యుపకారమునకు బదు లుపకారముఁ గావింపఁగోరినవాఁడై, నీవు దానుజేయునతిథిపూజను గ్రహించుట వలనఁ గలుగుగారవము నొందఁగోరుచున్నాఁడు. ఓ కపిశార్దూలుఁడా! సముద్రుఁడు నాకడకేతెంచి, "ఓ మైనాకుఁడా! ఈ హనుమంతుఁ డాకాశమున నూఱుయోజనములదవ్వును దాఁటఁబూనియున్నాఁడు. ఇతఁడు కొంతతడవు నీచటియందు విశ్రమించి తక్కినభాగముఁ బిమ్మట దాఁటును గావున నీవు పైకిలేచి యతనికడ్డముగానిలువు" అని నన్నుఁ బురికొలుపఁగా, నేను పైకిలేచితిని. కపికుంజరా! నాయెడ నిచ్చి గొంతసే పలఁతదీర్చుకొని పిదపఁ దక్కినదారి దాఁటుము. ఇప్పు డిచటనుండు సువాసనగలిగి తియ్యనైయుండు గడ్డలను, దుంపలను, పండ్లను దిని సేదఁదీర్చుకొని యావలఁ బోదువు. కపిముఖ్యా! మాకును నీతోడి సంబంధముకలదు. సత్పురుష సంపూజనము ముల్లోకములందును ప్రసిద్ధి గాంచినది. పవనతనయా, వడిగా దాఁటిపోవు వానరులలోపల నిన్ను ముఖ్యునిఁగాఁ దలఁచుచున్నాఁడను. సామాన్యునయినను వచ్చిన యతిథిని బుద్ధిమంతుఁడు సమ్మానముచేయవలయును. నేను సకలధర్మముల నెఱిఁగినవాఁడ. నీవో కడుగొప్పవాఁడవు. నీబోటివానినీ సకలధర్మముల నెఱిఁగిన నేను బూజింపవలయుననుట కేమైనను సందియమున్నదా? మఱియుఁ గపికుంజరా! నీవు మహాబలిష్ఠాలియగు దేవోత్తముఁడయిన పవనునికిఁ బుత్రుఁడవు. వేగమున నాతనికే సమానుఁడవు. ధర్మజ్ఞుఁడా! నిన్ను నేఁ బూజింతునేని, వాయుదేవుఁడును నాచేసిన పూజను బొందినవాఁడగును కావున నీవు నాచేఁ బూజింపఁదగినవాఁడవు. ఇదియకాక నిన్ను నేను గారవింప మఱియొక్క కారణ మున్నది చెప్పెద వినుము.

నాయనా! తొల్లి కృతయుగమునఁ బర్వతముల కన్నింటికిని రెక్కలుండెను. అవి యప్పుడు గరుడవాయువులవేగముఁబోలు వేగము గలవై యన్నివైపులకుఁ బోవుచుండెను. అవి యట్లు పోవుచుండఁగా, దేవతలు, మహర్షులు, సకలభూతములు తమపైఁ బడునేమో యని తలఁచిరి. అంత వేల్పులేఁ డలిగినవాఁడై, యచ్చటచ్చటనున్న పెక్కు పర్వతముల రెక్కలను వజ్రాయుధముతో నఱకెను. అట్లు నా రెక్కలను నఱకుటకై నాదాపున కేతెంచెను. నే నతనికి దెలిసి వాయు

దేవుని శరణు గోరఁగా, నతఁడు గడువేగిరముగాఁదెచ్చి నన్నీసముద్రము లోపలఁ ద్రోసి యడుగునకుఁ జేర్చెను. నీతండ్రి నాతెక్కలు పోనీయక నన్నింద్రునినుండి తప్పించి కాపాడెను. కావున మారుతుఁడు నాకు గారవింపఁ దగినవాఁడు. కావున నా వాయుదేవునిపుత్రుఁడవైన నిన్ను నే గారవించెదను. వానరముఖ్యా! మహాగుణంబుగల యీ సంబంధము నీతోడ నాకుఁ గలదు. మహావానరా! మనకీ రీతిని సంబంధమున్నది గావున నీవు కడు మోదమునొంది మా యతిథిపూజను గైకొని, నాకును సముద్రునకును సంతసమును గావింపుము. కపిసత్తమా! నా శిఖరములపయి వ్రాలి శ్రమదీర్చుకొనుము. మా యతిథిసత్కారము గ్రహింపుము. మా సత్కారమును గొప్పగాఁ దలఁపుము. నిన్నుఁ జూచుటచే మిక్కిలి సంతసించితిని" అని మైనాకుఁడు హనుమంతునిఁ బ్రార్థించెను.

వీర్యవంతుఁడైన కపిశ్రేష్ఠుఁడా మైనాకునిపలుకులు విని, "పర్వతేంద్రుఁడా! నీ వొనర్చిన యాతిథ్యమునకు సంతసించితిని. భవద్దర్శనాదులచేతనే యాతిథ్యమొనర్చినట్లయ్యె. నీ వొనర్చిన యతిథిపూజ నేను గైకొనినైతినని యాగ్రహము పూనకుము. కార్యసమయము నన్నుఁ ద్వరపెట్టుచున్నది. ప్రొద్దును పోవుచున్నది. నే నిచ్చట నిలిచితినేని, యీ దిన మిచ్చటనే యుండవలసివచ్చును. నేను నాతోడివానరుల యెదుట సముద్రమధ్యమున నెచ్చటను నిలువక లంకకుఁబోయి చేరెదనని ప్రతిజ్ఞ యొనర్చితి" నని చెప్పి, యా మైనాకునిఁ జేతితోఁ దాఁకి, చిఱునవుమోముతో నాకాశమున కెగిరి, యాసముద్రమైనాకులు రామకార్యసిద్ధికిఁబగిన దీవనలు సల్పి గారాబముతోఁ జూచుచుండఁగా, మిక్కిలి పైకెగిరి యాపర్వతమును సముద్రుని విడిచి తనతండ్రియగు వాయువు యొక్క మార్గము నొంది, మఱింతపైకిఁబోయి తలవంచి యాపర్వతము జూచుచు నిరాధారమై నిర్మలమైయున్న యాకాశ మార్గమునఁ బోయెను. ఆ హనుమంతుఁడు చేసిన యితరులకుఁ జేయ నలవికాని రెండవ వింతను (మైనాక పర్వతమున విడిసి యలఁతదీర్చుకొనకయె పోవుటను—మొదటివింత సముద్రమును దాఁటఁబూనుట—మైనాకమున విడియకయేపోవుట రెండవవింత—యని తెలియవలెను.) జూచి, వేల్పులందఱును, సిద్ధులును, మహర్షులును మిగుల నానందము నొందిరి.

వేల్పులును, వేల్పుదొరయు నాకాశమునసుండి యా కాంచనశృంగ ములుగల మైనాకునికార్యముఁ జూచి మోదము నందిరి.

అంత శచీపతి యా మైనాకునిపనికి సంతసించి, కడు మోద ముతో నా పర్వతరాజగు మైనాకునికడకు స్వయముగా నేగుదెంచి, "పుత్తడిశృంగములు గల యో మైనాకుఁడా! హనుమంతునివిషయ మున నీ వొనర్చిన కార్యమునకు సంతసించితిని. నావలని భయంబుగల వాఁడవయి యున్నను, నిర్భయుఁడవయి నూఱు యోజనములు దాఁటఁ బూనిన హనుమంతునికి సాయము చేసితివిగాన నీ కభయము నొసఁగు చున్నాను. నీ వింక నావలనివెఱపు మానియుండుము. ఈ వానరవీరుఁడు రామునికి దూతయై యాతని పత్నియగు సీతను వెదకుటకై సముద్రము దాఁటుచున్నాఁడు. ఇట్టి హనుమంతునికి నీవు సాయమొనర్చి నన్ను సంతోషపఱచితివి" అని చెప్పఁగా, పర్వతసత్తముఁడు నూఱుజన్నముల వేల్పు, వేల్పులదొరయునగు నింద్రుఁడు తన కార్యమున కామోదించి, తన కభయమొసఁగుటంగూర్చి మిక్కిలి సంతోషము నొందెను. వేల్పు దొరయు వేల్పులతో నంతర్ధాన మొందెను. మైనాకుఁడును దేవేంద్రుని వలన వరము బడసి నెమ్మదిగలవాఁడయ్యెను. హనుమంతుఁడును మైనాక పర్వతముంతు కడలి చేక్కిని ముహూర్తకాలములోపల దాఁటి పోయెను.

హనుమంతుఁడు సురసను నిరాకరించుట

అంతట దేవ గంధర్వ సిద్ధ మహర్షులు పాములతల్లియగు సురసను బిలిచి, సూర్యునిఁ బోలునట్టి యా సురసతో నిదె శ్రీమంతుఁడగు వాయునందనుఁడు హనుమంతుఁడనువాఁడు కడలిని దాఁటుచున్నాఁడు. నీవు పర్వతముఁ బుడమించు రాక్షసరూపము ధరించి, భయంకరము లగు కోఱలును, పచ్చని కన్నులును గలిగి భయముఁ దోఁపించు నాకా శమునంటి గొప్పవాయి తెఱచికొని యతనిని గొంతసేపడ్డగింపుము. మేమాతనిబలపరాక్రమముల నింకను దెలియఁగోరెదము. నిన్నతఁ డుపాయముతో గెలుచునో, లేక దిగులొందునో చూచెదము" అనిచెప్పి యామెను మర్యాదసేసి పంపఁగా, నా సురసయు రోఁత పుట్టించునదియు, రూపుసెడినదియు నందఱకు బీతుగావించునదియు

నైన రక్కసి రూపు దాల్చి సముద్రమున దాఁటిపోవుచున్న యా హనుమంతుని కడ్డముగా నిలఁబడెను. అంత హనుమంతుఁడు దగ్గఱకువచ్చినతోడనే యా సురస "ఓ వానరోత్తమా! వేల్పులు నిన్ను నా కాహారముగ నేర్పఱచిరి. ఈ నా నోటఁ జొఱఁబడుము" నిన్ను నేను తినెదను. అని చెప్పఁగా శ్రీమంతుఁడగు హనుమంతుఁడు చిఱునగవు మోమునఁ గదుర నడఁకువ దోఁప నిట్లనెను.

"ఓ రాక్షసీ! దశరథనందనుఁడగు రాముఁడనునాతఁడు తండ్రి పనుపునఁజేసి, తన తమ్ముని లక్ష్మణుని, తన పత్నిని జానకిని దోడ్కొని దండకావనమునఁ బ్రవేశించెను. రాక్షసులతోఁ బగపూనిన యతఁడు వేఱొక్కపనినిమిత్తము పోయియుండఁగా, రావణుఁడు పతివ్రతయగు నాతనిభార్యను సీతాదేవి నెత్తుకొనిపోయెను. నే నా రాముని పనుపున నా సీతాదేవికడకు దూతనుగాఁ బోయెదను. నీవును రాముని రాజ్యమున నుండుదానవు గావున నీ వతనికి సాయముచేయఁదగును. అట్లు కాదంటివేని నేను సీతను జూచివచ్చి యా సంగతి రామునికి నివేదించి, యాతనివిచారము మాన్పి మఱలివచ్చి నీవాయి చొచ్చెదను. నీకు సత్యముగాఁ బ్రతిజ్ఞ చేసి చెప్పుచున్నాను."

అని సురసతో హనుమంతుఁడు చెప్పఁగా గామరూపిణియగు సురసయు నాహనుమంతునిఁ గూర్చి, "యిది నాకు వరము. దీని నెవ్వఁడును మీరఁజాలఁడు"అని చెప్పియు, తనమాట సరకుసేయక యాహనుమంతుఁడు పోవుచుండుటగని, యాతనిబలము నెఱుఁగఁగోరినదై, "ఓ వానరోత్తమా! నీవు నా నోటఁ జొచ్చియే పోవలయును. ఇది నాకు మున్ను బ్రహ్మదేవుఁ డొసఁగిన వరము" అని చెప్పి, త్వరపడుచు నా వాయునందనుని ముందటఁ దన నోరు తెఱచికొని నిలఁబడెను. అప్పుడు హనుమంతుఁడు సురసమాట విని కడుఁ గినుకపూని, "యట్లె కానిమ్ము. నన్నుఁ బ్రిఁగఁజాలువిధమున నోరు తెఱవుము చూత" మని చెప్పి, పదియోజనములనిడివియు, బదియోజనముల వెడల్పును దొడరునట్లు తనదేహమును బెంచెను. (మహామేఘసన్నిభంబయిన యాతని రూపును జూచి, సురసయు నిరువదియోజనముల వైశాల్యము గలుగునట్లు తననోటిం దెఱచెను. అది కాంచి కుపితుఁడై హనుమంతుఁడు ముప్పదియోజనములపఱపు నంతటిపొడవుంగల యట్లు తన మేనిఁ

బెంచెను. సురసయు నలువది యోజనము లంతనోరు చేయఁగా, హను మానుఁ డేఁబది యోజనములంత దేహము గలవాఁడయ్యెను. అంత సురస యఱువది యోజనములంత మోము పెంపఁగా, హనుమంతుఁడు డెబ్బది యోజనములంతగఁ బెరిగెను. వెండియు సురస యెనుబది యోజనములంతగ మోము పెంపఁగా, హనుమంతుఁడు పర్వతము మాడ్కి తొంబది యోజనములంత మేను పెంచెను. సురసయు నూఱు యోజనములంతగాఁ దన నోటిని దెఱచెను.) అంతట హనుమంతుఁడు మిక్కిలి యుత్తేజాలి గనుకఁ బొడవునాలుకగలిగి కడు వెఱపుగలిగించు నదై నరకకూపముఁ బోలియున్న యా సురసమోమును గాంచి, తన దేహమును క్షణములోపలఁ గుఱుచపఱచి బొట్టనవ్రేలియంతటిరూపము దాల్చినవాఁడై, కడువేగముతో నా సురసమోము చొచ్చి వెలువడి వచ్చి, యంతరిక్షమున నిల్చి, కాంతిచే మెఱయుచు నిట్లనెను.

"ఓ దక్షపుత్రీ! నేను నీ నోరుసొచ్చి వెలువడితిని. నీకు మ్రొక్కెదను. నీకు బ్రహ్మదేవుఁ డొసఁగిన వరము నెఱవేఱెను. ఇఁక నేను సీత యుండుచోటిని వెదకఁబోయెదను" అని హనుమంతుఁడు పలు కఁగా, సురస స్వస్వరూపము ధరించి, తన మోమునుండి వెలువడి, రాహుముఖమోమునుండి వెడలిన చంద్రునిమాడ్కి వెలుఁగుచున్న హను మంతునిఁ జూచి, "వానరశ్రేష్ఠా! కార్యసాధనమునకై స్వేచ్ఛగాఁ బొమ్ము. సీతాదేవిని దెచ్చి మహోత్తుఁడగు రామునితోఁ జేర్పుము" అని చెప్పి స్వర్గలోకమునకుఁ జనియెను. అప్పుడు సకలభూతము లా హను మంతుఁ డొనర్చిన మూఁడవవింతను జూచి బలెబలెయని యాతనిఁ గొనియాడిరి.

ఇట్లు గరుత్మంతునిఁబోలు హనుమంతుఁడు దాఁట నలవికాని సముద్రముపై నాకాశమున కెగిరి, వారిధారలు గురియుచుండ, పక్షు లెగురుచుండ, నృత్తగీతవాద్యాదులయందు నేర్పరులగు తుంబుర నారద ప్రభృతులయిన మునులు దిరుగుచుండఁగా, నైరావతమను నింద్రధనుస్సు పర్వఁగా, సింహాములు, వ్యాఘ్రములు, ఏనుఁగులు, పక్షులు, పాములు వాహనములుగఁగల యొచ్చెములులేని విమాన ములు వచ్చుచుఁ బోవుచు సొంపుగలిగించుచుండఁగా, వజ్రాయుధము యొక్కయు, పిడుగులయొక్కయు నొఱపిడివలనఁ బుట్టిన యింగలములు

వెలుఁగు లీనఁగా, పుణ్యములొనర్చి, స్వర్గమునుబొందిన మహాపురుషుల యునికిచే సొంపొదవుచుండఁగా, వేల్పుల కొసఁగుటకై యగ్ని హోత్రుఁడు పెల్లుగా యజమానుఁ లిచ్చు హవిస్సులను గొంపోవుచు శోభిల్లఁగా, అంగారకాది గ్రహములును, తక్కిన నక్షత్రములును, సూర్యచంద్రులును, సొంపుసెంపు గలిగించుచుండఁగా, మహర్షులు గంధర్వులు, బన్నగములు, యక్షులును నంతట నిండియుండఁగా, విశ్వావసుఁడను గంధర్వరాజు వసింపఁగా, దేవేంద్రునిగజము దిరుగుచుండఁగా, పెక్కు విద్యాధరవీరులు గుంపులుగూడి విహరించుచుండఁగా, జీవలోకమునకు విజీవిగలయట్లు బ్రహ్మదేవునిచే నిర్మింపఁబడిన మేల్కట్టువలెఁ దోఁచుచు, సూర్యచంద్రులకు దారియై నిర్మలమయి యేకతమయి సర్వత్ర నిండియున్నట్లుగాఁ దోఁచునిరాధార మయిన వాయుమార్గమున గరుత్మంతునిమాడ్కిఁ జనుచు నంతటవారికిఁ గనఁబడుచు వ్రేలాడుచుండు తొక్కలుగల పర్వతోత్తమముకైవడి నాధారములేని యాకాశమునఁ జొఱఁబాఱెను.

హనుమంతుఁడు సింహికను నిరాకరించుట

ఇవ్విధమున నెగసిపోవుచుండు హనుమంతునిఁ జూచి, కామరూపిణియగు సింహికయను రక్కసి తనయొడలు పెంచి, "నేను చాలకాలమునుండి యాఁకలిగొనియుంటిని. ఇదె గొప్పజంతు వొక్కటి నాకుఁ జిరకాలమునకు దొఱకినది" యని తనలోపలఁ దలఁచికొని, యా హనుమంతునినీడ నీడ్చి పట్టెను.

ఆ సింహిక యట్లు హనుమంతుని నీడ నీడ్చిపట్టఁగా, వానరపుంగవుఁడు, పట్టుపడి కుంటుపడిన పరాక్రమముగలవాఁడయి "యేమి యీవింత ! యింతలో, నెదురుగాలిచే నడ్డుపెట్టఁబడ్డ నావయుఁబోలె నిలుపఁబడినవాఁడ నైతిని" అనియెంచి నలుప్రక్కలను, పైనను, క్రిందను దృష్టి సారించి, సముద్రమధ్యమున వెలికిలఁబరుండియున్న గొప్పజంతువును జూచి, దాని వికృతంపుమోమునుగని, "ఓహో ! ఇది మనరాజు సుగ్రీవుఁడు చెప్పిన వెఱఁగుచూపును నెక్కువ పరాక్రమమునుగల నీడనుపట్టుకొను రాక్షసిరూపమయియుండును ! దీనికి సందియములేదు" అని తలఁచెను. బుద్ధిమంతుఁడు గావునఁ

గార్యముల కలరూపు నెఱింగిన హనుమంతుఁ డది సింహికయని తెలి
సినవాఁడై, వార్షికమేఘముచాడ్పునఁ దనమేనిని బెంచెను.

హనుమంతుఁడు తనదేహము పెంచుటను జూచి, ఆ సింహి
కయు పాతాళగుహాంబోలు తన నోటిని దెఱచికొని, మేఘసంక్షిన్నలే
నుఱుముచు నా వానరనిమ్నోదికిఁ గవియఁబోయెను. అట్లు తన దేహ
మును మ్రింగుటకుఁ దగినంతగాఁ దెఱచిన యాసింహికమోమును
యాయపట్టులనెల్లనుజూచి, వజ్రదేహుఁడును, బలిష్ఠుఁడునగు హను
మంతుఁ డూహగలవాఁడగుటంజేసి, దేహమును కుఱుచఁజేసి, తెఱచి
యుండు నాసింహికనోటఁ బ్రవేశించెను. సిద్ధులు, చారణులు, సింహిక
నోటఁ జొచ్చుచుండు హనుమంతునిఁజూచి రాహువుచే మ్రింగఁబడు
పున్నమనాఁటి నింపుచంద్రునితో సాటిగాఁ దలఁచిరి. అంత హనుమం
తుఁడు సింహికకడుపులోని యాయపట్టులనెల్లఁ దనగోళ్ళతోఁ జీల్చి,
మనోవేగమున వెలువడి సూక్ష్మదృష్టితోఁ జూచి, నేర్పు మెఱయ,
ధైర్యముపూని చుఱుకుదనముతో నా సింహికను ఱొమ్మున నడిచి,
మఱల నెప్పటియట్ల మేనిని బెంచెను. సింహికయు గుండెనువియ
డస్సినదై సముద్రమునఁ బడెను. హనుమంతుఁ డట్లు సింహికను పడఁ
ద్రోయుటనుజూచి, యాకాశమున సంచరించు మహాభూతములెల్ల
హనుమంతు నుద్దేశించి, "వానరోత్తమా! నీవొకగొప్ప ప్రాణినిజంపి
యొక గొప్పకార్యము చేసితివి. మేలుగలుగుఁగాక! నీయిష్టార్థమును
సాధింపుము. వానరోత్తమా! నీకుఁబోలె నెవ్వనికి ధైర్యమును,
కార్యముల కలరూపు నెఱుఁగఁగల సూక్ష్మదృష్టియు, కార్యనిశ్చయ
రీతియు, పనిసేయఁ గలుగుటయు నున్నవో, వాఁడు తనకార్యము
లందు దైన్యము నొందఁడు" అని చెప్పి, పూజ్యుఁడైన తన్ను గౌర
వించుచుండఁగా, నిష్టార్థసిద్ధిం బడసినవాఁడై గరుడునిమార్కి వాయు
మార్గమును ప్రవేశించిపోయెను.

మఱియు నా హనుమంతుఁ డించుమించుగా నొడ్డుచేరినవాఁడై,
యంతటఁ జూడ్కి నిగిడించి, నూఱుయోజనములు గడచినతరువాత
వనములవరుసఁ జూచి, పాఱుచునే పెక్కు తెఱంగుల వృక్షములతోఁ
జెన్నారు ద్వీపము నొక్కదానిని, మలయపర్వత ప్రాంతములను,
సముద్రమును, సముద్రతీరమునందలి జలప్రాయభూములను (నీటి

వసతిగల భూములను) అట్టి సాగరప్రాంతజలప్రాయ భూములందు మొలచిన వృక్షములను, నదులయొక్క ముఖద్వారములను జూచుచు గొప్ప మేఘముఁ బురుడించునట్లై, యాకాశమును గ్రమ్మునంత విస్తారముగలిగియున్న తనమేనిఁ జూచికొని, "రాక్షసులీ నాగొప్ప శరీరమును, కడువడినిఁ జూచిరేని, "యితఁడెవఁడో క్రొత్తవాఁ"డని నన్నుఁ జూచుటయందే మనము గలవారగుదురు" అని తలఁచి, అజ్ఞానము దొఱఁగినవాఁడైన తపస్వి స్వస్వరూపమునందునట్లును, వామనావతారుఁడయిన విష్ణువు బలిచక్రవర్తి గర్వము నడఁచుటకై, గొప్ప రూపముదాల్చి, మూఁడడుగులచే భూమ్యాకాశములఁ గొలిచి మఱల నిజరూపము నొందిన కైవడినిఁ బర్వతముఁబోలు తనరూపము సంకోచపఱచి యెప్పటియట్ల రూపమునొందెను. పెక్కు కైఱఁగులయిన మనోహరరూపములు ధరించువాఁడును, శత్రువులకు సాధ్యపడనివాఁడును నైన యా హనుమంతుఁడు సముద్రముయొక్క యావలితీరమునుజేరి, యతిప్రమాణమయిన తన యాకారమునుజూచి, యటుమీఁద జరుగవలసిన కార్యము నాలోచించి, ప్రకృతకార్యానుసారముగా సూక్ష్మరూపము దాల్చెను. గొప్ప పర్వతశిఖరముఁబోలు నామహాత్ముఁడైన హనుమంతుఁడు సూక్ష్మరూపము ధరించి, పెక్కు లైఱఁగులైన యాశ్చర్యములుగలదియు, మొగలి, చండ్ర, టెంకాయచెట్లతో నిండి నదియు, సకలవస్తు పూర్ణమైనదియునైన లంబపర్వతశిఖరమునఁ గూలెను. అట్లు లాహనుమంతుఁడు, రాక్షసులతోను, సర్పములతోనుఁగూడి, గొప్ప యలలతో నొప్పారు సముద్రమునుదాఁటి, పూర్వరూపమువదలి స్వస్వరూపమునొంది, లంబపర్వతశిఖరమునఁనెఱఁగి యచ్చటినుండియే యమరావతిం బురుడించు లంకాపురమును జూచినవాఁడయ్యెను.

2-వ సర్గము

హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశింప వేచియుండుట

వేగవంతుఁడు బలవంతుఁడునగు హనుమంతుఁడు దాటనలవికాని మహోదధిని లంఘించి, నీలవర్ణములగు పచ్చికపడియలు వెలయ, గొప్పబండలు, తిప్పలును శోభిల్ల, నెత్తావులతోఁగూడినపర్వతములను, పుష్పితములయిన వనరాజులను జూచుచుఁ బోయి, లంబపర్వతమున

డిగఁగా, నాతనిపాటునకుఁ గదలినవృక్షములనుండి యాతని పయిరాలిన పూవులచేఁ బుష్పమయుఁడయిన వానిమాడ్కి శోభించుచు నాతఁడు శతయోజనవిస్తీర్ణమగు సముద్రమునుదాఁటియు, బలిమి కొఱఁతవడ మిచే మార్గాయాసజనితశ్రమ సూచకమగు దీర్ఘనిశ్శ్వాసమును విడు వకయు, బడలికనొందకయు నుండుటయేకాక, "నే నెన్ని శతయో జనములైనను దాఁటఁగలననునపుడు నూఱుయోజనములపరిమితిగల యీ సముద్రము దాఁటఁగలుగుట చెప్పవలెనా? అని తనలోఁ దానను కొనుచు నలుదెసలఁ జూడఁగా, సరళ, కర్ణికార, ఖర్జూర, ప్రియాళ, పిచుమంద, కుటజ, కేతక, ప్రియంగు, నీప, సప్తపర్ణ, అసన, కోవిదార, కరవీరాది మహావృక్షములు ముకుళపుష్పవంతములై, పుష్పముల భారములచేఁ గొమ్మలతో ముందుకు వ్రాలఁగా, పక్షులు కలయ నిండి యుండఁగా, కొనలు గాలికిఁ గదులుచుండఁగా నొప్పారుచుండునట్లు కనఁబడెను. మఱియు, హంససారస శోభితములై, కమలోత్పలాలం కృతములగు కొలఁకులును, వివిధములగు తోఁటలును, పెక్కు జలా శయములును, సర్వర్తుపుష్పఫలశోభితములైన వృక్షములతో నిండిన యుద్యానవనములును నుపవనములును నా హనుమంతునికి దృష్టి గోచరము లయ్యెను.

జయలక్ష్మిచే వెలుఁగుచున్న యా వాయునందనుఁడు రావణ పాలితమగు లంకాపురమును సమీపించి పద్మోత్పలశోభితములగు నగడిత లొప్పుచుండ, రావణుఁడు దాఁ దెచ్చిన సీత నెవ్వరు నెత్తికొని పోకుండుటకై భీకరములగు ధనుస్సులను దాల్చి రాక్షసవీరులు పుర మెల్లఁ గాచుచుండఁగా, పసిఁడిప్రాకారము చుట్టును వెలుఁగుచుండ, శరత్కాలమేఘములంబోలెఁ దెల్లనై సూర్యచంద్రాదులమాడ్కి వెలుఁగు గృహములతోఁగూడిన సుధాధవళములైన యున్నత గృహ ములుగల పెద్దవీథులు పురమెల్ల నిండియుండఁగా, అట్టల్లను మత్స్యది చిహ్నవంతములగు ధ్వజములును, సాధారణపుఁ డెక్కములును లతాదిరేఖావిశిష్టములగు పసిఁడితోరణములును శోభనుగలిగించు చుండ, దేవనగరమునుబోలెను, ఆకాశనిర్మితమగు పురముబోలె సొంపు మీఱినదై, ప్రాకారమను జఘనమున నిర్మలమైన యగడ్తయందలిజల మను దువ్వలువ మెఱయుచుండ, శతఘ్ని శూలము లనెడి కొప్పుముడి

యందు అట్టిళ్లనెడి శిరోభూషణములు వెలుఁగుచుండ నొప్పు నతివయో
యనఁబరగియుండునదియు, వాస్తవముగా విశ్వకర్మచే నిర్మితమయినను,
సొంపువిలకింప మనోనిర్మితమో యనఁదగియుండునదియునై యాకాశ
మునఁ దేలుచున్నట్టులుండునదియు, కైలాసశిఖరముంబోలి యాకసము
నొరయునట్లును, నున్నతగృహములుగల దగుటచే నాకాశమున కెగురు
నట్లును, పెక్కురాక్షసులచే నిండినదగుటచే, నాగులచేనిండిన భోగవతీ
పురమువలెను విరాజిల్లుచుఁ దొల్లి కుబేరునికునికిపట్టయి, పిదప రావ
ణునిచే నాక్రమింపఁబడినదియు, బాగుగా నిర్మింపఁబడినదై చక్కఁగాఁ
గనఁబడుటచే నెన్నరాని చక్కఁదనముగలదియు, శూలముద్గరాది నానా
విధాయుధధారులైన వాఁడికోఁబలుగల శూరులగు పెక్కండ్రు రాక్ష
సులచే విషఁంతములగు పన్నగములచే గుహావలె సంరక్షింపఁబడు
నదియునగు లంకాపురమునుగాంచి, దాని గొప్పసంరక్షణమును, సముద్ర
మును, భీకరుఁడైన పగతుఁడగు రావణునిఁ దలఁచికొని యివ్విధముగఁ
జింతింపసాగెను:

"వానరులీమహాసముద్రము దాఁటివచ్చియు నిష్ప్రయోజకు
లగుదురు. యుద్ధముచేసి యీ లంకాపురమును గెల్చుటకు దేవతల
కైనను నలవిగాదు. కష్టసాధ్యమయి చొఁబనలవికాకయున్న రావణ
పాలితమగు నీలంకాపురమునకుఁ బ్రసిద్ధవిక్రముఁడగు రాముఁడు వచ్చి
నను యేమిపనిచేయఁగలఁడు? రాక్షసులయెడ సామమునకేని, దాన
మునకేని, భేదమునకేని యవకాశము గన్పట్టకున్నది. ఇఁక యుద్ధమున
కవకాశమే కాన్పింపదు. బలశాలురగు వానరులందఱిలోపల నంగ
దుఁడు, నీలుఁడు, నేను, మహారాజు సుగ్రీవుఁడు ననునలుగురికే యిచ్చటికి
రా వీలుపడును. మేము నలువురము వచ్చి యయ్యోడుపనియా యిది.
అయినను సీత జీవించియున్నదా అని మొదటవిచారించి యాసీతాదేవి
ప్రాణములతో నుండుట తెలిసికొని యప్పుడు కదా కర్తవ్యముంగూర్చి
విచారింపవలెను. ఇప్పుడేల యావిచారము" అని కపివీరుఁడు గొంత
తడవుచింతించి, రామునికి మేలుసేయఁగోరినవాఁడై, యాపర్వతశిఖ
రమున నుండియె మఱల నిట్లాలోచింపఁదొడఁగెఁ: "క్రూరులగు రాక్ష
సులు కావలియుండుటచే నీపురమున నీరూపముతోడఁ బ్రవేశింప వీలు
గాదు. ఈరాక్షసులు గొప్పపరాక్రమము గలవారలు, బలిమిగల

వారలు. సీతను వెదకనచ్చిన నేను వీరినిఁ గనుమొఱఁగి వంచింపవలయునే కాని వేఱుపాయము లేదు. నేను మహాకార్యసాధనము సేయఁ గోరుదు నేని, కనఁబడియుఁ గనఁబడకయునుండు రూపముతో రాత్రిసమయమునఁ బురముజొచ్చుట యుచితము"అని కొంతతడవుచింతించి, సురాసురులకుఁ గూడఁ జొఱనలవికాకయున్న యవ్విధమయిన పురమును జూచి, పలు మాఱు నిశ్చయించియు, మఱల నిట్లని చింతింపఁ దొడఁగెను.

"దురాత్ముఁడగు రాక్షసేంద్రుఁడయిన రావణునికిఁ గనఁబడక యెవ్విధముగా నీపురములోపలఁజొచ్చి, జానకీదేవిని జూడఁగలను? జ్ఞానరూపుఁడయిన యారామునికార్య మెట్లులెసెడకయుండును? ఒంట రినిగా నీపురము లోపలఁజొచ్చి, యేకాంతమున నొంటరిగానే నాసీత నెట్లు చూడఁగలను? రాజును మంత్రులును జక్కఁగా యోచించి చేసిన కార్యములైనను జేతగాని దూతనుబొంది దేశకాలములకుఁగాక బెడిసి నవై, సూర్యోదయమునఁ జీకటియట్లు చెదరిపోవుచున్నవి. అంత మాత్రమేకాక యివి చేయఁదగినవి యివి చేయఁదగనివి యని రాజు మంత్రులాలోచించి చేసినపనులైనను, పందయైన దూతవలన రాజులకు మంత్రులకును చేతఁగాని వారనుపేరుగూడఁ దెచ్చుచున్నవి. తమకు సర్వము దెలియునని తలఁచునహంకారులగు దూతలు కార్యములు చెడఁగొట్టుదురు. ఎట్లు కార్యము సెడకయుండును! ఎట్లు మూఢుఁడను పేరు నాకు రాకయుండును! ఎట్లు సముద్రము దాఁటుటయు వ్యర్థము గాకయుండును? రావణునివలనఁ జెఱుపుగలుగునని శంకించుచుండిన నాయీకార్యము వ్యర్థమేయగును. రాక్షసరూపముతోఁగాని మఱియే రూపముతోఁగాని, రాక్షసులకుఁ దెలియక యిచ్చట నుండుటకు వీలు గాదు. వాయుదేవుఁడైనను వీరికిఁదెలియక సంచరింపఁజాలఁడని నాకుఁ దోఁచుచున్నది. కడుబలవంతులగు రాక్షసులకుఁ దెలియనిది యొక్కటి లేదు. ఇచ్చట నేను స్వస్వరూపముతో నుందునేని, నన్నీఘోరరాక్ష సులు పొలియింతురు. అంత నాప్రభువుకార్యమును చెడిపోవును. కావున నేను నారూపముతోనె సూక్ష్మరూపినై రాత్రివఱకు వేచియుండి, రామకార్యము సాధించుటకై రాత్రియందుఁ జీకటిపడిన తర్వాతఁ బురము ప్రవేశించి లోపలిగృహములందెల్ల సీతాదేవిని వెద

కెదను" అని కార్యనిశ్చయముచేసికొని, శూరుఁడయిన హనుమం
తుఁడు సీతాసందర్శనాభిలాషతో ప్రొద్దు క్రుంకుటకై వేచియుండెను.
ఇంతలో సూర్యుఁడు పశ్చిమాద్రిం జేరెను.

సూర్యుఁడస్తమింపఁగా వీరుఁడగు మారుతనందనుఁడు తనదేహ
మును గుఱుచపఱచి పిల్లియంతరూపముదాల్చి చూపఱకువింతగొల్పుచు,
వరుసలువరుసలుగా నిర్మింపఁబడి, పసిఁడివెండి స్తంభములును, సువర్ణ
వాతాయనములు (కిటికీలు) ను గలవై యొప్పుమీఱి, చక్కఁగాఁ దీర్చిన
రాజవీథులు వెలయుచుండ నేఁడెనిమిది యంతస్తులు గలిగియుండు
మేడలతోఁగూడి మనసునకు సంతోషము గొల్పునట్టిదగు లంకాపురము
ప్రవేశింపఁబూనెను. ఆరాక్షసుల భవనముల క్రిందినేలలు చలువరాలు
పఱచి బంగారు వెండిపనితనము గలవియై శోభిల్లుచుండెను. మఱియు
రాక్షసులయిండ్లలో నేలలు వైడూర్యమణులచేతను ముత్తెములచేతను
నలంకృతములయి ప్రకాశించుచుండెను. చక్కఁగాఁ గైసేయఁబడి
యున్న లంకాపురమునందంతటఁ గట్టఁబడియుండు సువర్ణమణిఖచితము
లైన తోరణము లాపురమునకు శోభాజనకములైయుండెను. ఇట్లు
సున్నపుఁబూతచేఁ దెల్లనైన యేడంతస్తులమేడలవీథులు గలదై, సువర్ణ
వికారములగు గవాక్షములు, తోరణములుం గలదై రావణుని బాహు
బలముచేఁ గాపాడఁబడుచు శత్రువుల వెఱపించు బలముగల రాక్షసు
లచే నంతటను రక్షింపఁబడుచున్న లంకాపురమునుజూచి సీతాదేవిని
జూడఁగోరియున్న హనుమంతుఁ డాపురమునొక్క పోడిమికి సంతోష
మును, చొఱరాకయున్నందుకై విచారమునుబొంది యోచించు
చుండెను. చంద్రుఁడును నక్షత్రమండలమధ్యమున వెలుఁగుచు, సముద్ర
మైనాకులవలెఁ దానును హనుమంతునికిఁ దోడ్పడుటకోయన్నట్లు, (౨౭)
తనకిరణజాలములను లోకములఁ బ్రసరింపఁజేయుచు నుదయించెను.
శంఖక్షీర మృణాళములవలెఁ దెల్లనై యుదయించుచు నలుదెసలను
వెలుఁగఁజేయుచు, తటాకమున మీఁదుమిక్కిలి యెగురుచున్న రాయం
చను బోలిన యాచంద్రుని హనుమంతుఁడు చూచెను.

3-వ సర్గము

హనుమంతుఁడు లంకలోనికిఁ బ్రవేశింపఁబూనుట

బలవంతుఁడగు వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుఁడు లంబమను పేరు గల త్రికూటపర్వతశిఖరముననుండి, యుత్సాహముపూని, మనోహరములగు వనములతోఁ గూడినదియు, చక్కఁగా సున్నపుఁబూఁత పూసియుండుటచే శరత్కాలమందలి మేఘుంబులవంటి డాలుగలవి యగు మేడలతో నొప్పుమీఱినదియు, సముద్రము ధ్వనివంటి ధ్వని గలదియు, సముద్రపుగాలి వీచుటచే నింపుగులుకునదియు, అలకాపురమునుమాడ్కిఁ జక్కఁగా బలిసినసేనలయలబలములతో నిండినదియు, చక్కని బహిర్ద్వారములందు మదించినయేనుఁగులు గలదియు, సున్నపుఁ బూఁతచేఁ దెల్లనైన ద్వారములు, తోరణములుఁ గలదియు, పాముల కునికిపట్టయి, చక్కనికాపుగల గలిగియుండు రమ్యమయిన భోగవతీ పురమునుమాడ్కి విలసిల్లునదియు, మెఱుపుగల మొగుళ్లతోను నిండి నదియు, రెక్కలతెరువుఁదాఁకునదియు, తిన్నగా వీచుచున్న గాలిగలఁ దియు, నింద్రుని యమరావతివలె గొప్ప బంగారంపుఁ బ్రాకారముచేత జుట్టఁబడినదియు, చిఱుగజ్జెలమ్రోఁతలుగల కెక్కెములచే శోభిల్లునదియు నైన యాలంకాపురముయొక్క ప్రాకారమునొద్దకుఁజేరి, యత్యంత విస్మయవికసితమానసాబ్జుఁడై పట్టణమునంతటఁ గలయఁజూచి, హర్షము నొంది, వెండియు, వైడూర్యవజ్రస్ఫటిక ముక్తాఫలములచే నలంకరింపఁ బడిన తిన్నెలును, నవరత్నములు చెక్కిన పైభూములును, అపరంజితోఁజేసిన మదపుటేనుఁగులును గలవియు వెండితోఁ జేయఁ బడినవైనందున మిక్కిలి తెల్లనివియు, పచ్చలతోఁజెక్కిన మెట్లును, స్ఫటికపు ముంగిళ్లును గలవియు, మనోహరములగుబవంతులతో నొప్పు మీఱినవియునైనందున నాకసమున కేగినవో యన్నట్టులుండునవియు, క్రొంచపక్షులు, నెమళ్లు, రాయంచలు గలిగియుండునవియునగు బంగారు ద్వారములు గలదయి అంతట నిండినవాద్యభూషణధ్వనులతో నొప్పు మీఱినదియు నైనందున నింద్రుని యమరావతీపురమునుఁ బురుడించు నదియు, ఎత్తయినయిండ్లచే నాకాశమున కుద్దమించు చున్నట్టు లుండు నదియు సకలసంపదలతో నిండినదియుఁ, బరమోత్తమమయినదియు నగు

రాక్షస రాజగు రావణునిదైన లంకాపురముఁజూచి, వెండియు నిట్లు తనలోఁ దాను చింతించెను.

ఈలంకాపురమును రావణునిసేనలెల్లప్పు డాయుధపాణులై కావలికాచుచుందురు గనుక, నీపురము నితరులు బలవంతముగా ముట్టడింపఁజాలరు. కుముదుఁడు గాని, అంగదుఁడుగాని, మైందద్వివిదులు గాని, సుషేణుఁడుగాని, ప్రసిద్ధుఁడగు సూర్య పుత్రుఁడైన సుగ్రీవుఁడు గాని, కుశపర్వుఁడుగాని, కేతుమాలుఁడుగాని, నేనుగాని యీలంకాపురమునఁ బ్రవేశింపఁగలుగుదు మేమోకాని, తక్కినవారీ పురమున నడుగిడఁజాలరు. అంతియకాక, రామలక్ష్మణులు పరాక్రమవంతులు గనుక నొక్కవేళ, వారు సాధించినను సాధింతురు" అని రామలక్ష్మణుల పరాక్రమమునుగూర్చి తలఁచి మనసున నుప్పొంగి, రత్నములనెడివలు వలుగట్టి, ఉగ్రాణములనెడు కర్ణావతంసము గలిగి, యంత్రాగారములను పాలింపఁగలదియై, చక్కఁగా నలంకరించుకొనిన జవరాలిచందమున నొప్పునదియు, సూర్యునివలెఁ దేజరిల్లు మేడలతోఁజెన్నుమీఱి నదియునైన రాక్షసరాజపురియగు లంకను గలయం జూచెను.

రావణపాలితయగు లంకయుఁ దనలోపలఁ బ్రవేశించునట్టి బలవంతుఁడగు వాయునందనుని హనుమంతునిఁజూచి, తాను వికృతపు మోమునగల రూపుదాల్చినదై యావాయుసూనుని కడ్డముగానిలిచి, బిట్టుగనఱచుచు, "ఓరీ! నీవెవ్వఁడవు? నీవు వనములం దుండువాఁడవు. నీ వికృడి కేలవచ్చితివి? నీప్రాణములను గొనెదను. వాస్తవమును దెలుపుము. ఈపురమునకు నెల్లప్పుడు రావణునిభటు లెల్లెడల, గావలియుందురు. ఓరీ కోఁతీ!దీనిలోపలఁ బ్రవేశింప నీకునలవిగాదు" అని యడిగెను.

అంతట హనుమంతుఁడు తన శౌర్యము మెఱయుఁ దనముందట నిల్చియున్న యాలంకాదేవిని జూచి, "నీవు నన్నడిగితివి కావున నీకు నేను వాస్తవము దెలియఁజేయవలసినదే. అదియట్లుండనిమ్ము, వికారములయినకన్నులుగల నీవెవ్వతెవు? నీవేల పట్టణంపుగవనియం దున్నావు? నాకడ్డుపడి క్రౌర్యముతో నన్నేల బెదరించుచున్నావు? అని యడిగెను.

కోరినరూపమెత్తఁగల యాలంకాదేవి హనుమంతునిమాటలు విని మోమున నలుక గదురఁ బండ్లు పటపటగొఱుకుచు, "ఓరీ కోఁతీ! బలశాలియగు రాక్షసేంద్రుఁడగు రావణునియానతివలన నీపురమును

గాచుచుందును. నన్ను గెలువ నేరికిని శక్యముగాదు. నన్ను దిరస్కరించి పురములోపలఁ బ్రవేశింప నీకు సాధ్యముగాదు. నీవు నాచేఁ జావుఁ దన్నులుతిని ప్రాణములందొఱఁగి, యిచ్చటనే దీర్ఘముగ నిద్రింతువు. ఓవానరా! నేనే లంకాపురిని; నేనెల్లప్పుడు దీనిం గాపాడుచుందును. ఇదియే నా వృత్తాంతము నీకుఁ జెప్పితిని" అనెను.

అంతటఁ జమత్కార బలములుగలవాఁడగు వాయునందనుఁ డా లంకయొక్క పలుకులు విని, వికృతంపుమగువరూపముదాల్చిన యా లంకాదేవినిగాంచి, పూనికితో నిలఁబడి, "ఓదేవీ! నేను అట్టళ్ళతోను, ప్రాకారముతోను, వెలుపలి ద్వారముతోను గూడిన యీలంకాపుర మును, దీనియందలి వనములను, ఉపవనములను గొప్పధనికుల మేడలను గలయంజూడఁ గోరికతోవచ్చితిని. నాకీపురము చూడవలెనని యెక్కువ మక్కువగలిగియున్నది. చూడనిమ్ము" అని యడిగెను.

కామరూపము గలదియగు నాలంకాదేవి యాహానుమంతుని పలుకులు విని, కడునలిగినదై, "ఓ మూఢుఁడా! వానరాధమా! నన్ను గెలువక రాక్షసేశ్వరుఁడగు రావణునిచేఁ గాపాడఁబడు లంకాపురము జూడనలవికాదు" అని మిక్కిలి నిష్ఠూరముగాఁ బలికెను.

అంత నాకపిశార్దూలుఁడు లంకాదేవి నుద్దేశించి "యోమంగళ కరుతాలా! యీపురమును జూచి, పోయినట్లే మఱలివచ్చెదను" అనెను.

అంతట నాలంకాదేవి వెఱపుగలిగించునట్లు ఱొప్పి, కడువేగ మున నాహానుమంతుని దనయఱచేతితో నప్పళింపగా నవ్వానరోత్త ముఁడు లంకచే దెబ్బవడి,కోపముచే నొడలుమఱచి గొప్పయార్భాటముఁ గావించి, యెడమచేతిపిడ్గ్లనుముడిచి, పిడికిట నాలంకాదేవి నొక గ్రుద్దు గ్రుద్దెను. ఆఁడుదియను కారణముచే నెక్కువ క్రోధముఁ జూపఁడయ్యె. అంతమాత్రమునకే యాలంకాదేవి సంధిబంధములెల్ల సడలగా వికృత మైనమోముతో వెంటనే క్రిందఁబడెను. అంతట మహాపండితుఁడైన హానుమంతుఁడు లంకాదేవి పడుట చూచి, తాను బలవంతుఁడయినను, ఆఁడుదానితో సాటిగాఁ గయ్యమొనరింపరాదని యెంచి, యాలంకాదేవి నేమియుఁజేయక జాలి నెంచెను.

అంత లంకాదేవి మిక్కిలి వెఱపుదోఁప డగ్గుత్తికతో నాహానుమం తునిఁ గాంచి "ఓగొప్పచేతులవాఁడవగు వానరశ్రేష్ఠుఁడా, అనుగ్రహిం

పుము; నన్నుఁగావుము. సాధువా! గొప్పవారు బలముగలవారయున్నా స్త్రీని జంపరాదను మర్యాదను దాఁటకుందురు. వానరోత్తమా! నేనే లంకాపురిని. వీరుఁడా, నీవు బలిమి మెఱయ నన్ను గెలిచితివి. వానరోత్తమా! యిదె నిక్కపుమాట. చెప్పెద నాలకింపుము. తొల్లి నాకు బ్రహ్మదేవుఁడు "ఓలంకాదేవీ! ఎప్పు డొకవానరుఁడు మగటిమిచే నిన్నుఁ బడఁగొట్టునో, అప్పుడు లంకలోని రాక్షసులకుఁ జేటు వాటిల్లు నని తెలియుము" అని నాకు వరమొసఁగెను. ఓవానరోత్తమా! యిప్పు డాసమయము వచ్చెను. విధిచెప్పినది నిక్కువము. దానికి మాఱు పాఱున్నటికిని గలుగదు. సీతను దెచ్చుటవలన లంకాపురీశుఁడగు రావణునికిని, రాక్షసులకంతఱకుఁ జేటుగలిగినదియే. కావున, ఓ హనుమంతుఁడా! వానరనాథుఁడ వయిన నీవు శాపముచేఁ గొట్టుపడియున్న లంకాపురిం బ్రవేశించి, యిచ్చుచోప్పునఁ దిరిగి సీతాదేవిని వెదకుము. ఇఁకను వలయుసనుల నన్నింటిని జేయుము" అని చెప్పి, యాహనుమంతునికి మార్గము విడిచెను.

4-వ సర్గము

హనుమంతుఁడు లంకలోపలఁ బ్రవేశించుట

వానరరాజగు సుగ్రీవునికిని మేలుచేయఁగోరువాఁడును, నిడుద చేతులవాఁడును, ఎక్కువవెలుఁగుగలవాఁడునైన వానరోత్తముఁడగు హనుమంతుఁడు కామరూపిణియగు లంకాధిదేవతనుజయించి ప్రాకారము నెక్కి దుమికి, లంకాపురములోపలికిఁ జొఱఁ బెనలిడి శత్రువుల తలలమీఁదఁబెట్టినట్లు తొలుత నెడమకాలుఁబెట్టి ముత్యాలచేతను, పువ్వులచేతను వెలుఁగుచున్న రాజమార్గమున నడఁచి పోవఁజొచ్చెను. అప్పు డాలంకాపురమట్టహాసములతోను, వాద్యములనాదములతోను గూడినదై వజ్రమణులచే నలంకృతములయి, సుధాధవళితములై యైరావతముఁబోలియున్న గృహములతోను, తెల్లనిమేఘములవంటి కాంతిగలవై, పలురంగులు గలిగి, పద్మస్వస్తికముల లక్షణములతోను గట్టఁబడియున్న పెక్కుబవంతులతోను గూడినదై, మేఘాచ్ఛాదితమైన యాకసముమాడ్కిఁ గనఁబడెను. సుగ్రీవుని మేలుగోరునట్టివాఁడును కాంతిమంతుఁడునగు హనుమంతుఁడు చిత్రములయిన పుష్పహారములచేతను,

అలంకారములచేతను నలంకరింపఁ బడియున్న యాలంకాపురిని చూచి చొఅనలవికాని యాలంకాపురము చొచ్చుటచేఁ దనప్రభువుయొక్కయు, రామునియొక్కయుఁ గార్యము నెఱవేఱినదని యానందించెను.

మారుతనందనుఁ డొక్కయింటినుండి మఱొక్కయింటికిఁ బోవుచుఁ బలుతెఱఁగుల యాకారములు రూపములుగల యిండ్లను జూచుచు, స్వర్గలోకమునందలి యప్సరసలయొక్క గానములవలె నున్న మదసంపూర్ణలయిన జవరాండ్రయొక్క యురఃకంఠశిరోదేశములందుఁ బుట్టిన మంద్రమధ్యమతారము లనెడి స్వరములతో మిళితమైయొప్పు శ్రావ్యగానములధ్వనులను, ధనికుల భవంతులందుఁ గాంతలు చిఱు గజ్జెలుగట్టిన మొలనూళ్లను అందెలనుదాల్చినవారై, మేడలనుండి క్రిందికి దిగునప్పుడు మెట్లమీఁద నడుగులు పెట్టునప్పుడు గలుగుధ్వనులను, సంతోషముచేఁ జేయుచేతిచప్పట్లను, సింహనాదములను, మఱియు నచ్చటచ్చట రాక్షసులగృహములందు రాక్షసుల మంత్రఘోషము లను, వేదాధ్యయనపరాయణులైన రాక్షసులవేదఘోషములను, రావ ణుని స్తోత్రముచేసెడి రాక్షసులస్తోత్రశబ్దములను వినుచు, రాజమార్గము నావరించియున్న గొప్ప రాక్షససేనను, నగరమధ్యమునందుండు సేనల గుంపునందలి పెక్కువేగులను, దీక్షవహించినవారిని, జడలుదాల్చిన వారిని, బోడినెత్తివారిని గోచర్మములతాల్పులను, బట్టలేనట్టివారిని, (బ్రాహ్మణులహస్తంబులందలి దర్భలు దేవేంద్రుని వజ్రాయుధము వంటివియని చెప్పఁబడియుండుటచేత) దర్భకట్టలును, అగ్నికుండ ములు నాయుధములుగా నుపయోగించువారిని, కూటముద్గరము లనెడి యాయుధములఁ జేతఁబట్టినవారిని, దండాయుధధారులను, ఒంటికంటివారిని, ఒంటిచెవివారిని వ్రేలుబొజ్జయు, స్తనములు గలవారిని, భయంకరరూపులను, వెగటుదోపఁజేయు రూపము గలవారిని, కుఱుచవారిని, ఖడ్గ, ధను, ర్ముసల, శతఘ్ని నామకాయు ధముల దాల్చినవారలను, దుడ్డుకఱ్ఱలవంటి చేతులుగ గలవారిని, విచిత్రములగు కవచములఁదాల్చినవారిని, మిక్కిలిబలియనట్టియు, మిక్కిలి చిక్కనట్టియు శరీరముగలవారిని, మిక్కిలిపొడవును, మిక్కిలి కుఱు చయుఁగాకయుండువారిని, ఎక్కువ తెల్లవారు గానివారిని కడునల్లని వారు గానివారిని, మఱుగుజ్జులు, మిక్కిలి గూనివాండ్రునుగానివారిని,

వికృతరూపులను, బహురూపులను, చక్కనిరూపముగలవారిని, మంచి కాంతిగలవారిని, గరుడవానరాది, చిహ్నములుగల ఱెక్కలను, సాధారణ వస్త్రములుగట్టిన ఱెక్కలను బట్టినవారిని, శక్తులు, చెట్లు, పట్టసములు, వజ్రములు, త్రోపుశునాయుధములు, పాశములు మున్నగు నాయుధములఁ దాల్చినవారిని, పూవులసరములుదాల్చి, గంధము నలఁదుకొని, మేటితొడవులందొడిగి, పలుతెఱఁగులయుడుపులను వేసి కొని వేడుకగాఁ దిరుగు పెక్కండ్రు రాక్షసులను, వాఁడిశూలములను దాల్చినవారిని, వజ్రాయుధధారులను, మహాబలులను జూచెను. అనంతర మా హనుమంతుఁ డంతఃపురముముందట నంతటఁ గావలి కాచుటకై రావణునిచే నియమింపఁబడియున్న మూలబలమునుజూచెను.

ఆప్రసిద్ధుఁడయిన హనుమంతుఁడును త్రికూటశిఖరమున నిర్మింపఁ బడినదియు, తెల్లదామరపువ్వులే శిరోభూషణములుగాఁగల (తెల్ల దామరపువ్వులతోఁగూడిన) యగడ్తలచే నొప్పినదియు, నలుప్రక్కల నెత్తుగోడలుగలదియు, రథములు, వాహనములు, ఆకాశమునఁ బోవు రథములు (విమానములు), గజాశ్వములు, నాలుగుదంతములుగల తెల్లమేఘరాసులవంటి యేనుఁగులుగలిగి చెన్నుదాల్చినదియు, దేవ లోకమునఁ బోలునదియు, మనోహరములగు వాద్యధ్వనులతోఁ గూడి నదియు, గుట్టిముల సకిలింతలును, భూషణనాదములును గలదియు, చక్కని ద్వారములుగలదియు, విశేషవీర్యముగల పెక్కండ్రు రాక్షసులచే రక్షితమయినదియు, బంగారువన్నెగల నడిమిప్రదేశముతోఁ గూడినదియు, విలువగల పెక్కుముత్యాలసరములచే నలంకరింపఁబడిన కొనలుగలదియు, సువాసనగల నల్లయగురుగంధముచేఁ బూయఁబడిన దియునైన రావణునియంతఃపురమును ప్రవేశించెను. (33)(కా)

ఏ-వ స ర్గ ము

హనుమంతుఁడు రావణునియంతఃపురంబున వెదకుట

హనుమంతుఁడు రావణునియంతఃపురము ప్రవేశించినవెంటనే, చంద్రుఁడుప్పరము మధ్యనొందినవాఁడై, వెన్నెలలను వెదచల్లుచుఁ దనకిరణముల నెల్లయెడలఁ బర్వఁజేసి, ఆలమందయందలి మదించిన యాఁబోతుచందమునఁ దిరుగుచు, లోకముల పాపఫలంబులను (దుఃఖ

ములను) బోఁగొట్టి యాహ్లోపముఁ గల్గించుచు, మహాసముద్రము నుప్పాంగఁజేయుచు, సకలభూతములను విరాజిల్లఁజేయుచుఁ బోవు చుండుటఁ గాంచెను. అప్పుడు చంద్రునియం దొప్పుచుండెడి సొరు, భూలోకమున మందరపర్వతమందలి సొరువలెను, ప్రదోషసమయము లంబలి సముద్రశోభపగిదియు, నీటినడుమనున్న కమలములదీప్తి మాడ్కియు వెలిఁగెను. అప్పుడు మహాప్రభావముగల శశాంకుఁడగు చంద్రుఁడు సూర్యకిరణ సంబంధముచే మంచుబొట్లనెడి ముఱికి నశింపఁ జీఁకటి చెదరిపోవఁగా, కాంతివిశేష సంబంధముచేఁ గళంకము చక్కఁగాఁ బ్రకాశించుచుండ, వెండిపంజరమున నున్న రాయంచ వలెను, మందరపర్వత గుహాయం దున్న సింగముచందమునను, మదపు టేనుఁగుపైఁ గూర్చున్న వీరునిభాతియు, జాతిమీఁదఁ గూర్చున్న మృగేంద్రునికైవడియు, యుద్ధరంగమునసున్న మత్తగజమురీతియు, సింహాసన మెక్కిన నృపునిగతియు, వాఁడికొమ్ములుగల యాఁబోతు మాడ్కియు, ఉన్నతశిఖరముగల వెండికొండమాడ్కియు, బంగారు పొన్నులువేసిన దంతములుగల యేనుఁగుకైవడియు సర్వకళాపరి పూర్ణుఁడై యంతరిక్షమున వెలిఁగెను. అట్లు చందురుఁడు తనపండు వెన్నెలలఁ బర్వఁజేసి, చీఁకటిఁ బోఁగొట్టఁగా, రాక్షసులు మాంస భక్షణరూపమైన పాపమునఁ బ్రవర్తింపఁగా స్త్రీ పురుషులు దమమనస్సు లంబలి ప్రణయకోపము వీడి యొండొరులను వలపుతోఁ జూచుచుం డఁగా, నారాత్రి స్వర్గసదృశమై జనులచేఁ గొనియాడఁదగినదై యుండెను.

తంబుర, వీణెమున్నగు వాద్యములనాగములు శ్రావ్యములై చెలరేగెను. చక్కని నడవడిగల స్త్రీలు తమప్రియులతోఁగూడ నిద్రించిరి. జనులకు మిక్కిలి వింతపుట్టించు శోకకృత్యము లొనర్చు రాక్షసులు విహరింపఁబూనిరి. అచ్చట గృహాములందుఁ గొందఱు మద్యపానముచే మైమఱచియుండిరి. మఱికొందఱు స్వకృత్యములందు శ్రద్ధలేక యుండిరి. జనులు గందరగోళముగా నఱచుచుండిరి. రథములు, గుఱ్ఱములు, సింహాసనములు విశేషముగా సుండినవి. వీరలక్ష్మి పురము నందంతటఁ దేజరిల్లుచుండెను. మఱియు రాక్షసు లొండొరులను దమ బలిమికొలఁది నీడ్చుచు, బలిసినతమచేతుల నొండొరులమీఁద వేసి

కొనుచు, మద్యపానమువలన నొడలుదెలియక మాటలాడుచు, ఒండొరులను బెదరించుకొనుచు, ఓహ్ములఁ గనఁబఱచుకొనుచు, వివిధ రూపములను దాల్చుచుఁ దమయంగములను గాంతలపై వేయుచు, గట్టి విండ్లనుమీటుచునుండిరి. రాక్షసస్త్రీలు కొందఱు గందపుఁబూఁత పూసికొనుచుండిరి. మఱికొందఱన్ననో నిద్రించుచుండిరి. చక్కని ముద్దుమోమును, రూపునుంగల కొంద ఱతివలు చిఱునవు నవ్వుచుండిరి. మఱికొందఱు ప్రియులపైఁ బొలయలుక గనఁబఱచుచుండిరి. కొందఱు తమప్రియు లింకనురామిచే నిట్టూర్పులూర్చుచు నుండిరి. బృంహితములుచేయుచున్న మదపుటేనుఁగులు, సకలజనపూజితులయిన మహాసత్పురుషులును, తమతోసమముగా యుద్ధముచేయువీరులు దొరకమిచే నిట్టూర్పులు విడుచుచున్న వీరులును గలదైన యాపురంబు బుస కొట్టుచున్న పాములతోఁగూడిన మడుగుఁబోలియుండెను. సూక్ష్మబుద్ధి గలవారు, వ్యవహారనిపుణులు, దైవభక్తిగలవారు, పలురూపములు గలవారు, ప్రియములైన పేళ్లుగలవారునైన పెక్కండ్రు రాక్షసు లచ్చటఁ గనఁబడిరి. మఱియు చక్కనిరూపముగలవారు, సకల సుగుణములు గలవారు, తమసుగుణములకుఁ దగిన చేష్టలుచేయువారు, మిఱిన వెలుఁగుగలవారు, యోగ్యులునగువారును, విరూపులైన వారును గనఁబడిరి.

అటుతర్వాత నచ్చటనే రాక్షసకాంతలు ప్రియులకిష్టులును (లేక ఉత్తమభూషణములను దాల్చినవారును) పాతివ్రత్యమహిమచే వెలయువారును, నక్షత్రములవలెఁదేజరిల్లువారును, ప్రియులయందును, మద్యపానములందును ప్రీతిగలవారునై యగపడిరి. కొందఱుకాంతలు సౌందర్యముచే మెఱయుచు, ననతోఁగూడి, నడిరేయియందుఁ బ్రియుల బిగికౌఁగిళ్లఁజేరి, ముదముచే సొక్కి, పువ్వులలో డాగిన పక్షులవలె నగపడిరి. కొందఱు పూబోడులు పై మేడలమీఁదఁ గూర్చుండిరి. కొందఱు చానలు తమమగల తొడలమీఁద సుఖముగాఁ గూర్చుండిరి. కొందఱు వనితలు మన్మథునిబారింజిక్కి భర్తలకుఁ బ్రియురాండ్రు చేయవలయు శుశ్రూషలుచేయుచు (లేక భర్తలతోఁ గూడి రమించుచు) నుండిరి. అచ్చట వివస్త్రలు కొందఱును, బంగారువంటి మేనిసొరుగల వారు కొందఱును, అందమయిన మేనిచాయఁగలవారలయు, ప్రియవి యో-

గముచేఁ జంద్రునివలెఁ దెల్లనయినవన్నెగలవారు కొందఱు నుండిరి. కొందఱు వనితలు తమమనస్సులకెక్కిన ప్రియులకడకుఁ బోయి వారిం గూడి కడుముదముతో నొప్పుచుండిరి. మఱికొంద అంగనలు తమ యిండ్లయందే ప్రియులఁగూడి మహానందముగలిగియుండిరి. అప్పుడు హనుమంతుఁ డాస్త్రీలలో నెవ్వరు మనుష్యకాంతలో, ఎవ్వరు రాక్షస కాంతలో తెలియఁగోరినవాఁడై, చంద్రునిబోలె వెలిఁగెడి యాకాంతల మోములను, వంకరలైన తెప్పలుగల చక్కనినేత్రముల వరుసలను జూచెను. రాముఁడు చెప్పినభూషణము లేవియైన నున్నవో కనుఁ గొనుటకై యాకాంతలమెడలందున్న మెఱుపుసంక్తులంబోలు నాభరణ ములను జూచెను.

అయినను, మిక్కిలి చక్కఁదనముగలదియు, న్యాయమార్గముఁ దప్పని రాజకులమునఁ బుట్టినదియు, చక్కగాఁబూచిన తీఁగెనుబోలి నదియు, అయోనిజాతయు, స్థిరమైన పాతివ్రత్యధర్మమునందుఁ దప్పని పట్టుదల గలదియు, రాముని జూచుటయందుఁ దలంపుగలదియు, రామునివిరహముచే మన్మథునిబాధం బడగిలినదియు, తనయందే తలంపు గలిగియున్న భర్తయొక్క మనస్సునందుఁ జొచ్చినదియు, లోకము నందలి స్త్రీలందఱిలోపల నెల్లప్పుడు నుత్తమయు, విరహతాపముచే నొచ్చినదియు, విడువక కన్నీరువిడుచునదియు, తనప్రియునితోడ నుండు నప్పు డుత్తమభూషణమును దాల్చినదియు, చక్కని కనుబొమలు గల దియు, తిన్నని కంఠధ్వనిగలదియు, వనమున నాట్యముచేయు నాఁడు నెమలినిబోలినదియు, సూక్ష్మమగు చంద్రరేఖమాడ్కి మిక్కిలిచిక్కి, కాంతిదఱిగియున్నదియు, దుమ్ములోఁబొఱలించిన బంగారుతీఁగెచంద మున మాలిన్యముతోఁగూడినదియు, గాటముగా నాఁటిన బాణపు గాయముఁ బోలె లోపలవేదనగలదియు, వాయువుచేఁ జెల్లాచెదరైన మేఘములపంక్తియుంబోలెఁ జిత్తస్వాస్థ్యము లేనిదియునై యుండు సీతాదేవి మాత్రము కనఁబడదాయెను. అంతట వక్తలలో నుత్తముఁ డగు రామనృపాలునియొక్కపత్నియగు సీతాదేవిం దానంతసేపు వెదకియుఁ గానకపోవుటచే హనుమంతుఁడు వెంటనే మూఢునివలెఁ గడుదుఃఖము నందినవాఁడయ్యెను.

6-వ సర్గము

హనుమంతుఁడు రావణాదిగృహంబుల వెదకుట

కామరూపధారియగు హనుమంతుఁడు మొదట రావణునియంతఃపురముచేరి, యచ్చట రాక్షసులనేకులు మేల్కొని యుండుటచే సీతాదేవిని వెదకుట కిచ్చట నిది సమయముగాదని యెంచి, మఱల వెలుపటికేతెంచి, విమానములందెల్ల వెదకియు సీతనుగానమిచే మిక్కిలి విచారమునొంది, మఱింత వేగముతో లంకాపురమెల్ల వెదకెను. అచ్చట నెక్కడను సీతను గానమిచేఁ గాంతిమంతుఁడయిన పవననందనుఁడు మఱల రావణుని గృహమునకే మఱలె. ఆరావణునిగృహము సూర్యుని మాడ్కిఁ దేజరిల్లు ప్రాకారముతోఁ గూడి, భయంబు గలిగించు రాక్షసులు గావలియుండ, సింహముల రక్షణమందున్న మహారణ్యము పగిదిఁ దేజరిల్లెను. వెండిచేఁ జేయఁబడి, బంగారుభూషణములచే నలంకరింపఁబడిన వివిధవర్ణములగు తోరణములు వెలుఁగుచుండెను. ఆశ్చర్యకరములగు ముంగిళ్లును, మనోహరములగు ద్వారదేశములును నుండెను. శూరులును, శ్రమలేనివారునునగు ఏనుఁగులపై నెక్కిన ప్రధానులును రథముల నీడ్వఁగలవియు నడ్డగింప నలవికానివియునైన గుఱ్ఱములును తిరుగుచుండెను. దంతముతోను బంగారుతోను వెండితోను చేయఁబడినవియు సింహవ్యాఘ్రచర్మములచేఁ గప్పఁబడినవియునగు నరదములు పెనురొదచేయుచు నిరంతరము నంతటఁ దిరుగుచుండెను. ఆనగరు పెక్కు రతనములతో నిండినదై, యుత్తమములగు పీఠములకు నెలవై, మహారథులగు రాక్షసుల కునికిపట్టగుచు గొప్ప రథములమహాధ్వనిగలిగి, రమ్యములగు వింతవింతలైన వేలకొలఁది మృగపక్షులతో నంతట నిండియుండెను. సుశిక్షితులగు బాహ్యరక్షకులును రాక్షసులును నగరునకు నలుదెసలఁ గావలియుండిరి. చక్కని జవదాండ్రంతటఁ దిరుగుచుండిరి. ముగుదలంద ఱుప్పాంగుచుండిరి. రాక్షసశ్రేష్ఠులు చేరువలందు నిల్చియుండిరి. ఉత్తమభూషణములను దాల్చిన స్త్రీపురుషులు దిరుగునప్పుడా భూషణధ్వనులు సముద్రధ్వనుల మాడ్కిఁ జెలరేగుచుండినవి. రాజలక్షణములగు ఛత్రచామరాదులును, అగురుచందనమును విశేషముగా నుండెను. మహా

వనమున సింహాములు దిరుగునట్లు గొప్పవారంతటఁ దిరుగుచుండిరి. భేరీ, మృదంగ, శంఖాదివాద్యములమ్రోఁతలు బోరుగొల్పుచుండెను. రాక్షసు లెల్లప్పుడు గంధపుష్పాదులతోఁ బూజలు సల్పుచుండిరి. రావణుఁ డాహితాగ్నియగుటంజేసి యతని గృహమునఁ బర్వదినము లందు దర్శపూర్ణమాసాదులగు ఇష్టులు జరుగుచుండెను. రావణుని భవనం బిట్టి సుగుణవిశిష్టమై సముద్రమువలె మ్రోఁగుచు, గంభీరమై, రత్నమయములగు సాధనములతోను మహారత్నములతోను నిండి, రథాశ్వగజములమ్రోఁతలతోఁగూడి చెన్నుమీఱి యుండెను. అట్టి రావణాసురుని భవనముఁ జూచి, హనుమంతుఁడు దానిని లంకాపురమున కాభరణముగా నెంచెను.

వీర్యవంతుఁడగు హనుమంతుఁ డిట్టులు దవ్వునుండి యారావ ణునినగరు చూచి, యచ్చటికిఁ బోవఁదలఁచి, మార్గమునడుమ రావణుని నగరునకు దాపుననుండు రాక్షసుల నగళ్లను, ఉద్యానములను నొక్క-దానివెంబడినొక్కటిగా నేరికి వెరవక తిరిగెను.

శూరుఁడగు హనుమంతుఁడు కడువడితో నొప్పుచుఁ బ్రహస్తుని యింటి మీఁదికెగిరి యచ్చటినుండి మహాపార్శ్వనిగృహముమీఁదికి నెగిరెను. అట్లొక్కటి వెంబడి నొక్కటిగాఁ గుంభకర్ణ, విభీషణ, మహోదర, విరూపాక్ష, విద్యుజ్జిహ్వ, విద్యున్మాలి, వజ్రదంష్ట్ర, శుక, సారణ, ఇంద్రజిత్, జంబుమాలి, సుమాలి, రశ్మికేతు, సూర్యశత్రు, వజ్రకాయ, ధూమ్రాక్ష, సంపాతి, విద్యుద్రూప, భీమ, ఘన, విఘన, శుకనాస, వక్ర, శఠ, వికట, బ్రహ్మకర్ణ, దంష్ట్ర, రోమశ, యుద్ధోన్మత్త, మత్త, ధ్వజగ్రీవ, నాది, ఇంద్రజిహ్వ, హస్తిముఖ, కరాళ, పిశాచ, రోహితాక్షుల యిండ్లమీఁది కెగిరి దాఁటుచు, చక్కనైయుండు నాయా యిండ్లయం దారాక్షసులకలిమిని జూచుచుఁ బోయి, వారి యిండ్లనన్నిం టిని దాఁటి రాక్షసరాజునగరు చేరెను.

ఆరావణునిగృహమున శూలముద్గరశక్తితోమరాద్యాయుధ ధారిణులై యా రావణాసునిచేరువఁ బరుండియున్న భీకరదృష్టులగు రాక్షసాంగనలను గాంచెను. కొంతదవ్వేగఁగ, సకలాయుధధారులగు భటులను, శ్వేతరక్తవర్ణములగు నశ్వములను, మంచిజాతియందుఁ బుట్టినవి, రూపముగలవి, శత్రుగజముల నొప్పించునవి, గజశిక్షయందు

నేర్పుగలవి, యుద్ధమున నైరావతముంబోలినవి, శత్రుసేనల సంహరించునవి, మదజలముగార్చుచుండుటఁ జేసి, తూకపడుచున్న మేఘములను, నీటివెల్లువలను కాఱుచున్న పర్వతములం బోలునవి, మేఘగర్జనముంబోలు గర్జనముగలవి, శత్రువుల జయింప నలవిగానివియునైన యేనుఁగులను, బంగారుకవచములఁ దాల్చినవారు, బాలభానుబింబముపగిదిఁ దోఁచువారునగు పెక్కురుభటులను జూచెను. మఱియొకప్రక్కను పలుతెఱంగులైనపల్లకులను, తీఁగెలయించ్లను, చిత్రశాలాయుతములగు గృహములను, తక్కుంగల వేడుకతావులను, కొయ్యతోఁజేసిన పర్వతములను, దివ్యమయిన రతిక్రీడాగృహములను, పగటిపూటఁ గాలముపుచ్చుఁదగిన గృహములను జూచెను. రావణునిభవనోత్తమము మందరగిరింబోలినదై, నెమ్మతో నిండి యొక్కెపుఁ గొయ్యలచే విస్తారమయియుండుటను, అచ్చటనే పెక్కురత్నములతోఁ నిండియున్న గనుల నన్నింటినిజూచి, యది బుద్ధిమంతులగు జ్ఞాననిష్ఠులైన మునులతపస్సునకు ఫలమైన యీశ్వరునిభవనమువంటిదేయని తలఁచెను.

ఆరత్నముల కాంతియు, రావణునిప్రతాపమునుగూడిన యా భవనము వేయివెలుఁగులతో వెలుఁగుసూర్యనిమాడ్కిఁ దేజరిల్లెను. అంత హనుమంతుఁడు మఱికొంత లోపలికిఁబోయి బంగారుమయములగు మంచములను, పీఠలను, అసంఖ్యములైన పాత్రములను జూచెను. తేనెతోఁ బక్వముచేసిన మద్యములచేఁ దడిసినది, మణిమయములగు పాత్రములతో నిండినది, కుబేరునిగృహమువలె నిఱుకుగాక విశాలరమణీయమైనదియు, అందెలయు, మొలనూళ్లయుఁ జిఱుమ్రోతలతోను, ధ్వనివిశేషముగల మృదంగముల ఘోషములతోనుగూడి, మూఁడుమ్రోఁతలీనుచుఁ బెక్కుప్రహరిగోడలతోఁగూడి, చక్కని పెక్కురు జవరాండ్రకునికిపట్టు, విశాలములయినతొట్టికట్టులతో నిండినదియునైయుండు నట్టిరావణుని నగరులోపలఁ బ్రవేశించెను. (౨౧/౩౧)

7-వ సర్గము

హనుమంతుఁడు రావణునియంతఃపురమున సీతను వెదకుట

బలవంతుఁడగు హనుమంతుఁడు పచ్చలుచెక్కిన బంగారుకిటికీలును, పక్షులగుంపులుగలవై, మెఱుపులచేఁ గ్రమ్మఁబడి, పక్షిజాలము

లతోఁగూడియున్న వార్షికమేఘమునలెఁ దేజరిల్లు భవనపంక్తులను, ముఖ్యములయిన ధనుర్బాణశంఖాద్యాయుధములచే విరాజిల్లుచున్న యాయిండ్లలోపలియిండ్లను, పర్వతములవలె నెత్తయిన గృహముల యంబలి దివ్యములై వెడలైన యుప్పరిగెలను, సకలధనములచే నిండినవియు, దేవాసురులచేతఁ జక్కఁగాఁ బూజింపఁబడినవియు, ఎట్టియొచ్చెమును లేనివియు, కుబేరుని గెల్చి తనబలముచే సంపాదింపఁబడినవియు, పూనికితోఁ జక్కఁగాఁ దీర్పఁబడినవియు, మయునిచేతనే స్వయముగా నిర్మింపఁబడినవో యనఁబడినవియు, సకలగుణసమృద్ధిగలవియునైన లంకాపురాధీశ్వరుని గృహముల నన్నిటినిఁ జూచెను.

తర్వాత హనుమంతుఁ డున్నతమైన మేఘమువొక్క రూపమువలెఁ బ్రకాశించునదియు, బంగారు మయమయినదిగాన నందమునుగాఁ దోఁచునదియు, సాటిలేనిరూపముగలదియు, రాక్షసేశ్వరుని బాహుబలమునకుఁ దగినదియు, నానావిధములగు రత్నములచేఁ బూర్ణమై, ధగధగమని వెలుఁగుచుండుటఁజేసి, కారణాంతరముచేఁ బుడమికి దిగివచ్చి యచ్చటఁ బర్వినస్వర్గలోకమోయనఁదగినదియు, పలుతెఱఁగులగు చెట్లనుండి తూలిన పువ్వులచే నిండినది యగుటవలన పుప్పొడితో నిండిన పర్వతశిఖరమువలెఁ దోఁచునదియు, ఉత్తమస్త్రీలుగలిగి వెలయునది యగుటచే మెఱుఁగులచే మెఱయు ప్రాకారము మబ్బువలెఁ బ్రకాశించునదియు, రాజహంసలచే మోయఁబడు కాంతియుక్తమైన పుణ్యాత్ముల విమానముచందమున నొప్పారునదియు, నానాధాతువులతోఁ జిత్రముగఁ గానిపించు పర్వతశిఖరము పగిదియు, చంద్రతారాగణములతోఁగూడి పలువన్నెలు గలదిగాఁ గనఁబడు నాకాశము చొప్పునను, ప్రాగుగాఁజేయఁబడిన నానావిధ మేఘములమాడ్కియుఁ దోఁచునదియు, నానారత్నములు చెక్కినదియునైన లోకోత్తరమైన పుష్పకవిమానమును గాంచెను. (౫౬)

ఆ పుష్పకవిమానమునందలి పుడమియెల్లఁ బర్వతపంక్తులతో నిండినట్లుచిత్రింపఁబడెను. ఆపర్వతములందుఁ బెక్కువృక్షములున్నట్లును, ఆ వృక్షములు పువ్వులగుత్తులతో నిండియున్నట్లును, పుష్పములెల్లఁ బుప్పొడితోను, కేసరములతోను నిండియున్నట్లును చిత్రింపఁబడియుండె.

తెల్లని పాలగార పూయఁబడినట్లున్నయిండ్లును కోలఁకులెల్లఁ దామర పువ్వులతోఁగూడియున్నట్లున్న కొలకులును చిత్రింపఁబడియుండెను. ఆ కమలములును కేసరములతో నిండియుండునట్లు రచింపఁబడినవి. పలు విధములైన వనములును జిత్రింపఁబడెను. మఱియుఁ బచ్చలు, బంగారు, వెండి, పవడములమయములైన పక్షులును, వివిధములగు సర్పములును, మంచిజాతులయందుఁ బుట్టినయశ్వములబోలు చక్కనియంగములుగల యశ్వములును జిత్రితములయ్యెను. మఱియుఁ గొన్నిపక్షులు చక్కని తెక్కలును ముక్కునుంగలవై, ఒయ్యారముతోఁ దమతెక్కలను వంచికొని మన్మథునిబంటులో యనునట్లు మన్మథోద్దీపకములై సొంపు మీఱునట్లు చిత్రింపఁబడియుండెను. ఏనుఁగులు తామరకొలఁకులలో డిగి, తొండములతోఁ దామరాకులను, పువ్వులతేకులను, కేసరములనుఁ జుట్టుకొని తామే వ్యాపించియుండునట్లు చిత్తరువులు వ్రాయఁబడియుండె. అట్లు కొలఁకులందు లక్ష్మీదేవి తనచక్కని యిరుచేతులలోను గమలములఁ దాల్చి, తమ్మిగద్దియ యందుఁ గూర్చుండియుండునట్లు లిఖింపఁబడెను.

ఇట్లు పలుతెఱఁగులైన చిత్రములతోఁగూడి, నవరత్నఖచితమై, ఉత్తమగృహములకంటె నుత్తమమయి, మంచుతోలఁగినపిదప మిక్కిలి చొప్పుమీఱి నెత్తావిగల పుష్పాదులతో నిండిన పెక్కుగుహలుగల పర్వతమువోలె శోభిల్లునదియునైన యాపుష్పకవిమానమును గాంచి, యపూర్వమైన దానిసొంపునకు నచ్చెరువందెను. అంత హనుమంతుఁ డారావణపాలితమైన చక్కని లంకాపురమునఁ దిరిగి, పతివ్రతయని కొనియాడఁబడినదియు, భర్తయందలి సుగుణములచే లోఁబఱుపఁబడినదియునైన సీతాదేవినిగానక మిక్కిలి దుఃఖితుఁడయ్యె. ఆ హనుమంతుఁడట్లు న్యాయమార్గముఁదప్పక, ప్రయత్నములొనర్చి పలుతావులందుఁదిరిగి యొకతూరి చూచినమాత్రముననే యంతయుఁ గరతలామలకముగాఁ (చేతిలోని యుసిరికకాయవత్తుగా) జూడఁగలవాఁడైయున్నను సీతాదేవిని గానక, పెక్కుతెగలగు వగలం గుందుచుండఁగా నాతనిమనంబు గుదురుతప్పినదై చింతాక్రాంతమై యుండెను.

8-వ సర్గము

పుష్పకవిమాన వర్ణనము

ఆరావణుని గృహమధ్యమున నున్నట్టి కెంపులు రవలు చెక్కిన చిత్తరువులుగలిగి, యపరంజితోఁ జేయఁబడిన గవాక్షములతో నొప్పు మీఁదియున్న యప్పుష్పకవిమానమును హనుమంతుఁడు కాంచెను. (34)
ఆవిమానమును విశ్వకర్మ నిర్మించునప్పు డొక్కొక్కభాగమును నిర్మించి యిది బాగున్నది యిది బాగున్నది యని తనసేర్పును గొనియాడు కొనుచు నిర్మించుటచేత నది యెన్నఁరాని సాటిలేని చిత్తరువులుగలదై యాకాశమున నిలిచినదై, మఱియెత్తగు వాయుమార్గమున నెలకొన గలదగుచు సూర్యునిమార్గముయొక్క యానవాలో యనఁ బ్రకాశించెను.

ఆవిమానమునఁ బ్రయత్నపూర్వకముగాఁ జేయఁబడినదికానిది యొక్కటియులేదు. ఆవిమానమున నమూల్యరత్నఖచితము కాని దొక్కటియులేదు. ఆవిమానమున లేని వింతలు దేవతలవిమానము లందును లేవు. అచ్చట గొప్పయాశ్చర్యములేని దొక్కటియులేదు. తపస్సుచేసియు, బలముచూపియు సంపాదింపఁబడినదియు, మనస్సున కిష్టమయిన నడకలతోఁ బోవునదియు, పలుతెఱఁగులైన గోపురములు మున్నగువింతలతోఁ గూడినదియు; అన్నివైపులఁ గాన్పించు నొక్కటే తీరుగల చిత్తరువులతోఁగూడినదియు, యజమానునిమనస్సును గనిపెట్టి పోవలసినచోటికిఁ బోవునదియు, వాయువేగముఁబోలు వేగముగల దియు, నేరికి నడ్డగింపరానిదియు, పుణ్యాత్ములును, మహాధనసంపన్నులును, కీర్తిమంతులునైన మహాసంతుష్టులగు నింద్రాదులయొక్క భవనములవలె నొప్పారునదియు, మేలయిన రత్నములు మున్నగు వస్తువులు గలదియగుటచే మిక్కిలి వన్నె కెక్కినదియు, విచిత్రములైన పెక్కుశిఖరములచే నలంకరింపఁబడినదియు, శరత్కాలచంద్రునిం బోలె స్వచ్ఛమైనదియు, విచిత్రశిఖరములు గలదియునైన మనోహరమగు పర్వతశిఖరముమాడ్కి వెలుఁగునదియు, కుండలములను (అంటుజోళ్లను) దాల్చుటచే శోభాయమానములగు మోములుగల వారును, విస్తారముగాఁ దినువారును, రాత్రులందు ఆకాశమున

దిరుగువారును, గుండ్రనివి, వంకరవి, విరివిగలవియైన నేత్రములుగల వారును గడువడిగాఁ బోవువారునగు పెక్కువేల భూతములచే మోయఁబడునదియు, వసంతర్తువునకు సంబంధించిన యన్ని పుష్పములు గలదియాటచేతఁ జూడనింపై నదియు, వసంతకాలమునకంటె ననుభవ యోగ్యమునైన పుష్పకమనెడి విమానోత్తమమును వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుఁడు చూచెను.

9-వ సర్గము

హనుమంతుఁడు రావణాంతఃపురమున సీతను వెదకుట

అట్టివిమానోత్తమమగు పుష్పకము నడుమనుండునదియు, నర్ధయోజనము వెడల్పును నొక్కయోజనము నిడివియుఁ గలిగి, పెక్కుమేడలతో నిండినదియునై యున్న రాక్షసేంద్రుని గృహమును మారుత పుత్రుఁడు చూచెను.

శత్రువులఁ బరిమార్చువాఁడయిన యా హనుమంతుఁడు విశాలములగు కన్నులుగలదగు సీతాదేవిని వెదకుచు నంతటను దిరిగెను. హనుమంతుఁడట్లు తిరుగుచు, నాలుగుదంతములు, మూఁడుదంతములుగల యేనుఁగులతోను గూడినదియు, విశాలమైనదియు, ఆయుధధారులైన భటులచేఁ గావలికాచఁబడునదియు, రావణునిభార్యలగు రాక్షసకాంతలతోను, రావణుఁడు బలాత్కారముతోఁ దెచ్చిన రాజకన్యలతోను గూడినదియునై నందున గావలికిఁ గదలుచుండునట్టి నక్రమకరములు, తిమింగిలములు, సామాన్యమత్స్యములు, పాములు మొదలగువాని కునికిపట్టగు సముద్రమును బోలిన రావణునినగరు సొచ్చెను. కుబేరుఁడు, దేవేంద్రుఁడు మొదలగు దిక్పాలురయొక్క భవనములందుండు సారు రావణుని గృహము నెడఁబాయకుండెను. కుబేరునిభవనమును, యమునినగరునను, వరుణునిమనికియందును నెంతటి కలిమిగలదో, యంతటి కలిమియు, నంతకంటె నెచ్చయిన కలిమియు రాక్షసులగృహములం దొక్కొక్కదానియందును గలదు. అట్టిరాక్షసులగృహముల కంటె మించిన మెఱుఁగుగలదయిన రావణునినగరు నడుమనుండు నదియు, పలుమదపుటేనుఁగుల చిత్తరువులతోఁ గూడినదియు, సొగసయిన పనితనము గలదియునైన మఱియొక్క గృహమును మారుత

సూనుఁడు గాంచెను. అయ్యది బ్రహ్మకొఱకు విశ్వకర్మ తననేర్పెల్ల వినియోగపఱచి నిర్మించెను. అది పుష్పకమనఁబడినది; నవరత్నఖచి తమైయున్నది. కుబేరుఁడు బ్రహ్మనుగూర్చి తపమొనర్చి, నవరత్నము లచే నలంకరింపఁబడిన యాపుష్పకవిమానము నొందెను. రావణుఁడు పరాక్రమమునఁ గుబేరుని జయించి, బంగారుతోను వెండితోను నిర్మించిన తోడేళ్ల ప్రతిమలుగలిగి, చక్కఁగాఁదీర్చిన స్తంభములచే మోయఁబడి, కాంతిచే వెలుఁగునట్టిదియు, మేరుమందర పర్వతమువలె నెత్తయి యాకాశము నొఱయుచున్నవో యన్నట్టులుండు సొగసై కూటగృహములచే నంతట వెలుఁగునదియు, సూర్యాగ్నులవలెఁ దేజరిల్లునదియు, పసిఁడిమెట్లు గలదియు పచ్చలును నీలములును బఱచిన యందము లయిన తిన్నెలతో సొంపుమీఱునదియు, స్ఫటికమణులతోను, బంగారముతోను నిర్మించిన సోపణగంట్లతోను, కిటికీలతోను గూడినదియు, పలుతెఱఁగులైన పగడములతోను, విలువగల మణులతోను, గుండ్రనైన ముత్యములతోను గట్టఁబడి, విచిత్రమైన పైప్రదేశముతోఁ గూడినదియు, పసిఁడివన్నెగల్గి నెత్తావిచే గుబాళించు నెఱ్ఱని చందన ముచేఁ బూయఁబడినదియు, బాలసూర్యునిపగిది దీపించునదియునైన పుష్పకవిమానము నెక్కెను.

అట్టిరమ్యమైన పుష్పకవిమానమును హనుమంతుఁడెక్కి యచ్చట నుండి దివ్యమై మిఱిమీఱియున్నందుచే, రూపముదాల్చిన వాయువో యనఁదగిన పాన, భక్ష్య, అన్నములనుండి పుట్టిననెత్తావి నాఘ్రాణించెను. లోకమున మనుష్యుఁడు బంధువునచ్చినయెడల, వానినెదుర్కొని తనయింటికిఁ బిల్చుకపోవుచందమున నాగంధము బలవంతుఁడైన హనుమంతు నెదుర్కొని, రావణుఁడున్నచోటికి రమ్మని పిలిచినదో యన్నట్లుండెను.

హనుమంతుఁడు పుష్పకవిమానమునై నెక్కినతర్వాత సీతాదేవిని వెదకుటకుఁ దఱలినవాఁడై, యా పుష్పకవిమానమధ్యమున నుండుమనింటికిఁ బోవ సుద్యుక్తుఁడై, సుందరాంగనవోలె నారావణుని మనస్సును సంతోషపఱచునట్టి చక్కనైన విశాలమగు నారావణుని గృహమును గాంచెను. ఆ గృహమునకు రతనాలుచెక్కిన మెట్లును, బంగారు కిటికీలు నుండెను. అచ్చటినేల పటికపుఱాలు పఱచఁబడి

యుండెను. నడుమనడుమ దంతపుబొమ్మలు నిర్మింపఁబడియుండెను. ముత్యములు, పగడములు, వెండి, బంగారములుకలయ నలంకరింపఁ బడినవి, చక్కనివి, సమమైనవి, మిక్కిలి యొత్తయినవియు అంతటను చక్కఁగా నలంకరింపఁబడినవియునగు పెక్కుగొప్ప స్తంభము లుండెను. కావున నది యున్నతములయిన మెక్కలతో నంతరిక్షమున కెగురఁ బ్రయత్నించినదో యన్నట్లుండెను. నదులు కొండలు సముద్రములు దేశములు మొదలగు భూలక్షణములుగల గొప్పరత్నకంబళము పఱువఁ బడియుండెనుగాన, నాగృహము దేశరాజ్యములతోఁగూడిన విశాలమైన భూమిమాడ్కి నుండెను. ఆరావణగృహమున పక్షులు మదించినవై కూఁతలిడుచుండెను. కమ్మనివాసనలు గుబాళించుచుండెను. శ్రేష్ఠములయిన కంబళములు పఱువఁబడియుండెను. నందినియను రాక్షసవీరు లాగృహ ద్వారమునఁ గావలియుండిరి. అగురుధూపము వేయుటచే నాపొగ యంతయు వ్యాపించుటవలన నాగృహము దెలుపు నలుపు వన్నెగలదై యుండెను. సున్నపుఁ బూఁతవలన నిర్మలమై హంసవలెఁ దెల్లనై యుండెను. పూవులు చల్లఁబడియుండుటచేఁ జిత్రవర్ణముగల వేల్పుటావువలెఁ బ్రకాశించుచుండెను. మనస్సునకు సంతోషము గలిగించునదియు, వన్నెలకుఁ గూడ వన్నె తెచ్చునదియు, శ్రమను దీర్చునదియు, మిక్కిలి చక్కనై కాంతికిఁబుట్టిననెలవో యనునటుండునదియునై యుండెను.

రావణునిచేఁ బాలింపఁబడు నాగృహము పంచేంద్రియములకుఁ దనివిఁగలిగించు నుత్తమవస్తువులచేత నాహానుమంతుని పంచేంద్రియములను దల్లివోలెఁ దృప్తినొందించెను. హానుమంతుఁ డట్టిచక్కని రావణుని నగరుచూచి, "ఇది పాతాళము మొదలగు లోకములలో నొక్కటియో, వాయువు, వరుణుఁడు మొదలగు వేల్పులుండెడిలోకమో, దేవేంద్రపురియో, మితిమీఱిన తపఃఫలమైన బ్రహ్మలోకమో" యని తలంచెను. అచ్చట నన్ని బంగారుకంబములందును జూదమాడుచుండు నట్లు రెండేసిబొమ్మలు ఒకటి పెద్దదిగాను, మఱియొక్కటి దానికంటెఁ జిన్నదిగాను నిర్మింపఁబడియుండె. అవి బంగారు స్తంభములకడ బంగా రముతోడ నిర్మింపఁబడినవి యగుటచే మిక్కిలి ప్రకాశించుచుండెను.

వానిలోఁ జిన్నబొమ్మలు, జూదమాడు మొనగాండ్రతో జూద మాడి యోడిపోయి, యవమానపడి, తాము మఱల గెల్పునొందుటకై

భగవంతునిఁగూర్చి ధ్యానము చేయుచున్న జూదరులమాడ్కి నుండు టను హనుమంతుఁడు గాంచెను. అచ్చట నుంపఁబడియుండు దీపముల కాంతియు, రావణుని తేజస్సును, భూషణముల మెఱుఁగులును జేరి యుండుటచే నాగృహము నిప్పంటుకొని మండుచుండునట్లుండెను.

అచ్చట రాక్షసస్త్రీలు పలురంగులచీరలఁ గట్టి, నానావిధాలంకా రములఁజేసికొని, విచిత్రములైన పుష్పహారములను దాల్చి, మద్య పానమువలని కైపుచే మై మఱచి, సగముచాత్రివఱకుఁ బ్రియులతోఁ గ్రీడలుసల్పి యలసటచే నిద్రించిరి. అట్లు వారందఱు నిద్రించుటవలన, వారిభూషణములచప్పుడులు వినరాకయుండినందున, కలహంసలకలరవ ములు, తుమ్మెదలగీపెట్టుటలులేని మహాపద్మవనమువోడ్కి విరాజిల్లు చుండెను.

ఆరాక్షసేంద్రునిగృహమున నుండు స్త్రీలు దంతములు దెలియ కుండునట్లు నోళ్లుమూసికొని, కన్నులుమోడ్చి నిద్రించుటవలనను, సూర్యోదయమున వికసించి, రాత్రిరాఁగా ముడుచుకొన్న కమలములం బోలియున్న సువాసనగల వారిముఖములను హనుమంతుఁడు చూచి, యీముఖపద్మములందలి పూఁదేనెకు గ్రోలుటకై తుమ్మెదలెప్పు డివి వికసించునాయని మాటిమాటికిఁ బ్రార్థించుచున్నవో యనియు, సైత్యసౌర భ్యాదిగుణములందు కమలములకంటె మించినవో యనియు దలఁచెను.

ఆరావణుని మందిర మాకాంతలముఖపద్మముల కాంతిగలది యగుటచే నక్షత్రతేజస్సుచే వెలుఁగుచున్న మబ్బుగ్రమ్మిన శరత్కా ల మందలి యాకాశమువలె వెలుఁగుచుండెను. ఆరాక్షసకాంతలచేఁ జుట్టఁ బడినవాఁడైయున్న రావణాసురుఁడు నక్షత్రగణపరివృతుఁడైన పూర్ణ చంద్రునిమాడ్కి మెఱయుచుండెను.

హనుమంతుఁడచ్చటనున్న సుందరాంగులగు స్త్రీలను జూచి, వారందఱు పుణ్యశేషముండునప్పు డుప్పరమునుండి పుడమినొక్కచోట గుంపుగాఁబడిన నక్షత్రములో యని తలఁచెను. నక్షత్రములవలె మిగుల వెలుఁగుచున్న యాకాంతలమేనిసొంపును, రూపమును, నిగనిగమను మెఱుఁగును మితిమీఱియుండెను.

అచ్చటనుండు కాంతలు చక్కగాఁ ద్రాగి, యాటలాడుచుఁ బాటలుపాడుచు సురతసుఖములఁ దేలుచు, బడలి నిద్రించినందున, వారుదాల్చిన గొప్పపూలదండలును, మేటిభూషణములును స్వస్థానముల నుండి తొలఁగియుండెను. కొందఱుకాంతలకు బొట్టుమాసెను. కొందఱు సుందరులకుఁ గాలియండెలు దావు తప్పెయుండెను. కొందఱు చెలువలకు హారములు ప్రక్కలకు జాఱియుండెను. కొందఱు చానలకు ముత్తైపు సరములు దారముదెగినందునఁ జుట్టును జాలియుండెను. కొందఱు క్రొన్నంటులకుఁ గోకలు ముళ్లువీడి జాఱియుండెను. మొలనూళ్లు త్రెగి పోవుటఁజేఁ గొందఱుకాంతలు మార్గాయాసము దీర్చుకొనుటకై కట్టు త్రాళ్లువిప్పి నేలపైఁబొఱలింపఁజేసిన పెంటిగుట్టములవలెఁ గానఁబడిరి. చక్కనికమ్మలుదాల్చిన కొందఱు పొలఁతుకలు నలిగి, త్రెగిన పువ్వుల దండలుకలవారగుటంజేసి, కాఱడవియందు మదపుటేనుఁగులచే నలగఁ ద్రొక్కఁబడిన విరులుగల తీఁగెలమాడ్కి శోభిల్లిరి.

కొందఱుస్త్రీలు స్తనములందుఁ దాల్చిన చంద్రహారములు వారి స్తనములనడుమ నిద్రించిన హంసములమాడ్కి వెలుఁగుచుండెను. కొందఱుస్త్రీలు ధరించిన వైడూర్యహారములు కాదంబములను నంచల వలెను, మఱికొందఱు ధరించినబంగారు మెడనూళ్లు చక్రవాకముల వలెను విలసిల్లుచుండినవి. వీకందఱు స్త్రీలును రాయంచలను బెగ్గురు పక్షులంబోలిన వజ్రవైడూర్యహారములును, చక్రవాకపక్షులవలె గుండ్రనైన మెడనూళ్లు ఇసుకదిన్నెలవంటి పిఱుఁదులును గలవారగుటచే హంసకారండవచక్రవాకములతోఁ గూడిన యిసుకదిన్నెలుగల నదులమాడ్కిఁ బ్రకాశించుచుండిరి. అచ్చట నిద్రించు కొంద అంగనలు చిఱుగజ్జెలనెడి మొగ్గలు, బంగారంపుఁదొడవులనెడి గొప్పపద్మములు, శృంగారంపుఁజేష్టలనెడి మొసళ్లును, కీర్తిఁదెచ్చెడి చక్కదనమను తీరములును గలవారలై నదులమాడ్కి నుల్లసిల్లిరి. కొందఱతివల యెత్తైన యంగములందును, స్తనాగ్రములందును ఏర్పడిన భూషణములవలెనే ప్రకాశించినవి. కొందఱు చెలువలచీరెలకొంగులు నోటి వాయువులకుఁ గదలుచు మోములపైనని మాటిమాటికి నెగురుచుండినవి. చక్కనికాంతిగల భూషణములు దాల్చిన పలురంగులుగల యాకాంతలచీరెలకొంగులు వారినోటిగాలికిఁ గదలుచు, గాలికిఁ బైకెగురఁ

గొట్టఁబడిన ధ్వజపటములమాడ్కిఁ బ్రజ్వరిల్లెను. మంచికాంతిగల కొందఱు సుందరాంగనలయొక్క కమ్మలు నోటిగాలిసోఁకుడువలన మెల్ల మెల్లగాఁ గదలుచుండినవి.

పంచదారగలిపిన మద్యముయొక్క కమ్మనివాసనలును, స్వాభావికమైన సుగంధముంగలదియైన యాకాంతలనోటిగాలి యారావణుని సోఁకుచుండెను. కొందఱు స్త్రీలు నిద్రయందు తమసనతులమోములను రావణునిమోమని తలఁచినవారలై మాటిమాటికి ముద్దుపెట్టుకొనిరి. రావణునియందు మిక్కిలి దగులుగలిగిన యాయుత్తమాంగనలు నిద్రచేమైమఱచినవాకయినందునఁ దమ్ము ముద్దుపెట్టువాఁడు రావణుఁడనియె తలఁచి తమసవతులను మఱల ముద్దుపెట్టుకొనిరి. అచ్చట మఱికొందఱు కాంతలు భుజకీర్తులనుదాల్చిన తమభుజములను దలక్రింద దిండ్లుగాఁబెట్టికొని నిద్రించుచుండిరి. కొందఱుజవరాండ్రు తమ చక్కని చీరెలను దలగడలుగాఁ బెట్టికొని నిద్రించుచుండిరి. ఒక్కతె మఱొక్కదానిఱొమ్మునఁ దలపెట్టి నిద్రించుచుండెను. అది మఱొక్కదానిభుజముమీఁదఁ దలపెట్టి నిద్రించుచుండెను. మఱియొకతెయింకొకదానితొడపైఁ దలపెట్టి నిద్రపోవుచుండెను. అయ్యది మఱియొక్కర్తుకచేతులను దలగడగానుంచుకొని నిద్రించుచుండెను. ఇట్లు మోహపరవశలైన జవరాండ్రంద ఱొకదానితొడమీఁద మఱొక్కతెయు, ఒకదానిప్రక్కలందు మఱొక్కతెయు, ఒకర్తుకవీఁపుమీఁద మఱియొక్కర్తుకయు, ఒకదాని పిఱుఁదులమీఁద మఱియొకతెయుఁ దమతమ యవయవముల నుంచికొని పరుండియుండిరి. ఒండొరుల భుజములపైఁ దలలుంచుకొని పరుండుటచే నల్లనికేశములుగల యాకాంతలు పూఁదేనెఁగ్రోలుటకై వాలిన తుమ్మెదలుగల పూవులదండలలాగునఁ బ్రకాశించిరి.

రావణుని యంతఃపుర స్త్రీ లొండొరుల ముఖమారుత మొండొరులకు సోఁకుటకై యెదురెదురుగాఁ జేతులుగ్రుచ్చుకొనిపరుండి, యొండొరులకోక కొంగులు దగులుకొనునట్లును, ఒకరిచేతు లొక్కరిమీఁద వేసికొని, చిక్కుపడిన యొండొరుల తలవెండ్రుకలుగలవారలై నిద్రించుటవలన వసంతర్తువునందు చక్కఁగాఁ బూచిన తీఁగలెక్కువ గాలి వచ్చుటచే నొండొంటితోఁ దండలవలెఁ జేరినవి, యొండొంటితోఁ

గలిసిన పూవులరాసులుగలవి, యొకటితోనొకటి పెనుచుకొన్న కొమ్మలు గలవి, యొండొంటిమీఁదను దుమ్మెదలు వాలుటలుగలవియునై యుండు నట్లు ప్రకాశించిరి.

ఆకాంతలంద ఱొండొరులను చేరికొని పండుకొనుటచేత వారు వాడుదాల్చిన భూషణము లాయాతావులయం దున్నను గలిసియున్నం దున నీభూషణములొక్కటెవి యీ భూషణములు మఱొక్కటెవి యని నిశ్చయించుటకు వీలులేకుండెను. అప్పుడు రావణుఁడు హాయిగా నిద్రించుచుండఁగా, పలుకంగులుగల యాస్త్రీలనందఱను పసిఁడికంబము లం దుంపఁబడినదీపములు తెప్పపాటులేనివై చూచుచున్నవోయన్నట్లు వెలిఁగెను. ఆరావణుని శయనగృహంబున నున్న రాజర్షి పితృదైత్య గంధర్వ కాంతలును మఱియు నచ్చటనుండు రాక్షసకాంతలును రావ ణుని రూపబలాదులం జూచి మోహించి, మన్మథపరవశలై వచ్చిన వారలెకాని, యీ రావణుఁడు సీతనుదప్ప నొక్కటెను బలాత్కార ముతోఁ దెచ్చినవాఁడుకాఁడు. మఱియు రావణుఁడు యుద్ధముగోరి, యొరులకాంతలను గొంపఱిని దెచ్చెను. కాని, తానుగాఁ గోరి తేలేదు. కొంపఱు మదించిన జవరాండ్రు రావణునిమోఁది మోహముచే మద నునిబొరిందవిలి వచ్చిరి. ఆ స్త్రీలలో నందఱును రావణునిగుణములను గోరివచ్చిరేకాని, యాతఁడు తనపరాక్రమము మెఱయ బలాత్కార ముగాఁ దెచ్చినకాంత యొక్కటెయులేదు. రావణునియందుఁ దప్పఁ దక్కినపురుషునియందుఁ గోరికగలదియులేదు. జానకితప్ప ముందుగా రావణేతరపురుషుని భర్తనుగాఁ బొందినదియులేదు; రావణుని స్త్రీలలో నొక్కటెనైనను సత్కులమునఁ బుట్టనిదియు, సౌందర్యములేనిదియు, శృంగారరసాదులందు నేర్పులేనిదియు, బలిమిలేనిదియు, భర్తకుఁ గోరఁ దగనిదియు లేకుండెను. (౫౬)

రాముని ధర్మపత్నియగు సీత స్వయంవరమునకు పూర్వమే రావ ణునికి పత్నియయినచో, రావణుని జన్మము సార్థకమై యుండెడు ననుc నీబుద్ధి స్వాభావికముగా మంచిబుద్ధిగల హనుమంతునికిఁగూడఁ గోతి స్వభావమువలనఁ బుట్టెను.

హనుమంతుఁడు "మొదట నిట్లు చెడుతలంపు తలఁచియు, మరల విచారమునొంది "సీత సకలగుణములలో నందఱికంటె నుత్తమురాలు.

అట్టి యా సీతాదేవి విషయమున నీరావణుఁడు గొప్పకులమునఁ బుట్టిన వాఁడైనను లోకనింద్యమైన కార్యము నొనరించెను గదా" యని మన మున మిక్కిలి నొచ్చి, చింతించిన వాఁడయ్యెను.

10-వ స ర్గ ము

హనుమంతుఁడు రావణునిఁజూచుట

అంత హనుమంతుఁ డా రావణునిశాలయందు స్ఫటికములు చెక్కినదియు, నవరత్నములచే నలంకరింపఁబడినదియునై, దంతము తోను, పసిఁడితోనుజేసిన విచిత్రములయిన యంగములతోఁ గూడి నవియు విలువగల పఱపులతోను బట్టలతోను గూడినవియగు వైడూర్య ఖచితములైనవియునగు నాసనము లంతట వెలయుచుండ నొప్పారునది గనుక దేవేంద్రునిశయనగృహముంబోలు మేలైన శయనగృహమును జూచెను. ఆ శయనగృహమున నొక ప్రదేశమున నెత్తావి గుబాళించు పూలసరములచే సొంపుమీఱినదియు, చంద్రునిఁబోలునదియునైన తెల్లనిగొడుగును జూచెను. మఱియు హనుమంతుఁడు సువర్ణమయ మయినందున నగ్నిహోత్రునిమాడ్కి వెలుఁగునదియు, అశోకపుష్ప మాలికలచే విస్తారముగా నలంకరింపఁబడినదియు, రాక్షసకాంతలు వింజా మరములు చేతఁబట్టి యంతట వీచుచుండఁగా, పలుతెఱఁగుల చంద నముల సువాసనలు గమగమయని పర్వుచుండఁగా, అగురుధూపముల వాసనలెల్లకడల నొసఁగుచుండఁగా, విలువగల పఱపును, దానిపై కంబ ళ్లును పఱపఁబడియుండఁగా, సువాసనగల పూవులదండలంతటను, శోభను గలిగించుచుండఁగా నొప్పిన యారావణునిపాన్పును జూచిన వాఁడయ్యెను.

ఆపాన్పునందు నల్లనిమబ్బుచాయగలవాఁడును, నిగనిగమెఱయు మేటియంటుజోళ్లుదాల్చినవాఁడును, ఎఱ్ఱనికన్నులుగలవాఁడును, నిడుపు చేతులవాఁడును, పసిఁడిబట్టగట్టినవాఁడును, పరిమళవంతమైన యెఱ్ఱని గంధము నలఁదికొన్నవాఁడునునైనందున సంధ్యాకాలపు ఱెఱుపు గ్రమ్మియుండ మెఱుపులు మిఱుమిట్లు గొల్పుచుండు నాకాశమున వెలుఁగుచుండు నల్లమబ్బువలె నుండువాఁడును, దివ్యభూషణములఁ దాల్చినవాఁడును, కామరూపుఁడు గనుక రాక్షసరూపుఁడయినను

జూడఁదగినరూపముఁదాల్చినవాఁడును పుష్పులతోఁగూడిన చెట్లుగల వనములతోను, పొదలతోను గూడిన మందరపర్వతముమీఁద నుండువాఁడును, రాత్రులందుఁకేళిసల్పి యలసినవాఁడును, రాక్షసకాంతలకుఁ బ్రియుఁడును, రాక్షసులకుఁ గోరినవి యొసఁగిసుఖము గలిగించువాఁడును, మద్యమునుద్రావి మైమఱచి నిద్రించుచుండువాఁడును నైన రావణాసురుని మారుతి చూచెను.

అంతట హనుమంతుఁడు వెలుఁగుచుండెడి యాపాన్పునందు నొడలు తెలియనట్లు నిద్రించుచు, ఏనుఁగుమీఁద బుసకొట్టుచున్న యారావణునిఁజేరి, "యితఁడు పాపాత్ముఁడు. రామునిదేవి యగు సీత నపహరించినవాఁడు. ఈతనింజేరరా" దని యెంచి, మిక్కిలిపెఱుచిన వాఁడువోలె నచ్చోటినుండి కొంచెము దూరమునకుఁ బోయెను. అట్లు వెనుకకుఁ గొంతదూరముపోయి, యచ్చటి యొక మెట్టుమీఁదుగా మఱియొకతిన్నె మీఁది కుఱికి నిద్రించుచున్న యట్టిరావణుని బొగుగాఁ జూచినవాఁడయ్యెను.

దివ్యగంధమాల్యాభరణాంబరధరుఁడగు రావణుఁడు శయనించిన యాపాన్పు, మదజలంబుగార్చెడి యేనుఁగు ప్రవేశించిన సెలయేటి ప్రవాహము చందమున వెలుఁగుచుండెను.

అప్పుడు రావణుఁడు బంగారు భుజకీర్తులుగలవియు, నింద్రుని ధనుస్సును బోలినవి, యింద్రుని వెల్లయేనుఁగుతోడిపోరాటములందు దానికొమ్ముల కొనలపొడుపులచేఁ దగిలినగాయములు గలిగినవియు, వజ్రాయుధముచేఁ గీచఁబడిన బలిసిన భుజ శిరస్సులుగలవి, విష్ణుచక్రపు దెబ్బలచే గాయములు గలవియు, లావుగలవియు, ఎచ్చుతక్కువలులేని మూఁపులుగలవియు, బలిమితోఁగూడినవియు, శుభలక్షణములుగల గోళ్లును బొటనవ్రేళ్లును గలవియు, చక్కనివ్రేళ్లును, ఆఱుచేయియుఁ గలవియు, చక్కఁగాఁగదిసినవియు, గడియమ్రానులంబోలినవియు, యేనుఁగుతొండములవలె గుండ్రనివియు, కుందేటిరక్తముతో సమానమై మిక్కిలిచల్లని నెత్తావి గుబాళించు మేలిమియొఱ్ఱగంధముచేఁ బూయఁబడినవి, చక్కఁగా నలంకరింపఁబడినవియు, తెల్లనిపాన్పునందుఁ జాచఁబడియుండుటచే నైదుతలలపాములవలె నొప్పునవియు, చక్కని జవరాండ్రచేఁ బిసుకఁబడునవియు, చక్కనిగంధపుఁ బూఁతగలవియు,

యక్ష, పన్నగ, గంధర్వ, దేవ, దానవుల నేడిపించునవియు, మందర పర్వతమున నిద్రించుకోపముగల గొప్పపాములంబోలినవియునైన తన చేతులను మంచమువిూఁదఁ జాచికొని పరుండియుండఁగా హనుమంతుం డట్టిరావణుని భుజములను జూచినవాఁడయ్యెను.

పర్వతోపముఁడయిన రాక్షసరాజగు రావణుఁడు సకలశుభ లక్షణములలోఁ గూడినవాఁడై రెండుశిఖరములతోఁగూడిన మందర పర్వతముమాడ్కిఁ బ్రకాశించెను. మఱియు మాంస, సురపాన్న, పాగడపూవులతావివంటి తావిగలదియు, షడ్రసోపేతములయిన భక్ష్య భోజ్యాదులతావియు, మద్యగంధమునుగల గొప్పనిట్టూర్పు శయన గృహము నిండునట్లు రాక్షసరాజగు రావణుని గొప్పనోటినుండి వెలువడుచుండెను.

శిరస్సునందు కొంచెముజారిన ముత్యములుగూర్చిన బంగారు కిరీటమును, చెవులందు దివ్యములైన యంటుజోళ్లును, నిడుపునిఱివియుఁ గలిగి బలిసియున్న యొమ్మునందెఱ్ఱనిచందనపుఁబూఁతయు, ముత్యాల హారమును, తెల్లనిపట్టు పచ్చడము, పచ్చనిమేలిముకట్టు పుట్టమును నలరారుచుండఁగా, మిసుపరాశివలె నల్లనై పామువలె బుసకొట్టుచు, గంగానదీజలమునడుమ నిద్రించు నేనుఁగుంబోలినవాఁడును, మంచ మునకు నలువైపులం దుంచఁబడిన నాలుగు బంగారు స్తంభముల దీప ములకాంతిచే దేదీప్యమానముగ ప్రకాశించుచున్న దేహాముగల వాఁడును, అన్నియంగములు దెలియునట్లు వెలికిలఁ బరుండియుండు వాఁడును, మెఱుఁగులతోఁగూడిన మేఘమువంటివాఁడునగు రావణునిఁ జూచినపదంపడి, ఆబలవంతుఁడగు రావణునిపాదములకడఁ బరుండి యున్న యాతనిప్రేమంపుఁబెండ్లాలను పావని చూచినవాఁడయ్యెను.

అచ్చటఁ జంద్రునివలె వెలుఁగు నందమయిన మోములుగల ఘారును, చక్కనికుండలములను దాల్చినవారును, వాడనిపూవులసరము లును, తొడవులును ధరించినవారును, ఆటపాటలందును, వీణెమొదలగు వాద్యములు వాయించుటందును జాణలునైన జవరాండ్రను, రావణునిఁ గౌఁగిలించి నిద్రించుచుండు దేవకన్యకలను అచ్చటిస్త్రీలు చెవులకొన లందుఁ దాల్చియుండు కెంపులు, రవలుచెక్కిన పసిఁడికమ్మలను, భుజము లందుఁ దేజరిల్లు బాహుపురులను మారుతి చూచెను. ఆపుష్పక

విమానము చక్కనికుండలములు దాల్చిన యాకాంతలయొక్క చంద్రునిఁ బోలు మోములవెలుఁగులుగల దగుటచే నక్షత్రగణములతోఁగూడిన యాకాశముమాడ్కి వెలుఁగుచుండెను.

ఆరావణుని పత్నులగు మేటిజవ్వనులందఱు యౌవనమదమువలన నొనర్చిన సంభోగవ్యాపారములచే నలసినవారలై యచ్చటచ్చట నిద్రించుచుండిరి. నృత్తమునందు నేర్పుగలయొకచామ యొక్కనవాఁడుక వలన నృత్యకాలమునందువలెనే కరచరణాద్యవయవముల పొంకముతోఁ బొన్నుమీఁద దేహమునుంచి యొకమూల నిద్రించుచుండెను. మఱి యొకభామ వీణెనుగౌఁగిలించి నిద్రించుటచే, నదీవేగమునకుఁ గొట్టు కొనివచ్చి యోడకుఁదగులుకొన్న తామరతీఁగెవలెఁ బ్రకాశించు చుండెను. మఱియొకతె మడ్డుకమను వాద్యమును జంకఁబెట్టుకొని నిద్రించుటచేతఁ బసిబిడ్డను ప్రేమతోఁ జంకనెత్తుకొనియె నిద్రించిన కాంతవలెఁ గానఁబడెను. చక్కని స్తనములు మొదలగు నంగములుగల యొకానొకజవ్వని పటహమనువాద్యమును గౌఁగిలించుకొని నిద్రింపఁగా, చిరకాలమునకు వచ్చిన భర్తను ప్రేమమీఱఁ గౌఁగిలించికొని నిద్రించిన కాంతవలె నుండెను. ఒకానొక స్త్రీ పిల్లనగ్రోవిని గౌగిలించుకొని నిద్రించుటచేత, నేకతమున మగనిని గామముదీఱఁ గౌఁగిలించికొనినట్టి స్త్రీవలె నొప్పియుండెను. నృత్యమునందు నేర్పుగల యొకవనిత వీణెను పట్టుకొని నిద్రింపఁగా, మగనితోడ నిద్రించినస్త్రీవలె నొప్పాఱెను. యౌవనమదముచే నెఱ్ఱి కన్నులుగల యొకనాఁతి మద్దెలవాయించు చుండి దానినట్లే ప్రక్కనఁబెట్టుకొని, మెత్తనివి, బలిసినవి, పసిఁడివన్నె గలవియుఁ గనుక మనోహరములైయుండు నంగములతో నామద్దెలను గట్టుకొని నిద్రించుచుండెను. చక్కని లక్షణములును సన్ననినడుమును గల యొకకాంత మదమువలనిసుకతశ్రమముచే నలసినదై, భుజపార్శ్వ ప్రదేశములకుఁ దగులునట్లు చంకలో పణవమను వాద్యమును బెట్టి కొనియె నిద్రించెను. మఱొక్కకాంత ఒకడిండిమమును బట్టుకొని, మఱియొక్క డిండిమము చంకలోఁబెట్టుకొని నిద్రించుటచేత మగనిని గౌఁగిలించుకొని బిడ్డను చంకలోఁబెట్టుకొని నిద్రించిన స్త్రీవలెఁగానఁ బడెను. తామరపువ్వుల తేకులఁబోలు కన్నులుగల యొకచెలువ మద్య మదముచే నొడలుమఱచినదై, ఆడంబరమనువాద్యమును రెండుచేతుల

నడుమ నుంచికొని పరుండినట్లు కాన్పించెను. రావణునికి గిండిచెంబు నిచ్చు మజ్జొయతివ యాగిండిచెంబును తలక్రిందుగఁ బట్టికొనినందున నాజలము మీఁదఁ బడుటవలనఁ దడిసినదై, వసంతర్తువున నొడలు నెండకువాడకుండునట్లు నీళ్లుచల్లఁబడిన చిత్రవర్ణంపు బూవులదండవలె విరాజిలెను. ఒకానొకయువతి బంగారుగిండనుబోలు స్తనములమీఁదఁ జేతులుంచుకొని, నిద్రచే నొడలుమఱచినదై నిద్రించెను. పద్మపత్రములం బోలు కన్నులును, పున్నమచందురుంబోలు మోమునుంగల యొకకాంత యౌవనగర్వముచే మైమఱచి, మఱియొక్క గుండ్రని పిఱుఁదులుగల కాంతను పురుషుఁడను భ్రమచేఁ గౌఁగిలించుకొని నిద్రించెను. కామము గలకాంతలు తమప్రియులను దమకుచములుదగులునట్లు బిగియఁగౌఁగి లించికొనుచందంబున మఱియు ననేకసుందరాంగులైన స్త్రీలు నానా విధవాద్యములను గౌఁగిలించికొని నిద్రించిరి. ఆస్త్రీలపాన్పులకుఁ గొంత సమీపమున నుత్తమమైన యాస్తరణమునఁ బవ్వళించియున్న రూపవతి యగు నొక్కసుందరాంగిని హనుమంతుఁడు చూచెను.

సుందరాంగియు, ముత్యాలు రత్నములుచెక్కిన భూషణముల ధరించినదియై తనసొమ్ముల మెఱుంగులచే నాదివ్యగృహమును దేజరిల్లు నట్లు చేయునదియు, పసిఁడివలెఁ బసిమినన్నెగలదియు చూడఁదగినదియు, అంతఃపురంపురాణియునైన మందోదరి యొకపఱపునఁబరుండి యుండెఁ. హనుమంతుఁ డా మందోదరిని జూచి, రూపలావణ్యాతిశయముచే సీతయె యది యనుకొని నెక్కువముదముతోఁ గూడినవాఁడై తనకోఁతి స్వభావముఁజూపుచుఁ జేతులు దట్టెను. తోఁకముద్దుపెట్టుకొనెను; పొంగెను; ఇటటు తిరిగెను. కిలకిలారవములుచేసెను; పరుగెత్తెను; కంబము లెక్కెను; అచ్చటినుండి క్రిందఁబడెను. ఇట్లు మాఱుతిపెక్కు కోఁతిచేష్టలు చేసిన వాఁడయ్యెను.

11-వ సర్గము

హనుమంతుఁడు రాక్షస స్త్రీలను గాంచుట

హనుమంతుఁడా మందోదరిం జూచి, మొదటఁ గోఁతిస్వభావము వలన నామె సీతయనియెంచి సంతోషించినను, బిదప నాబుద్ధిని వదలి నెమ్మదినొందినవాఁడై, యాసీతాదేవిని గూర్చి వేఱొకచింత నొందెను.

"పతివ్రతయగు నాసీత రాము నెడఁబాసి యివ్విధమున నిద్రింపఁ జాలదు. ఆసీత రామునిఁబాసి, మఱొక్కనిఁ బొందుటకును, అలంకారములు చేసికొనుటకును, పానముసేయుటకును నియ్యకొనదు. ఆసీత రామునికంటె నితరుని దేవేంద్రునివంటివానినైననుగోరదు. మానవుల లోనేకాక, వేల్పులయందైనను రాముని కెనవచ్చువాఁడు లేఁడు. కావున నిది యెంతమాత్రము సీతగాదు మఱియొకతె" యని తలఁచి పావని పానశాలయందంతట సీతను వెదకుచుఁ దిరిగెను.

ఆపానశాలయందు కొందఱు రతిక్రీడలచే డస్సిరి. కొందఱు పాటలచే నలసటనొందిరి. కొందఱుస్త్రీలు నాట్యములచే శ్రమపడిరి. కొంద ఱతివలు పానమదముచే మైమఱచి మురజములు, మృదంగములు, పీటలు, మేలిమి యాసనములు మొదలగువాని నాశ్రయించి నిద్రించుచుండిరి. కపీంద్రుఁడు చక్కనిరూపములుదాల్చి, ముచ్చటలాడుచు, సమయోచితముగా భరతశాస్త్రార్థమును వివరించువాకయి దేశకాలములను గనిపెట్టి, పొందికగల మాటలను మాటలాడుచు నుండు నెక్కుండ్రు కాంతలతోఁగూడి బాహ్యాభ్యంతరసుఖముల ననుభవించి నిద్రించుచుండు రావణునిఁ జూచినవాఁడయ్యెను. నిడివిచేతులు గలవాఁడయిన రాక్షసశ్రేష్ఠుఁడగు రావణుఁడు గొప్పయాలనడుమనుండు నాఁబోతువలెను, అరణ్యమున నాఁడేనుఁగులచేతఁ జుట్టఁబడిన గజేంద్రునివలెయుఁ బ్రకాశించెను.

హనుమంతుఁ డట్లు శయనమందిరమునఁ బరుండియున్న రావణుని, అతనిపత్నులను జూచిన తరువాత, కోరినవస్తువులతో నిండినదియగు నారాక్షసేంద్రుని భవనమునందలి పానశాలను జూచెను. అచ్చటజింకలు, దున్నలు, వరాహములు, నెమళ్లు, కోళ్లు, మేకలు, కొక్కెరలు, మత్స్యవిశేషములు మొదలగు మృగములమాంసములు ముక్కలు ముక్కలుగాఁగోసి, పెరుగుతోఁగలిపి, ఉప్పువేసి ఇంగువమొదలగు సంభారములతోఁ బక్వమయి, వెడల్పుబంగారు పళ్లెరములందు సగము సగమునిని యుంపఁబడియుండుటనుజూచెను. మఱియుఁ బులుసు, ఉప్పు, కారము మొదలగు సంభారములుచేర్చి, శర్కర, తేనె, దానిమ్మపండ్లు, మొదలగు మధురపదార్థములతోఁ బక్వముచేసిన షర్బత్తులు లేహ్యములుననెడి పదార్థములు పసిఁడిపాత్రములందు సగము దిని పాఱవేయఁ

బడియుండుటను జూచెను. అచ్చటనే కొందఱుస్త్రీల ముత్యాలహార ములు, అందెలు, బాహుపురులు నూడఁదీసి పారవేయఁబడియుండెను. పానపాత్రములందు సగముసగము తిన్న పెక్కుపండ్లును, కట్టఁబడిన పుష్పహారములును పానశాలకు మిక్కిలి మెఱుఁగుఁదెచ్చుచుండెను.

ఆపానశాలయం దచ్చటచ్చట పొందికనమర్చియుంచఁబడిన మంచ ములును, పెక్కువిధములుగా నేర్పరులగు వంటవారిచేఁ బెక్కుసంబా రములతోఁ బక్వముచేసి, వెవ్వేఱుగాఁ బాత్రలలో నుంచఁబడిన నంజు ళ్లును గలదయి, యాపానభూమి నిప్పు లేకయే మండుచున్నట్లు కనఁ బడెను.

ఆపానభూమియందు సముద్రమథనకాలమునఁ బుట్టిన వారుణీ జాతీయములగు నకృత్రిమమద్యములును, కృత్రిమములైన నారికేళాది మద్యములును, చక్కెర, పూఁదేనె, పండ్లరసము మొదలగు వస్తువులచేఁ బక్వముచేయఁబడిన మద్యములును, నానావిధములగు సువాసనపొళ్లతోఁ జేర్చి వెవ్వేఱుగా సిద్ధముచేయఁబడి యుండెను. ఆపానశాల యట్టిమద్య ములును, పలుతెఱఁగులైన పువ్వులసరములును, బంగారుతొడను, స్ఫటి కములతోడను జంబూనదియందుఁ బుట్టిన యపరంజితోను జేయఁబడిన యనేకములగు గిండ్లును విస్తారముగాఁ గలదియగుటచే మఱింత శోభా యమానమై యుండెను.

మఱియు హానుమంతుఁడు వెండిబంగారులతోను రత్నముల తోను నిర్మితములగు పాత్రలందు నిండియున్న మద్యములను, ఒకచోట సగము త్రాగియుంచఁబడియున్న పానపాత్రములను, మఱియొక్కచోఁ బూర్తిగాఁ త్రాగియుంచఁబడిన యుత్తపానపాత్రలను, వేఱొక్కచోట నేమియుఁ ద్రాగకయే యుంచఁబడియుండు పానపాత్రలను జూచెను.

హానుమంతుఁడు కొన్నిచోట్ల నానావిధములగు భక్ష్యములను, కొన్నిచోట్లఁ గొంచెముకొంచెముగా నుంపఁబడియుండు పానీయము లను, కొన్నిచోట్ల నన్నముల మిగతభాగములను, కొన్నిచోట్లఁ బగిలి పోయిన గిండ్లను, కొన్నిప్రదేశములందుఁ గలియఁబెట్టఁబడిన కుండలను, కొన్నిప్రదేశములందు నలిగిన పూవులదండలను, కొన్నిప్రదేశములందు నీటిని, బండ్లను, మేటివలువలుపఱచిన స్త్రీలపాన్పులను జూచెను. అచ్చట కొందఱు వనిత లొండొరులను గౌఁగిలించుకొని నిద్రించిరి. కొందఱు

కాంతలు నిద్రించుచుండు మటేయొక్కదాని వస్త్రమును దామిడ్చి కప్పుకొని నిద్రించిరి.

ఆస్త్రీలు గట్టినకోకలును, దాల్చినపూలదండలును అచేతనము లయ్యెను, చేతనవస్తువులు తిన్ననిగాలి ననుభవించి యాసుఖాతిశయ ముచే నిశ్చలముగనున్నట్లు కదలకయుండెను. ఆపుష్పకవిమానమునందలి మందమారుతము చల్లనిచందనముయొక్కయు, మద్యముయొక్కయు, పూదేనెయొక్కయు నానావిధపుష్పమాలలయొక్కయు, నానావిధధూప ములయొక్కయుఁ బలుతెఱఁగుల నెత్తావిని మోసికొనుచు, రసగంధ ధూపములపరిమళముచే మఱింత వృద్ధినొందినదై, యాపుష్పకవిమా నము వ్యాపించెను.

ఆ శయనగృహమునఁ బొందురశ్యామదేహకాంతిగల కొంద ఱుత్తమస్త్రీలును, కొందఱు పసిఁడిడాలుగల మేనుగల జవరాండ్రును నిద్రించుచుండిరి. నిద్రపోవునపుడు సైత మాస్త్రీలయొక్క శరీరములు మన్మథవికారహేతుకసంభోగముచే డస్సినవై తామరతీఁగలవలె రమ్య ముగ నుండెను. అట్లు మహాతేజుఁడగు వానరేంద్రుఁ డిత్తెఱఁగున రావణుని యంతఃపురమునెల్లఁ గలయంజూచెను గాని సీతాదేవిని మాత్రము చూడఁడయ్యెను. ఆమహావీరుఁడగు హనుమంతుఁ డాస్త్రీల నందఱను జూచి ధర్మలోపమువలనిభీతిచే నిట్లు చింతను బొందెను: "ఇట్లు నేను గాఢనిద్రచెందియుండు పరకాంతలను గాంచితిని. ఈ విధ మునఁ బరస్త్రీలను జూచుట నాకు మిక్కిలి ధర్మలోపమును గలిగించఁ గలదు. నాచూపు పరస్త్రీలమీఁద వ్యాపించునదిగాదు. అయిన నిచ్చట నా కీపరదారావలోకమనెడి మహాదోషము గలిగెను. అక్కటా! నేనెంతపాపము చేసితిని!" అని యిట్లు మనస్సునఁ జింతించెను.

ధైర్యవంతుఁడయిన యాహనుమంతుఁ డిట్లు కొంతతడవు చింతించి, పిమ్మట నొక్కవిధమున మనసును తాయిచేసికొని, కార్యనిర్ణ యముఁదెలుపు నొకతీరు బుద్ధిని దలపెట్టెను:—"ఏను రావణునియందుఁ బ్రేమగలయాతని భార్యల నందఱిని జూచినది వాస్తవమే. అయినను, నామనసునఁ గించిత్తైనను వికారము గలుగలేదు. మంచిపనులందును చెడ్డపనులందును ఇంద్రియములయన్నిటి ప్రవృత్తికి మనసే హేతువు గదా. అట్టి నామనసేమో నిశ్చలముగానున్నది. సీతను నేను వేఱొక

స్థలమున వెదకుటకు వీలుగాదుగదా. స్త్రీలను వెదకవలసినదిగానుండిన, స్త్రీలయందేగదా వెదకవలయును. ఏజంతువునకు నేదిజాతియో, యాజాతియందె దానిని జనులు వెదకుదురు. కనఁబడకపోయిన జవరాలిని లేళ్లగుంపునందు వెదకుటయెట్లు? కావున నీరావణునియంతఃపురమెల్ల నిశ్చలమైనమనస్సుతో వెదకితినికాని, సీతాదేవిమాత్రము గనఁబడలేదు" అని తలఁచినవాఁడై, వీరుఁడగు హనుమంతుఁడు దేవగంధర్వనాగకన్యలను జూచెనేకాని, సీతాదేవిని జూడఁడాయెను.

అప్పుడు శూరుఁడయిన కలిమిగల వానరవీరుఁడు సీతను జూడక, యన్యస్త్రీలను జూచుచు నచటినుండి తొలఁగిపోయి, మిక్కిలి చింతించి, మఱల ధైర్యము నొందినవాఁడై పానశాలను వదలి సీతను వెదకుటకు బయలువెడలెను.

12-వ సర్గము

హనుమంతుఁడు సీతను జూడక వగచుట

హనుమంతుఁడు సీతనుజూడఁ దమితో నారావణుని శయనగృహమధ్యమునఁ దీఁగెయిండ్లను, చిత్రగృహములను రాత్రులందుండఁదగిన గృహములను జొచ్చి వెదకెనుగాని, చక్కని చూడ్కిగల యాసీతాదేవిమాత్రము గనఁబడదాయెను. అట్లు రఘునందనుని ప్రియపత్నిని సీతాదేవిని వెదకియుఁ గానక మారుతనందనుఁ డిట్లు చింతింపఁదొడఁగెను:

"సీతాదేవి తప్పక మృతినొందియుండును. కావుననే నేనెంత వెదకినను, నాకుఁ గానరాకున్నది. సీతాదేవి పాతివ్రత్యమహిమము గాపాడుకొనఁ బట్టుపట్టినచో గొప్పదైన సన్మార్గము దప్పకుండఁగా, నీ కడుదుష్టుడయిన రావణుఁ డా దేవిని కుత్తుకనులిమి చంపియుండును. లేదా, హెచ్చుతక్కువరూపమును, వికృతవేషమును, వెడదమోమును, నిడుపువెట్టిమూపులుగల తేజోహీనులగు నీ రాక్షసకాంతలనుజూచి భయపడి జనకరాజపుత్రి మృతినొందియుండును.

నేను సీతనుజూడక, శత్రువులవిషయమునఁ బరాక్రమము చూపక, బహుకాలము వానరులతోడఁ బ్రొద్దువుచ్చిన నాకు, ఇఁక సుగ్రీవునికడకుఁ బోవలసినయాశ లేదు. అతఁడు కఠినముగా దండన

సేయువాఁడు ; బలవంతుఁడు. అతని నెదిరింప నెవరికిని వీలుకాదు. అంతఃపురమెల్లఁ జూచితిని. రావణుని రాక్షస భార్యలను జూచితిని. పతివ్రతయగు సీత గానరాదు. నేఁబడిన శ్రమయెల్ల వమ్మయ్యెను. నేనిచ్చటినుండి మఱలి సముద్రమును దాఁటఁగా వానరులందఱు గుమిగూడి వచ్చి నన్నేమడుగుదురు ? "ఓ వీరుఁడా ! ఆలంకకుఁబోయి యేమి చేసికొనివచ్చితి" వని యడుగుదురు. నే నిచ్చట సీతను గానక యేమి బదులు సెప్పుదును. గడుపుమోఁతచేత వారందఱు నిక్కముగాఁ బ్రాయోపవేశము చేయఁగలరు. వృద్ధుఁడైన జాంబవంతుఁడును, అంగదుఁడును తక్కినవానరులును సముద్రమును దాఁటిన నన్నుఁ జుట్టుకొని యేమిచేసితివని యడుగుదురు. వారికి నేనేమిచెప్పుదును ? ఉత్సాహమే సంపదకు మొదటికారణము. ఉత్సాహమే పరమసుఖము. ఉత్సాహమే యన్నిపనులకు సాధనము. ఆయుత్సాహమే యాయాజంతువుయొక్క కర్మఫలమును సిద్ధింపఁజేయును. కనుక ఉత్సాహముతోఁ జేసినకార్యమే శ్రేష్ఠము. కావున నేను మఱల వెడలి రావణుఁడేలెడు ప్రదేశముల నెల్ల వెదకెదను. చలిపందిళ్లను, పూవులగృహము లను, చిత్రశాలలను, క్రీడాగృహములను, ఇంటితోఁటల నడుమనుండు వీథులను, పైక్కువిమానములను, విచిత్రగృహములను, ఆటయిండ్లను మఱల వెదకెదను."

హనుమంతుఁ డిత్తెఱఁగున నాలోచించి, మఱల భూమిలోపలి గృహములందును, నాలుగుత్రోవలుగలియుచోట్లనుండు మండపములందును, ఇండ్లకుదూరమున స్వేచ్ఛావిహారమునిమిత్తముగట్టియుండు గృహములందును వెదకఁబూనినవాఁడై, యెత్తుగానుండుతావుల నెక్కుచు, అచ్చటినుండి దిగుచు, మాటిమాటికి నిలఁబడుచు మరలఁ బోవుచు, ద్వారములను దెఱచుచుఁ, దలుపులను బగులఁగొట్టుచు, నిండ్లలోపలఁ జొచ్చుచు, వానినుండివెలుపలికి వచ్చుచు, భూబిలగృహముల లోపల దిగుచు మఱల పానినుండి పైకెక్కివచ్చుచు నిత్తెఱఁగున నాప్రదేశమంతయు వెదకినవాఁడయ్యెను. రావణునియంతఃపురమున హనుమంతుఁడు వెదకనితావు నాలుగంగుళములంతయైనను లేదు. హనుమంతుఁడు ప్రాకారములోపల నున్న మంత్రికుమారులు మొద

లగు వారుండెడి వీథులును, రచ్చచెట్ల కాథారములుగా నుండెడి తిన్నెలును, నడబావులును, తామరకోలంకులును గలయఁజూచెను.

పలుపలురూపములుగల విరూపలయిన వికృతంపు రాక్షస్త్రీలతనికిఁ గనఁబడిరేకాని యాజానకి గనఁబడదయ్యె. లోకమున సాటిలేని సౌందర్యముగల చక్కనైన విద్యాధరకాంతలు పెక్కండ్రచ్చటఁ గనఁబడిరేకాని రాముప్రియురాలు దృష్టిగోచరము గాదయ్యె. రావణునిఁ బెండ్లాడిన పున్నమచందమునిఁ బోలు మోములుగల నాకలోక స్త్రీలును, రావణుఁడు బలాత్కారముగాఁ దెచ్చిన నాగకాంతలును (43) అచ్చట పెక్కండ్రు గానవచ్చిరేకాని, జనకనందిని మాత్రము గనఁబడదయ్యె.

నిషదచేతులవాఁడైన మారుతసూనుఁడగు హనుమంతుఁ డా సీతను గానక తక్కిన చక్కని పడుచుల నందఱిని జూచి, పలుమఱు వగచి, వానరేంద్రులు సీతాన్వేషణమునకై చేసిన ప్రయత్నమును, తాను సముద్రమును దాఁటినయు నిరుపయోగ మాయెనని యోచించి, మఱల వగఁగూరి, విమానమునుండి డిగ్గి, శోకముచే మనమున నేమియుఁ దోఁచనివాఁడై, మఱల వగపాలై యుండెను.

13-వ సర్గము

హనుమంతుఁడు విచారపడుట

వడిగల హనుమంతుఁడు తానింతకు మున్నెక్కియున్న విమానమునుండి యట్లు దిగి, ఇంద్రనీలమణులు చెక్కినప్రాకారమును దాఁటి, మేఘమధ్యమునసున్న మెఱుపుకైవడి వెలుఁగుచు, రావణునిగృహము విడిచివచ్చి, జనకరాజపుత్రియగు సీతను గానక తనలోఁదానిట్లు యోచింపఁదొడంగెను.

"నేను రామునికి ప్రియము చేయఁగోరి, యీ లంకాపట్టణ మెల్లఁ బటుమాఱు గాలించితిని. చక్కని యన్ని యవయవములుగల దగు సీత నాకగపడలేదు. ఈలంకాపురమునంబలి గుంటలును, చెఱువులును, కొలంకునును, చిన్నకాలువలును, నదులును, జలప్రాయములైన నప్రదేశములును, దుర్గములును, పర్వతములును, భూమియెల్లను వెదకితిని. సీతమాత్రము గానరాదు. గ్రద్దలనాయకుఁడగు సంపాతియు,

సీత రావణుని యింటనున్న దని వక్కాణించెను. ఇచ్చట సీతగాన రాదు. సీతయు (అయోనిజ), విదేహదేశాధీశునికుమారి, సుజనుల కునికియగు మిథిలానగరనాయకుని కూతురు; జ్ఞానవంతులలోఁ బ్రసిద్ధుఁడైన జనకమహారాజునకుఁ బుత్రిక. ఇట్టి సుగుణగణవిశిష్టురాలగు సీత చేయునదిలేక యారావణునికి లొంగినదై యారావణునిఁ బ్రేమతోఁ జేరియుండునా? ఎంతమాత్రము చేరియుండదు. రావణుఁడు సీత నెత్తి కొన్నవాఁడై రామునిబాణములకు వెఱచి, వేగముతో నెగిరివచ్చు నప్పుడు త్రోవలో జారిపడియుండవలెను. లేదా, సిద్ధులు దిరిగెడి యాకాశమార్గమున రావణుండు తన్నెత్తికొనిపోవుచుండఁగా, సీత సముద్రమును జూచి మనసునదిగులుపడి దానియందు గూలినదేమో? లేదా, రావణుని మిక్కుటమైన వేగముచేతను, వానిచేతులనడుమ నలుఁగుట చేతను నావెడదకన్నులదగు పూజ్యురాలయిన రామునిపత్ని ప్రాణములఁ బాసియుండవలెను. అటుకాదేని, రావణుఁడు సముద్రమును బైపైననే దాఁటుచుఁ బోవుచుండఁగా, నప్పుడు జానకి పొఱలి సముద్రమునఁ బడిపోయియుండవలెను. ఇది నిక్కము. అట్లు కాకపోయిన, సీత తననడవడిని గాపాడఁగోరి రావణుని కెడమిాయకుండఁగా నప్పుడు రావణుఁడు సీతపైఁ గోపపడి దిక్కులేని యామెను మ్రింగెనేమో. అక్కటా! యీరావణుఁడెంతకటికివాఁడు! అట్లుకాదేని, నల్లనికన్నులు గల యీ పతివ్రతయగు సీతను రావణునిభార్యలు తమకు సవతి పోరొక్కటి గలిగె నన్న తలంపుతో మ్రింగియుందురు. లేదా, నిండు చందురనిఁబోలునదియు, కమలపత్రములవంటి నేత్రములుగలదియు నైన రామునిముఖమునే ధ్యానించుచు, నాచింతచే నాదేవి ప్రాణములఁ దొఱఁగియైన నుండవలెను. లేదా, "హారామా! హాలక్ష్మణా! అయోధ్యా! అయోధ్యాపురమా!" యని పలుతెఱఁగుల విలపించి జీవితముఁదొఱఁగి యుండవలెను. అట్లుకాదేని, రావణుని యంతర్గృహముననే యుంచఁబడినదై, పంజరమున నుంచఁబడిన యాఁడు గోరువంకవలె విలపించుచున్నదేమో? ఇదియొకవేళ వాస్తవముగా నుండవచ్చును. అంతియకాని బ్రహ్మజ్ఞానియగు జనకమహారాజుకూఁతురు, అయోనిజ, పరాక్రమశాలియు జనరంజకుఁడునైన రామునికి భార్య, కలువతెకులవంటి కన్నులుగలది, సన్ననినడుముగలది, ఉత్తమాంగన

యగునిట్టి యారామునిదేవి యెన్నటికైన రావణుఁగోరునా ? ఆతనికి లోఁబడునా ? ఆమె యాతనిఁగోరదు. ఆతనికి లోఁబడను బడదు.

నాకేల యీవిచారము ? జానకి భూగృహాదులలో నుంచుటచేఁ గనఁబడలేదో ? సముద్రమునఁబడి ప్రాణములఁ దొఱఁగినదేమో ? లేక రామునిఁదలఁచికొని మృతినొందినదేమో, రామునికి సీత ప్రాణసమానురాలు. అట్టిరామునికి సీతవృత్తాంతము దెలుపకుండుట యుక్తము గాదు. సీతసంగతి దెలిపినను పాపము సంభవించును. వాస్తవము తెలుపకున్నను స్వామివంచనరూపమైన దోషము సంభవించును. ఇప్పు డెట్లు నేను చేయవలసినది ? అంతయు విరుద్ధముగానున్నది. ఇటువంటి కార్యములం దేది యుక్తముగా నుండును ? ఇప్పుడు నేను సీతను గానక వానరేంద్రునిపురమునకుఁ బోతినేని, నేనేమికార్యము సాధించి నట్లగును ? నేనీసముద్రమును దాఁటినదియు, లంకలోఁ బ్రవేశించి నదియు, రాక్షసస్త్రీలను గాంచుటయు నిష్ఫలమగును. నేను కిష్కింధకుఁ బోఁగానే, సుగ్రీవుఁడును, వానరులును, రామలక్ష్మణులును అందఱును గూడి నన్నేమి యడుగుదురు ? వారందఱు సీతయగపడినదా యని యడుగుదురు.

నేను కాకుత్థ్సునికడకేగి, సీతను జూడలే దను కడు నప్రియమగు మాటను జెప్పెదినేనిని, కర్ణకఠోరమును, భయంకరమును, ఉగ్రమును, అసహ్యమును, ఇంద్రియక్షోభకరమునైన యావాక్యమును విన్న మాత్రముననే యారాముఁడుండఁడు. రాముఁడు కష్టమునొంది మనస్సున మరణమునకు నిశ్చయింపఁగా, నారాము నెప్పుడును ఎడఁబాయకుండువాఁడును, బుద్ధిమంతుఁడునైన లక్ష్మణుఁడు ప్రాణములతో నుండఁడు. అన్నలిద్దఱు మృతినొందినన్న వార్తవినెనా, భరతుఁడును మృతినొందును. భరతుఁడు మృతినొందినచో శత్రుఘ్నుఁడుండఁడు. తమపుత్త్రులందఱు మృతినొందుటచూచి, వారితల్లులుండరు. నెనరు గలవాఁడును, ఆజ్ఞినమాట తప్పనివాఁడునైన వానరాధిపుఁడగు సుగ్రీవుఁడును తమప్రాణమిత్త్రుఁడట్టిస్థితినొందుటచూచి, జీవితమును వదలును. సుగ్రీవుఁడు మృతినొందఁగా ; నతనిభార్యయగు రుమయు దుఃఖితయై, దీనతనొంది, సంతోషములేనిదై చిక్కి భర్తృవియోగవ్యసనముచే మరణమునొందఁగలదు. తార వాలిమరణమువలని శోకము

చేతనే మొదలుచిక్కియున్నది. దానికిదోడుగా సుగ్రీవుడును మృతి
నొందెనేని యామెబ్రతికియుండదు. తల్లిదండ్రులు పోవుటచేతను,
పినతండ్రియైన సుగ్రీవుడు మృతినొందుటచేతను బాలుడైన యంగదుఁ
డెట్లు ప్రాణములతో నుండఁగలఁడు? తక్కిన వానరులందఱు తమరాజు
మృతినొందినతర్వాతఁ దమకేల ప్రాణము లని, పిడికిళ్లతో నెత్తిని గ్రుద్దు
కొనియు, ఆఁఅచేతులతో బాదుకొనియుఁ దలలుపగులఁగొట్టుకొనిచత్తురు.
కీర్తిమంతుఁడయిన సుగ్రీవుఁడు తనపరిజనులకు మంచిమాటలు చెప్పియు,
కోరినవి యొసఁగియు, గౌరవమొనర్చియు సున్నాఁడు. అట్టి తమరాజు
పోయినతరువాతఁ దమకేల బ్రతుకని, వారు తమప్రాణములను నదలఁ
గలరు. రాజమరణశోకముచేత వానరులు వనములందును, బర్వతము
లందును, ఇండ్లుమొదలగువానిచేఁ గప్పఁబడియుండు ప్రదేశములందును
గూటములుకూడి విహరింపరు. ఇఁకేమి చేయుదురనిన, ఆలుబిడ్డలు పని
వారు వీరితోఁగూడి పర్వతశిఖరములెక్కి యచ్చటినుండి పడి తమతలలు
పగులఁగొట్టుకొందురు. లేదేని, యావానరులు విషము పుచ్చుకొనియో,
ఉరివేసికొనియో, అగ్నిప్రవేశముచేసియో, ఒక్కప్రొద్దులుండియో,
కత్తితోఁ గొంతుకోసికొనియో ప్రాణములఁ దొఱఁగుదురు.

కావున నేనిక్కడినుండి మఱలి కిష్కింధకుఁ బోయితినేని, భయం
కరమైన గగ్గోలు పుట్టఁగలదు. ఇక్ష్వాకుకులమునకు, వానరకులమునకుం
జేటుపుట్టఁగలదు. కావున నేనిచ్చటినుండి కిష్కింధకుఁ బోవనే పోవను.
సీతను జూడక నేను సుగ్రీవునిఁ జూడఁజాలను. నేను కిష్కింధకు
మఱలిపోక యిక్కడనేయుందునేని, ధర్మాత్ములును, మహారథులునయిన
రామలక్ష్మణులు సీతవృత్తాంతము దెలియఁగలదన్న యాశచేఁ బ్రాణము
లతో నుండఁగలరు. వానరులును సంతసము గలిగియుందురు. నేను
జానకిని జూడనేని, చేతఁ జిక్కినది, నోటిలోఁబడినది తినుచు, నియమము
పట్టి, చెట్లమొదళ్లయందుఁబసుండి, నానావిధములగుకందమూలఫలముల
తోను, ఉదకముతోను సముద్రప్రాంతజలప్రాయభూములందు వాన
ప్రస్థుఁడనైయుండెదను. చితిపేర్చి, యరణినుఁడి నిప్పుచిలికి దాని నాచితి
యందుంచి చక్కగాఁ బ్రజ్వరిల్లఁజేసి యందుఁ జొచ్చెదను. కాదేని,
ప్రాయోపవేశముచేసి శరీరము విడుతును. కాకులు, కుక్కలు, నక్కలు
నాకళేబరమును దినఁగలవు. "ఇది మహర్షులంగీకరించిన మరణము" అని

నాతలంపు. లేదా, లోఁతులోపలఁ బ్రవేశించెదను. మొదట లంకాధి దేవతయొక్క విజయముచేత మేలుగావించినదియు, సీతాదేవిని వెదకుట కనుకూలమైన వెన్నెలరాకచే మనస్సున కింపుగలిగించినదియు, సీతను వెదకుటకు సహాయపడినదియని జనులచే నెన్నఁబడు కీర్తియను పుష్ప మాలికగలదియు, హనుమంతుఁడు లంకను ప్రవేశించిన రాత్రియని ప్రసిద్ధిగన్నదియునైన యీదీర్ఘరాత్రి సీతాదర్శనముచేయని నా కిప్పుడు వ్యర్థమాయెను. ఒకచెట్టుమొదటఁ గూర్చుండి, నిద్రాహారములు మాని, తపస్సుచేసికొనుచుండెదను. అంతియకాక, యిక్కడనుండి నేనెంత మాత్రము మఱలిపోవను. నేనిచ్చటినుండి సముద్రము దాఁటిపోతినేని, అంగదుఁడును అతనితో వచ్చిన వానరులును ప్రాణములతో నుండరు. నేనింతసేపు ప్రాణములఁదొఱఁగవలయునని యెంచితిని. అది యుక్తము గాదు. వినాశమునందుఁ బెక్కుదోషములుగలవు. బ్రతికియుండిన మేలుపడయవచ్చును. కావున బ్రాణములతోనుండెదను. ప్రాణము లతోనున్న మేలుపడుటయు నిజము. అని యిత్తెఱఁగునఁ బలుతెగలఁ బోలుచుండు దుఃఖమును మనసున నడఁచుకొని యాశోకమునకుఁ దుదిగానకుండి కొంతధైర్యము దెచ్చుకొని తనలోఁ దానిట్లని చింతింపఁ దొడఁగెను.

"బలవంతుఁడగు పతితలలవాఁడైన యారావణునిఁ బరిమార్చి దను. సీతాదేవిని వాఁడపహరించినాఁడని యెంచికొందము. దానిచే వానిమీఁదిపగ దీర్చుకొన్నట్లులగును. అటుగాదేని, రావణాసుఁ నెత్తికొని సముద్రమును దాఁటిపోయి, పరమశివునికి బలిపెట్టునట్టు లారామునిముందట నుంచెదను." అని యిట్లు హనుమంతుఁడు సీత యొక్క పోఁబడిలేలియమిచేఁ జింతను బొందినవాఁడై, యటుపిమ్మట నేమి చేయవలసినది యను పనితెఱఁగును, తీరనిదుఃఖమును మనస్సును గలఁతపెట్టుచుండఁగా మఱల నాలోచనచేయఁబూనెను.

గీర్తిమతియగు రామునిపత్నిని సీతను గాంచువఱకు అంత నీలంకాపురమును మాటిమాటికి వెదకెదను. పోనిమ్ము, సంపాతి మాటనుబట్టి రామునిక్కడకుఁ దోడితెత్తమనిన, రాముఁడు సీత నిచ్చటఁ గాంచఁడేని, తనకు వట్టి ప్రయాసగలిగించినందుకు, వానరులసత్యము చెప్పినందుకు నలిగినవాఁడై, వానరుల నందఱను గాల్చివేయును.

కావున నే నిచ్చటనే యాహారమును వర్జించి యుండెదను. అట్లైనచో నానిమిత్తమై వానరు లందఱు మృతినొందక యుందురు. గొప్పప్రాకారముతో గూడిన యశోకవనము గన్పట్టుచున్నది. ఈ వనమునకుఁ బోయెదను. ఇచ్చట నేను సీతాదేవి నింకను వెదకలేదు.

"అష్టవసువులను, ఏకాదశ రుద్రులను, పన్నిద్దఱు ఆదిత్యులను, అశ్వినీదేవతలను, మరుత్తులనుగూర్చి నమస్కరించి, రాక్షసులకు శోకము పెంచువాఁడనై, రాక్షసుల నందఱిని సంహరించి, తపస్సు చేయువానికి భగవంతుఁడిష్టార్థసిద్ధి నొసఁగుచందమున నేనును ప్రియా దర్శనము చేయఁగోరుచున్న రాముని కీ సీతాదేవి నెత్తుకొనిపోయి సమర్పించెదను." అని యిట్లు మారుతి మనసునఁ గలవరపాటు నొందిన వాఁడై, కొంతతడవు చింతించి రామలక్ష్మణులకును, సీతాదేవికిని, రుద్రేంద్రయమవాయుదేవతలకును, సూర్యచంద్రాదిదేవతల కందఱికును, సుగ్రీవునికిని మ్రొక్కి, ధైర్యముపూని యచ్చటినుండి లేచి, మనసుచే నశోకవనమును బొందినట్లే తలఁచి, యావలికార్యముంగూర్చి యిట్లు చింతించెను.

"ఈ యశోకవనమెన్నఁ రానిది, సకలవిధములైన సంస్కారము లతో నొప్పారుచున్నది, రాక్షసులచే నిండినది, కాననములచేఁ జుట్టఁబడినదియుగా నుండఁగలదు. రావణునిచే నియమింపఁబడిన రాక్షసులు పెక్కండ్రక్కడిచెట్లకుఁ గావలియుందురు. అందఱియందునుండునట్టి దృష్టిగోచరుఁడుగాని వాయుదేవుఁడుగూడ నచ్చట మిక్కిలి గట్టిగా వీవఁడు. రామునికొఱకును (సీతాన్వేషణముకొఱకును) రావణుని కొఱకును (రావణుని కగపడకుండుకొఱకును) నేను నాదేహమును సంకోచపఱచితిని. ఈ సీతాన్వేషణరూపకార్యమున దేవతలును, ఋషులును నాపని కానుకూల్యము గావింపఁగలరు. తనంతఁ బుట్టినవాఁడును, త్రికాలజ్ఞుఁడునైన బ్రహ్మయు, అగ్ని, వాయువు, వజ్రాయుధధారియగు దేవేంద్రుఁడును, పాశము దాల్చినవాఁడగు వరుణుఁడును, సూర్యచంద్రులును, మహోత్సులగు నశ్వినీదేవతలును, ఏడ్వురుమరుత్తులును, శంకరుఁడును, సకలభూతములును, సకలభూతేశుఁడును, మఱియు నాకంటికిఁ గనఁబడకయుండు దేవతలును నాకార్యమునకు సిద్ధినొసఁగుదురుగాక! ఉన్నతమైన ముక్కును, తెల్లని దంతములును

గలదియు ఒచ్చెము లేనిదియు, తెల్లనిచిఱునవ్వుతోఁగూడినదియు, పద్మ పత్రములఁబోలు మోముగలదియు, నిర్మలుఁడైన శరత్కాలచంద్రు నితో సమానమయినదియునైన యా రామునిదేవియొక్క మోము నెప్పుడు చూడఁగలను? నీచుఁడును, పాపాత్ముఁడును, చేయరాని కటికి పనులు చేయువాఁడును, మహాభయంకరవేషముఁ దాల్చిన వాఁడునైన రావణుఁడు బలాత్కారముతోఁ దెచ్చిన జాలిపలఁపఁదగిన యా రాముని దేవి నాకిప్పుడెట్లు కంటి కగపడఁగల? దని యివ్విధమున హనుమం తుఁడు దేవతానమస్కారముచేసి సీతాదర్శనముంగూర్చి విచారపడిన వాఁడాయెను.

14-వ సర్గము

హనుమంతుఁడశోకవనమునకుఁ బోవుట

ఆంజనేయుఁడు ముహూర్తకాలము పూర్వోక్తప్రకారముగాఁ జింతించి, యా యశోకవనమును మనసుచేఁ బొంది యా రావణుని యంతఃపురము విడిచి వచ్చి యాయశోకవనప్రాకారమును బొందెను. అంతట నామారుతి యావనప్రాకారమునొంది, మేన గగ్గురుపాటొందిన వాఁడై, వసంతర్త్వారంభమునఁ బూఁచినవిరులతో నిండియున్న మద్ది, అశోక, సంపంగి, విరిగి, నాగకేసరము, మామిడి మొదలగు చెట్లును, శివప్రియములైన వృక్షవిశేషములను, కపిముఖములను వృక్షములను జూచెను.

అంత నాహనుమంతుఁడు మామిడితోఁపులచేఁ జక్కఁగా నావరింపఁబడినదియు, పెక్కుతీఁగెలతోఁ గూడినదియునైన వృక్షముల ప్రాంతమునకు నల్లెత్రాటినుండి విడువఁబడిన బాణమువలె మహావేగముతో దుమికెను. ఆహనుమంతుఁడు పక్షులనాదములతో నిండినదియు, వెండిబంగారుమయములైన చెట్లచే నంతట నిండినదియు, చిత్రవిచిత్రములగు మృగపక్షిసంఘములతోఁ గూడినదియు, వింతగొల్పెడు వనములు గలదియునైనందున నుదయించుచున్న సూర్యునిమాడ్కిఁ దేజరిల్లునదియునైన యావనమునెల్లఁజూచెను. మృగపక్షులచే నిండిజనులకు సంతోషప్రదమైయున్న వసంతకాలమునఁ బుష్పఫలములచే నిండిన పెక్కువగలచెట్లచేఁ గ్రమ్మఁబడినదియు, కోయిలలును, తుమ్మెద

లును, నెమళ్లును మదించినవై చేయునాదములచేఁ దానును శబ్దించు నట్లుండునదియు, పెక్కుపక్షులగుంపుల కునికిపట్టయినదియునైన యా యశోకవనమునందు నామారుతి యుత్తమకాంతయగు పతివ్రతయైన రాముని దేవిని వెదకుచు, హాయిగా నిద్రించుచున్న పక్షులను లేపెను.

ఆపక్షు లెల్ల లేచి యెగురునప్పుడు విడిల్చిన వానితొక్కల తాఁకుళ్లకుఁ జెట్టులు గదలినవై పలువగలైన పువ్వులవానలను గురి పించినవి. ఆపుష్పములన్నియు నాహానుమంతునిఁ గ్రమ్ముటచేత నాహాను మంతుఁ డశోకవనమధ్యమున నుండు పువ్వుల కొండవలెఁ గనఁబడెను. ఆవనమున నలుదెసలకుఁ బరుగెత్తుచున్న యాహానుమంతునిఁ జూచి, సకలభూతములు నతఁడు వసంతుఁడేమో యని తలఁచిరి. చెట్లనుండి రాలిన పలుతెగల పువ్వులచే నిండిన యావనభూమి భూషణములను దాల్చిన జవరాలిచందమునఁ బ్రకాశించెను.

హానుమంతుఁ డొకవృక్షమునుండి మఱియొకవృక్షమునకు దుమికునప్పుడు ఆకులు, పువ్వులు, పండ్లు మొదలగునవి రాలుటచేతఁ బైభాగములం దేవియులేని వృక్షములు, జూదమునఁ దమబట్టలను సొమ్ములను బందెము వెట్టియోడిన జూదరులమాడ్కిఁ గాంతిలేక యుండి నవి. వడిగలవాఁడయిన హానుమంతుఁడు గదలించిన పుష్పశాలులగు గొప్పవృక్షములనుండు పువ్వులు, పండ్లు, ఆకులును వడిగారాలెను. ఆయశోకవనంబునందలి వృక్షములు పుష్పఫలపర్ణములు రాలిపోవుట చేతను, పక్షులెగిరిపోవుటచేతను బోదెలు మాత్రము గలిగియుండుట చేతను ప్రకంపనకంపితములో యన్నట్లు తోఁచినవి.

హానుమంతుఁడు తోఁకతోను, చేతులతోను, కాళ్లతోను ద్రొక్కుటచే విఱిగిన చెట్లుగల యాయశోకవనము సురతావసానమున వీడినకొప్పును, మాసినమైపూఁతయుఁ గలిగి, ప్రియుఁడు చుంబనము చేయుటచే దంతమువలెఁ దెల్లనైన దంతములును నధరోష్ఠమును గల దియు, భర్తయొనర్చిన నఖక్షతదంతక్షతములు గలదియునైన జవ్వని చందమున విరాజిల్లుచుండె. వర్షర్తువునందు దక్షిణపుగాలి మేఘజాల ములను జెదరఁగొట్టునట్లు, హానుమంతుఁడు గొప్పతీఁగలజొంపములను జెల్లాచెదరుచేసెను.

కపివీరుఁడగు హనుమంతుఁ డంతటఁదిరుగుచు వెండి, బంగారు, రత్నములకాలయములై యచ్చెరువొదవించునేలలను, మంచినీటితోఁ గూడినవియు, పలుతెఱఁగులరూపులతోఁ గట్టినవియు, విలువగల రతనాలమెట్లతోఁగూడినవియునైన నడబావులను; ముత్యములను పవడములను బోలినయిసుకగలవియు, స్ఫటికమణివలెఁ దెల్లనైన మధ్యభూములుగలవియు, గట్టులందుమొలచిన పసిఁడివన్నెగల వింతగొల్పు చెట్లతోఁ బ్రకాశించునవియు, చక్కఁగాఁ బుష్పించిన పద్మోత్పలములు గలవియు, జక్కవలు, నీరుకొంగలు, రాయంచలు, బెగ్గురుపక్షులు కూయుకూఁతలతో నిండినవియు, పెక్కుభ్రాఁకులతోఁగూడినవియు, అమృతతుల్యమగు నీటితోఁగూడినవియు, తీఁగెల జొంపములును, కల్పవృక్షముల పుష్పములును నిండినవియు, పెక్కుతెఱఁగులపొదలచేఁ జక్కఁగాఁ గప్పఁబడినవియు, నడుమనడుమ గన్నేరుచెట్లతో నిండినవియు నైన నిడివికాలువలను జూచినవాఁడయ్యెను.

అనంతర మా హనుమంతుఁడు వార్షికమేఘముఁబోలునది, గొప్పకొనలుగలది, చిన్న బండలచేతను, తిప్పలచేతను, వృక్షములచేతను నంతట శోభిల్లునది, పెక్కుగుహలుగలదియునై రమ్యమై యుండు నొకపర్వతమును గాంచెను.

ఆపర్వతమునుండి జాఱి, నీటిలోపలికి వాలియుండు చెట్లకొమ్మలచే వెనుకకు మఱలింపఁబడి, తేటనీటితోఁ బ్రవహించుటచే, భర్తతోఁ జెఱలాట మాడునపుడు కారణవిశేషముచే భర్తపై నలిగి చివుక్కునలేచి పోవుచుఁ దనబంధువులు "పోవలదు. భర్తపైఁగోపముపడరా" దని కోపము నిమ్మళింపఁజేసి యడ్డగింపఁగా, కోపముతగ్గి కలఁకదేఱినదై మగనిమీఁది మక్కువతో మఱలివచ్చుచుండుమగువచందమున వెలయుచున్న నదిని, దానిచేరువఁ బక్షిసంఘములతో విరాజిల్లుచున్న తామరకొలఁకులును, చల్లనినీటితోఁ గూడినదియు, రత్నములుచెక్కిన మెట్లుగలదియు, ముత్తెముల యిసుకచే శోభిల్లునదియు, పలుతెఱఁగులైన పక్షులగుంపులతోఁ గూడినదియు, వివిధమృగ సంఘములచే నాశ్చర్యకరమైనదియు, చిత్రకాననములు గలదియు, విశ్వకర్మ కట్టిన కడుగొప్ప మేడలతోను, కృత్రిమవనములతోను నన్నిప్రదేశములందు నలంకరింపఁ

జేయఁబడినదియునైన కృత్రిమమగు నడబావియు నాహానుమంతునికిఁ గనఁబడెను.

ఆయశోకవనమునఁ బుష్పఫలశోభితము లైయున్న చెట్లమొదట నిర్మింపఁబడియున్న బంగారపుమెట్లతోఁగూడి, పాన్పులు, దిండ్లు, తివాసీలు, పీటలు మొదలగునవి గలిగియున్న తిన్నెలతోఁగూడి బహుళ లతాపుంజపత్రములచేఁ గప్పఁబడి దట్టమైయున్న బంగారపువన్నెగల యొక శింశుపావృక్షమును, దానికి సమీపమున నున్న భూప్రదేశములను, వాఁగులను, సెలయేళ్లను, సువర్ణవికారము లౌటంజేసి యగ్ని హోత్రునిమాడ్కిఁ దేజరిల్లునట్టి తక్కినవృక్షములను జూచెను. సూర్యుఁడు మేరుపర్వతసాన్నిధ్యముచే బంగారపువన్నెగలవాఁడైనయట్లు, శూరుఁడగు హానుమంతుఁడును ఆవృక్షములకాంతిచేఁ బసిఁడివన్నె గలవాఁడయినట్లు తలఁచెను.

నూఱులకొలఁది చిఱుగజ్జెలనాదముగలిగి పసిఁడివన్నెగల చెట్ల గుంపులచే వెలయుచు, తిన్ననిగాలివీవనలతోఁ గూడియున్న యాశింశు పావృక్షదర్శనముచే విస్మయాక్రాంతచిత్తుఁడై, హానుమంతుఁడు చక్కని లేత చిగుళ్లతోఁగూడినదియు, ఆకులు దట్టముగనున్నదియు నైన యా శింశుపావృక్షము నెక్కినవాఁడై "రామునిదర్శనమునందుఁ దమితో నందందుఁ దోఁచినట్లుల్లఁ దిరుగుచు శోకపీడితురాలైయున్న సీతాదేవి నిచ్చటఁ జూచెదను. ఈ రమ్యమైన యశోకవన మాదురాత్మునిది. ఇది నిక్కము. దీనియందనేకములైన సంపెంగిచెట్లు, చందనవృక్షములు, పొగడచెట్లు ప్రకాశమానములైయున్నవి. ఈ తామరగుంటయుఁ బెక్కుపక్షులతోఁగూడి మనస్సున కింపొదవుచున్నది. రామునకుఁ బ్రియపత్నియైన సీత వనవిహారమున కుత్సాహములుగలది గనుకఁ దప్పక యిచ్చటికి రాఁగలదు. అట్లు కాదేని, పూజ్యురాలగు సీతాదేవి రామునివిరహతాపముచేఁ జిక్కినదై, యిచ్చటికి వచ్చినఁ దనతాపము తగ్గఁగలదనునెన్నికతో నీవనమునకు వచ్చియుండవచ్చును. లేదా, రామునికిఁ బ్రియురాలగు యౌవనమధ్యస్థురాలయిన జానకి వనచరుల యందును, వనవిహారమునందును బ్రేమగలదిగావున వనవిహారము నిమిత్తమయినను వచ్చియుండవచ్చును. లేదా, సంధ్యోపాసనమునందుఁ గోరికగలదిగావున సంధ్యాకాలమున సంధ్యనుపాసించునిమిత్తమైనను

వచ్చియుండవచ్చును. ఈరమ్యమైన యశోకవనము రాజపుత్రియగు రామునిపత్నికి సమ్మతమైనది. చంద్రనిభాననయగు నారామునిదేవి ప్రాణములతో నుంపనేని, యీరమ్యజలోపేతమైన నదికి రాఁగలదు" అని యిట్లు తలంచినవాఁడై, సీతాదేవిఁజూడఁగోరి చక్కఁగాఁ బుష్పించి, యాకులచే దట్టమైయున్న యాశింశుపావృక్షమున డాఁగి యావనంబు నంతయుఁ జూచినవాఁడాయెను.

15-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవిఁ గాంచుట

ఆహనుమంతుఁడు శింశుపావృక్షముయొక్క దట్టమైన యాకుల సందునఁ గూర్చున్నవాఁడై, సీతాదేవిని వెదకునిమిత్తమయి నానా దిక్కులఁ జూడ్కిఁ జొఱనిచ్చుచుఁ గ్రిందనేలపైఁజూచుచు నా యశోక వనము లెల్లఁ బొఱిఁజూచెను. అయ్యశోకవనము సంతానము లనెడి యీవులప్రాకులతీఁగెలతోను, మఱియనేకవృక్షములతోను గూడి శోభిల్లుచు, మేలిమిగంధరసపుఁజిలకరింతగలిగి, యంతటఁ బూలహార ములచేతఁ గైసేయఁబడి, నందనవనముతో సాటియై, మృగపక్షుల కునికి పట్టయి, మేడలచేతను, బవంతులచేతను గ్రిక్కిరిసినదై, కోయిలలకూఁత లతో నిండి, బంగారంపుఁగలువలు తామర పువ్వులుగలిగిన నడబావు లెక్కువశోభను గలిగించుచుండ, పెక్కుపీటలును రత్నకంబళ్లును వెలుఁగుచుండ, పెక్కు నేలమాళిగలు సొంపొదవుచుండ, సర్వర్తువులకు సంబంధించిన పువ్వులతో నిండినవై పండ్లతోఁగూడియున్న వృక్షము లుల్లముల కుల్లాసము పుట్టించుచుండ, అశోకవృక్షములు చక్కగా విరిసినవై కాంతిగలవై యుండుటచే నుదయించుచుండు సూర్యుని కాంతిని బరుడించుచుండ, ముక్కుతొట్టులందుఁ జిక్కుకొన్న పువ్వులచే నొప్పుమీఱిన పలువన్నెలుగల పక్షులొక్కుమ్మడిగా గుంపులుగుంపు లుగాఁ గూలుటంజేసి చెట్లకొమ్మలందలి యాకు లెల్ల జలజలరాలగొట్టు చున్నవో యని యూహ గలిగించుచుండ, అడుగు మొదలుకొని పుష్ప ములచే నిండి, యా పువ్వులబరువులకు వంగి, పుడమిని దాఁకుచున్నవో యన్నట్టులుండు నశోకవనములు మొదలగు వృక్షములతోను, చక్కఁగాఁ బూఁచిన కొండగోఁగు, మోదుగుపువ్వులతోనుగూడి యా

ప్రదేశమును బ్రకాశింపఁ జేయుచుండె. అయ్యశోకవనమునందు గొప్ప మొదళ్లుగల సురపొన్నలు, ఏడాకులయరటులు, సంపెఁగలు, వేగిసలు మున్నగు వ్రాఁకులు చక్కఁగాఁ బుష్పించినవై ప్రకాశించుచుండినవి. అయ్యశోకవనమునఁ గొన్ని యశోకవృక్షములు బంగారుతో సాటియైన వన్నెగలవియు, మఱికొన్ని నిప్పుమంటలంబోలునవియు, వేఱుకొన్ని నల్లనికాటుకం బురుడించునవియునై యొప్పుచుండెను.

మఱియుఁ బెక్కు చిన్నితోటలతోఁగూడినదై, యబ్బురము గలిగించుచు, దేవేంద్రునినందనవనమును, కుబేరునిచైత్రరథమును తోటను మించినదో యన్నట్లు ప్రకాశించునదియు, సొబగు మీఱినదియు, కాంతితోఁగూడి మిగుల రమ్యమైనదియు, పువ్వులనెడి రిక్కలగుంపులచేఁ దేజరిల్లు రెండవయాకాశమో యనఁదగినదియు, పువ్వులనెడి వివిధములయిన రతనములకుప్పలచే నొప్పారు నైదవసముద్రమో యనఁదగినదియు, ఋతువులన్నింటియందుఁ బూఁచెడి పువ్వులచేఁ జెలంగుచు మధ్యగంధముగల పెక్కువృక్షముల కునికిపట్టయినదియు, పలువగలఁ గూయుచుండు మృగపక్షుల నినాదముల మూలమున వినువారిచెవుల కింపు పుట్టించునదియు, పెక్కుసువాసనల గుబాళించునదియు, మనసున కుల్లాసము పుట్టించునదియు, నెత్తావుల కునికిపట్టగు పర్వతశ్రేష్ఠమైన రెండవ గంధమాదనపర్వతమో యనఁబరగినదియునైన యా యశోకవనమును హనుమంతుఁడు అత్యాదరముతో మాటిమాటికిఁ జూచెను.

అయ్యశోకవనమున నా వానరపుంగవుఁడు వేయిస్తంభముల మీఁదఁ గట్టఁబడినదియు, కైలాసపర్వతముమాడ్కి దెల్లనైనదియు, పవడములతోఁ జేయఁబడిన మెట్లతోఁ గూడినదియు, అపరంజితోఁ గట్టిన తిన్నెలు గలదియు, కన్నులను జూఱఁగొనుచున్నదో యన్నట్లును, జిగిచే మెఱయుచున్నదో యన్నట్లును, మిక్కిలియెత్తయినందున నింగినొఱయుచున్నదో యన్నట్లునుండునదియు, నిర్మలమైనదియు, బుద్ధాలయమువలె నొప్పునదియునైన చేరువనున్న మేడను జూచెను.

అచ్చట హనుమంతుఁడు మూసినమసివలువ గట్టినదియు, రాక్షసస్త్రీలచేఁ జుట్టఁబడినదియు, ఒక్కప్రొద్దులుండుటచేఁ జిక్కినది, తెంపులేనిది, మాటిమాటికి మగనిం దలఁచికొని నిట్టూర్పువిడుచునదియు, శుక్లపక్షపాడ్యమియందలి లేత చందురుని నిర్మలమైన రేకవలెనుండునది,

'యిది యారూపముగ నుండవచ్చు'నని నిదానించి యానవాలు పట్టఁ దగిన రూపముతోఁగూడినదియయ్యును చక్కఁదనము గలదియైనందునఁ బొగగుమిచేఁ గ్రమ్మఁబడి నున్నదియు, యగ్నిజ్వాలకైవడి చినిఁగిన పచ్చనియొంటిబట్ట కట్టినదియు, ముఱికితోఁగూడి తొడవులుదాల్పక యుండుటంజేసి, పద్మములులేని పద్మాకరమువాఁడి వెలుఁగనిదియు, పరపురుషదర్శనాదులయెడ లజ్జపడునదియు, విచారముచేఁ గడువగతోఁ గూడినదియు, మిక్కిలి వాడుపాటినదియు, జాలి చూపఁదగినదియు, నంగారకునిచేఁ బీడితయైన రోహిణికైవడి సంతసము దక్కినదియు, మగనిఁ దలఁచి కండ్లనిండఁ గన్నీరు నించునదియు, ఆహారము లేమిచేఁ గడుఁ జిక్కినదియు, మనోదుఃఖముతోఁగూడి, యెల్లప్పుడు భర్తను గూర్చినచింతయే ప్రధానముగాఁగలదియు, తనప్రియబంధువులను జూడక రాక్షసాంగనలను జూచుచు నుండుటంజేసి, తనగుంపునుబాసి వేపులగుమిచేఁ జుట్టఁబడిన యాఁడుజింకవలెఁ గాంతిదక్కినదియు, నల్ల త్రాచువలె నల్లనిదై, కటిపురోభాగమునఁ బడునదైన యొంటి జడతోఁ గూడినదాటచేత శరత్కాలమున నల్లనై యున్న వనపంక్తితోఁగూడిన పుడమివలెనుండునదియు, సుఖము లనుభవింపఁ దగినదియయ్యు దుఃఖ ముచేఁ గడు వగచునదియు, వ్యసనము లెట్టివో యెఱుఁగనిదైనను వ్యసనము లనుభవించునదియునైన సీతాదేవిని గాంచెను.(73)

పున్నమచంద్రునిఁ బోలుమోమును, చక్కని కనుబొమ్మలును, చక్కని గుండ్రని స్తనములును, నల్లని కురులును, దొండపండువలె నెఱ్ఱనైన పెదవియు, నున్నని మేనును, సన్నని నడుమును, చక్కగ నూనిన యడుగులును, తామరరేకులంబోలు కన్నులుంగలదియును, దేహకాంతిచేత దిక్కులను ప్రకాశింపఁజేయునదియును, మరునిపత్ని యగు రతీదేవివలె నందకత్తెయు, నిండువెన్నెలమాడ్కి సర్వజనముచేఁ గోరఁదగినదియు, దీక్షపట్టిన తాపసకాంతవలెఁ బుడమిమీఁదఁ గూర్చుండునదియు, నాగాంగనవలె నిట్టూర్పు విడుచునదియు, భయ పడుస్వభావము గలదియు, దుఃఖపరంపరలు విడువకవచ్చుచుండుటచేఁ బొగగుమితోఁ గూడిన నిప్పుమంటకైవడిఁ బ్రకాశము లేకుండునదియు, సందేహాస్పదమైన యర్థముగల ప్రసిద్ధములగు మన్వాది స్మృతివాక్య ములం బోలినదియు, క్షీణదశయం దుండుకలిమిం బోలినదియు, లేని

యపకీర్తివచ్చుటచే నడఁగిపోయిన కీర్తివలెను, ఫలాభావముచేఁ గొఱ
వడిన శ్రద్ధవలెను, కార్యానుకూలతనొందని యాశవలెను, విఘ్నము
లచే నిండిన కార్యసిద్ధినివలెను, కపటముతో నిండిన బుద్ధివలెను సొంపు
దఱిగి యుండునదియు, రామునిఁబొందుట కుపాయము దొఱకమిచే
నొచ్చినదియు, రావణునిచేతఁజిక్కి చిక్కినదియు, నల్లనైన పంకర
ెప్పవెండ్రుకలు గలదియు, కన్నీళ్లతో నిండినదియు, తేటదనములేని
మోముతోఁ గూడినదియు, మాటిమాటికి నిట్టూర్పు విడుచునదియు,
ముఱికి వట్టినదియు, తెంపులేనిదియు, భూషణములు దాల్పఁదగిన
దయ్యాను భూషణములను దాల్పనిదియు, కాఱు మబ్బులచేఁ గ్రమ్మఁ
బడిన చుక్కలతేనిడాలుపగిది వెలుఁగు లేనిదియు, ఆవృత్తిలేకపోవు
టచే మఱచిన విద్యను బోలినదియు, శబ్దార్థజ్ఞానము లేమిచేఁ జెప్పఁదలఁ
చిన యర్థముంగాక, చెప్పఁదలఁపని వేఱొక్క యర్థము నొసఁగునట్టి
మాటవలె నొప్పుదప్పియుండునదియు, నిర్దుష్టురాలును నైన యాసీతను
హనుమంతుఁడు చూచి, మొదట నామె సీత యగునోకాదో యని
సందేహించి, "ఈవిడ కామరూపుఁడగు నారావణుఁ డెత్తికొని పోవు
నపు డెట్టిదిగా నుండెనో, యిప్పుడును నట్టిదిగానే యున్నది. కావున
నీమె సీతాదేవిగా నుండవచ్చు" నని తలఁచెను.

మఱియు రాముఁడు సీతాదేవియంగములం దేయే భూషణము
లుండునని చెప్పెనో, ఆభూషణముల నన్నింటిని సీత భర్తృవియోగ
ముచే నొలిచి చెట్టుకొమ్మలకుఁ దగిలించి యుండఁగా, హనుమంతుఁడు
వానినిఁ జూచినవాఁడై తన మనమున నివ్విధమున నాలోచింపఁ దొడఁ
గెను: "రాముఁడు తనపత్నియగుసీత యే యే భూషణములఁ దాల్చి
యుండునని చెప్పెనో, అవియెల్ల నిచ్చటఁ గనఁబడుచున్నవి. ఈ చక్కని
కమ్మలును, చక్కఁగాఁ గట్టఁబడిన గూబబావిలీలును, రత్నములు చెక్కిన
పగడములు గ్రుచ్చిన చేతికడియములును—సీత బహుకాలము దాల్చి
యుండినందున నల్లనైయున్న యీ భూషణము లన్నియు నారాముఁడు
చెప్పినవియ. సీతాదేవి రావణునిచేఁ దేఁబడునప్పుడు ఋశ్యమూక
పర్వతమున నేయేతొడవులను మూటగట్టి క్రిందవైచెనో, ఆ భూష
ణము లిచ్చటఁ గానరావు. ఆమె యచ్చట వేనిని క్రిందవేయలేదో, అవి
యివియె. దీనికి సందియము లేదు. అచ్చట ఋశ్యమూక పర్వతమున

జాతిపడిన పసిండి పట్టనంటి కాంతిగల యీ మేలిమి పసుపుపుట్టుకోకయు, అప్పుడు వానరులుచూచిన చెట్టుకొనయందుఁ జిక్కికొన్న యుత్తరీయమును, నేలమీఁద ప్రోఁతతోఁ బడిన గొప్పవైన చక్కనిభూషణములును ఈసీతాదేవి పడవేసినవియే. ఈయుత్తరీయము బహుదినములుగాఁ గట్టుఁబడిన దగుటవలన మిక్కిలి నలిగియున్నను, ఇది ఋశ్యమూకమునఁ బడవేసిన యుత్తరీయమునంటి రంగుగలదై, దానివలెఁ గాంతి గలదిగానున్నది. రామునిపట్టంపుదేవియగు సీత పసిఁడివన్నెగల మేనితోఁగూడినది. కావుననే ఈ పతివ్రతయగు సీతను బోఁగొట్టుకొనియు, రాముఁడు మనసున నీమెమీఁది తగులు విడువకున్నాఁడు. రాముఁడు దయ, క్రూరతలేమి, దుఃఖము, కామము నను నాలుగు కారణములచే నే స్త్రీనిమిత్తము పరితపించుచున్నాఁడో, ఆస్త్రీ యీమెయే. ఆనాలుగు కారణము లెవ్వియనిన: ఆపదలందు స్త్రీలను రక్షింపవలసియుండఁగా, అట్లు చేయజాలనయితినే యనుజాలియు, ఆశ్రితయైన స్త్రీని గాపాడనైతినిగదా యనునాశ్రితసంరక్షకస్వభావమును, తనకర్థశరీరముగానున్న పత్ని యగపడక పోయెఁ గదా యను దుఃఖమును, తనకుపభోగయోగ్యకాలుగా నున్న ప్రియకాంత కనఁబడకపోయెనే యనిన విరహవేదనయు. ఈనాలుగు కారణములచే రాముఁడు వెతలఁబడునట్టి కాంత యీమెయె. ఈమె యంగప్రత్యంగము లెంత చక్కనివో, యా రాముని యంగప్రత్యంగములు నంత చక్కనివిగా నున్నవి. ఆరాముని రూపం బెట్టిదో, ఈసీతయొక్క రూపము నట్టిద. ఈసీత మనసా రాముని యందును, ఆరాముని మన సీతయందును నాఁటియున్నవి. కాఁబట్టియె రాముఁ డీ సీతమీఁది మోహాముచే ముహూర్తకాలమైనను జీవించి యున్నాఁడు. రాముఁ డితరస్త్రీలకంటె విలక్షణురాలైన యీసీతను బాసి వియోగవ్యసనముచే నశింపక ప్రాణములతో నున్నాఁడుగావునఁ జేయనలవికాని పని సేసినవాఁడు" అని యివ్విధమున ముఱికిబట్టఁ గట్టుకొని యుపవాసములచేఁ జిక్కి రామునిఁగూర్చిన వ్యసనమే ముఖ్యముగాఁ గలదిగానున్న సీతాదేవిని జూచి సంతసించినవాఁడై, ఈసీత మఱలఁ బొందుటకుఁదగిన పతివ్రతాధర్మమునం దుండుటచే రాముఁ డదృష్టవంతుఁడే యని మనమునఁ దలఁచినవాఁడయ్యెను.

16-వ సర్గము

హనుమంతుఁడు సీతనుగూర్చి వగచుట

ప్రతాపవంతుఁడగు వానరశ్రేష్ఠుఁడైన హనుమంతుఁడు కొని యాడఁదగు సీతను, గుణములచే నొప్పినట్టి రామునిఁ గొనియాడి మరలఁ జింతను జెందెను. కొంతసేపు ధ్యానించి, కన్నులనిండ నీరు గ్రమ్మఁగ చూపు చెదరుచుండఁగా, సీతనుగూర్చి యీ క్రింది తెఱఁగునఁ బలవించెను:—

"గురుజనవిధేయుఁడయిన లక్ష్మణుఁడును, జగద్రక్షకుఁడయిన రాముఁడును మిక్కిలి జాగ్రత్తతోఁ జూచుకొనుచున్నను సమస్త జన పూజ్యురాలయిన సీతాదేవికే కడగండ్లు వచ్చినప్పుడు, మఱియితరుల సంగతి యేమనవచ్చును? గ్రహచారము దప్పించుకొన నేరికిని వశము గాదు. ఈసీతయు రాముని యొక్కయు, రాముఁడు మాయామృగమును వెంబడించిపోయినను, ఇతఁడు మారీచుఁడుగాని మృగముగాదని నిశ్చయించియుండిన లక్ష్మణుని యొక్కయుఁ బరాక్రమం బిట్టిదని యెఱిఁగినది గనుక వర్షర్తువునందలి గంగానదివలెఁ గించిత్తైనను గలఁగకున్నది. నడకయందును, ఈడునందును, స్వభావమునందును, కులమునందును, సాముద్రిక శాస్త్రలక్షణములందును సీతకు రాముఁడును, రామునకు సీతయుఁ దగినవారు."

అని యిట్లు హనుమంతుఁడు లక్ష్మీదేవియుంబోలె లోకమున కొప్పినదై యున్న బంగారువన్నెగల యాసీతంగూర్చి తలఁచి, రాముని మనమునకుఁ దెచ్చికొని తనలోఁ దా నిట్లనుకొనెను:

ఈసీతాదేవినిమిత్తమై రాముఁడు కడుబలిమికాఁడగు వాలిని, పరాక్రమమున రావణునిఁబోలిన కబంధుని సంహరించెను. మఱియు దేవేంద్రుఁడు శంబరాసురుని వధించినచందమున, రాముఁడు దండ కారణ్యమున భీమవిక్రముఁడగు విరాధుని సంహరించెను. మఱియు నిత్యము డగ్గినజ్వాలలమాడ్కి నుండు కఱుకుటమ్ములనేసి జనస్థానమున నుండునట్టి పదునాలుగువేలమంది రాక్షసులను సంహరించెను. కీర్తి మంతుఁడైన యారాముఁడు గొప్పబలిమిగలవాఁడగు ఖరదూషణత్రిశిరసులను నుగ్గునేసెను. ఈసీతాదేవినిమిత్తమే రాముఁడు జనశ్లాఘా

పాత్రమయిన వాలి పాలించుచుండిన వానరరాజ్యమును సుగ్రీవుని కొసఁగెను. విజీవికన్నులదగు ఈసీతనిమిత్తమై నేనును ఏటిమగఁడగు సముద్రుని దాఁటితిని; ఈపట్టణమును వెదకితిని. ఈసీతనిమిత్తమై రాముఁ డీనాలుగు సముద్రములచేఁ జుట్టఁబడిన యీపుడమిని దల క్రిందుగాఁ బొఱలించును. పుడమియనఁనేల? జగత్తునంతయుఁ బొఱ లింపఁగలఁడని నేను దలఁచెదను. రామునికి త్రైలోక్యాధిపత్యము గొప్పదా, సీత గొప్పదా యని విచారించిన, రామునికి ముల్లోకముల యేలుబడియు సీతయొక్క కలాంశమునకుఁ బోలదు.

ఈమె ధర్మాత్ముఁడును, మహాత్ముఁడునైన మిథిలరాజగు జనక మహారాజునకుఁ గూఁతురు. అయోనిజ. భర్తకు శుశ్రూష యొనర్చుట యందే యాసక్తిగలది. చేను దున్ననప్పుడు పుడమిని పెకలించు కొని నాగేటిచాలునందుఁబుట్టినది. తామరపువ్వులపుప్పొడివంటిచేని దుమ్ముచే నిండినది. ఈసీతాదేవి పరాక్రమశాలియు, సత్స్వభావుఁ డును, యుద్ధములందు శత్రువులకు వెఱచి వెనుకకు మఱలని వాఁడును నైన దశరథమహారాజునకు వాసికెక్కిన పెద్దకోడలు. పితృవాక్య పరిపాలనాది ధర్మముల నెఱిఁగిన వాఁడును, నెనరు గలవాఁడును, కీర్తిమంతుఁడును నైన రామునికిఁ బ్రియురాలగు భార్య. ఇప్పుడీ విడ యీరాక్షసకాంతలవశమునఁ జిక్కియున్నది. పసిఁడి వన్నె మేనుగలదియు, విడువక చిఱునవ్వుతో మాటాడునదియునైన ఏ సీతాదేవి భర్తయందలిప్రీతిచే బలాత్కరింపఁబడినదై, సకలభోగము లను బరిత్యజించి కష్టములను సుకుచేయక నిర్జనమయిన వనమునకు వచ్చి, పండ్లు దుంపలు తిని తనజీవితముఁ గాపాడుకొనుచు, భర్త శుశ్రూషయందు శ్రద్ధగలదై, వనమునందున్నను నగరమునందున్నట్లె యెక్కువప్రీతిని బొందుచుండినదో, యాసీతాదేవి యిడుమలఁ బడఁదగి నదికానిదైనను నిప్పు డీరాక్షసులు పెట్టిడి యీబాధనోర్చుచున్నది. రావణునిచే నిట్లు హింసపడియుఁ దననడవడిని విడువకుండు నీసీతను, చలిపండిటిని దప్పిగొన్నవాఁడు వెదకుచువచ్చి కనుఁ గొనునట్లు రాముఁడు చూడవలయు. రాజ్యముగోల్పోయిన రాజు మఱలఁ దన రాజ్యమును బొందినప్పు డానందము నొందునట్లు, రాముఁడును, ఈ సీతను బడయుటచేఁ దప్పక సంతసము నొందును. ఈసీత, కామసుఖములఁ

బాసియు, బంధుజనములను బాసియున్నను, మఱిల నారామునితోడి కూడిక గలుగఁగలదని కోరినదై తనప్రాణముల నుంచుకొనియున్నది.

ఈసీత యేకాంతచిత్తయై వేఱొండు విషయమును మనమునఁ దలఁపదు, రాక్షసస్త్రీలను చూడదు. ఈవనమునందలి పుష్పఫలభరిత ములగు వృక్షములను జూడక యారామునే తనమనమునఁ జూచు చున్నది. మగువకు మగండనువాఁడు భూషణమునకంటె నుత్తమమైన భూషణము. కావున భూషణములఁదాల్పఁ యోగ్యురాలైనను, ఈసీత యాభూషణములలో నుత్తమభూషణమగు రామునిఁ బాసి యెంతయు శోభిల్లకున్నది. రాముఁడీ సీతను బాసి తనప్రాణములఁ దాల్చియు, వెతలచే, గుందకయు నున్నాఁడనుట చూడ నారాముఁడు చేయనలవి కాని పని చేసినవాఁ డనవలయును. నల్లనికొనవెండ్రుకలును, తమ్మి తేకులంబోలు కన్నులునుగలిగి సుఖముల ననుభవింపఁ దగినదయ్యు రాక్ష సాంగనలనడుమ దుఃఖముతో నుండునదియైన యీసీతాదేవిని జూడఁగా, మృగప్రాయుఁడనైన నాకే మనమున వెత పుట్టినది. భూమిదేవివలె నోర్పుగలదియు, పద్మపత్రములంబోలు కన్నులుగలదియునైన యీసీతా దేవి మున్ను రామలక్ష్మణులకాపుదలలో నుండినదో, అట్టియీసీతాదేవి యిప్పుడు వికృతంపుఁజూడ్కిగల రాక్షసస్త్రీల కాఁపుదలయం దొక్క చెట్టుమొదటఁగూర్చుండి వగచుచున్నది. మంచుచేఁ బాడైన తామర తీఁగచందంబున ముందున్న శోభను విడిచినదియు, వెతలపరంపరయందుఁ జిక్కి కడువగచునదియునైన జనకరాజుగారాబుపట్టి యగుసీత, తన భర్తనెడఁబాసిన పెంటి జక్కవపిట్టవోలె నోటఁజెప్పను మనసునఁ దలంపను రాని చెడ్డదశను బొందియున్నది! అక్కటా! ఎంతకష్టము సంభవించెను! పుష్పభారములచే ముందుకువంగిన కొనలతోఁగూడిన యీయశోకవృక్షములు తామశోకములయ్యెను విరహబాధచేఁ గుందు నట్టి సీతాదేవి కెక్కువశోకమునే కలిగించుచున్నవి. మఱియు పెక్కు వేల కిరణములతోఁ బుట్టినవాఁడును సూర్యునికంటెఁ జల్లనికిరణములు గలవాఁడునైనను చంద్రుఁడుదయించుచు విరహిణియగు సీతకు శోక మునే గలిగించుచున్నాఁడు.

బలమును వడియునుగలవాఁడగు వానరేంద్రుఁ డివ్విధమునఁ జింతించి, యీవిడ సీతయే యని బుద్ధియందు నిశ్చయించుకొన్నవాఁడై యీవలికార్యము చేయుటకయి యీవృక్షమునందే కూర్చుండెను.

17-వ సర్గము

హనుమంతుఁడు సీతను జూచుట

హనుమంతుఁ డట్లు శింశుపావృక్షమున నుండఁగా, తెల్లకలువలగుమ్మబోలు కాంతిగలవాఁడును, నిర్మలుఁడునునైన చంద్రుఁడు, హంసము తెల్లనియుపకమును బొందునట్లు నిర్మలమైన యాకాశము (2/1) నపరభాగమును బొందెను. అట్లు చంద్రుఁడుదయించి, తననిర్మలకాంతిని బర్వఁజేసి, యాహనుమంతునికి రాక్షసస్త్రీలను, సీతను జూపఁ దోడ్పడు వాఁడునుంబోలె వెలుఁగుచు, చల్లని కిరణములచే నాహనుమంతునికి సంతసము గలిగించెను.

అప్పుడు హనుమంతుఁడు పున్నమచందురునిఁబోలు మోముగలది యైనను, ఎక్కువబరువుచే నీట మునిఁగిన యోడయుంబోలె వ్యసనపరం పరలలో మునిఁగియున్న యాసీతాదేవిని జూడఁగోరినవాఁడై, తలయెత్తి మున్ముందుగా నాసీతాదేవిచేరువ నున్న భీకరంపుఁ జూపులుగల రాక్షసాంగనలను జూచెను.

వాకలలో ఒంటికంటిది, ఒంటిచెవిది, చెవులేతలముసుఁగుగాఁ గలది, చెవులులేనిది, కూటమునంటి చెవులుగలది, ఎగుముక్కుకలది, సన్నని పొడవు మెడగలది, పెద్దతలగలది, పలుచని కేశములు గలది, కేశములు లేనిది, కంబళివంటి వెండ్రుకలుకలది, వ్రేలుఁజెవులును, నొసలునుగలది, వ్రేలుబొజ్జయుఁ బాలిండ్లనుగలది, వ్రేలుఁబెదవిగలది, గడ్డమునందుఁ బెదవిగలది, వ్రేలు మోమును పిక్కలునుగలది, కుబ్జ చది, పొడవుది, గూనిది, లావు పిక్కలుగలది, పొట్టిది, నునుపుగాని యొడలుగలది, వంకరమోము గలది, పచ్చకన్నులది, రోఁతపడఁదగిన మోముగలదియు నుండిరి. మఱియు, రోఁతపడఁదగినవారు, పచ్చనిడాలు గలవారు, నల్లనివారు, కోపపడువారు, జగడమే కూడుగాఁ గలవారు, నల్లయినుపయీఁకులు, గొప్ప ముస్తైనవాలులు, కూటములు, రోఁకళ్లు దాల్చినవారు, పంది, జింక, పులి, ఎనుము, గొట్టె,నక్క యనుమృగముల

మోరలవంటి మోరలుగలవారు, ఏనుఁగులయు, ఒంఁటెలయు, గుఱ్ఱి ములయుఁ బాదంబులంబోలు పాదములుగలవారు, శరీరము లోపలికిఁ గ్రుంగిన తలగలవారు, ఒంటిచేతివారు, ఒంటికాలివారు, గాడిదె చెవులవారు, గుఱ్ఱపుఁజెవులవారు, పసరపుఁ జెవులవారు, ఏనుఁగుఁజెవుల వారు, కోఁతిచెవులవారు, ముక్కుఁడులు, నిడుపుముక్కులవారు, అడ్డ ముక్కులవారు, చప్పిడిముక్కులవారు, ఏనుఁగుతొండమువంటి ముక్కులు గలవారు, నెత్తిని ముక్కులు గలవారు, ఏనుఁగుకాలివంటి కాళ్లవారు, పెద్దడుగులవారు, ఆవుపాదమువంటి పాదములవారు, కాళ్లయందు జుట్టుగలవారు, పెద్దతలయు నిడుపు మెడయుఁ గలవారు, గొప్పపాలిండ్లును పెద్దబొజ్జయుఁగలవారు, గొప్పవాయియు, మిడి గ్రుడ్లును గలవారు, నిడివిగోళ్లును నాలుకయు గలవారు, గొట్టెతల వారు, ఏనుఁగుతలవారు, ఆవుతలవారు, పందితలవారు, గుఱ్ఱపుతల వారు, ఒంటెతలవారు, గాడిదెతలవారు, చూపరకు వెఱపుగలిగించు వారు, గయ్యాళులు, జగడాలమాకులు, వెఱపించువారు, బూడిదె రంగు వెండ్రుకలుగలవారు, వెగటు మోరలవారు, అనయము మద్య పానమునందును మాంసభక్షణమునందును ప్రేమగలవారు, మాంసర క్త ముల నొడలికిఁ బూసికొనువారు, రక్త మాంసము లాహారముగాఁ గోరువారు నుండిరి. చూచినమాత్రముననే మేనికి గగుర్పాటొదవించు నా వికృతరూపలగు రాక్షసకాంతలందఱును ఆ సీతాదేవి గూర్చున్న లావుబోదెగల శింశుపావృక్షము చుట్టును కూర్చుండిరి.

సీతాదర్శనజన్యమైన కాంతి విశేషముగలవాఁడగు హనుమంతుఁ డట్టి రాక్షసకాంతలను జూచినపదంపడి యాచెట్టుక్రిందనే కూర్చుండి యున్న పతివ్రతయగు జనకమహారాజుకూఁతురైన సీతను జూచెను.(64) అప్పు డాసీతాదేవి మోమున వన్నెతొఱఁగియు, వెతలనుడికియు, ముఱికిచేఁ జిక్కుపడ్డశిరోజములు గలిగియు నుండుటచే, పుణ్యము నశిం పఁగాఁ గాంతిఁబాసి పుడమిఁగూలిన నక్షత్రమువలె నుండునదియు, పాతివ్రత్యమహిమతో వెలయునదియు, మగనిఁజూచుటకు నోచుకొనని దియు, మేలిమి భూషణములఁ దీసివేసినదియు, మగనిమీఁది మక్కు వయే సొమ్ముగాఁగలదియు, రాక్షసపతియగు రావణునిచే నడ్డగింపఁబడి తనబంధువులనుండి యెడఁబాపఁబడియుండుటవలన, సింహముచే నడ్డ

గింపఁబడి తనగుంపునుండి యెడఁబాపఁబడి దిగులొందియున్న పెంటి యేనుఁగుమాడ్కియు, వర్షాకాలాంతమున శరత్కాల మేఘములచేఁ గ్రమ్మఁబడిన చంద్రరేఖం బోలెను, నలుఁగులు మొదలగునవి లేమిచేత రూపుమాసి, తంతులులేని వీణెం బోలెనుండుననదియు, మగనివశమున నుండఁదగినదియు, రాక్షసకాంతల వశముననుండ నిష్టము లేనిదియు, అశోక (శోకము లేని) వనమునందుండియు, శోకసాగరమునఁ బూర్తిగా మునిఁగినదియు, మున్ను పేరొక్కనఁబడిన రాక్షసకాంతలచేఁ జుట్టు గావలి కాచఁబడుటచేతఁ గ్రూరగ్రహముచే ముట్టడింపఁబడిన రోహిణిం బోలినదియు, సొమ్ములు లేమిచేఁ బువ్వులులేనితీఁగెకైవడి నందము తగ్గినదియునై యుండెను.

మఱియు నాసీతాదేవి యొడలంతయు దుమ్ముచేనిండియు, సౌంద ర్యముగలిగియునుండుటచే నడుమున బ్రుంగిన తామరతూఁడుమాడ్కి వెలుఁగుచును వెలుఁగకయు, మాసిన నలిఁగినబట్టను గట్టుకొని మోమునఁ గళలేనిదైనను, భర్తయొక్క పరాక్రమము దలఁచుకొని తన కెప్పటికైన మేలుగలుగఁగలదని యెంచి ధైర్యముపూని, తనపాతివ్రత్యముం గాపాడుకొనుచు, జింకపిల్లవంటి నల్లనికన్నులతోఁగూడి బెదరిన లేడివలె నలువైపులఁజూచుచుఁ దన కడగండ్లను దలఁచుకొన్నప్పుడా వనము నందలి చెట్లచిగుళ్లు వాడిపోవునట్లుగ వేఁడినిట్టూర్పులు విడుచుచు, శోకరాశియో, మీఁదికిలేచిన దుఃఖపుటలయో, ఓర్పుయొక్క యపరావ తారమో యనఁబరగి, చక్కఁగాఁదీరిన యంగములు గలదాటచే నాభరణములు లేకున్నను ప్రకాశించుచుండెను. అట్టి యామదిరేక్షణ యగు సీతను మాఱుతి కాంచి యాపరాని యానందమునొంది, యానంద బాష్పములు విడిచి, రామలక్ష్మణుల యనుగ్రహమునఁజేసియే కాదా తాను సీతను జూడఁగలిగినదియని యా రామలక్ష్మణులను మనస్సున స్మ్రెక్కి, సీతాదర్శనముచేఁ బులకితగాత్రుఁడై రాక్షసులకుఁ గనఁబడ కుండుటకై దేహమును ముడుచుకొని యాశింశుపావృక్షపుఁ గొమ్మల మఱువున డాఁగియుండెను.

18-వ సర్గము

రావణాసురుఁడు సీతను జూడవచ్చుట

హానుమంతుఁడట్లు వనపాదపముల సింగారమును గాంచుచు, సీతను వెదఁకుచునుండగా, మూఁడుజాములు గడచి యొక్కజాము (152) ప్రొద్దుమాత్రముండెను. అయ్యపరరాత్రమున నాఅంగములతోడ వేదములను జదివినవారును, మేటిజన్నము లొనరించినవారునైన బ్రహ్మరాక్షసులు చేయువేదఘోషము లాహానుమంతుని చెవులకు సోఁకుచుండెను.

అప్పుడు రావణునినగరనంవలి చెవులకింపుగలుగు మంగళ వాద్య ఘోషములచే నిడుదచేతులు నెక్కువబలిమియు నెక్కువమగఁటిమి యుంగల యా రావణుఁడు నిద్ర లేచి, బట్ట జాఱిపోవుచుండ, పూవుల సరములు తావులు తప్పియుండ నాసీతయందెక్కువ తగులుగలవాఁడై, మదనునిబాధంజిక్కి, మదముమీఱఁగా, నాకామబాధను లోపల నణఁచుకోఁజాలనివాఁడై, యన్నితొడవులువొడిగి, దివ్యకాంతిచేఁ దేజరిల్లుచు నానావిధపుష్పఫలములుగలిగిన పెక్కుచెట్లచేఁ జెన్నారి, తామర కొలఁకులకునికియై, నానాపుష్పశోభితమై, తీవనిమదముగల పక్షులతోఁ గూడి యెక్కువవింతయై యుండుననియు, చూడనింపయిన పెక్కు తోఁడేళ్లతోవెలసి, పెక్కుమృగపక్షులచేనిండి, చెట్లనుండి రాలిన పండ్లచే సందులేనిదై యుండు నశోకవనముఁగూర్చి తఱిలి యిరువైపు లందలి తోటల రామణీయకముఁ జూచుచు నావనమునకు వచ్చిచేరెను.

దేవేంద్రుని దేవగంధర్వస్త్రీలు వెంబడించులాగున, నూఱ్వారు స్త్రీలు మాత్రమే యారావణుని వెంబడించి వచ్చిరి. వారిలోఁ గొందఱు పసిఁడిదీపపుసెమ్మెలను మోయుచు వచ్చిరి. మఱికొందఱు వింజామరములను, మఱికొందఱు విసనకఱ్ఱలను గైకొనివచ్చిరి. కొందఱు పసిఁడిగిండ్లతో నుదకముఁబట్టికొని ముందుగానడచిరి. కొందఱు బాకులను, ఆసనమునుగైకొని, యారావణునివెంబడి నడచిరి. ఒకానొకజాణయగు రాక్షసకాంత రత్నఖచితమయిన మద్యపూరితపాత్రను కుడిచేతఁ బట్టికొని వచ్చెను. రాయంచవలెను పున్నమచందురునికైవడిని వెలయుచున్న కాడగల తెల్లనిగొడుగును మఱొక్కతె పట్టుకొని రావణుని

వెంబడింబోయెను. నిద్రచేతను, కైపుచేతను తూలుచుండ నొప్పెడి రావణుని యుత్తమకాంతలు హారములు, బాజీబందులు తమ తావులు తప్పియుండ, మేనిగంధపుఁబూఁత పూర్తిగా మాసియుండ, కొప్పులు వీడియుండ, మోములందుఁ జెమ్మటలు గాఁయుచుండ, మేనఁదాల్చిన పుష్ప హారములు చెమ్మటకుఁదడియ, శిరోజములందలి పుష్పహారములు చిక్కు పడియుండఁగా నిద్రచేతను మదముచేతను ముందుకువెనుకకుఁబడుచు రావణునిమీఁది గారవముచేఁ గొందఱును, మోహముచేఁ గొందఱును, అశోకవనమునకుఁ బోవుచున్న రాక్షసేంద్రుఁడయిన రావణుని వెంబడించిరి.

ఆరాక్షసస్త్రీలకుఁ బెనిమిటియగు మహాబలుఁడగు రావణుఁడు మరునివలలోఁజిక్కి, మూఢుఁడగుటచేఁ బతివ్రతయగు సీతయందు మోహముగలవాఁడై తిన్నగా నడచుచు వచ్చెను.

వాయుపుత్రుఁడగు హనుమంతుఁడు రావణునితోఁగూడవచ్చెడి రాక్షసకాంతల యొడ్యాణములందలి చిఱుగజ్జెలమ్రోఁతలను, కాలియందెలమ్రోఁతలను వినెను. ఆవెంబడి రాక్షసకాంతలు సువాసనగల తైలములందుఁ దడిపిన పెక్కు దివ్విటీలు కొనివచ్చుచుండఁగాఁ జక్కఁగాఁ గానవచ్చుచున్న వాఁడును, మోహమదగర్వములతోఁగూడిన వాఁడును, నిడివిగలవియు వంకరలునైన యెఱ్ఱనినేత్రములు గల వాఁడును, విల్లుచేతఁబట్టని ప్రత్యక్ష మన్మథుఁడనఁదగినవాఁడును, మజ్జిగయొక్కయు, థారోష్ణముయొక్కయు నురుగులకాంతినిబోలు తెల్లనికాంతిగలదియు, తావునుండి తొలఁగి, భుజకీర్తులందుఁ దగులు కొన్నదియు, నిర్మలమైనదియునైన మేలిముసుఁబట్టి నొయ్యారముతో నీడ్చుకొనుచు దాపునకు వచ్చిన రావణుని హనుమంతుఁడు చెట్లయాకుల జొంపముల దాఁగినవాఁడై చక్కఁగాఁ జూచెను. కపిశ్రేష్ఠుఁడట్లు రావణునిఁజూచినపిదప నాతనివెంబడి వచ్చెడి రూపయౌవనములచే శోభిల్లెడి యాతని యుత్తమపత్నులను జూచెను. అట్లు హనుమంతుఁడు వారిని జూచుచుండఁగా గర్వముచే నిక్కఁ బొడుచుకొన్న చెవులతోఁ గూడినవాఁడు, మద్యపానముచే మత్తుఁడును, వింతతొడవులఁదాల్చిన వాఁడు, మహాబలుఁడునగు రావణుఁడు నక్షత్రములచేఁ జుట్టఁబడిన

చంద్రునిమాడ్కిఁ బ్రకాశించు జవరాండ్రతోఁగూడి, మృగపక్షుల కూఁతలతో నిండిన యావిహారవనమును బ్రవేశించెను.

ఎక్కువ వెలుఁగుగలవాఁడగు హనుమంతుఁడు విశిష్టతేజము గలవాఁడైన రావణుంజూచి, "యీగొప్పచేతులవాఁడు రావణుఁడు గాఁబోలు" నని తలఁచి, యాతని యన్ని చెయువులుచక్కఁగాఁ జూడఁగోరి, తాను ముందున్న కొమ్మకుఁ గ్రిందికొమ్మకు దిగెను. హనుమంతుఁడు శత్రువులకోర్వరాని మగఁటిమిగలవాఁడయ్యు నతని వెలుఁగునకు నడఁగినవాఁడై యాకులసందున డాఁగి యతనికంటఁబడకుండెను. రావణుఁడన్ననో నల్లని కొనవెండ్రుకలును, గొప్పపిఱుఁదులు, కదిసిన స్తనములును, నల్లని క్రీ గన్నులుంగలది యగు సీతాదేవిం జూడఁగోరి, యాదేవికడకు సమీపించెను.

19-వ సర్గము

రావణుఁడు సీతను చూచుట

ఆ రావణుఁడు వచ్చినయుత్తరక్షణమననే పతివ్రతయగు విజీవి కన్నులదైన యాసీతాదేవి రూపయౌవనములతోఁగూడిన యారాక్షసాధిపుఁడైన రావణుని దవ్వునఁ జూచినవెంటనే బొజ్జను రెండు తొడలతోను, స్తనములను రెండుచేతులతోను మూసికొని, పెనుగాలియందలి యరటిచెట్టువలె వణఁకుచు, కన్నులనుండి కన్నీరుఁగార్చుచు నేడ్చుచుఁ గూర్చుండియుండెను.

అప్పుడు రావణుఁడన్ననో రాక్షసకాంతలవశమున నుండు నదియు, దుఃఖములచే దొచ్చినదై, సముద్రమునమునిఁగిన యోడమాడ్కి నుండునదియు, పైకప్పులేని బయలునందుఁ గూర్చుండునదియు, పాతివ్రత్యమతము నవలంబించినదియు నరకఁబడి తీరకుండిన చెట్టు కొమ్మను బోలినదియు, ముఱికితోఁ గూడినదయ[illegible]తను గొల్పు దేహముగలదియు కైకేతకుఁ దగినదియయ్యుఁ గైకేత లేనియదు అడు సంటిన తామరతూఁడుమాడ్కిఁ బ్రకాశించినబీకాంతి కయు నుండునదియు, నాత్మవేత్తయు రాజర్షిపుత్రుఁడగు రామునిజీవ వకు సంకల్పములనెడిగుట్టములు పూన్చిన మనస్సునెఱిఁగి యథేచ్ఛమువిహరిం గూర్చుండి పోవుచున్నదానింబోలెఁ జూపట్టునదియు, ఎండుచుండినట్టి

V.R. NARLA MEMORIAL LIBRARY D.N.R. COLLEGE ACC No.

దియు, రామునిఁగూర్చిథ్యానించుచు, రామునివియోగదుఃఖమున మునిఁగి యొంటరిగా నేడ్చుచుండునట్టిదియు, దుఃఖమునకుఁ దుదగాన కుండునదియు, రామునే తలంచునదియు, మణిమంత్రౌషధములచేఁ గట్టి వేయఁబడిన యాఁడుపామువలె నిటటుపొఱలుచుండునదియు, భూమ కేతు వనుదుష్టగ్రహముచేఁ దొందఱపెట్టఁబడిన రోహిణీదేవివలె రాక్షస కాంతలచే బాధింపఁబడునదియు, గౌరవము, మర్యాద, మంచినడవడి, ఆచారము, ధర్మగుణములగలిగిన గొప్పకులమునఁ దాను బుట్టినను, మున్ను చెప్పినగుణములులేనిచెడుకులమునఁ బెండ్లాడి, యాకులమునఁ బుట్టినదానిపగిది శోభాహీనురాలై యుండునదియు, లేని యపవాదము వచ్చుటచే నశించిన కీర్తింబోలియు, ఆవృత్తి లేకపోవుటచే మఱచిన విద్యకైవడియు, నశించిన గొప్పకీర్తివలెను, ఆదరణచేయఁబడని శ్రద్ధ మాడ్కియు, అల్ప పూజాద్రవ్యములు గల పూజచొప్పునను, సిద్ధి నొందనియాశవలెను, తగ్గిన ధనాదాయమువలెను, చెల్లింపఁబడని యుత్త రువువలెను, ఉత్పాతకాలమున మండునట్టి దిక్కువలెను, దోఁచుకొని పోఁబడిన పూజార్థమగు వస్తువువలెను, మంచుచేఁ బాడుచేయఁబడిన తమ్మికొలనికైవడియు, మొనగాండ్రు లేని దండువలెను, చీఁకటిచేఁ గాన రానికాంతి చందమునను, నీరింకిన యేటిపగిదియు, పరిశుద్ధులుగానివా రిచేఁ దాఁకఁబడిన యజ్ఞవేదికరీతియు, చల్లారిన యగ్నిజ్వాలవలెను, రాహువుచే మ్రింగఁబడిన చంద్రబింబముతోఁగూడిన పున్నమనాటిరాత్రి వలెను, కమలపత్రములు కోయఁబడి, పళ్ళులు చెదరగొట్టబడి, ఏనుఁగుల తొండములచేఁ గలియఁబెట్టఁబడి యాకులమైయున్న తామరకొలనివలె నుండునదియు, పెనిమిటియెడఁబాటువలనివెతచే గుంది, యెండుపాఱిన మోముగల దౌటచేతఁ గట్ట తెగిపోవుటచే నీరెల్లఁబాఱిపోవఁగా నెండిన యేటివలెనున్నదియు, ఎక్కువ పోషణ లేనిదగుటచేఁ గృష్ణపక్ష రాత్రివలెఁ బ్రకాశింపనిదియు, సున్నితమై చక్కఁగాఁ దీరినయంగము లతోఁ గూడినదియు, రత్నఖచితమయిన రాజగృహమున నుండఁదగిన దియు,అప్పుడే యెత్తి యెండలో వేయఁబడఁగా నెండకువాడిపోవుచున్న తామరతూఁడుమాడ్కి నుండునదియు, అడవియందు విచ్చలవిడిగాఁ దమగుంపుతోఁగూడఁ దిరుగునప్పుడు పట్టుకొని కట్టివేయఁబడి మిక్కిలి దిగులుపడి ఘీంకారము చేయుచున్నట్టి స్త్రీజాతి యేనుఁగుకైవడి వేఁడి

నిట్టూర్పులు విడుచునదియు, నిడివియైన యొంటిజడఁ దాల్చినను, ప్రయత్నము లేకయ స్వాభావికముగాఁ బ్రకాశించుచుండునదియు, వర్షర్తువు తీఱి నల్లని వనపంక్తితోఁ గూడిన భూమివలె సొంపు లేనిదియు, ఆహారము లేమిచేతను, భర్తను ధ్యానించుటచేతను, భర్తవియోగశోకము చేతను, రాక్షస్త్రీవలని బాధల భీతి చేతను మిక్కిలి చిక్కినదియు, దైన్యము, కృశత్వమును నొందినదియు, ప్రాణధారణకు మాత్ర ముపయుక్తమైన యన్నముఁ దినునదియు, తపస్సే ధనముగా నెంచినదియు, రామునిమూలమున రావణుని కెప్పు డవమానము సంభవించునా యని దేవునిఁగూర్చి దోసిలియొగ్గి మనస్సునఁ దలపోయుచుండునదియు, దనకేమి వచ్చునోయని అన్నివైపులఁ జూచుచుఁ గన్నీరు గార్చుచుండునదియు, చక్కనైన తెప్పలతోఁ గూడినవి, యెఱ్ఱనివి, నిడివివి, తెల్లనివియునైన కన్నులుగలదియు, రామునే తలపోయుచుండునదియునైన యాసీతా దేవిని రావణుఁడు తన్నువలచునట్లుచేయ మొదలిడెను.

20-వ సర్గము

రావణుఁడు సీతను బ్రతిమాలుట

ఆ రావణుఁడు పతివ్రతయు, భర్తనెడఁబాసియుండుటచే సంతసము లేనిదియు, వ్యసనంపుముఖముతో నుండునదియు, దీనురాలునగు సీతంగూర్చి సాభిప్రాయములైన యింపుమాటలచేఁ దనయభిప్రాయమును దెలిపెను.

ఏనుఁగుతొండమువంబోలు తొడలుగలదానా! నన్నుఁ జూచి, స్తనములను, కడుపుసుమూసి, నీదేహమును భీతివలననోయన్నట్లు నాకుఁ జూపక లోపలికి ముడుచుకొనఁ గోరుచున్నావు. ఓ విశాలాక్షీ! నీపై మరులుగొని యున్నాను. ఓసీ ప్రియురాలా! నన్ను గారవింపుము. సుగుణము లన్నిటితో నిండినదానా! సకలలోకములకు మనోహరురాలా! యిచ్చట నీకు వెఱపు పుట్టించుమనుజులుగాని కామరూపులగు రాక్షసులుగాని లేరు. ఓసీతా! నేను రాక్షసుఁడనయినను, నావలనను భీతి నీకు వలదు. ఓసీ పిఱికిదానా! పరస్త్రీలను హింసించి తెచ్చుటకాని, వారితోఁ గలియుటగాని రాక్షసులకు ధర్మమే. దాని కేసందియమును లేదు. ఇది యిట్లున్నను, ఓమిథిలాధిపునికూఁతురా! నాయెడ మోహము

గలుగునంతవఱకు నిన్నుఁ దాఁకను. నీశరీరమునఁ గామము యథేచ్ఛగాఁ జొచ్చునుగాక!

ఓ చెలీ! ఓ దేవీ! నీకిచ్చట భయము వలదు. నాయెడ విశ్వాసముంచుము. వాస్తవమైన ప్రేమను నాయెడఁ జేయుము. ఇత్తెఱఁగున నెప్పుడు వ్యసనముఁ దగిలియుండకుము. ఓ సీతా! ఒంటిజడయు, నేలఁబరుండుటయు, చింతించుటయు, నల్లనిబట్టయు, నిష్కారణముగా నొక్కప్రొద్దులుండుటయు నీకుఁ దగినవికావు.

ఓ మైథిలీ నీవు, నన్నువలచి, విచిత్రములగు పుష్పమాలికలును, చందనములు, అగరువులు, నానావిధములగు బట్టలు, దివ్యభూషణములు, గొప్ప విలువగల పానీయద్రవ్యములు, పాన్పులు, ఆసనములు, నృత్తగీతవాద్యములును అనుభవింపుము. ఓ చక్కనిరూపముగల దానా! నీవు స్త్రీలలోఁ నుత్తమురాలవు. నీవిట్లు వ్యసనపరురాలవై యుండవలదు. సొమ్ములు పెట్టుకొనుము. నన్నుఁబొందినపిదప నీవెట్లు తగనిదానవగుదువు. నీ కిప్పుడు వచ్చియున్న మనోహరమైన ప్రాయము మీఱిపోవుచున్నది. కడచినయౌవనము వడిగాఁబాఱు నదీప్రవాహము మాడ్కి మఱల రానేరదు. ప్రసిద్ధుఁడైన సృష్టికర్తయగు బ్రహ్మదేవుఁడు లోకోత్తరసౌందర్యశాలినివైన నిన్ను సృజించి, యంతటితో సృష్టిని జాలించె నని తలఁచెదను. ఓసీ చక్కనిదానా! నీతోఁ సాటియగు రూప లావణ్యములు గలకాంత ముల్లోకములలోను గానరాదు.

ఓ వైదేహీ! చక్కఁదనమును, వయసును గలదానవగు నిన్నుఁ జూచినపిదప నెవ్వఁడు చూచి చూడక పోవును? సాక్షాత్తుగా సృష్టికర్తయగు బ్రహ్మదేవుఁడయినను నిన్ను వీక్షించి పోఁజాలఁడు. చంద్రునిఁబోలు మోముగలదానా! నీయొక్క యేయే యంగమును జూచుచున్నానో, ఓ గొప్పపిఱుఁదులదానా! యాయా యంగమున నాదృష్టి కట్టుపడుచున్నది.

ఓ మైథిలీ! నీవు నాకు భార్యవగుము. ఈ వెట్టిపట్టుదలను విడువుము. అచ్చటిచ్చటినుండి తేఁబడిన పెక్కురు చక్కనియతివలలో నీవు పట్టపుదేవివి గమ్ము. నేను శత్రువులను సంహరించి, యనేకలోకముల నుండి యేయే మంచివస్తువులను దెచ్చితినో, ఓ పిఱికిదానా! భయపడకుము. ఆమంచి వస్తువులును, నారాజ్యమును, నేనును నీయధీనులము.

ఓ సొగసుదానా ! నీ నిమిత్తమై సకల పట్టణములతో నిండిన భూమి యంతయు గెల్చి నీ తండ్రికొసఁగెదను. ఈ లోకమున నాతో సాటిగా యుద్ధముసేయఁగలవాఁడు మఱొక్కఁడు లేఁడు. ఇదిగో సమరమున సాటిలేని నాకడుగొప్పమగటిమిఁ జూడుము. నేను దేవతలతో యుద్ధములు చేయునప్పుడు వారి కొక్కెములను విఱిచితిని. నాపగతురు సుకలుగాని యసుకలుగాని నాయెదుట నిలిచి యుద్ధముసేయఁజాలరు. నీవు నామీఁద మోహముగలదానవై, నిగనిగ మెఱయుచుండు నీ భూషణములను దాల్పుము. నీవు చక్కగా నలంకరించుకొందువేని, నేనును ప్రేమతో నిన్ను బాగుగాఁ జూతును.

ఓ చక్కనిమొగముగలదానా ! నాయెడఁ గరుణించి, యలంకారముచేసికొని, యథేష్టముగాఁ గోరిన భోగము లనుభవింపుము. ఓ పిఱికిదానా! మద్యముత్రాగుము. నాతోఁ గ్రీడసల్పుము. నీయిచ్చ చొప్పున వలయువారికి భూమియిమ్ము, ధన మిమ్ము. నాయందుఁ బ్రేమ యుంచి నన్నుఁగోరుము. నీకేది కావలసినను ధైర్యముతో నాజ్ఞాపింపుము. నాయనుగ్రహమువలన నీవు వేడుకతో నుండుచు, నీచుట్టముల నందఱను సంతోషపెట్టుము. ఓ మంగళాంగీ ! నా కలిమిని, నా సౌందర్యమును, నాకీర్తిని జూడుము.

ఓ భాగ్యశాలినీ ! రాముఁడన్ననో నారబట్టలు గట్టుకొన్న వాఁడు, అతనితో నీకేమిపనియున్నది ? రాముఁడు జయములేనివాఁడు. రాజ్యలక్ష్మిని బోఁగొట్టుకొని యడవులయందల్లాడుచున్నాఁడు. వ్రతము పూని, నేలమీఁద బరుండుచుఁ గాలము గడుపుచున్నాఁడు. ఇప్పటికి బ్రతికియున్నాఁడో లేఁడో యని నేను సంశయించెదను. ఓవైదేహీ ! రాముఁడొక్కవేళ జీవించియున్నను, క్రిందిభాగమున కొంగలసంచారముగల నల్లమబ్బులచేఁ గ్రమ్మఁబడిన వెన్నెలనుబోలె నా యధీనత యందున్న నిన్ను రాముఁడు చూడనైనను జాలఁడు. హిరణ్యకశిపుఁడింద్రునిచేత నున్న కీర్తిని బొందఁజాలనట్లు, నీవు నాచేతనుండి తప్పించుకొని పాఱిపోయినైనను రాముని బొందఁజాలవు.

చక్కనిచిఱునవ్వుగలదానా! తెల్లనిపల్వరుసగలదానా ! సొగసుకన్నులదానా ! వన్నెలాడీ ! గరుఁడుఁడు పాము నెత్తికొనిపోవునట్లు, ఓ భీరూ ! నామనమును నీవు చూఱఁగొనుచున్నావు. నీవు మాసిన

దువ్వులువ గట్టికొని, యన్నము లేక చిక్కి, యలంకారములు దాల్పక యున్నను, నిన్నుఁ జూచినపిదప నాభార్యలపై మరులు గొనుటయే లేదు. ఓ జానకీ! నాయంతఃపురమున రూపలావణ్యాదిసుగుణగణో పేతలగు పెక్కండ్రుకాంత లున్నారు. నీవు వారికెల్ల రాణివై యుండుము. ఓ నల్లనిముంగురులు గలదానా! నీవు నన్నుఁగోరుదువేని, నాయంతిపురమునఁగల లోకోత్తర సౌందర్యముగల స్త్రీలందఱును అప్సరలందఱు లక్ష్మీదేవినింబోలె నిన్నుఁగొల్చుచుందురు. ఓ సొగసుకను బొమ్మలదానా! కుబేరునికడ నెన్ని రత్నములు, నెన్ని నిధులు నున్నవో, ఆరత్నములను, ఆనిధులను, ఆతనిలోకమును నీవే యథేష్టముగా అనుభవింపుము. ఓ దేవీ! రాముఁడు తపస్సునఁగాని, బలమునఁగాని, ఒక పరాక్రమమునఁ గాని నాకు సాటియగువాఁడు కాఁడు. మఱియు, ధనము, తేజస్సు, కీర్తి వీనియందుఁగాని నాకు సాటియగువాఁడు కాఁడు; కావున ఓ వయ్యారీ! మద్యము ద్రాగుము; ఈవనమునఁ దిరుగుము. రతిక్రీడలం దేలుము. కావలసిన భోగము లనుభవింపుము. నీకుఁ గావలయు ధనమొసఁగెదను. భూమి యొసఁగెదను. నీవు నన్నేలుము. నీవు నాయెడఁ బ్రేమతోనుందువేని నీచుట్టములందఱు నీకలిమిఁజూచి నీయెడఁ బ్రేమగలిగియుందురు. ఓ భీరూ! సువర్ణమణిహారములను దాల్చినదానవై, పుష్పించిన దట్టములైన చెట్లతోఁ గూడిన వనములందుఁ దుమ్మెదల ఝుంకారములను వినుచు, సముద్రతీరములందు నాతోడ విహరించుచుండుము." అని రావణుఁడు సీతను సామదానోపాయములచే స్వాధీనపఱచుకొనఁ జూచినవాఁడయ్యెను.

21-వ సర్గము

సీత రావణునిపలుకులకుఁ బ్రత్యుత్తర మొసఁగుట

రామవియోగవ్యసనముచేఁ గృశించినదియు, మోమునఁ గాంతి లేక వెలవెలపాఱుచుండునదియు, కరుణింపఁ దగినదియు నైన గొప్ప పిఱుఁదులు గలదగు సీతాదేవి యా రావణునిరూపు చూచి గడగడ వణఁకుచు, చేయునది లేక గొల్లున నేడ్చుచుఁ దాను పతివ్రత గనుక భర్తనే ధ్యానించుచు, నాభయంకరుఁడైన రావణుని యట్టి కర్ణకఠోరపు మాటలు విని, మొదటఁ గొంతసేపు చింతించి, యాయధ

మునితోఁ బ్రత్యక్షముగా మాటలాడుట పతివ్రతకు ధర్మము గాదు కావున గడ్డిపోచ యొక్కటి నడుమఁ ద్రుంచివైచి, "ఓరీ రావణా! నీవును, నీకలిమియు, నీపరాక్రమాదులును తృణప్రాయము" లను నట్టి యభిప్రాయముఁ దెలుపుచుఁ జిఱునవ్వు నవ్వుచు నిట్లనియెను:

"ఓరీ రావణా! నీమనసును నావలననుండి మఱలింపుము. నీ ప్రియురాండ్రయందే మనసు పెట్టుము. పాపాత్ముఁడు మోక్షమును గోరుట యనర్హమగునట్లు నీవు నన్నుఁగోరుట యనర్హము. నేను గొప్ప కులమునఁ బుట్టినదానను, గొప్పకులమును జొచ్చినదానను. ఒకనికి లొంగినదానను (పతివ్రతను). అట్టి నేను లోకనింద్యమయిన యీ కార్యముఁ జేయను" అని చెప్పి పతివ్రతయగు సీతాదేవి యతనినిఁ దిరస్కరించి మఱల నతనితో నిట్లనెను:

ఓరీ! నే నొరునియాలను; పతివ్రతను; గావున నీ కుపయోగ పడుదాననుగాను. సాధువులధర్మమును జక్కఁగాఁ బరిశీలింపుము; సాధువులు చేయు వ్రతమునుజేయుము. ఓరీ రేద్రిమ్మతీఁడా! నీభార్యలను గాపాడుకొనవలయు ననినీకెట్లు తలంపుండునో, అట్లే యొరుల కును తమభార్యలను గాపాడుకొనవలయు ననుతలం పుండునుగదా! అందఱు నీవంటివారే యని తలఁచికొని స్వభార్యలందే రమింపుము. తనభార్యలందుఁ దృప్తి నొందనివాఁడును, చపలుఁడును, ఇంద్రియముల నిలుకడ లేనివాఁడును, మోసమునందు నేర్పుగలవాఁడును నైన యధ మునికి మగనాండ్రు ఆయుస్సుక్షయము మొదలగు నవమానములఁ గలిగింతురు. ఇచ్చట నీకు బుద్ధి సెప్పు పెద్ద లెవ్వరును లేరా? దుర్బుద్ధు లగువారి చెడు బోధలను విని, వారియిచ్చచొప్పునఁ బోవుచు, రాక్షస వినాశంబుఁ గోరినవాఁడవై పండితులు చెప్పిన హితవాక్యములను విన వైతివేమో. కావుననే నీ కిప్పు డిట్టి పెడకట్టబుద్ధి పుట్టినది. బుద్ధిహీనుఁ డయి, న్యాయ్యములైన కార్యములఁ జేయని రాజును దమయేలి కనుగాఁ బడసి, సంపదతో నిండినవైనను పురములును, రాజ్యములును నశించిపోవును. అట్లే యీ లంకాపురము సకల రత్నధనధాన్యాది సంపదలతోఁ గూడినదయ్యు, నిన్నొడయనిఁగాఁ బడసినదిగాన నీక వేగిరమే పాడైపోవును. ఓరీ రావణా! తనకార్యములవలననే తాను జేటు దెచ్చికొని, ముందాలోచన లేక యవస్థపడుచుండు పాపకర్ముఁడ

వైన నీవు నశించిన నప్పుడు జనులందఱు "స్వకర్మమువలననే దురాత్ముఁడు మ్రగ్గె" నని సంతోషింతురు. పాపాత్ముఁడవైన నీచే నందఱు వంచితులై, "దైవవశముననే క్రూరుఁడైన యీ రాక్షసాధిపునికిఁ గష్టము వచ్చె" నని, పాపపుసేఁతలు గల నిన్నుఁ జూచి చెప్పుకొందురు.

ఓరీ రావణా! నీవు సొమ్ములిచ్చెదనని, ధనమునిచ్చెదనని, రాజ్యమునిచ్చెదనని చెప్పితివి. నీ వంతిపురపుటతివలకెల్ల రాణితనము నొసఁగినను, ధనమొసఁగినను, నేను వాని కాశించి నీకు లొంగుదానను గాను. ఓ రావణా! సూర్యుని నతనివెలుఁ గెడఁబాయకయుండునట్లు, నే నాకాకుత్స్థవంశోద్భవుఁడైన రాము నెడఁబాసి యుండను. బ్రహ్మాదులచేఁ దమతమలోకములసిద్ధికై ప్రార్థింపఁబడుచుండు ప్రసిద్ధుఁడైన రాఘవుని కుడిభుజము దిండుగాఁ బెట్టికొని నిద్రించినదాననైన నేనిప్పుడు మఱొక్కభుజము నెట్లు దిండుగాఁబెట్టికొని నిద్రింతును. వేదవ్రతములొనర్చి స్నాతుఁడయినవాఁడు, బుద్ధిమంతుఁడు, ఆత్మజ్ఞానవంతుఁడునైన విప్రునికే సాంగవేద విద్య తగినదగునట్లు, నేను భూపతియగు నా రామునికే తగిన భార్యను. ఓ రావణా! నీకు మేలగును. వనమున వయసున నున్నయాఁడేనుఁగును గజేంద్రునితోఁ జేర్చునట్లు, రాఘవు నిచ్చటికిఁ బిలుచుకొనివచ్చి నన్నా రాఘవునితోఁ జేర్చుము.

ఓ రావణా! నీవు లంకాపురమున నుండఁగోరితివేని, ఆ రాముని తోఁ జెలిమిచేసికొనుట యుక్తము. అట్లుకాక, "ఆరాముని వేఁడుకొను దీనదశ మనకేల" యని దీమసముతోనుంటివేని, పురుషశ్రేష్ఠుఁడయిన యారాముఁడు నిన్ను ఘోరయుద్ధమునం దెగటార్పఁగలఁడు. ఓ రావణా! నీ విప్పుడు, "నేను వేఁడుకొంటినేని నన్ను మన్నించునా యారాముఁడు" అని సందియపడవలదు. ఆతఁడు ధర్మముల నెఱిఁగినవాఁడు. శరణుచొచ్చినవారి యందుఁ బ్రేమగలిగి వారిని గాపాడువాఁడు. కావున నీకుఁ బ్రాణముల మీఁద నాశ గలదేని, యతనితోఁ జెలిమిచేసికొనుము. శరణాగతవత్సలుఁడై యారామనృపాలునికడకేగి, "యోమహాత్మా! నేను తెలియక యీ పనిచేసితిని. నాతప్పు మన్నింపుము" అని క్షమాపణ యడుగుకొనుము. నేనుసు నీతప్పు మన్నింప వేఁడెదను. నీవు మనస్సునందలి కల్మషముఁ బాసి, నన్నుఁ గొనిపోయి యారాముని కప్పగింపుము.

రావణా! నీవిట్లు నన్ను రఘూత్తమున కర్పించితివేని, నీకు మేలు గలుగును. అట్లుగాక నీ వేవిధమునఁ జేసినను నీకు వధము దప్పదు. ఇంద్రుఁడైనను నిన్ను విడుచు. యముఁడైనను నిన్ను విడుచు. లోకోత్తరుఁడైన రాఘవుఁ డలిగెనేని నిన్ను విడువఁడు. ఇంద్రుఁడు ప్రయోగించిన వజ్రాయుధధ్వనినింబోలె నారాముని వింటినారియొక్క గొప్పనాదమును నీవు వినఁగలవు. చక్కని గణుపులుగలవి, కంకపత్రములు గట్టినవియునగు రామలక్ష్మణులపేరులుగల బాణములు విషజ్వాలలగ్రక్కెడు పాములమాడ్కి జ్వలించుకొనలుగలవై, యీ లంకాపురమునందలి రాక్షసుల నందఱను బూర్ణముగాఁ బరిమార్చుచుఁ గొంతయైనను తావులేక నిండి నిబిడీకృతమై యుండునట్లు చేయఁగలవు. ఓ రావణా! గరుడుఁడు సర్పములను వేగముతోఁ దన్నుకొనిపోవునట్లు, బలవంతుఁడగు రాముఁడును రాక్షసేంద్రులను వేగముతో నెత్తికొనిపోవఁగలఁడు. రాముఁడు శత్రువుల నణఁగఁ ద్రొక్కువాఁడు. వామనావతారుఁడగు విష్ణువు రాక్షసచక్రవర్తియగు బలిని యాచించి మూఁడడుగులచేతనే వానిరాజ్యలక్ష్మిని లాగికొన్నచందమున, శ్రీరాముఁడును నిన్నుఁ బరిమార్చి నన్నుఁ గొంపోవఁగలఁడు.

రావణా! జనస్థానమంబలి పదునాలుగు వేవురు రాక్షసులు మడిసి, యాజనస్థానము పాడైపోవఁగా, నీవు యుద్ధముచేయ శక్తిలేనివాఁడవై యీ చేయరాని దొంగపనిని జేసితివి. ఓరీ యధమాఁడా! నరసింహములగు నారామలక్ష్మణులను మాయామృగముచే వంచించి వనము విడిచిపోవునట్లొనర్చి, వారు లేనప్పుడు వనములోపలఁజొచ్చి, నన్నుఁ గొనివచ్చితివి. రావణా! వేపి పులులయెదుట నుండఁజాలనట్లు రామలక్ష్మణులను బొడఁగాంచి నీవుండఁజాలవు. నాప్రాణేశ్వరుఁడు రాముఁడు లక్ష్మణునితోఁ గూడవచ్చి, సూర్యుఁడు స్వాలోపదకము తనకిరణములచేఁ బీల్చునట్లు, నీ ప్రాణములను దనబాణములచేఁ దీయఁగలఁడు. వృత్రాసురుని యొంటిచేయి దేవేంద్రుని రెండుచేతులతోఁ బోరాడఁజాలక యోడినట్లు, దొంగతనమున నన్నుఁ దెచ్చిన నీ వొక్కరుఁడవు శూరులైన రామలక్ష్మణులతోఁ బోరితివేని, నీకు జయముగలుగుట సిద్ధముగాదు. కాలహతమైన గొప్పవ్రాఁకు పిడుగునుండి తప్పించుకొనఁజాలనట్లు, నీవు పైలోకములకుఁ బోయినను, పాతాళమునకుఁ బోయినను

దశరథపుత్రుఁడయిన రాముని బారినుండి తప్పించుకొనఁజాలవు. ఇది నిస్సంశయము" అని సీతాదేవి రావణునిఁ బరుషవాక్యంబు లాడిన దాయెను.

22-వ సర్గము

రావణుఁడు సీతకు బదులుసెప్పుట

రాక్షసరాజగు రావణుఁడు సీతయాడిన పరుసనిమాటలు విని, చూడఁదగినది యగు సీతనుగూర్చి యప్రియవాక్యములతో నిట్లనియె:

"ఒకఁడు స్త్రీల నెంతెంతగా బతిమాలుచున్నాఁడో అంతంతగా స్త్రీలకు వాఁడు లోకువయగుచున్నాఁడు. ఎంతెంత ప్రియముగా మాటాడుచున్నాఁడో, అంతంతగాఁ దిరస్కృతుఁడగుచున్నాఁడు. నేర్పరి యగు సారథి త్రోవతోలఁగి పరువిడుచున్న గుఱ్ఱముల నాఁపునట్లు నీయందుఁ బుట్టినకామము నాకోపము నాఁపుచున్నది. మనుజు లెవ్వరియం దాఁపరాని కామము నుంచెదరో, వారట్టివారియందు జాలియు, ప్రేమయుఁ గలిగియుందురు. వధమునకుఁ దగినదానవును, భంగపఱుపఁ దగినదానవు, కపటమునివేషముఁదాల్చిన రాముని యం దాసక్తవు నయిన నిన్ను నేనిప్పుడు చంపియే యుండవలసినది. అయినను నీయందు నాకున్న మోహాముబలనచే నేను నిన్నుఁ జంపక విడిచితిని. మైథిలీ! నీవే యే పరుసనిమాటలు పలికితివో, ఆయా మాటలలో నొక్కొక్క దానికిని నిన్నుఁ జంపి యుండవలసినది. అయినను, నీమెడఁగల మోహాముచే నిన్నేమియుఁ జేయలేక యుంటిని."

ఇట్లు రాక్షసాధిపుఁడగు రావణుఁడు సీతతోఁ జెప్పి కోపాటోపముతోఁ గూడుకొన్న వాఁడై, మఱల నిట్లు పలికెను.

18

"ఓ చక్కని మైచాయగలదానా! నీకిదివఱలో నొసఁగిన గడువులో నీఁక రెండు నెలలు మిగిలియున్నవి. ఈ రెండునెలలలోపలఁ జక్కఁగాయోచించికొని యావల నాశయనము నెక్కుము. అట్లు రెండు నెలలు గడచినపిదపఁ గూడ నీవిట్లు నన్ను భర్తనుగాఁ గోరకుందువేని, నిన్ను సద్దికూటికై వంటయింటఁ జంపివైచెదరు.

రాక్షసేంద్రునిచే నివ్విధమునఁ బెదరింపఁబడుచుండు జానకిని జూచి, దేవగంధర్వకన్యకలు వికారపుఁజూడ్కి గలవారలై కడు

దుఃఖించిరి. వారిలోఁ గొందఱొడు గఱచియు, కొందఱు మోములు చిట్లించియుఁ, గొందఱు గ్రుడ్లుత్రిప్పియు నా సీతాదేవి నూఱడించిరి.

వార ట్లూఱటచేయఁగా, సీత కొంతదిటవు పూని, రాక్షసాధిపుఁ డయిన రావణుంగూర్చి, తన కితవును, పాతివ్రత్యబలగర్వముతోఁ గూడి నదియునై న మాటల నిటనెను:

"ఓరీ రావణా! నీకు హితము గోరువాఁడేని, జననింపఁబోవైన పరస్త్రీ హరణరూపమగు చేటునుండి నివారించువాఁడేని యొక్కఁడును లేఁడుకాఁబోలును! దేవేంద్రునకు శచీదేవివలె ధర్మాత్ముఁడగు రామునికి దేవినై న నన్ను నీచుఁడవై న నీవు గోరితివికాని ముల్లోకములలోపల మఱొక్కఁడు నన్ను మనసునై నఁ దలఁచునే? ఓరాక్షసాధమా! మహాప్రతాపుఁ డయిన రామునియొక్క పట్టంపుదేవేరినై న నన్నెట్టి క్రూరపుమాటలు మాటాడితివో, ఆమాటల కలిగినవాఁడై రాముఁడు నీపైకి వచ్చెనేని, నీవెచ్చటికిఁ బోయి తప్పించుకొందువు?

ఒకవనమున మదించిన యేనుఁగును, పిఱికిస్వభావముగల కుందేలును గూడి పోరిన నెట్లుండునో, రాక్షసాధమా! నీవును రాముఁడును బోరుట యట్లుండును. ఓరీ నీచుఁడా! శ్రీరాముండు మదపుటేనుఁగుం బోలినవాఁడు. నీవు మనుష్యునిఁ జూచిన మాత్రమునఁ బరుగెత్తు స్వభావముగల కుందేటివంటివాఁడవు. ఓరీ! దండకారణ్యమున రామునియెదుటఁ బడక, మాయామృగమునెపమున వారిని వనము నుండి వెడలఁజేసి, యెవ్వరు లేనిసమయమున దొంగవలె నన్నెత్తికొని పాఱివచ్చినదిగాక, యిచ్చట నీ వారిలో నాత్మస్తుతి చేసికొనుటకు లజ్జ పడకున్నావు! అప్పుడు నీ వారాఘవునికంటఁ బడవైతివి. అప్పు డీ డంబమపస తెలిసియుండును. ఓరీ దురాత్ముఁడా! నలుపు తెలుపు గలిసినవి, విరూపములునునై న నీమిడిగ్రుడ్లు నన్ను వలపుతోఁ జూచునప్పుడేల క్రిందఁబడకున్నవి? ధర్మాత్ముండయిన యారాఘవునిభార్యను, దశరథమహారాజునకుఁ గోడలనునై న నన్నీ విధమున దురాలాపములాడెడి నీనాలుక యేల తునిఁగి క్రిందఁబడకున్నది?

ఓపదితలలవాఁడా! భస్ముచేయఁదగినవాఁడా! నేను నాపాతివ్రత్యబలముచేతనే నిన్ను బూదిచేసియుందును. అయినను, నాభర్తయుత్తరవు లేమిచేతను, పాతివ్రత్యరూపమైన తపస్సును గాపాడుకొన

వలయును గనుకను నిన్నిప్పుడు బూదిచేయక మన్నించితిని. బుద్ధిమంతుఁడగు రామునికి దేవినైన నన్ను దండకారణ్యమునుండి యపహరించితేఱ నీకు వీలుకాదు. నన్ను నీవపహరించుటయను కార్యమును నీ వినాశమునకై భగవంతుఁడే యేర్పఱచినవాఁడు. దీని కేసంశయమును లేదు. ఓరావణా! నీవు శూరుఁడవు. కుబేరునకుఁ దమ్ముఁడవు. చతురంగ బలముతోఁ గూడినవాఁడవు. ఇట్టి సహాయబలముగలవాఁడ వయ్యు, నీవు మాయామృగవ్యాజముచే రాఘవుని వేఱొక్కచోటికిఁ గొని పోయి, యాతనిదేవినైన నన్నేల దొంగిలించి తెచ్చితివి! నిన్ను విధి యీడ్చుచున్నది గావున నీ కిట్టి విపరీతబుద్ధి పుట్టినది.

అని సీతాదేవి పలుకఁగా, రావణుఁడా మెపలుకులు విని క్రూరమునై న తన మిడిగ్రుడ్లుత్రిప్పి తదేకదృష్టితో నాదేవిం జూచెను.

ఆ రావణుఁడు నల్లని మేఘమువంటి శరీరకాంతిగలవాఁడును, గొప్ప మూఁపురములు గలవాఁడును, సింగమువంటి సత్తువయు, నడకయుఁ గలవాఁడును, కాంతిమంతుఁడును, మండుచున్న కొనగోరు కయు, కన్నులుంగలవాఁడును, కోపవశమున శిరస్సునందలి కిరీటముకొన కదలుటచేఁ బొడవయినవానియట్లు తోఁచువాఁడును, నానావిధములైన పుష్పహారములను దాల్చి సుగంధము పూసికొన్నవాఁడును, ఎఱ్ఱని పూలదండలును ఎఱ్ఱని బట్టలు గట్టినవాఁడును, అపరంజితోఁ జేయఁబడిన భుజకీర్తులను దాల్చినవాఁడును, మొలను నల్లనైన పట్టుపట్టి దిట్టముగాఁ గట్టినవాఁడగుటంజేసి, యమృతముఁ జిలుకునిమిత్తమై వాసుకి యనుసర్పముచేఁజుట్టఁబడిన మందరపర్వతమువాడ్క నుండువాఁడునునై యుండెను. మఱియుఁ బర్వతమంబోలు రావణుఁడు బలిసిన లావు బుజములు గలవాఁడగుటచేత నిరువైపుల రెండుశిఖరములతోఁ గూడిన మందరశైలము వాడ్కియు, బాలసూర్యునిపగిదిఁ దేజరిల్లు నంటు జోళ్లు గలవాఁడగుటచే నెఱ్ఱని చిగుళ్లను బూవులును గలిగిన రెండడశోకవృక్షములతో నొప్పిన పర్వతమునై వడిని వెలుఁగుచుఁ గల్ప వృక్షుమువంబోలి, మూర్తిమంతుఁడయిన వసంతుఁడో యనునట్లున్న వాఁడై, వల్లకాటియందలి యాలయంబుఁ బోలినవాఁడై, సకలభూషణములఁ దాల్చియు భీకరుఁడై, కోపముచేఁ గన్ను లెఱ్ఱనఁజేసి, యాసీతాదేవి నుతిమించూచి, పాముమాడ్కి బుసకొట్టుచు, "ఓసీ! సూర్యుఁడు

ప్రాతఃకాలమున నుదయకాలమందలి చీఁకటిని రూపుమాపునట్లు నిన్నిప్పుడే నలిపివేసెదను చూడుము" అని సీతాదేవినిగూర్చి న్యాయముఁ దప్పినదియు, ఉపయోగము లేనిదియునైన మాటను జెప్పెను.

శత్రువుల నేడ్పించునట్టివాఁడగు రావణుఁ డిట్లౌటఁగన సీతను బెదరించి, యాసీతచుట్టు నున్నట్టి భయంకరాకారమైన ఒంటికంటిది, ఒంటిచెవిది, చెవులతో ముసుఁగువేసికొనునది, ఆవుచెవులది, ఏనుఁగు చెవులది, వ్రేలాడు చెవులది, చెవులులేనిది, ఏనుఁగడుగులది, గుఱ్ఱపు కాళ్లది, ఆవుకాళ్లది, అడుగులందుఁజుట్టుగలది, మఱియొక యొంటి కంటిది, ఒంటికాలిది, బరువుకాలిది, మొండిది (కాళ్లులేనిది), కడునిమ్ముపు మెడయుఁ బెద్దతలయుఁగలది, లావుబొజ్జయు బలిసిన కుచంబులును గలది, వెడల్పుమోమును గన్నులునుగలది, నిడివినాలుకది, నాలుక లేనిది ముక్కుడిది, సింగపుమోకది, ఆవుమోముది, పందిమోముది మొదలగు రక్కసులఁ జూచి, "యోకాంతలారా! మీరందఱు గూడు కొని, ఈ సీతమనస్సున కిష్టములైన పనులు చేసియు, ఇష్టములుగాని పనులుచేసియు, మంచిమాటలచే బుజ్జగించియు, సొమ్ములిచ్చెదమని చెప్పియు, రామునియెడ విరోధముఁ బుట్టించియు, కడపటఁ గొట్టియుఁ దిట్టియు నీసీత నాకు లోఁగునట్లు చేయవలయును" అని వారి కానతిచ్చి, కామక్రోధములచే నొడలుదెలియనివాఁడై సీతాదేవిని బెదరించెను.

అంతట ధాన్యమాలినియను నొకరాక్షసి వేగిరమేగుచ్చి, యా పడితలలవానిని గట్టిగాఁగౌఁగిలించికొని "మహారాజా! నాతోడ రమింపుము, నీవు రాక్షసేశుఁడవు. ఇది కాంతిలేనిది. పిఱికిది. మానిసి జాతియందుఁ బుట్టినది. దీనితో నీవు రమించిన, నీకేమిసుఖము గలు గును? మహారాజా! నీబాహుబలార్జితములైన దివ్యభోగముల ననుభవింప నిది నోఁచుకొనలేదు. బ్రహ్మదేవుఁడు దీని కా సుఖముల నొసఁగఁడయ్యె. కామములేనిదానిని గామించువాని శరీరమునకు మంటలు పుట్టును. తనపై వలపుగొన్న దానితోఁ గ్రీడించువాని కెక్కువ యానందము గలుగును" అని యావలి కీడ్చెను.

ఇవ్విధమున ధాన్యమాలిని రావణాసురుని చెయిపట్టి లాగఁగా, మేఘశ్యామలుఁడయిన రాక్షసేశ్వరుఁడగు రావణుఁ డట్టహాసము

చేయుచుఁ జివుక్కున వెనుకకుఁ దిరిగి, వెలుఁగుచున్న వేఁడివెలుఁగు వెలుఁగుంబోలు నెలుఁగుగల తనమందిరమునకుఁ బయనమాయెను. ఆరావణునితో వచ్చియున్న దేవగంధర్వకన్యలును, నాగకన్యలును ఆరావణునితోడ మఱలి యారావణుని గృహశ్రేష్ఠమునఁ బ్రవేశించిరి. రావణుఁడును పతివ్రతాధర్మమున నిలిచినదియును, ధైర్యము గల దియు, రావణునియొక్క యాకారమునుజూచియు, మాటలు వినియుఁ గడువణఁకుసదియు నైన యాసీతాదేవిని మున్ను చెప్పిన తెఱఁగున బెద రించి, కామముచే నొడలుమఱచినవాఁడై, దేదీప్యమానమైయున్న తననగరు సొచ్చినవాఁడాయెను.

23-వ స ర్గ ము

రాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుట

శత్రువుల నేఁపించువాఁడయిన రావణుఁ డిత్తెఱఁగున సీతా దేవితోఁబలికి, రాక్షసస్త్రీలతో నాదేవి వశమగునట్లు చేయుమని యాన తిచ్చి, తనపత్నియగు ధాన్యమాలిని లాగుటచే మఱలి తనయంతఃపుర భవనము చొఱఁగా, చూపఱకు దడపుట్టించునట్టి రాక్షసకాంతలందఱు సీతాదేవికడకుఁ బరువిడివచ్చి సీతచుట్టును గూర్చుండి, యొక్కొక కోప ముతోఁ గూడినవాక్కులై, కడుఁబరుసనిమాటలతో నాసీతాదేవి నెత్తి పొడువ నారంభించి, "ఓసీతా! పులస్త్యమహాముని వంశమునఁ బుట్టిన వాఁడును, పరమోత్తముఁడును, గొప్పమొనకాఁడును, పదితలలుగల వాఁడునైన రావణునికి భార్యయగుట నేల గొప్పగానెంచవు" అని యనిరి.

అంతట నేకజటయను నొకరాక్షసాంగన కోపముచే నెఱ్ఱనైన కన్నులుగలదై, పిడికిటి కడఁగునంత సన్ననినడుముగలదగు సీతాదేవిని బిలిచి, "ఓసీతా! నామాటవినుము. ఆఱుగురు ప్రజాపతులలో నాలవ ప్రజాపతి బ్రహ్మమానసపుత్రుఁడు. అతఁడు పులస్త్యుఁడని ప్రఖ్యాతినొందినవాఁడు. ఆతనికి మానసపుత్రుఁడొకఁడు పుట్టెను. అతఁడు గొప్పవెలుఁగుగలవాఁడు; మహర్షి; విశ్రవసుఁడని పేరువడసిన వాఁడు; బ్రహ్మదేవునితో సాటియగు కాంతిగలవాఁడు. ఓ విఱివికన్నుల దానా! శత్రురావణుఁడగు రావణుఁ డా విశ్రవసునితనయుఁడు.

రాక్షసులకు జేఁడు. అట్టి యా రావణేశునికి నీవు భార్యయగుటకుఁ దగినదానవు. ఓ చక్కనైన యన్నియంగములు గలదానా! నామాట యేలయంగీకరింపకున్నావు?" యని యడిగెను. ఆమాటలకు సీత బదులు చెప్పకుండెను.

అంత పిల్లికన్నులం బోలుకన్నులుగలదగు హరిజటయను రాక్షసి కోపముచేఁ గన్నులు గిరగిర త్రిప్పి, "ఓసీ సీతా! ముప్పదిమూఁడుకోట్ల దేవతలతోఁ గూడనెత్తివచ్చిన దేవేంద్రునిగెల్చినట్టి శూరుఁడగు రావణాసురునికి నీవు భార్యవగుటకుఁ దగినదానవు" అని చెప్పెను. దానికిని సీత బదులుచెప్పక మౌనముతో నుండెను.

అంతటఁ బ్రఘసయను నొకరాక్షసాంగన యప్పుడు సీతాదేవిని బెదరింపుచు "ఓ సీతా! మగఁటిమిచే మదించినవాఁడును, మొనగాఁడును, యుద్ధములందు శత్రువులకు వెఱచి మఱలనివాఁడును, చేవకాఁడును, మగఁటిమిగలవాఁడునునైన రావణునికిఁ బెండ్లామవగుట నీకుఁ జేఁదే? మహాబలుఁడగు రావణుఁడు కాంతలలోపల నిష్టురాలును, గౌరవముతోఁ జూడఁబడునదియునైన తనపట్టపు దేవియగు మందోదరిం బాసియు, నానావిధరత్నములతోఁ నలంకృతమును, వేయిమంది స్త్రీలతోఁ గూడినదియునైన యంతఃపురమును విడిచి నిన్నుఁ బొందుచున్నాఁడే. నీవేల యతనికి భార్యవగుటకు సమ్మతింపవు"? అని యడిగెను. ఆ మాటలకుఁ గూడ సీత బదులు సెప్పక ముందువలెనే యూఱకుండెను.

అంతట వికట యను మఱియొక రాక్షసి, "ఓసీతా! తొల్లి యుద్ధరంగమున ననేక పర్యాయములు దేవగంధర్వదానవులను గెల్చిన రావణుఁ డిప్పుడు నీచేరువకు వచ్చియున్నాఁడు. ఓ యధమురాలా! అన్నిటఁ గొఱంతలేని యమ్మహాత్ముఁడయిన రాక్షసేంద్రుఁడగు రావణునికి భార్యవగుట కేల యపేక్షింపవు?" అని యా సీతాదేవితో ననెను. దానికిని సీత మాఱు పలుకకుండెను.

అటుతర్వాత దుర్ముఖియను పేరుగల మఱియొక రక్కసి సీతం గూర్చి, "ఓ నిడివి క్రీగన్నులుగలదానా! ఏరావణునికి వెఱచి సూర్యుఁడెండగాయఁడో, గాలిదేవుఁడు వీవఁడో, యా రావణునిచేరువ నేలయుండవు? మఱియుఁ గల్పవృక్షము లెవ్వనికి వెఱచి పూవులవానఁ గురిపించినవో, ఓచక్కని కనుబొమలదానా! పర్వతములును మేఘము

లును గోరినప్పుడు జలమునొసఁగినవో యట్టి రాజాధిరా జయిన రాక్ష సాధిపుఁడగు రావణునికి భార్యవగుటకు నీవేల యిష్టపడవు? నేను నీకుఁ జెప్పినమంచిని చక్కఁగా గ్రహింపుము. చిఱునవ్వుమోముగలదానా! నామాటను వినుము. లేనిచో నీకు మరణము నిక్కము" అని చెప్పెను.

24-వ సర్గము

రాక్షసులు సీతను బెదరించుట

వికృతంపు మోరలుగలవారును, మోమోటము లేనివారునైన యారాక్షసకాంతలందఱు సీతాదేవిచుట్టు నిలుచుండి యాసీతంగూర్చి చెవుల కింపుగాని మాటలతో నిట్లనిరి:

"సర్వభూతమనోహరురాలవయిన యోసీతా! మేటిపాన్పుతోఁ గూడిన యంతఃపురమున నీ వుండనియ్యకొనకున్నావదేల? నీవు మనుష్య స్త్రీవిగనుక మానుషుఁడైన రామునికి భార్యయగుటను గొప్పగా నెంచుచున్నావు. రాముని యొద్దనుండి నీమనసును మఱలింపుము. నీ వెన్నటికిని రామునికిఁ బత్నివి గానేరవు. ముల్లోకములకలిమి ననుభవించు వాఁడును, రాక్షసులకుఁ బ్రభువునైన రావణుని భర్తనుగాఁబొంది, సుఖములకుఁ గొఱంతలేకుండ విహరింపుము. ఓచక్కనిదానా! నీవు మానిసివి గనుక రాజ్యము గోల్పోయి, పట్టాభిషేక కార్యసిద్ధినొందక, పందయై యడవికి వచ్చినట్టి మానిసియైన రాముఁనే కోరుచున్నావు. నీకుఁ గొంచెమైనఁ దెలివి లేదే" అని.

పద్మపత్రములంబోలు కన్నులుగలదైన సీతాదేవి యారాక్షసు లాడినమాటలు విని, కన్నులనుండి నీరు గార్చుచు నివ్విధంబునఁ బలికెను:

"ఓ కాంతలారా! మీరందఱు గలిసి పలికినమాట లోకవిరుద్ధముగ నున్నది. మఱియు మీమాట నామనస్సునకుఁ బ్రీతికరముగాఁ దోఁచుచున్నది. మనుష్యజాతియందుఁ బుట్టినకాంత రాక్షసజాతియందుఁ బుట్టినవానికిఁ బెండ్లామగుట తగదు. మీరందఱు గలిసి నన్ను ముక్కలు ముక్కలుగా నఱికి నమలుఁడు. అది సమ్మతమే. మీమాటను నేను వినను. నేను మీమాటప్రకారము చేయను. ఎవఁడు నా నాథుఁడో, అతఁడు వేదగాని, రాజ్యహీనుఁడుగాని అతఁడే నాకు గురువు.

సువర్చల సూర్యునియందును, భాగ్యశాలిని యగు శచీదేవి దేవేంద్రుని యందును, అరుంధతి వసిష్ఠుని యందును, రోహిణి చంద్రునియందును, లోపాముద్ర యగస్త్యునియందును, సుకన్య చ్యవనునియందును, సావిత్రి సత్యవంతునియందును, శ్రీమతి కపిలునియందును, మదయంతి సౌదాసునియందును, కేశిని సగరునియందును, భీమరాజుకూఁతురగు దమయంతి నలునియందును మిక్కిలి యనురాగము గలవారలై యున్నట్లు, నేనును ఎల్లప్పు డిక్ష్వాకువంశపురాజులలో శ్రేష్ఠుఁడయిన రామునియందే నిత్యము ప్రేమగలిగియుండుదానను" అని సీతాదేవి యారాక్షసకాంతలతోఁ జెప్పెను.

రావణునిచేఁ బురికొల్పఁబడిన రాక్షసస్త్రీలు సీతమాట విని యెక్కువ యాగ్రహముగలవారై, పరుసని మాటలతో నాసీతను బెదరింపఁ దొడఁగిరి. అప్పుడు హనుమంతుఁడు శింశుపావృక్షమున దాఁగినవాఁడై, కీమకమ యనక, సీతాదేవి నారాక్షసకాంతలు బెదరించు మాటలను వినుచుండెను. అప్పుడు రాక్షసాంగనలు కడుఁగనలినవారలై, భయముచే వణఁకుచుండు నాసీతాదేవి నన్నివైపుల ముట్టడించి, మెఱయుచుండెడి వ్రేలాడు పెదవులను గొఱుకుచు, గొడ్డళ్లను చేతఁ బట్టికొని, "యిది రాక్షస రాజగు రావణుని భర్తనుగాఁ బొందుటకుఁ దగినదికాదు" అని యనేకవిధముల నాసీతను బెదరించిరి. చక్కనిమోము గల యాసీత భీకరలయిన రాక్షసకాంత లట్లు బెదరించుచుండఁగా, తనంతటఁ బుట్టుచుండు కన్నీటిని దుడుచుకొనుచు శోకసాగరమున మునిఁగినదై, శింశుపావృక్షముకడకుఁ జేరి నిలుచుండెను. అప్పుడు రాక్షస కాంతలును సీతను నలువైపులఁ జుట్టుకొని, విన్నదనము మోమునఁ దోఁప, రామవియోగవ్యసనముచేఁ జిక్కినదై, నల్లనిబట్టకట్టికొనియుండు నాసీతను పలుతెఱఁగుల బెదరింప నారంభించిరి.

కోపముచే నెఱ్ఱనైన యాకారముగలదియు, వికృతరూపురాలును, లావుపొట్టగలదియు, చూపఱకు వెఱపుపుట్టించునదియునైన వినత యను నొకరాక్షసకాంత "ఓసీతా! నీ వింతపర్యంతము భర్తయందుఁ జూపిన స్నేహము చాలును. అన్నిసంగతులందును నెక్కువకుఁ బోవుట వ్యసనమునకుఁ గారణమే యగును. నీయెడ నేను మిక్కిలి సంతసించితిని. లోకమున మనుజు లాచరింపవలసినపనిని జేసితివి.

మైథిలీ, నీమేలు కోరి నేను జెప్పెడిమాటను సైతము గొంచెము వినుము. దేవేంద్రునివంటి రూపవిక్రమములుగలవాఁడును, నేర్పు కాఁడును, దానశీలుఁడును, అందఱిచేఁ జూడఁదగినవాఁడును, రాక్షసుల కందఱకు నధిపతియునైన రావణుని భర్తనుగా వరింపుము. మానుష జాతియందుఁ బుట్టినవాఁడగు పిఱికియయిన రాముని విడిచి, ఓ వైదేహీ! మేలిమిమైపూఁతపూసికొన్న దానవై, చక్కని సొమ్ములు దొడిగినదానవై, రావణునిఁ జేరుము. ఇది మొదలు సకలలోకములకెల్ల రాణి వగుము. ఓ సుందరాంగీ! స్వాహా యగ్నికిని శచి దేవేంద్రునకుం బోలె నీవును ఆరావణునికిఁ బ్రీతిగావించుదానవుగా నుండుము. నిరాయుష్కుఁడును, పిఱికియునైన యారామునితో నీకేమి కావలసినది యున్నది? ఓసీతా! నీవు నామాటప్రకారము చేయవేని, నిన్నిప్పుడే మేమందఱము గూడి తిందుము" అని సీతతోఁ జెప్పెను.

అటుతర్వాత వ్రేలుకుచములు గలదగు వికటయను మఱొక్క రాక్షసి కోపముతో సీతాదేవినిఁ బొడుచుదానివలె పిడికిలి సై కెత్తి పట్టి యొప్పుచు, "ఓ బుద్ధిలేనిదానా! ఇష్టములుగాని పలుకు లెన్నియైన నీవు చెప్పినను, వానినన్నింటిని నీపై దయవలనను, నీసౌకుమార్యము వలనను నోర్చియుంటిమి. సమయానురూపముగాఁ జెప్పిన మాహిత వాక్యమును వినకున్నావు. ఇతరులకుఁ బొందశక్యముగాని సముద్రము యొక్క యీవలిగట్టును బొంటితివి. భీకరమయిన రావణునియంతి పురమునకుఁ దేఁబడితివి. రావణాసురనిగ్రహమున నుంపఁబడి, మాచేఁ గాపాడఁబడుచుండు నిన్నుఁ గొనిపోవుటకు సాక్షాత్తుగా దేవేంద్రుఁడైనను జాలఁడు. నీకు మేలగు నామాట వినుము. నీవు కన్నీరుపెట్టుకొనవద్దు. పనికిమాలిన యీవ్యసనము మానుము. ప్రేమను ఆనందమును బొందుము. ఎడతెగని దీనతను విడువుము. ఓసీతా! రాక్షసేంద్రునితో యథేష్టముగా విహరింపుము. ఓసీ పిఱికిదానా! స్త్రీలకు యౌవనము తిరము గానిదని నీకుఁ దెలియునుగదా! నీప్రాయము గడచునంతలోపల సుఖము నొందుము. కైపుచే నెఱ్ఱనైన కన్నులు గలదానా! రాక్షసరాజుతోఁగూడి, మనోహరములగు ఉద్యానవనము లందును పర్వతములందును విహరింపుము. ఓసీ చక్కనిదానా! నీవశమున నేడువేలమంది పనికత్తె లుందురు. రాక్షసులకెల్ల భర్తయైన

రావణుని భర్తనుగాఁ గోరుము. ఓ మైథిలీ! నామాటప్రకారము నీవు చేయవేని, నీగుండెను జీల్చి తిందును" అని సీతను బెదరించెను.

అంతటఁ జండోదరియను నొక్కరాక్షసి కోపముచే నొడలు దెలియనిదై, గొప్పమొనవాలుం ద్రిప్పుచు, తనతోడి రక్కసులనుజూచి, "ఓ యమ్మలారా! లేఁడివలె నదరుకన్నులు గలదియు, వెఱపుచేఁ గడు వణఁకుచున్న స్తనములు గలదియునైన యీసీతను మనతేఁడు తెచ్చినప్పుడే, దీనిగుండెలును, ప్లీహమును, ఉత్పీడమును, నాడులతోఁ గూడిన గుండెకాయను, ప్రేగులను, తలను దినవలె నని నాకు కోరిక పుట్టినవి. ఇప్పుడు వానిని దిందమని యెంచెదను" అని చెప్పెను.

అటుతర్వాతఁ బ్రఘసయను నొకరాక్షసి, తనతోడి రాక్షస కాంతలనుజూచి, "చెలులారా! యేల తామసించెదరు. ఈక్రూర రాలిమెడను నులిమి వేయుఁడు. పిమ్మట రాజుతో ఆమానుషస్త్రీ మృత యయ్యె నని తెలుపుఁడు. దానికి రావణుఁడు "మీరు తినుఁ" డని చెప్పినుగాని, మనల నేమియు ననఁడు. దీనికేమియు సందేహము లేదు" అని చెప్పెను.

అంత అజాముఖియను మఱియొకరాక్షసి "యక్కలారా! దీనిని జంపి సమములయిన మాంసపుతునుకలను జేయుఁడు. పిమ్మట మనమందఱము పంచుకొందము. వివాదమాడుట నాకు సమ్మతముగాదు. మద్యమును, నానావిధములగు పచ్చళ్లను వేగిరముగాఁ దెండు" అని చెప్పెను.

అంతట శూర్పణఖయను రాక్షసి తనచెలులంజూచి "యోయమ్మలారా! అజాముఖి చెప్పినదే యుక్తమని నాకుఁ దోఁచుచున్నది. సకల శ్రమలఁ బోఁగొట్టునట్టి మద్యమును దెండు. ఈసీతమాంసమును దిని, నికుంభిలయను శక్తిముందఱ నృత్యము సేయుదము" అని చెప్పెను.

ఘోరరూపలగు రాక్షసస్త్రీ లిత్తెఱఁగున బెదరింపఁగా, సీత ధైర్యమువిడిచి కంట నీరు గార్చెను.

25-వ సర్గము

సీత చింతించుట

ఆక్రూరలగు రాక్షసస్త్రీలు మిగులఁ గర్ణకఠోరము లయిన మాటలతో నాసీతాదేవిని బెదరింపఁగా, జానకి పలవించి, వారట్లు

పలుకుచున్నను పతివ్రతాధర్మము నడపుటయందు విడువని పట్టుదల గలదిగావునఁ గడగడవడఁకుచున్నను, కన్నులు నీటితో నిండగా డగ్గుత్తికతో వారిని జూచి నిట్లనెను.

"ఓ రక్కసులారా! రాక్షసజాతియందుఁ బుట్టినవానికి మానవ జాతియందుఁ బుట్టినది భార్య యగుట పొసఁగదు. మీరందఱు నన్ను నమిలివేయుఁడు. సమ్మతమేకాని మీ మాటచొప్పున నే నెన్నఁటికిని చేయను" అని సీత రాక్షసకాంతలతోఁ జెప్పెను.

అప్సరసంబోలునట్టి సీత యారావణునిచే బెదరింపఁబడి, రాముని యెడఁబాటువలని వ్యసనముచే దుఃఖించుచు, రాక్షసుల మధ్యమున నుండి సుఖము లేనిదైయుండెను.

మఱియు నాసీతాదేవి తనదేహమును జొచ్చుదానివలెఁ గడు నడఁకువతోఁ గూడినదై, వనమునఁ దనగుంపునుండి తప్పించుకొని తోడ్వేళ్లనడుమఁ జిక్కి యల్లాడుచుండు నాఁడుజింకవలెఁ గడు వణఁకెను.

మనసు విఱిగినదైన యాసీతాదేవి పుష్పించిన యశోకవృక్షము యొక్క గొప్పకొమ్మ నొక్కదానిని బట్టికొని దుఃఖముతో రామునిఁ దలఁచి చింతించుచుండెను.

ఆసీత యాప్రకారము కన్నీరువిడిచి, యాకన్నీటిచేఁ దనవిఱివి గలకుచములను దడపుచు, రామునింగూర్చి వ్యసనపడుచు, దుఃఖమున కంతము గానదయ్యెను.

ఆసీత రాక్షసభీతిచే వణఁకుచు, పెనుగాలివీచినప్పు డరటి వ్రాను గ్రిందఁబడినట్లు క్రిందఁబడినదై, రాక్షసులభయముచే వణఁకుచు మోమునఁ గళదప్పినదయ్యెను.

అట్లు వణఁకుచుండు సీతాదేవియొక్క నిడుపు వెడల్పునుం గల దగు జడ గదలుచుఁ బ్రాఁకుచున్న పాముమాడ్కిఁ గనఁబడెను.

ఆసీత వెతలఁ గుందినదై, శోకముచే మనమున నేమియుఁ దెలియనిదై, నిట్టూర్పు విడుచుచుఁ గన్నీరువిడిచి "అక్కటా! రామా! హాలక్ష్మణా! హా! యత్తగారా కౌసల్యా! హాసుమిత్రా!" యని విలపించెను.

"స్త్రీకిఁగాని, పురుషునికిఁగాని మృత్యువు అకాలమున రాదు" అని పెద్దలు చెప్పుకొనుట వాస్తవము. కావుననే క్రూరలైన రాక్షస స్త్రీలచే నిక్కడ నిట్లెఱఁగునఁ బీడితనై, రామునిఁ దలచి దుఃఖము నొందినదాననై, క్షణమైనను జీవించియున్నాను. ఈ నేను పాపాత్మ రాలను, నిర్భాగ్యురాలను, సముద్రమునడుమ గాలిచేఁ గొట్టఁబడిన పడవ నీట మునిఁగిపోవునట్లు నశించెను. ప్రసిద్ధుఁడైన నాపెనిమిటిని గాంచక, రాక్షసులవశమునఁ జిక్కినదాననై, నీటిచేఁ గోయఁబడిన గట్టు వలెఁ జింతతోడఁగూడి గృశించుచున్నాను. కమలపత్రనేత్రుఁడును, సింహమువలె గంభీరముగా నడచువాఁడును, నెనరుగలవాఁడును, ప్రియవాక్యములు చెప్పువాఁడునైన నానాథుని భాగ్యవంతులగువారు దర్శింతురుగాని, నిర్భాగ్యురాలైన నాబోటి కామహాత్ముని దర్శనమబ్బునే? ఎల్లవిధముల ధీరుఁడైన రాము నెడఁబాసియున్న నాజీవితము విషము గ్రోలినదాని జీవితమువలె దుర్లభమగును. నేను జన్మాంతరమున నెట్టి పాపము గావించితినో, దానికి ఫలముగా నే నీ జన్మమునఁ గడునోర్వరాని క్రూరదుఃఖమును బొందుచున్నాను. ఈ యపారశోకముతో నుండఁజాలను. గనుకఁ బ్రాణములఁ దొఱఁగఁ గోరెదను. ఈరాక్షస స్త్రీలనడుమ నుండువఱకు నా కాకారామునిదర్శనమబ్బదు. "ఛీ! యీ మానిసిజన్మ మేల! ఛీ! ఈ పరవశమైన శరీరమేల! ఈపరవశమైన శరీరమును స్వేచ్ఛప్రకారము విడుచుటకు వీలుగాదుగదా" అని సీత తనలోఁ దానిట్లు చింతించిన దాయెను.

26-వ సర్గము

సీత చింతించుట

జనకరాజపుత్రి కన్నులనిండ నీరుగ్రమ్మియుండ నివ్విధమున ననుకొన్నదై, అలసట తీరుటకై పుడమిని బొఱలింపఁబడిన గుఱ్ఱపుఁబిల్ల వలెను, వెఱ్ఱిదానికైవడియు, మత్తుగొనిన దానికైవడియు, భ్రమచెందిన దానికైవడియు దుఃఖముచేఁ బొఱలుచుఁ దల వంచుకొని యిట్లెఱఁగునఁ బలవింపఁదొడఁగెను.

"నానాథుఁ డేమఱియుండఁగా, రావణుఁడు కామరూపముతో వచ్చి నన్ను మోసపుచ్చి, మెఱ్ఱోయని యఱచుచుండఁగా, బలా

త్కారముగాఁదెచ్చి, యీ రాక్షసకాంతలవశము చేసెను. వీరు నన్నన రాని మాటలుచెప్పి పలుతెఱఁగుల బెదరించిరి. వీరిమాటలవలన నామనస్సు పుండయియున్నది. ఈవిధమునఁ గడగం డ్లనుభవించుచుఁ బ్రాణములతో నుండుటకు నాకు సమ్మతి లేక యున్నది. మహారథుఁడయిన రామునిఁబాసి, యీరక్కసులనడుమ నుండవలసినచో, ద్రవ్యము లక్కఱలేదు. ఈనాహృదయమింత వెతనొందినను బగుల కుండుట చూడఁగా, నిది యుక్కుతోఁ జేయఁబడినదిగానైనను, జరా మరణములు లేనిదిగానైన నుండును గాఁబోలును! కష్టజీవినైన నే నట్టి ప్రాణనాథునిఁబాసి ముహూర్తమైనను ప్రాణమును గాపాడుచున్నానే. ఇట్టి చెడ్డదానను, నీచురాలనునైన నేను బ్రతికియున్నానే. ఛీ! ఛీ! యీనాబ్రదుకేల? నాలుగు సముద్రములవఱకుండు భూమికి నాథుఁడును, నాతో నెయ్యపుఁబలుకులు పలుకువాఁడునైన యాప్రియు నెడఁబాసినపిమ్మట నా కీప్రాణములందేని, సౌఖ్యములందేని పరామరిక యేల? వీరు నన్నుఁ జీల్పనీ, తిననీ, నాకేమి? నేనేమో ప్రాణములఁ బాసెదను. ప్రియునిఁబాసి, నేను చాలకాలము బ్రతికియుండఁజాలను. ఈరేబ్రిమ్మటఁడగు రావణుని నాయెడమకాలితో నైనను దాఁకను. అనఁగా నిఁక నితనింగోరుట యనునది కలలోని మాటయె.

రావణుఁడు నాతిరస్కారమునుగాని, తన్నుఁగాని, తనకుల మహిమమునుగాని యెఱుఁగకున్నాఁడు. కావుననే యితఁడు క్రూరుఁడై, నన్నుఁగోరుచున్నాఁడు. ఓకాంతలారా! మీరు నన్నుఁగోసినను, చీల్చినను, గాల్చినను, నిప్పులో మంట పెట్టినను నేను రావణునిఁ గోరను. మీరేల యూరక నోరు నొచ్చునట్లుగా మొత్తుకొనెదరు?

రాముఁడు దోషవంతులందు గుణమును గనిపెట్టువాఁడు. కీర్తి మంతుఁడు. నెనరుగలవాఁడు. ఎంతమాత్ర ముపకారముచేసినవారి యందును దయఁ జూపువాఁడు. పరోపకారమే ముఖ్యముగాఁ గల వాఁడు. ఇట్టి యారామునిఁడును నా కారానికాలమునకు దయమాలిన వాఁడయ్యెఁ గాఁబోలును. అట్లు కాకున్న, జనస్థానమునఁ బదునాలుగు వేవురు రక్కసుల్ నొక్కబాణముతోఁ దెగఁగొట్టిన యారాఘవుఁడు నన్నేల విచారింపరాఁడు?

మగటిమిలేని యీరావణుండు నన్నిచ్చట నిరోధించియున్నాఁడు. నానాథుఁ డీరావణు ననిమెనయందుఁ బొరిగొనఁ జాలినవాఁడు; దండ కారణ్యమున రాక్షసశ్రేష్ఠుఁడయిన విరాధునితోఁ బోరి యతనిం బరి మార్చినవాఁడు. అట్టి శూరుఁడయిన నాప్రియుఁడేల నన్నుఁ గనుఁగొన రాఁడు? "నానాథుఁడగు రాఘవుఁడు సమర్థుఁడుగానే యుండని. ఈ లంకాపురము సముద్రమధ్యమున నున్నదిగావున దీనింజొచ్చుట వీలు కాదు" అని యందమనిన, రాఘవునిబాణము గమనము నడ్డగించునట్టిదేది యును లేనేలేదు. మఱియేల శూరుఁడైన రాఘవుఁడు నన్నుఁ దోడ్కొని పోకుండవచ్చుచనిన, నన్ను రాక్షసుఁ డపహరించెనుగాన ననొల్లక యున్నాఁడేమో? లేక లక్ష్మణుని యన్నయగు నానాథునికి నేనిచ్చట నుండు సంగతి తెలియదేమో? అట్లు తెలిసియుండిన పక్షమునఁ బ్రతాప వంతుఁడు గావున శత్రువులొనర్చు నవమానము నోర్చియుండునా? నన్ను రావణుఁ డెత్తుకొనిపోవెనని యారామభూవిభుని కెవ్వఁడు తెలియఁజేయును? ఆగృధ్రరాజగు జటాయువు తెల్పఁడా యనిన, ఈ పాపాత్ముఁడయిన రావణుఁ డతనిని యుద్ధరంగమునఁ గూల్చెను.

ఆ జటాయువు తాను ముసలివాఁడయినను నన్నుఁ గాపాడఁగోరి, యారావణునితో ద్వంద్వయుద్ధముచేసి, కడుగొప్పపనిని జేసెను. రఘు వంశోద్భవుఁడయిన మన్నాథునికి నేనీరాక్షసపురియందున్న సంగతి తెలిసె నేని, ఇప్పుడే యతఁడీ లోకమున రాక్షసులపేరే లేకుండఁజేయును, లంకాపురమును ధ్వంసముచేయును; మహాసముద్రము నింకింపఁజేయును; రావణునిపేరు ప్రతిష్ఠలను బడఁగొట్టును. అట్లు మన్నాథుఁ డీలంకా పురమునందలి రాక్షసులను నుఱుమఁగా వారికాంతలందఱు ఇంటింటను నేనిప్పుడెట్లు విలపించుచున్నానో, అట్లు విలపింపఁగలరు. ఇది నిక్కము. రాముఁడు లక్ష్మణసమేతుఁడై వచ్చి లంకాపురమెల్ల వెదకి వెదకి రక్క సులను నాశము సేయఁగలఁడు. అతనికంటఁ బడినశత్రువు తప్పించుకొని పోఁజాలఁడు, క్షణకాలమైనను జీవించియుండఁడు.

ఈలంకాపురమునందలి తెరువులందు వేగమే వల్లకాటిచిచ్చు పొగ గ్రమ్ముకొనఁగలదు; గ్రద్ద లెల్లయెడల నిండికొనఁగలవు. త్వర లోనే యీలంకాపురము వల్లకాటితో సాటికాఁగలదు. త్వరలోనే నాకోరిక నెఱవేఱఁగలదు. ఈదురాచారము మీకందఱకుఁ జేటు

కాలము వాటిల్లెడునని తెల్పుచున్నది. ఈలంకాపురమునఁ గలుగు దుశ్శకునములఁ దలఁప నీపురమునకు త్వరలోనే కళమాసి పోఁగలదని తోఁచెడి. పాపాత్ముఁడయిన రాక్షసాధముఁడగు రావణుఁడు మృతినొంది నచో నీశత్రుసాధ్యముకాని లంకాపురము పెనిమిటినిఁ బోఁగొట్టు కొన్నజవ్వనికై వడిఁ గాంతిచెడినది కాఁగలదు. ఈలంకాపురి భర్తను బోఁగొట్టుకొని, రాక్షసాంగనలతోఁగూడి పెనిమిటిం బోఁగొట్టుకొని, యలంకారములేనిదై యున్న యంగనవలెఁ బుణ్యోత్సవములు లేనిదై యుండఁగలదు.

ఈరాక్షస స్త్రీలందఱు తమమగలం బోఁగొట్టుకొని వెతలఁగుందిన వారలై యింటింటను జేయు రోదనధ్వనులను నేను వేగిరమే వినఁగలను.

కోపముచే ఎట్టినిక్రీఁగన్నుగల యా శూరుఁడగు రాముఁడు నన్ను రావణునింట నున్నదాననుగా నెఱుఁగునేని, ఆతత్క్షణమేవచ్చి యామన్నాయకుఁ డేయుబాణముల కీలంకాపురము భస్మమై, రాక్షస వీరులందఱు చచ్చుటచేఁ జీకటితోఁగూడినదై, కాంతిఁ బాసినదై యుండఁగలదు.

అట్లయినచో నీకు దిగులేలయనిన, క్రూరుఁడును, నీచుఁడునునైన యీరావణుఁడు పెట్టినగడువు ముగింపునకు వచ్చినది. ఈరాక్షసులు పాపముచేయువారు. వీరికిది చేయరానిపని యనియు, ఇది చేయఁదగిన పనియనియులేదు. వీరియన్యాయము వలన నిప్పుడ నావధరూపమైన గొప్పయుపద్రవము సంభవింపఁగలదు. రక్తాంతనేత్రుఁడయిన ప్రియ దర్శనుని రామునిఁబాసి, కడువగతో నేనేమిచేయఁగలను? ఎవ్వఁడైన నాకు విసమునొసఁగువాఁ డిచ్చట నుండెనేని, ఆయమునిఁ జూడఁగలను. పతిని బాసి నేనిచ్చట నుండను. లక్ష్మణుఁడును అతనియన్న రాముఁడును నన్నిచ్చటఁ బ్రాణములతోనున్నదానిఁగా నెఱుఁగకున్నారేమో? వారికి నే నిచ్చట నున్న సంగతి దెలిసిన, వారు నాకై వెదకకుందురనుట లేదు.

శూరుఁడైన లక్ష్మణాగ్రజుఁడగు రామభూపాలుఁడు నావియోగ శోకముచే భూతలమున దేహము విడిచి, యిటనుండి దేవలోకమునకుఁ బోయియుండును. ఆదేవలోకమునఁ గమలనేత్రుఁడైన నానాథుని దర్శనము చేసికొను దేవగంధర్వ సిద్ధ మహామునులందఱు భాగ్య

వంతులని తలఁచెదను. ఆతనితో నుండు భాగ్యము నాకు లేక పోయెఁ గదా. నేనెంత భాగ్యహీనురాలను. జ్ఞానియు, ధర్మసంపాదనమునందుఁ గోరికగలవాఁడును, రాజర్షియునైన యా పరమోత్తమస్వరూపుఁడగు రాఘవునికి భార్యనైన నాతో నేమి యుపయోగము? నరులకుఁ గనఁ బడువారిమీఁదనే ప్రేమయుండునుగాని యెదుట లేనివారిమీఁదఁ బ్రేమ యుండదు. అయినను, ఇది కృతఘ్నులగువారిధర్మము. అంతియకాని, ఆరామభూవిభునికి నాపై నెన్నఁటికిని ఆశ లేకపోవదు. ఇట్లారాముఁడు నన్నుఁ దలఁపకుండుట నాజన్మాంతరపాపఫలమో లేక నాదురదృష్టమో యయి యుండవలెను. లేనిచో, లోకోత్తరుండయిన యారామునిఁ బాసి యిట్లు దుఃఖముల ననుభవింపవలసిన గతి నా కేల కలుగును? మంచి నడవడిగలవాఁడు, శూరుఁడు, శత్రుసంహారి, మహోత్సుఁడు నయిన రామునిఁ బాసి జీవించియుండుటకంటె ప్రాణములువిడుచుట మేలు.

అట్లు కాకపోయిన, నరోత్తములగు నాయన్నదమ్ము లిరువురు శస్త్రములు విడిచి కందమూలఫలములను దినుచు నడవులఁ దిరుగుచు నున్నారు గాఁబోలు! అటుకాదేని, చెడుతలంపుగల రాక్షసాధిపుఁడగు రావణుఁడు శూరులయిన యా సోదరులను మోసముతోఁ జంపెనేమో!

కావున నే నిప్పుడన్ని తెఱఁగులఁ బ్రాణములఁ దొఱఁగుదు ననిన, ఇంత దుఃఖమున నున్నను నాకు మృత్యువు రాకయున్నది. ఇష్టవస్తువనిన దుఃఖము గలుగదు. అనిష్టవస్తువనిన నెక్కువభయము గలుగును. ఆరెండు నెవ్వరికి లేవో యట్టిమహోత్సులకు నేఁ జేయెత్తి మ్రొక్కెదను. మౌనులును పాపకార్యములను విసర్జించినవారును, జితేంద్రియులును, మహోతపోమహిమగలవారునై సుఖదుఃఖములందు రెంటియందును సమానులైయున్న మునులు ధన్యులు. ఆత్మజ్ఞానము గలవాఁడును, ప్రియముపలుకఁదగినవాఁడునైన యారామునిఁబాసి, పాపాత్ముఁడైన రావణునిచేతఁ జిక్కి ప్రాణములతో నుండఁజాలను" అని సీత యారాక్షసకాంతలతోఁ జెప్పిన దాయెను.

27-వ సర్గము

త్రిజట తనస్వప్నవృత్తాంతము చెప్పుట

సీత యిట్లు పలుకఁగా, కడునాగ్రహము నొందినవారలైన, ఘోరరూపలగు రాక్షసస్త్రీలు కొందఱాసంగతి రావణునకుఁ దెలుప

మిక్కిలిత్వరగా మటికొంద లాసీతను జుట్టుకొని, యనర్థమే ఫల ముగాఁ గలిగిన యొకటే యభిప్రాయముగల యొకమాటను మఱలఁ దలఁచికొని, "ఓ చెడ్డదానా! క్రూరచింతన గలదానా! పాపపు నడత గలదానా! యిప్పుడే మేమందఱము కూడి నీమాంసమును సంతస ముతోఁ దినివేయుదుము" అని యామెతోఁ బలికిరి.

నీచలగు రాక్షసాంగన లందఱు నివ్వితమున సీతాదేవిని బెద రించుట చూచి, యచ్చటఁ బరుండి నిద్రించుచుండిన త్రిజటయను వృద్ధ రాక్షసి యారాక్షస్త్రీలతో నిట్లనియె:

"ఓ నీచలారా! మీరు నన్నుఁ దినుఁడు. జనకమహారాజునకు ననుఁగుకూఁతురును, దశరథమహారాజునకుఁ గోడలునైన యాసీతా దేవిని దినకుఁడు. నేనిప్పు డొక కలగంటిని. ఆకల రాక్షసులకు వినాశ మును, ఈ సీతమగనికి మేలును దెలుపుచున్నది. తలఁచినమాత్రమున నాకల మేనికి గగుర్పాటును, మనస్సునకు భీతిని గలిగించుచున్నది."

ఇట్లు త్రిజట పలుకఁగ, రాక్షసకాంత లత్యుగ్రకోపముగల వారలై, యందఱును వెఱపుతోఁగూడి యాత్రిజటంగూర్చి "ఓసీ! నీవు రాత్రి యెట్టి కల గంటివి? చెప్పుము" అని యడుగఁగా, రాక్షసుల నోటినుండి వచ్చినమాటను విని, యాపె రాత్రిఁ దాఁ గన్న కలయొక్క వాస్తవము నెఱిఁగింపఁ దొడఁగెను:

"దంతముతోఁ జేయఁబడినదియు, ఆకాశమునఁ బోవునదియు, పేయి రాయంచలు గట్టినదియు నైన విమానము నెక్కినవాఁడై, రాముఁడు తెల్లనిదువ్వలువఁదాల్చి లక్ష్మణసమేతుఁడై వచ్చినట్లును, జానకి తెల్లనివస్త్రముగట్టినదై, సముద్రపరివేష్టితమైయున్న తెల్లకొండ నెక్కి, యచ్చటనే సూర్యునితో వెలుఁగు చేరినట్లు రాముని తోఁ జేరి నటును నేను కలగంటిని. మఱియు రాముఁడు నాలుగుదంతములుగల పర్వతముంబోలు గొప్పయేనుఁగు నెక్కి లక్ష్మణునితోఁగూడఁ దిరుగు చుండఁగా నేను జూచితిని. తర్వాత నరశ్రేష్ఠులగు రామలక్ష్మణులు తమదీప్తిచే వెలుఁగుచుఁ దెల్లని పుట్టంబులు గట్టినవారలై తెల్లనిపూవుల దండలను శిరసునఁ దాల్చి సీత నెదురొక్కని వచ్చినట్లు చూచితిని. తరు వాత నాపర్వతము కొనయందు రాముఁడు గూర్చున్న యేనుఁ గాకసం భున నుండఁగా, సీత దానిమీఁద నెక్కినట్లుగాఁ గంటిని. పిదపఁ గమల

లోచనయగు సీత పెనిమిటితొడమీఁద నుండి యెగిరి, సూర్యచంద్రులను జేతితోఁ దుడుచుచున్నట్లు, అటుపిమ్మట నా విఱివిఱిక న్నులదగు సీతయు, ఆయిద్దఱు రాజపుత్రులును నెక్కిన మహాగజము లంకాపురము పైభాగమున నున్నట్లును, తర్వాత రామునిఁ డెనిమిది తెల్లనియెద్దులుగట్టిన రథము మీఁదఁగూర్చుండి యిచ్చటనుండి తఱలినట్లును, తరువాత మగఁటిమిగల పురుషోత్తముఁడగు రాముఁడు తమ్ముఁడగు లక్ష్మణునితోను, సీతతోను సూర్యనిమాడ్కిఁ దేజరిల్లు దివ్యపుష్పకవిమాన మెక్కి యుత్తరదిశకుఁ బోయినట్లును కలగంటిని. స్వర్గమును బాపాత్ము లెట్లు లోఁబఱచుకొనఁజాలరో, అట్లు గొప్పశూరుఁడగు రాముని సురాసురులు గాని, రాక్షసులుగాని, తక్కినవా రెవరుగాని జయింపఁజాలరు. అట్లు సీతారామలక్ష్మణులంగూర్చి కలగంటిని.

ఇఁక రావణుఁడు నూనెలో మునిఁగి, యెఱ్ఱనిబట్టగట్టికొని, గన్నేరుపూలదండనుదాల్చి, మద్యముద్రావి, మదించి, నేలఁ బొఱలునట్లును, మఱియొకతూరి, బోడియై నల్లనిబట్టను గట్టుకొని యొకస్త్రీచే నీడ్వఁబడి పుష్పకవిమానమునుండి యిప్పుడె క్రిందఁబడినట్లును, మఱియు నింద్రియస్వాస్థ్యము లేనివాఁడై, నవ్వుచుఁ జిందులు ద్రొక్కుచు ఖరములు పూన్చినరథమునఁ గూర్చుండి దక్షిణంపుదెసంగూర్చి పోయినట్లును, మఱియు నాగర్భభమువీఁదనుండి భయముచేఁ దలక్రిందుగాఁ బడినట్లును, మఱల నారావణుఁడు వెంటనే లేచి, తత్తరపాటుతో దిగులొంది, గర్వ ముడిగి, వెఱ్ఱివానికైవడి బట్టవిచ్చివేసి, చెడ్డమాటలను విస్తారముగా మాటాడుచు నోర్వరానంత దుర్గంధముతోఁగూడి, నరకమునుబోలి, మలములనెడి యడుసుతో నిండియున్న చీఁకటిం జొచ్చి, యచ్చట మునిఁగినట్లును, అప్పుడే యెఱ్ఱనిబట్టగట్టి దేహమంతయు బురద పూసికొనిన యొకనల్లని జవరాలు ఆరావణునిమెడలోఁ జెయి వేసికొని, దక్షిణదిశ కీడ్చుచున్నట్లును స్వప్నము గంటిని. ఇవ్విధమునఁనే కుంభకర్ణుఁడును, రావణునికొడుకులందఱును నూనెలో మునిఁగినట్లుగాఁ గలలోఁ జూచితిని. రావణుఁడు పందిమీఁదను, ఇంద్రజిత్తు శింశుమారము మీఁదను, కుంభకర్ణుఁ డొంటెమీఁదను నెక్కి దక్షిణదిశకుఁ బోవుచుండఁ గంటిని.

వారిలో విభీషణుఁడుమాత్రము తెల్లనిబట్టలుగట్టి, తెల్లని పూవులుదాల్చి, తెల్లని గంధములఁదికొని, తెల్లనిగొడుగు పట్టుకొని, శంఖములు పూరింపఁబడుచుండ, దుందుభివాద్యములమ్రోఁతలు చెలరేఁగుచుండ, నట్టువకాండ్రు నాట్యములు సలుప, పాటకులు పాటలు పాడఁ, బర్వతముఁ బోలినదై, ఉఱుమువంటిబృంహితముగలదై, నాలుగు దంతములు గలిగియున్న గజేంద్రము నెక్కి నలుగురు మంత్రులతో యాకాశమునఁ దిరుగుచుండినట్లు, అతనితోఁగూడ నెఱ్ఱనిపూలదండలు దాల్చి, యెఱ్ఱని బట్టలుగట్టుకొన్న కొందఱు రాక్షసులు మత్తులయి యాడుచుఁ బాడుచుఁ బోవుచున్నట్లును స్వప్నమునఁ జూచితిని.

ఈరమ్యమైన లంకాపురము గోపురతోరణములు విఱిగి గుట్టలు ములు ఏనుఁగులు, తేరులతోఁగూడ సముద్రమునఁ బడఁగాఁ జూచితిని. రావణపాలితమైన యీలంకాపురమును రామునిదూతయైన బలవంతుఁడగు నొక్కవానరుఁడు కాల్చివేసినట్లు స్వప్నము గంటిని. అట్లు కాలి బూదిచే నెగుడుదిగుడైయున్న యాలంకాపురమునందు రాక్షస స్త్రీలందఱు తైలముద్రాగి, చిందులుద్రొక్కుచుఁ గేకలిడుచు నవ్వుచుఁ బ్రవేశించిరి. కుంభకర్ణుఁడు మొదలగు మనరాక్షసవీరులందఱు కావి బట్టలఁ గట్టుకొని, వేడగుంటలోఁ బడినట్లు కలగంటిని.

ఓరాక్షసకాంతలారా! దూరముగా వెళ్లుఁడు. లేనిచో మీరు నశింతురు. రాఘవుఁడు వేగమె సీతను బొందఁగలఁడు. ఆ రాముఁ డత్యుగ్రకోపుఁడు. ఆతఁ డలిఁగెనేని, సర్వరాక్షససమేతముగా నీలంకాపురమును ధ్వంసము చేయఁగలఁడు. సీత రాఘవునకుఁ బ్రియురాలు. ఆతనిమన్నన వడసినది. వనవాసమునిమిత్తము భర్తను వెంబడించి వచ్చినది. ఆపెను మీరు బలిమించినను బెదరించినను రాముఁడు మన్నించువాఁడు గాఁడు. కాఁబట్టి మీరాకఠినవాక్యములు చాలింపుఁడు. మంచితనము నవలంబించి మంచిమాటలనాడుఁడు. సీతను మనతప్పిదముల మన్నింపవేఁడుఁడము. ఇదే నాకు మంచిదిగాఁ దోఁచెడి.

దుఃఖపీడితయైన యే సీతవిషయమై యిట్టికలగంటినో, యా సీత సకలదుఃఖములనుండి తొలఁగినదై యొక్కవసౌఖ్యము లనుభవింపఁ గలదు. రాక్షసులకు రాముని వలన భయంకరమైన యాపద సంభవించినది. మీ రొక్కవేళ నామెను మొదట ధిక్కరించియున్నను

యాచింపుఁడు. పెక్కుమాటలేల ? ఆమిథిలాధిపునిపుత్రికయగు సీతను వేఁడుకొన్న, నామె ప్రసన్న రాలగును. రాక్షసాంగనలారా ! మీరీ సీతాదేవిని మహాభయముఁజిపి కాపాడుట మంచిది. నాస్వప్నవృత్తాంతమే కాక యీసీతయంగములతీరు చూడనండేమియు వైపరీత్యము గాన రాదు. ఒక్కకాంతి వికలమయియుండుటమాత్రము కానవచ్చుచున్నది. కావునసే దుఃఖముల ననుభవింపఁదగనిదియు దివ్యభోగము లనుభవింపఁదగినదియునైన యీ దేవి కీ దుఃఖము సంప్రాప్తమాయెనని తెలుపుచున్నది. మఱియు నేను వైదేహికిఁ గార్యసిద్ధిని, రావణవినాశమును, రాఘవవిజయమును సమీపించినదని తలఁచెదను. ఈమెకుఁగలుగు గొప్పమేలు నాలకింప నెన్నియో కారణములు గన్పట్టుచున్నవి. తామర రేకుమాడ్కి విరివికన్నులదగు నీజాణయైన సీత యొక్క యెడమ కన్నదరుచున్నది. ఈమె యెడమబుజ మున్నట్టులుండి పులకితమయి యదరుచున్నది. ఏనుఁగుతొండమువంబోలు నీసీతయొక్క యెడమతొడ నిష్కారణముగా నదురుచు రాముఁడెదుట నిలిచియున్నట్లు దెలుపుచున్నది. పక్షియుఁ గొమ్మయందలి గూటిలోఁ బ్రవేశించి, మాటిమాటికి మేటిశుభము గలుగఁ గలదని చెప్పుచు, ఎక్కువశుభకరమగు వార్త రాఁగలదని తెల్పుచు ముదముతో మాటిమాటికి సీతాదేవిని ప్రేరణ చేయుచున్నదో యన్నట్టులున్నది" అని త్రిజట తనస్వప్నవృత్తాంత మును రాక్షసస్త్రీలతోఁ జెప్పినదాయెను.

28-వ సర్గము

సీత చింతించుట

ఆ పిఱికిదియైన సీత రాక్షసస్త్రీలనడుమ నుండి, రావణునిచేఁ గడుఁ గఠినంపుమాటలచే రోయఁబడినదై, వనమధ్యమున సింగముచేతఁ జిక్కినయేనుఁగుగున్న మాడ్కి వణఁకినదై, వీరత్వమము సంభవించినప్పుడు పోషణచేయలేని తల్లిదండ్రులచే నిర్జనమయిన యరణ్యమధ్యమున విడిచిపెట్టఁబడిన పసిబాలికవలె నీక్రింది తెఱఁగునఁ బలవించెను.

లోకమున, వేళరానిది చావురాదని పెద్దలందరు. ఆహా యిది నిక్కము! అటుకాకున్నచో, పాపాత్మురాలైన నేనిట్లు ఈరాక్షసస్త్రీలు చెప్పెడి బెదరింపుమాటలను వినుచు నీపాడు బ్రదుకు బ్రదికియుందునా?

వజ్రాయుధపుదెబ్బ దగిలియుఁ బగులని పర్వతశిఖరము మాడ్కి, నాహృదయము సుఖములేని దయ్యాను, పెన్వగలతో నిండినదయ్యాను బ్రద్దలుగాక యున్నది గాన నిది యుక్కుతోఁ జేయఁబడినదని యెంచెదను. ఆత్మహత్య దోషముగదా యనిన, నాకిప్పుడాత్మహాననముచే దోషము పొసఁగదు. ఈచూడనింపుగొలుపని రావణుఁడు నన్నేట్లయినను వధింపఁ బోవుచున్నాఁడు. ఈపాపాత్ముని చేతఁ జిక్కి దుర్మరణము నొందుటకంటె నాత్మహత్య చేసికొనుటయే మేలని తోఁచెఁ. అట్టి దుర్మరణ మొందనేల? ఆరావణుని కనుకూలురాలనై యుండఁగూడదా యనిన, ద్విజుఁడు ద్విజుఁడుగానివానికి మంత్రము నుపదేశింపని లైఱుఁగున, నే నీ పాపాత్మునికి నామనసు నొప్పగింపఁజాలను.

లోకనాథుఁడయిన యారామునుఁడు రాకమునుపే యీయాయుధముఁ డయిన రావణుఁడు, శస్త్రవైద్యుఁడు గర్భమునఁ బెడదారింబడిన శిశువు నంగములను ముక్కలుముక్కలుగాఁ గోయునట్లు నాయంగములను కఱకుఁగత్తులతోఁ గోయఁగలఁడు. బహుదినములుగా దుఃఖసాగరమున మునిఁగియున్నాను. ఈపాపాత్ముఁడయిన రావణుఁడు నాకు రెండునెలల గడువు వొసఁగెను. ఆరెండునెలలును ముగియఁగలవు. ఒకదొంగ రాత్రి రాజునింటఁదూఱి దొంగలింపఁబోఁగా, అప్పుడు రాజభటులు వానిని బట్టుకొని రాజునకుఁదెల్పిన, అప్పు డారాజు ఆదొంగకు సూర్యోదయ మగుడు శిరశ్ఛేదము చేయ నాజ్ఞాపించిన నాతఁ డెట్లు మనస్సున దిగులు చెందునో, అట్లు నేనును ఓర్వరాని దిగులుపొంది యున్నాను. అక్కటా! నాకెంతకష్టము సంభవించెను! హా! రామా! హా! లక్ష్మణా! హా! సుమిత్రా! హా! రామునితల్లి! హా నాతల్లి! తుపాను వీచునప్పుడు సముద్రమధ్యమునందలి నావ మునుఁగుకైవడి నిర్భాగ్యురాలనై నే నిదిగో మృతినొందుచున్నాను.

పిడుగుపాటుచే వనమునను ండు రెండుసింగములును రెండు వృషభములును మృతినొందునట్లు, బలవంతులగు ఆరాంజేంద్రపుత్రులిరువురును నానిమిత్తమై మృగరూపముదాల్చిన యాజంతువుచే మృతినొందిరి. అప్పుడాజైవము మృగరూపముదాల్చినదై నిర్భాగ్యురాలనైన నన్ను వంచించినది. కావుననే నేను మూఢురాలనై నామగనిని, నామగనితమ్ముని బాసితిని.

అని కొంతతడవు చింతించి, సీత తనమనోవల్లభుని ధ్యానించి యతని నెదుటఁ జూచినట్లు భావించి యిట్లనెను: "ఓరామా! సత్యము దప్పనివాఁడా! నిడుదచేతులవాఁడా! నిండుచందురునిఁబోలు మోము గలవాఁడా! నీవు లోకముల కన్నింటికి మేలుచేయువాఁడవును; లోకములకెల్లఁ జెలికాఁడవును. అట్లుండియు, ఈరాక్షసులు నన్ను వధింపఁ బూని యుండుట నేల యెఱుఁగకున్నావు? మానవులలో నెనరులేని వారికిఁ జేసిన యుపకారము వ్యర్థమగునట్లు, భర్తయే దైవమని నమ్మి యుండుటయు, ఈయోర్పును, నేలఁబరుండుటయు, స్వధర్మము నొనర్చుట యందలి పట్టుదలయు, నాపాతివ్రత్యము సర్వము వమ్మయ్యెను. నేను నిన్నుఁబాసి చిక్కినదానినై మోమునఁ గళదప్పినదాన నగుచు నిన్నుఁ గలియుటయం దాస వదలి నిన్నుఁ జూడనైతిని. కావున నేను నోచిన నోములును, నాపాతివ్రత్యమును విఫలమయ్యెను. ఓనాథా! నీవు నియమముతోఁ దండ్రియానతిని నియమముతో జెల్లించి, యడవినుండి మఱలి, తండ్రియాజ్ఞ పూర్తిచేయుటచేఁ గృతార్థుఁడవై, నావినాశముచే మఱలఁ బెక్కండ్రు విభీషికన్నుల జవరాండ్రను గూడి, ఓరామా! సుఖముతో నుండఁగలవు. నే నన్ననో, నీయందు వలపుగొన్న దాననుగావున నీయెడనే బహుకాలమునుండి మనస్సుపెట్టినదాననై, ఉపవాసవ్రతాదులనెల్ల వ్యర్థపఱచికొని, యిదిగో ప్రాణముల వదలఁ బోవుచున్నాను. ఛీ! యీబ్రదుకు నాకేల? ఇంతటి నిర్భాగ్యురాలనై నేను జీవించియుండుటకంటె మృతినొందుట మేలు. కావున విషము మ్రింగియో, పదునుఁగత్తితోఁ గొంతుకోసికొనియో ప్రాణములు వదలెద ననిన, ఈరాక్షసునియింట నాకు విషము దెచ్చియిచ్చువాఁడు గాని, పదునుఁగత్తి నిచ్చువాఁడు గాని కనఁబడలేదు."

ఇట్లు సీతాదేవి పలువిధముల విలపించి, మనస్సున నా రఘు పుంగవునే తలఁచుచు, గడగడ వణఁకుచు నెండుపాటినమోముతోఁ గూడినదై పుష్పించియుండు నాయశోకవృక్షము చేరువకుఁ బోయెను. అట్లు దుఃఖముచే మలమలమాడుచున్న యా సుకుమారసర్వాంగియగు సీతాదేవి పలుతెఱఁగుల విలపించి యేమియు దోఁపకమిచే జడను దీసికొని, "నే నీ జడను గొంతున కురివేసికొని, యమునిపాదముల కడకుఁ బోయిచేరెదను" అని చెప్పి యాశింశుపావృక్షశాఖ నొక్క

దానిని బట్టుకొని యురివేసికొనఁబోయెను. అట్లు ఆశుభాంగియగు సీతాదేవి రాముని, లక్ష్మణుని, తనకులమును జింతించి, "తాను సద్వంశమునఁ బుట్టి, గొప్పవంశమును జొచ్చి శూరుఁడగు రామునిఁ బెండ్లాడి, విధేయుఁడయిన మఱఁదిని గలదాననుగా నుండియు, నా కీరీతి నురివేసికొని చావవలసి వచ్చెఁగదా" యని వగచుచుండఁగా, శుభసూచకములును, ధైర్యసంపాదకములును, లోకోత్తరములును, ముందు ఫలితముల నొసఁగుటచేఁ గనఁబడినవియునైన శకునములు గలిగెను.

29-వ సర్గము

సీతాదేవికి శుభశకునము లగుట

దుఃఖస్వరూపురాలయినదియు, రాముని యెడఁబాటునం దెట్లుండవలయునో, అట్లుండుటచేఁ బొగడ్తగాంచినదియు, హర్షములేనిదియు, దీనహృదయముతోనుండునదియు, మంగళకరురాలును నైన యా సీతాదేవిని గలిగలవానిని బరిజనులుపొందునట్లు క్రిందఁజెప్పఁబడిన శుభశకునములు పొడకట్టినవి. వంకర కనురెప్పవెండ్రుకలవరుసలతోఁ గూడినదియు, నడుమగ్రుడ్డు నల్లగను, చుట్టును విశాలముగను శుభ్రముగను నుండునదియు, కొనలందు నెఱ్ఱనిదియునైన యాచిగురుఁబోఁడి యొక్క యెడమకన్ను చేపచేఁ గదలింపఁబడి చుట్టు నెఱ్ఱనైన కమలము వలె నదరెను. మఱియుఁ జక్కఁగాఁ గుదిరినదియు, బలిసినదియు, గుండ్రనిదియు, మేలిమి వల్ల యగురుచందనపుఁబూత పూసికొనుటకుఁ దగినదియు, పురుషోత్తముఁడయిన తన ప్రియునికి బహుకాలము దిండుగా నుపయోగపడినదియునైన యాసీతాదేవియొక్క యెడమభుజము వేగిరముగా నదరెను. ఇంతియకాక, ఆసీతాదేవియొక్క చక్కఁగాఁ గదిసిన యిరుతొడలలోను నేనుఁగుతొండమువం బోలినదియు, బలిసినదియు, సొగసయినదియునైన యెడమతొడ మిగుల నదరినదై రాముఁడు ముందు నిలఁబడి యున్నాఁడని తెలిపెను. నిర్మలనేత్రములును, నున్ననికొనలుగల దంతములును, చక్కనిమేనునుం గలదగు ఆసీతాదేవి నిలఁబడియుండఁగా, పసిఁడివన్నె గలదియు, కొంచెము దుమ్ము తగులుటచే మాసినదియునైన బట్ట జారెను.

గాలికిని ఎండకును వాడినదియు, మిక్కిలి సన్నగిల్లినదియునైన విత్తనము వానగుటయుటచేఁ దృప్తినొందునట్లు, సీతాదేవియు నీ మొదలగు పూర్వశుభసిద్ధిందెలుపు శుభశకునములచే నాథునిరాక త్వరలో కలుగఁగలదని బోధింపఁబడినదివోలె మిక్కిలి తృప్తి నొందెను. మఱియు నాసీతాదేవియొక్క దొండపండువంటి క్రిందిపెదవియుఁ జక్కని కంటిఱెప్పవెండ్రుకలతోఁగూడిన వంకరఱెప్పయుఁ బ్రకాశించెను. వరుసలుదీఱిన తెల్లనిదంతములుగలముఖము రాహువు నోటినుండి విడువఁబడినచంద్రునివలెఁ బ్రకాశించెను. అంత సీతాదేవి చింతనుబాసి, కునికిపాటులేనిదై, తాపము నిమ్మళింపఁగా సంతసముచే వికసించిన మనస్సుగలదియయి, వెన్నెలతోఁ గూడిన శుక్లపక్షమునాటి రాత్రివలె సంతోషభరితమైనమోముతోఁ గూడి ప్రకాశించుచుండెను.

30-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవినిగూర్చి చింతించుట

పరాక్రమశాలియగు హనుమంతుఁడును సీతాదేవి చెప్పిన మాటలను, త్రిజట స్వప్నవృత్తాంతమును, రాక్షసకాంతలబెదరింపులను యావత్తును విపులముగా విన్నవాఁడై నందనవనదేవతఁబోలు నాసీతాదేవిని జూచినవాఁడై పలుతెఱఁగుల యోచింపఁదొడఁగెను.

పెక్కువేలవానరులు అన్నిదిక్కులయందును ఏసీతాదేవిని వెదకుచున్నారో, యాసీతాదేవిని నే నిచ్చటఁ గాంచితిని. నేను మాఱువేషము దాల్చి, చాల యోచనతోఁగూడినవాఁడనై, శత్రుబలమును బరికించుచు నేరికిఁ దెలియకుండ రాక్షసుల కలిమిబలిమిని, ఈలంకాపురమును, ఈరాక్షసరాజగు రావణునిప్రభావమును గాంచితిని. ఎన్నఁడాని మహిమగలవాఁడును, జంతువులన్నిటియందు దయగలవాఁడును నైన యారామునికిఁ బట్టంపుదేవియుఁ బతివ్రతయు గోరునదియునగు నీసీతనోదార్చుట న్యాయము. ముందు దుఃఖముల నెఱుఁగనిదియు, ప్రకృతము దుఃఖములచే నొచ్చినదియు, అప్పటికిని దుఃఖమునకు ముగింపుగాననిదియు, నిండుచంద్రునిఁబోలు మోముగలదియునైన యీసీతాదేవి నిదిగో యోదార్చెదను. దుఃఖముచే స్మృతి దప్పియున్న యీ దేవిని నే నోదార్పక వచ్చినట్లే మఱలిపోతినేని,

నాపోక వ్యర్థమగును. నే నచ్చటికిఁ బోఁగా నిచ్చట నీపతివ్రతయగు రాజపుత్రి రక్షణము గానక ప్రాణములఁ దొఱఁగును. అచ్చటికిఁ బోయినను రాముని కీ సంగతి చెప్పక యుండఁగూడదా యనిన, నిడుద చేతులవాఁడును, నిండుచందురునిఁ బోలు మోముగలవాఁడును నైన రాముఁడును సీతాదర్శనమునం దాత్రముగలవాఁడై యున్నాఁడు గావున నాతని కీ సీతాదేవి వృత్తాంతము చెప్పకయుండుట యుక్తము గాదు. కావున నిప్పు డీదేవితో మాటాడవలయును. ఇప్పుడు మాటాడుదు ననిన, ఈ నిశాచరకాంతలసమక్షమున మాటాడుట యుక్తము గాదు. ఈపని యెట్లు చేయఁదగును? నే నిప్పుడు చిక్కులఁ దగులు కొంటిని. నే నీ మిగులురాత్రిలోపల నెట్టకేలకు నీ సీతాదేవి నోదార్పనేని, ఈసీతాదేవి జీవితము విడువఁగలదు. దీని కేమియు సందేహము లేదు.

నేను మఱలి రాముని కడ కేగినప్పుడు రాముఁడు "సీత నాకేమి వృత్తాంతము చెప్పి పంపెను?" అని యడిగెనేని నే నీ సీతాదేవితో మాటాడకపోయి యారాముని కేమని బదులు చెప్పఁగలను? సీతాదేవి వలన వృత్తాంతమును గొనిపోవక నే నిచ్చటనుండి త్వరగాఁ బోయినను, "నీ వూరక యేల వచ్చితి"వని యారామఁ డలిగి క్రూరదృష్టితోఁ జూచి నన్ను బూదిచేయును. అట్లుగాక రామునిసాయమునకై నారాజగు సుగ్రీవుని యుద్ధప్రయత్నముతోఁ బిలుచుకొనివత్తుననిన, నంతవఱకు సీతాదేవి జీవించియుండదు గనుక, సుగ్రీవుఁడు సన్నై న్యుఁడై వచ్చుట వ్యర్థమగును. కావున నెట్లో యొకలెఱఁగున రాక్షసు లేమఱియుండు నప్పుడు సందు చేసికొని, యిచ్చటనే యుండి వెతలపాలయియున్న యీ సీతాదేవిని మెల్లగా నూఱడింతుననిన, నేనో చినమేనివాఁడను. మీఁదుమిక్కిలి కోతిని. నే నిప్పుడు సలక్షణమయిన మానుషభాష తోనే మాటాడెదను. నేను ద్విజన్ముని మాడ్కి సంస్కృతభాషతో నా దేవితో మాటాడితినేని, సీతాదేవి నన్నును రావణునిఁగాఁ దలఁచి నాతో మాట్లాడ భయంపడును. అంతియకాక వానరుఁడనై న నేనెట్లు సంస్కృతభాష మాటాడఁగలను? కావున నే నామెతో నర్థముగల మనుష్యవాక్కున మాటాడి యామె నోదార్పవలయునేకాని వేఱువిధ ముగా నాపతివ్రతను సమాధానపఱుప వీలుగాదు. ఆమెకు వాడుక

పడిన మానుషభాషతోనే మాటాడుటయుఁ గడు నసాధ్యముగా నున్నది. ఈజానకి నావానరరూపమును, నేను మనుష్యవార్తలతో మాటాడుటను జూచి సందేహపడి మొదటనే రాక్షసులవలన భయపడి యున్నది గనుక నన్నుఁ జూచి భయము నొందును. అంత విజ్ఞానికన్నుల దగు పతివ్రతయైన యాసీతాదేవి 'రావణుఁడే వానరరూపమెత్తి వచ్చినాఁడు' అని తలఁచి భయపడి కేకలిడును. సీత యటులఁగానే రాక్షసకాంత లందఱాయుధములనన్నిఁటి నెత్తుకొని యమునివలె భీకరలై మీఁదికి వత్తురు. అట్లావికృతంపుమోఁకలుగల రాక్షస స్త్రీలందఱు నన్నుఁజుట్టుకొని తమబలిమియెల్లను జూపి నన్ను వధించుటకును, పట్టుకొనుటకును ప్రయత్నము చేయుదురు. అప్పుడు గొప్పవ్రాఁకుల కొమ్మలు, తెమ్మలు, బోదెలు పట్టుకొని పరుగెత్తుచుండు నన్నుఁ జూచి రాక్షసకాంతలు వెఱచి యీతఁ డెవఁడో యసాధ్యుఁడుగా నున్నాఁడని సందియపడుదురు. వనమునఁ దిరుగు నాయొక్క గొప్పమేనిని జూచి, వికృతపుమోములుగల రాక్షసకాంత లందఱు వెఱపుచే నదరిపడి రావణునినగరున సేవకులగు రాక్షసుల కీ సంగతిఁ దెలిపి, వారిని సాయమునకుఁ బిలుతురు. వారును శూలములు, కత్తులు, పెక్కుడివములు చేతఁ బట్టినవారై, యీపోరులో బీతు గలిగించుచు నాపైకి వత్తురు. వారు నన్ను నలువైపులఁ జుట్టుకొన్నప్పు డారక్కసులను బరిమార్చి యీమహాసముద్రము దాఁటి పోఁజాలను. వడిగల రక్కసులనేకు లెగిరి నన్నుఁ బట్టుకొనినైనఁ బట్టుకొందురు. అట్లు వారు నన్నుఁ బట్టుకొందురేని, ఈ సీతాదేవికి రామునివార్త తెలియఁబోదు. రాక్షసులు హింసయం దెక్కువ యపేక్షగలవారు గావున నీజానకిని వధింపనైనను వధింతురు. అట్లు ఈసీతయే వధింపఁబడునేని, రామసుగ్రీవుల యీకార్యము చెడిపోవును.

దారితెలియనిదియు, రాక్షసులచేఁ గాపాడఁబడునదియు, సముద్రముచేఁ జుట్టఁబడినదియు, రహస్యమైనదియు నైన యీలంకాపురమున నీ సీతాదేవియున్నది. రాక్షసులు పోరునందు నన్నుఁ బట్టుకొన్ననుు, లేక పరిమార్చినను, కార్యసాధనమున రామునికి మఱొక్కనిని సహాయునిఁ గానను. నన్ను రాక్షసులు చంపిరేని, నాకుఁ బిమ్మట నూఱుయోజనముల నిడివిగల యీసముద్రము దాఁటగల మొనగాని

నెంతయాలోచించినను గనుఁగొనలేకున్నాను. ఈ రాక్షసుల నందఱిని నేను జంపఁగలిగినఁ గలుగుదునుగాని, యీగొప్పకడలియావలిగట్టు నొందఁజాలను. యుద్ధమున జయాపజయములు నిక్కములుగావు. ఇప్పు డూరక పోవుటకును దోఁపలేదు. సీతను బలుకరించుటకును దోఁపలేదు. వివేకియగువాఁ డెవ్వఁడు సందిగ్ధమైన కార్యమును నిశ్చయముగాఁ జేయఁగలఁడు?

సీతాదేవితో మాటలాడకుండిన నామె ప్రాణత్యాగము సేసి కొనును. మాటాడిన నిప్పుడు చెప్పిన యీగొప్పచేటు వాటిల్లును. సూర్యుఁ డుదయింపఁ జీఁకటి చెదరిపోవునట్లు, అయినపనులుగూడ నవివేకియగుదూత దేశకాలముల నెఱుఁగక పోవుటచేఁ జెడిపోవు చున్నవి. ఈపని చేయవచ్చునా చేయఁగూడదా యని రాజు మంత్రులతో యోచించి నిశ్చయించిన బుద్ధియు, వివేకముమాలిన దూతమూలమున శోభింపకున్నది. దూతలు తాము పండితులని తలఁచినవారలై కార్య ములఁ జెడఁగొట్టుదురు. కావునఁ బనియెట్లు చెడకుండును? ఎట్లు నాకుఁ దెలివిలేనితనము రాకయుండును? నాసముద్రలంఘనశ్రమ మెట్లు వృథ కాకయుండును? ఈసీతాదేవి నన్నుఁ జూచి వెఱవక యెట్లు నాపలుకుల వినును?" అని యిట్లు ప్రశస్తమైన బుద్ధిగల హనుమంతుఁ డాలోచించె. "సచ్చరిత్రుఁడగు స్వబంధువైన రామునిఁ గీర్తించెదను. ఈ విడయుఁ దనబంధువార్త వినుటచే వెఱవకయుండును. అప్పుడు ప్రియవాక్య ములు పలుకుచు ధైర్యవంతుఁడైన యిక్ష్వాకుకులతిలకునియొక్క మంచినడవడులఁ దెలుపుమేటిమాటల నన్నిటిని వినిపించెదను. ఎట్లు నన్ను నమ్మునో, యాప్రకారము మాటాడెదను" అని మహానుభావుఁ డైన హనుమంతుఁడు లోకనాయకుఁడయిన రామునియొక్క దేవిని జూచుచుఁ జెట్టుకొమ్మనడుమ నున్నవాఁడై, సత్యప్రియమైన మాట చెప్పెను.

31-వ సర్గము

హనుమంతుఁడు రామునిచరితము గీర్తించుట

వానరవీరుఁడయిన హనుమంతుఁ డివ్విధమునఁ బలుతెఱఁగుల యోచించి, చేయఁదగిన పనిని నిర్ణయించుకొన్నవాఁడయి, సమీపము

నందుఁ జేరి సీతాదేవినిమిత్తమయి యింపుమాటలను బలికినవాఁడయ్యెను.

చతురంగబలము గలవాఁడయిన దశరథుఁ డను రాజొక్కఁడు మంచినడవడి గలవాఁడును, ప్రసిద్ధిచెందినవాఁడునునై యుండెను. అతఁడు రాజర్షులలోపల శ్రేష్ఠుఁడు; తపస్సుచే ఋషులతో సమానుఁడు; చక్రవర్తులవంశమునఁ బుట్టినవాఁడు; బలమున నింద్రునిఁబోలినవాఁడు; భూతదయగలవాఁడు; గొప్పబుద్ధియు, నెనరును, తిరమగు మగటిమియుఁగలవాఁడు; ఇక్ష్వాకువంశపు రాజులలో ముఖ్యుఁడు; వన్నెగలవాఁడు; కలిమిని బెంపొందించువాఁడు; రాజచిహ్నములతోఁ గూడినవాఁడు; విస్తారసంపదగలవాఁడు; రాజులలోపల నుత్తముఁడు; భూమండలమునందలి యన్నివైపులందును బేరువడసినవాఁడు; ఆశ్రితులకు సుఖ మొసఁగుచు, దానును సుఖము లనుభవించువాఁడు.

ఆతనికి రాముఁ డని ప్రఖ్యాతిఁజెందిన పెద్దకొడు కొకఁడు గలఁడు. అతఁడు చందురునిఁబోలు మోముగలవాఁడు; విశేషములనెఱిఁగినవాఁడు; విలుకాండ్రందఱిలో నుత్తముఁడు; స్వధర్మమును గాపాడువాఁడు; స్వబంధువులఁ గాపాడువాఁడు; ప్రాణులనెల్లరఁ గాపాడువాఁడు; ధర్మమును గాపాడువాఁడు; శత్రువులను దహించువాఁడు. ముదుసలియగునతనితండ్రి యొక విషయమునఁ బ్రతిజ్ఞ యొనర్చి, దానిం దప్పఁజాలక, యారామునిని, అతని భార్యతోను, అతనితమ్మునితోను నడవికిఁ బంపెను. ఆరాముఁడు కాఅడవియందు వేటనిమిత్తము తిరుగుచుఁ గామరూపులగు పెక్కండ్రు శూరరాక్షసులను జంపెను. జనస్థానమందలి పదునాలుగువేలమంది రాక్షసులను, వారినాయకులగు ఖరదూషణులను రాముఁడు సంహరించిన వార్తవిని, రావణుఁ డలిగి, మాయామృగముచే రాముని వంచించి యారామునిదేవియైన సీత నపహరించెను.

ఆరాముఁడు నిర్దిష్టరాలగు నాసీతాదేవిని వెదకుచు, సుగ్రీవుఁ డను వానరునితోఁ జెలిమి చేసికొనెను. అంతటఁ బగతురపురములను గెల్చునట్టి బలవంతుఁడగు రాముఁడు సుగ్రీవునియన్నయగు వాలి యనువానిని జంపి, సుగ్రీవునికి వానరరాజ్యమొసఁగెను. సుగ్రీవుని పనుపుచేఁ గోరినరూపము దాల్పఁగల పెక్కండ్రు వానరులు ఆదేవి నన్ని

దెసలయందు వెదకుచున్నారు. నేనును సంపాతిమాటనుబట్టి యీ విజీవి కన్నులదగు సీతాదేవినిమిత్తమై నూఱు యోజనముల దవ్వుగల సముద్రమును వేగముతో దాఁటితిని. రాఘవుఁడు తనపత్నియయిన యీసీత యెట్టిశరీరము, ఎట్టివన్నె, ఎట్టిడాలును గలిగినదని చెప్పెనో, అట్టి రూపవర్ణాదులుగల యీసీతను నే నిచ్చటఁ గాంచితిని" అని చెప్పి వానరశ్రేష్ఠుఁడయిన హనుమంతుఁడు మాటలు చాలించెను.

అంతట వంకరలైన శిరోజములకొనలును, నల్లని ముంగురులును గలదైన యీపిఱికిదగు సీతాదేవి శిరోజములచేఁ గప్పఁబడియున్న తన మోము పైకెత్తి శింశుపావృక్షమును జూచెను. మఱియు నామె హనుమంతునిపలుకులు విని, దిక్కులను విదిక్కులను జూచి, రామునిఁ దదేకాగ్రచిత్తముతో ధ్యానించి, రామవార్తాశ్రవణముచేఁ బరమానందము నొందెను. అటుతర్వాత నామె యిరుప్రక్కలందును, క్రిందను పైననుజూచి, ఊహింపరాని తేలివిగలవాఁడయి, ఉదయపర్వతశిఖరమున నున్న సూర్యసారథియైన యరుణునింబోలినవాఁడును, వాయుపుత్రుఁడును, సుగ్రీవునిమంత్రియునైన హనుమంతునిఁ జూచిన దాయెను.

32-వ సర్గము

సీత హనుమంతునిఁ జూచి విచారపడుట

అటుతర్వాత సీతాదేవి, తెల్లనివలువగట్టినవాఁడును, మెఱుగుఁబోలెఁ బచ్చనివాఁడును, వినయయుక్తముగా నింపుమాటలు మాటాడువాఁడును, వికసించిన యశోకపుష్పములగుంపువలె వెలుఁగువాఁడును, పుటమువేసిన బంగారపుఁడాలుగల కన్నులుగలవాఁడునై యాశింశుపావృక్షపుఁగొమ్మనడుమ డాఁగియున్న యవ్వానరునింజూచి, మనసునఁ గలవరపడినదై, పరమాశ్చర్యము నొంది, "ఆహా! యీవాన రుని రూపము భీకరమును, జూడ నలవికానిదియునై యున్నది?" యని తెలిసికొని మఱల మూర్ఛనొందెను. తర్వాతఁ గొంతసేపటికిఁ దెప్పిఱిల్లి, "పెద్దగొంతెత్తి యేడ్చిన నీరాక్షసు లిదియేమని యడుగుదురు" అని వారికి వెఱచి "హా రామా" యనియు, "హా లక్ష్మణా" యనియుఁ బలుతెఱఁగులఁ దిన్ననిగొంతుతో రాక్షసులకు వినరాకుండునట్లు విల

పించెను. ఆసీతాదేవి యట్లు విలపించి, వినయముతోడఁ గూర్చుండి యున్న వానరపుంగవునిఁజూచి, "ఇది కల" అని తలఁచెను.

ఆసీత యట్లు విచారపడి, గొప్పవంకరమోముగలవాఁడును, వానరేంద్రుఁడగు సుగ్రీవునియాజ్ఞాకరుఁడును, బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడునైన వాయునందనుండగు హనుమంతునిఁ జూచినంతటనే మిక్కిలి సంజ్ఞ దప్పి, ప్రాణములేనిదానివలెఁ గ్రిందఁబడి, మఱలఁ జాలసేపటికి (118) సంజ్ఞవొంది "నే నిప్పుడు స్వప్నమున వికృతరూపముగల వానరునిఁ జూచితిని. ఇది శాస్త్రనిషిద్ధము, రామలక్ష్మణులకును, నాతండ్రియగు జనకమహారాజునకును మేలగును గాక!" అని యనుకొని, మఱల "ఇది కలయుఁ గాదు. నిండుచందురునిఁ బోలు మోముగల నాప్రియునిఁ బాసి శోకదుఃఖపీడితురాలనైయున్న నాకు సుఖమును, నిద్రయులేవు. ఏను రామరామ యని యెల్లప్పుడు మనస్సున ధ్యానించుచు, నాతని నామమునే యుచ్చరించుచు, నాతని కనురూపమైన కథను వినుచు, నాకథలోని సంగతులనే చూచుచున్నాను. ఏలయన ఆనాథునివియో గమువలన మదనపీడితురాలనై, అతనియందే నాతలంపెల్లనుంచి, యత నినే ధ్యానించుచు నతనినే చూచుచున్నాను. అతని కథనే వినుచున్నాను. ఇది సంకల్పముగా నుండవచ్చునని యాలోచించి, మన మున నల్లెయుండుమని యూహించుచున్నానుగాని మఱల "ఇది మనోరథముగాదు. దానికి రూపములేదు. ఈవానరుఁడు చక్కఁగాఁ దెలియు రూపముతోఁ గూడినవాఁడై నన్నుఁ గూర్చి పలుకుచున్నాఁడు. ఇది యేదిగానైన నుండనిమ్ము. గురువునకును, దేవేంద్రునకును బ్రహ్మాగ్ను లకును నమస్కరించెదను. ఈవానరుఁడు నాతోఁ జెప్పిన దేదో, అది నిక్కమగునుగాని, వేఱువిధముగాఁ గాకపోవుఁగాక!" అని సీత తనలోఁ దాను జింతించిన దాయెను.

33-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవి నడుగుట

[redacted]పవడపుకాంతివంటి కాంతిగల మోముగలవాఁడును, అడఁకువఁ దెలుపువేషము దాల్చినవాఁడును, సీతనుజూచి దీనతనొందినవాఁడునైన యాహనుమంతుఁడు శింశుపావృక్షాగ్రమునుండి దిగి క్రిందికి, దాపు

నకుఁ జేరి, దోసిలి యొగ్గి నెత్తి నిడుకొని, యా సీతాదేవింగూర్చి యింపుమాటలతో నిట్లనియెను:

"ఓ తమ్మితేకులవంటి కన్నులుగలదానా! మాసినపట్టుచీకగట్టిన దానా! ఓపతివ్రత వగుదానా! నీవెవతెవు? ఏల చెట్టుకొమ్మను బట్టుకొని నిలుచుకొని యున్నావు. తామరపువ్వులరేకులనుండి నీరు దొఱఁగునట్లు నీనేత్రములనుండి యేల కన్నీరుగాఱుచున్నది? ఓశుభకరురాలా! ముద్దుమోముగలదానా! నీవు దేవకాంతవో? అసురవనితవో? నాగభామినివో? యక్షాంగనవో? కిన్నరులచామవో? గుండ్రనిపిఱుఁదులును ముద్దుమోమునుగలదానా! చూడఁగా నీవు దేవాంగనవుగాఁ గనఁబడుచున్నావు. రుద్రులకు సంబంధించినదానవో? మరుత్తులకుఁ జేరినదానవో? అష్టవసువుల యతివవో? లేక, చంద్రునిఁబాసి దివమునుండి క్రిందఁబడిన యన్ని సుగుణములుగలదగు రిక్కలలో రాణియైన రోహిణివో తెలియఁ బలుకుము. ఓ కల్యాణీ! నీ వెవతెవు? ఓ సొగసు కన్నులదానా! నీవెవతెవు? నల్లనికంటిదానా? మోహముననో, కోపముననో భర్తయగు వసిష్ఠమునీంద్రుని కలుక గలిగించి వచ్చిన యరుంధతివిగాదు గదా? ఓ నెన్నడుము గలదానా! నీవెవనికిఁ దల్లివి? నీతండ్రి యెవఁడు? నీతోఁబుట్టువు ఎవఁడు? నీమగఁ డెవ్వఁడు? ఈలోకమునుఁబాసి పరలోకమునకుఁ బోయిన యెవ్వానినిఁ గూర్చి చింతించుచున్నావు. రోదనమును బట్టియు, నిట్టూర్పును బట్టియు, భూమిమీఁద నిల్చియుండుటఁ బట్టియు, రాజచిహ్నములు దెలియవచ్చుటంబట్టియు నీవు దేవాంగనవుకావని తలంచెదను. నీయొంటిచిన్నెలు పరికింపఁగా, నీవొక్కఁ డేనికి దేవేరివై యుందువని యెంచెదను. నీ వొక్కవేళ రావణుఁడు బలవంతముగాఁ బట్టితెచ్చిన సీతవుగా నుందువేనినే నడిగెదఁ జెప్పుము. నీమెత్తనిదనమును, నీయమానుషసౌందర్యమును, నీమునివేషమును జూడ, నీవు తప్పక రామునిదేవివే యని యెంచెదను."

ఆసీతాదేవి రామునిచరితము వినుటచే సంతసము నందినదై చెట్టుపైఁ గూర్చుండియున్న హనుమంతునితో నిట్లనియె: "నేను రాజశ్రేష్ఠుఁడును, జ్ఞానవంతుఁడును, పగతురదండుఁ గాల్చువాఁడునైన దశరథమహారాజునకిఁ గోడలను. మహావివేకియగు విదేహదేశాధిపుఁ

డయిన జనకమహారాజునకుఁ గూఁతురను. నన్ను సీతయందురు. బుద్ధి మంతుఁడగు రామునికి భార్యను. ఏను నానాథుని గృహమునఁ బండ్రెం డేండ్లు మానుషభోగము లనుభవించుచు నన్నికోర్కులతో నిండిన దానన్నై యుంటిని. అచ్చటఁ బదుమూడవయేట దశరథమహారాజు తన కులగురువగు వసిష్ఠునితో నాలోచించి, నానాథునికిఁ బట్టాభిషేకము చేయదలఁచెను. ఆపట్టాభిషేకప్రయత్నము జరుగుచుండఁగా, ఆతని కడఁగొట్టు భార్యయగు కైకేయి భర్తనుజూచి, "ఓనాథా రామునికిఁ బట్టాభిషేకము నీవు చేయుదువేని, నేను బ్రతికియున్నంతవఱకు నన్నుముఁ గుడువను;నీరుద్రావను. ఇఁక నేఁ బ్రాణములతోనుండను. ఓరాజశ్రేష్ఠా! నీవు నాకు మున్నొసఁగినవరముల నిక్కము సేయఁగోరుదేని రాము నడ విికిఁ బంపుము" అని యడిగెను. సత్యసంధుఁడయిన యారాజు కైకే యీదేవికొసఁగిన వరములను జ్ఞప్తికిఁదెచ్చికొని, యాకఠినురాలగు కైకేయియొక్క మాటనువిని యట్లే మూర్ఛనొందెను. అంతట ముదు సలియగు నాదశరథనృపాలుఁడు వాగ్దత్తమునకుఁ గట్టువడినవాఁడై, విలపించుచుఁ గీర్తిమంతుఁడయిన తనపెద్దకొడుకగు నానాథునిరాజ్యము వేఁడెను. అంతఁ గాంతిగలవాఁడగు నాప్రియుఁడు రాజ్యపట్టమునకంటెఁ బిత్రువాక్యపరిపాలనము ముఖ్యమని మనఃపూర్వకముగా నంగీకరించిన వాఁడయ్యెను. కదలని మగఁటిమి గల యారామునుఁడు కోరినది యొసఁగునుగాని, యిచ్చినది గైకొనఁడు. తన బ్రదుకునిమిత్తమైన నిసుమంత చేఁదుమాటయైనఁ బలుకఁడు. గొప్పపేరువడసిన యారామునుఁడు మేలిమి పుట్టములను విడిచి రాజ్యమునుగూర్చి తలంపక తల్లికి నన్నప్పగించెను. నేను నాపెనిమిటిని బాసి స్వర్గమున నైన నుండఁగోరను గనుక, నేనును నానాథునికంటె ముందుగా వనములకుఁ దఱలితిని. చెలికాండ్ర కానంద దాయకుఁడయిన మహానుభావుఁడగు లక్ష్మణుఁడు తనయన్నతోఁగూడ రాఁగోరి, నారబట్టలఁ దాల్చి యన్నకంటె ముందుగాఁ బయనమాయెను. మేము ముగ్గురమును నాయకుఁడయిన దశరథునియానతిని గారవించి, కఠిననియమములు పూని ముందు చూడఁబడనిదియగుటచే చూపునకు వెఱపు పుట్టించునదియగు దండకారణ్యముఁ జొచ్చితిమి. ఎక్కువ వెలుఁగుగల యారామునుఁడు మాతోడ నాదండకారణ్యమున నుండఁగా దురాత్ముఁడయిన రావణుఁడు నన్ను వొంగిలించి తెచ్చెను. నా కిక

రెండునెలలవఱకుఁ బ్రాణములతో నుండుటకు సమ్మతి యొసఁగెను. ఆ రెండునెలలకుఁదరువాత నేను ప్రాణముల విడుతు" నని సీత హనుమంతునితోఁ దనవృత్తాంతము చెప్పిన దాయెను.

34-వ సర్గము

హనుమంతుఁడు సీతతో సంభాషించుట

వానరులగుంపుకాఁపరియగు హనుమంతుఁడు సీతాదేవియొక్క మాటలను విని, తీరని వ్యసనమునఁ బడియున్న యాసీతాదేవితో నిట్లనియె :

"ఓదేవీ, నేను రాముని పనుపున నీకడకు దూతనుగా వచ్చితిని. ఓవైదేహీ ! రాముఁడు కుశలముతో నున్నవాఁడు. బ్రహ్మాస్త్రమును, వేదములను, వేదాంగములను దెలిసినవాఁడును, వేదవిదులలో నుత్తముఁడునైన దశరథపుత్రుఁడగు నారాముఁడు నీసేమ మరయు మనెను. ఎక్కువ పరాక్రమము గలవాఁడును, నీమగనికిఁ గూర్చి తమ్ముఁడునైన లక్ష్మణుఁడు చింతలఁ దల్లడిల్లినవాఁడై శిరముతో నీకు మ్రొక్కెను"అని.

ఆసీతాదేవి రాజశ్రేష్ఠులయిన యారామలక్ష్మణుల వార్తను విన్నదై, ముదమున మేనఁ బులకలెత్తఁగా నాహనుమంతునిఁ జూచి, "నూఱేండ్లకైనను ప్రాణములతో నున్నవాని కానందము గలుగును" అను సామెత నిక్కమనియె తోఁచుచున్నది అని చెప్పెను.

ఆవచ్చిన హనుమంతునియం దారామునిదేవికి వింతయైన ప్రీతి గలిగెను. అంత వారియువు రొండొరులను నమ్మి మాటాడ మొదలిడిరి. అంతట నావానరనాథుఁడు ఆసీతాదేవియొక్క మాటను విని వెతలఁ గుందియున్న యాసీతాదేవికడ కేతెంచెను.

ఆ చక్కనియంగములుగల సీతయు హనుమంతుఁ డెంతెంతదగ్గఱకు వచ్చుచున్నాఁడో యంతంతగా నతనింగూర్చి సంశయపడినదై, "ఇతనితో నేనిప్పుడు మాటాడినదియు ననుచితముగా నున్నది. ఛీ! యేల యింతవెఱ్ఱిపని చేసితిని. ఆదురాత్ముఁడగు రావణుఁడే నన్ను మోసపుచ్చుటకై మాఱువేషము దాల్చి వచ్చెనేమో?" అని తనలోఁ దాను దలఁచినదై, యా యశోకవృక్షముయొక్క కొమ్మను వదలిపెట్టి యా చెట్టుక్రింద నేలమీఁదఁ గూర్చుండెను.

నిపుణచేతులవాఁడగు హనుమంతుఁడు వెఱపుచేఁ దత్తరపడి, వెతలచే నొచ్చియున్న యాజానకికి మ్రొక్కెను. ఆపున్నమచందురునిఁ బోలు మోముగలదియు, మధురమయిన కంఠధ్వనిగలదియునైన యా సీతయు హనుమంతుఁడు దాపునకు వచ్చుకొలఁది భయపడినదై, మఱలఁ దలయెత్తి యాహనుమంతునివైపు చూడకుండెను. అట్లు కొంతసేపుండి యాదేవి నిట్టూర్పు నిగిడించి యిట్లనియె :

"ఓరీ! నీవు మాఱువేషము దాల్చిన మాయలమారియగు రావణుఁడవే? నీవిట్లు మాయలమారివై నాకు మఱల సంతాపముగలిగించుట యుక్తముగాదు. కోరిన రూపమెత్తఁగల యోరీ నిశాచరా! నేనసలే వెతలఁగుందుచున్నాను. మఱియు నన్నేల వెతలలో ముంచెదవు? ఇది నీకు శ్రేయస్కరముగాదు. ఒకవేళ నేఁదలచినదియట్లుకాక యుండవచ్చును. ఏలయన, నీదర్శనమాత్రముననే నాకెక్కువ సంతసము పుట్టినది. ఓరీ! నీవు రామునిదూతవుగా వచ్చియుంటివేని, నీకు మేలగునుగాక. వానరశ్రేష్ఠా! నిన్నడిగెదను. రామునికథ నాకుఁ బ్రియమయినది. నాకుఁబ్రియుఁడైన రామునియొక్కగుణములను వర్ణింపుము. తిన్ననివాఁడా! ఏటిప్రవాహము నురవడి యేటిగట్టును హరించునట్లు, నీవు నామనస్సును హరించుచున్నావు. ఓహో యిది కలయో! ఏమి యీ స్వప్నానందము! నన్నీ రావణుఁడు తెచ్చి చాలదినములాయె. నేఁడు స్వప్నమున రాఘవుఁ డంపిన దూతను గాంచితినిగదా. నే నీరాఘవునిదూతను స్వప్నమందుఁ జూచినట్లు, యీ శూరులగు రామలక్ష్మణులను జూతునేని, నే నిట్లు వగలలోఁ జిక్కనుగదా. ఆస్వప్నము గూడ నాయెడ నసూయగలిగియున్నది. ఆ! నేను పొరపడితిని. ఇది స్వప్నముగాదని తలఁచెదను. స్వప్నమున వానరదర్శన మశుభప్రదమని పెద్దలు వక్కాణింతురు. ఇప్పుడు నాకు వానరదర్శనముచే మేలు గలుగుచున్నది. ఇదిస్వప్నమే యైనచో నాకు మేలుగలుగునా? ఇది స్వప్నముగాదు. ఇది చిత్తభ్రమయో! ఉపవాసాదులుండుటచేఁ గలిగిన వాతాదిదోషముల కలఁకపాటుచేఁ బుట్టిన వాయువికారరూపమైన భ్రమయో! విరహిజనసామాన్యమునకుఁ గల యొక యవస్థాభేదమో! లేక యొండమావులో ఎంచిమూచిన నిది యున్మాదము గాదు. ఉన్మాదమువంటిదగు చిత్తవిభ్రమమును గాదు. నేను ప్రజ్ఞగలదానినుగా

నున్నదానను. ఈతఁడు వానరుఁడని నేను చక్కని తెలివితోఁ జెప్పు చున్నాను." అని యిట్లు సీతాదేవి పలుతెఱఁగుల యోచించి, మోహా దుల బలిమి లేమిని, రావణునిబలిమిని నిశ్చయించికొని, రాక్షసులకుఁ గామరూపమెత్తుట సహజముగనుక నతఁడు రావణుఁడనియే నిర్ణయించు కొని, యాతనితో మాటలాడకయుండెను.

మారుత నందనుఁడగు హనుమంతుఁడు సీతతలంపును దెలిసి కొన్నవాఁడై యాసీతాదేవికిఁ జెవుల కింపులైనమాటలచే నామెను సంతోషపఱుపఁగోరి, "ఓదేవీ! ఆరాముఁడు సూర్యునివలె వెలుఁగుగల వాఁడు, చంద్రునివలె లోకమునకు మనోహరుఁడు, కుబేరునిమాడ్కి లోకముల కన్నిటికి రాజు, గొప్పపేరువడసినవిష్ణువుమాడ్కిఁ బరాక్రమ శాలి, బృహస్పతి చందమున సత్యప్రియములైన పలుకులు పలుకువాఁడు, శరీరముదాల్చిన మన్మథునిమాడ్కి రూపలావణ్యకాంతులు గలవాఁడు, సమయము వచ్చినప్పుడు కోపపడువాఁడు, తత్ఫలముగ శత్రువులను బరిమార్చువాఁడు, లోకోత్తరుఁడు, మహారథుఁడునైనవాఁడు. సకల జనము లారామునిచేతి నీడయందు నిలఁబడియున్నవి. అట్టిరాముని మాయామృగము నెపమున వెలుపలికిఁ బోవున ట్లొనర్చి నిర్జనవనము నుండి యేరావణుఁడు నిన్నుఁ దెచ్చెనో, ఆరావణుఁడు దానికై యనుభ వింపఁబోవు ఫలము నీవు వేగిరమె చూడఁగలవు. ఓదేవీ! యేరాముఁడు యుద్ధమున రోషముచే బాణములఁ బ్రయోగించి రావణుని వధింపఁ బోవుచున్నాఁడో ఆరాముఁడే నన్నుఁ బంపఁగా, నేను నీకడ కేతెంచితిని. ఆరాముఁడు నీయెడఁబాటువలనివెతలచేఁ గుందినవాఁడై నీతో సేమము చెప్పుమనెను. సుమిత్రకు సంతసమెసఁగఁజేయువాఁడును, గొప్ప తేజస్సు గలవాఁడునునైన లక్ష్మణుఁడును నీకు మ్రొక్కి నీతో క్షేమము చెప్పు మనెను. వానరశ్రేష్ఠులకెల్ల రాజును, రామునికిఁ జెలికాఁడునైన సుగ్రీ వుఁడును నీ కుశలమడిగెను. ఓదేవీ, రాముఁడు లక్ష్మణసుగ్రీవులను గూర్చుకొని యెల్లప్పుడు నిన్ను స్మరించుచుండును. ఓవైదేహీ! నీవు రాక్షసులవశమునఁ జిక్కియు, దైవానుగ్రహమునంజేసి జీవించి యున్నావు. వేగిరమె బలవంతులగు రామలక్ష్మణులును వానరరాజగు సుగ్రీవుఁడును ఇక్కడికి రాఁగలరు. ఏను సుగ్రీవునిమంత్రిని. హను మంతుఁడను పేరుగల వానరుఁడను. ఈమహాసముద్రమునుదాఁటి

లంకాపురములోపలఁ జొచ్చి, దురాత్ముఁడయిన రావణునినెత్తిని కాలు పెట్టి, మగటిమి పూని, నిన్నుఁ జూడ నేతెంచితిని. ఓదేవీ! నీవెట్లు నన్నుఁ గూర్చి తలఁచెదవో, నేనట్టివాఁడను గాను. ఈ కుశంక మాని, నామాట నమ్ముము" అని సీతాదేవిని నమ్మఁబలికెను.

35-వ సర్గము

హనుమంతుఁడు రామునిగుణంబుల వర్ణించుట

వైదేహి హనుమంతునివలన నారామునివృత్తమును విని, "ఓ వానరా! నీకు ఆరామునితోఁ గూడిక యెక్కడఁ గలిగెను? లక్ష్మణుని నీ వెట్లెఱుఁగుదువు? వానరులకును నరులకును నెట్లు స్నేహము సమకూఁతెను? రామలక్ష్మణులరూపచిహ్నము లెట్టివి? ఆరామలక్ష్మణుల యంగములపొందిక యెట్టిది? వారిచేతులు దొడలును నెట్టివి? చెప్పుము. వారిచిహ్నములను నాకుఁ దెల్పితివేని, నాకు వ్యసనము కొంత తగ్గును" అని యింపుగులుకు పలుకులతో నడిగెను.

వాయుసూనుఁడగు హనుమంతుఁడు సీతాదేవియడిగినమాటవిని, "ఓ కమలపత్రాక్షీ! యాహా, నీవు నీభర్తయొక్కయు, లక్ష్మణుని యొక్కయు చిహ్నముల నెఱిఁగినదానవుగానున్నను, నన్నడుగు చున్నావుగదా. అయినను, గొఱఁత లేదు. ఆ రామలక్ష్మణులచిన్నెలను నేను చూచినంతవఱకు నెఱిఁగించెదను వినుము.

ఓ జానకీ! రాముఁడు తమ్మితేకులంబోలు కన్నులుగలవాఁడు. సకలజంతువులకు మనోహరుఁడు. రూపము, దాక్షిణ్యమును గల వాఁడు. తేజమున మార్తాండుని, ఓర్పునఁ బుడమిని, బుద్ధిని బృహస్పతిని, కీర్తిని నింద్రునిఁ బోలువాఁడు. సకలజనములను, దనచుట్టాలనుబోలెఁ బోషించువాఁడు. స్వధర్మమును, స్వవృత్త మును గాపాడువాఁడు. శత్రువులను సంహరించువాఁడు. బ్రాహ్మణాదులగు నాలుగువర్ణముల వారిని గాపాడువాఁడు. లోకవాడుకలను చేయువాఁడు, చేయించువాఁడు, కాంతిగలవాఁడు. సజ్జనసంపూజితుఁడు. ఋతుకాలములందుమాత్రము పత్నినిగవయుటచే బ్రహ్మచర్యవ్రతము నడచుకొనువాఁడు. సజ్జనులకు మేలొడఁగూర్చఁ దలఁచువాఁడు. సకలకర్మముల నడపురీతి నెఱిఁగినవాఁడు. రాజనీతి

యందు నేర్పరి. బ్రాహ్మణులను గొల్చువాఁడు. శాస్త్రముల నధ్యయనము చేసినవాఁడు. సత్స్వభావము గలవాఁడు. పెద్దలయెడ నడఁకువ గనఁ బఱచువాఁడు. యజుర్వేదముఁ జదివినవాఁడు. వేదాంగములందును, ధనుర్వేదమునందును, తక్కిన వేదములందును నేర్పుగలవాఁడు. వేదార్థముల నెఱిఁగినవారిచే బహుమర్యాద చేయఁబడువాఁడు. విఱివి మూఁపురమును, నిడుపుచేతులును, శంఖమువంటిమెడయు, నెమ్మో మును, చక్కఁగాఁ గనఁబడని మూఁపుసంధులయొమ్ములును, కడు నెఱ్ఱని నేత్రములును గలవాఁడని లోకప్రసిద్ధి నొందినవాఁడు. ధుందుభి వాద్యపు ప్రౌఢంబోలు కంఠస్వరమును, నున్ననిమేనిడాలును, ఎక్కువ కాంతియు గలవాఁడు. పొడవును గుఱుచయుఁగాక సమముగా నుండు వాఁడు. శ్యామలవర్ణుఁడు, గట్టివైన ఱొమ్ము, మణికట్టు, పిడికిలియుఁ గలవాఁడు. కనుబొమలు, చేతులు, వృషణములు గలవాఁడు. సమ మయిన వెండ్రుకలకొనలు, బీజములు, పిక్కలు గలవాఁడు. ఉన్నతము లయిన బొడ్డు, పొట్ట, ఱొమ్ము గలవాఁడు. నెఱ్ఱనైన కంటితుదలు, గోళ్లు, అఱిగాళ్లు గలవాఁడు. నిద్దములైన కాలిరేఖలు, శిరోజ ములు, లింగము గలవాఁడు; నాభి, కంఠస్వరము, స్వభావము లోఁతయినవాఁడు. బొజ్జమూఁద మూఁడుముడతలు గలవాఁడు. అవనతములయిన స్తనములు, చనుమొనలు, కాలిరేఖలు గలవాఁడు. కుఱుచైనమెడ, మేహనము, పిఱుఁదు, పిక్కలు గలవాఁడు. సమము, గుండ్రము, ఛత్రాకారము అను మూఁడు లక్షణములతోఁ గూడిన శిరస్సుగలవాఁడు. నాలుగువేదముల యధ్యయనమును దెల్పు బొట్టన వ్రేలియందలి నాలుగురేఖలును, నొసటను కాళ్లయందును చేతులందును నాలుగేసిరేఖలును గలవాఁడు. తొంబదియాఱంగుళముల పొడవుగల చేతులు గలవాఁడు. సమములయిన చేతులు, మోఁకాళ్లు, తొడలు, పిక్కలు గలవాఁడు. రెండు కనుబొమ్మలు, రెండు ముక్కు తొట్టిలు, రెండు కన్నులు, రెండు చెవులు, రెండు పెదవులు, రెండు చనుమొనలు, రెండు మోఁచేతులు, రెండు మణికట్లు, రెండు మోఁకాళ్లు, రెండు బీజములు, రెండు పిఱుఁదులు, రెండు చేతులు, రెండు పాదములు, రెండు పిక్కలు అను నీపదునాలుగు జంటల యవయవములును సమ ముగా నుండెడువాఁడు. నాలుగుదంష్ట్రలను పండ్లుగలవాఁడు. సింహ

వ్యాఘ్రగజవృషభముల నడకంబోలు నడకగలవాఁడు. దొండపండు వలె నెఱ్ఱనైన కండపట్టిన పెదవులును, ఉబ్బిన బలిసిన నిండిన చెంపలును, నిడుపువి ఎత్తువి సొగసువియు నైన ముక్కుపుటములును గలవాఁడు. స్నిగ్ధములయినమాటలు, ముఖము, గోళ్ళు, రోమములు, చర్మముగల వాఁడు. నిడివియైన వెన్నెముక, శరీరము, కాలుసేతులవ్రేళ్లు, చేతులు, ముక్కు, కన్నులు, చెవులు,శిశ్నము నను నెనిమిదంగములు గలవాఁడు. పద్మమువంటి యాకారముగలవగు మోము, కన్నులు, వాయి, నాలుక, పెదవులు, దౌడలు, స్తనములు, గోళ్లు, చేతులు, పాదములు అను పది యంగములు గలవాఁడు. గొప్పవైనతల, నొసలు, చెవులు, మోము, మెడ, ఱొమ్ము, గుండెకాయ, కడుపు, కాలుసేతులు, వీఁపు అను పది యంగములుగలవాఁడు. ప్రసిద్ధికెక్కిన కీర్తి, తేజము, పేరునుంగల వాఁడు. నిష్కళంకములైన మాతాపిత్రువంశములు కలవాఁడు. ప్రక్కలు, కుక్షి, ఱొమ్ము, ముక్కుపుటములు, మూఁపులు, నొసలు అను నా యున్న తాంగములు గలవాఁడు. సన్ననైన వ్రేళ్లగణుపులు, శిరోజ ములు, రోమములు, గోళ్లు, చర్మము, మగగుఱి, మీసములు, దృష్టి, బుద్ధియు నను తొమ్మి దవయవములుగలవాఁడు. ధర్మ అర్థ కామములను వరుసగా పూర్వాహ్ణమునను, అపరాహ్ణమునను, రాత్రులయందును సేవించువాఁడు. సత్యవాక్యపరిపాలనమునందుఁ బట్టుదలగలవాఁడు. కాంతిమంతుఁడు. ధనసంపాదనమునందును, ధనమువెచ్చించుటయందును శ్రద్ధగలవాఁడు. యుక్తదేశ కాలములవిభాగము నెఱిఁగినవాఁడు. సర్వజనుల కింపుగా మాటాడువాఁడు. ఆరామునికి సవతితల్లికొడుకగు లక్ష్మణుఁడును శత్రువులకు లొంగనివాఁడు; ప్రేమరూపగుణములందు నారామునే పోలినవాఁడు.

ఆనరోత్తము లిద్దఱు నిన్నుఁ గనుంగొనఁగుతూహలముగలవారై, పుడమినెల్ల వెదకుచు,అన్న తఱుమఁగొట్టగా నతనికి వెఱచి, పరుగెత్తివచ్చి పెక్కువృక్షములతో నిండియున్న ఋశ్యమూకపర్వతమునందు దాఁగి యున్న సుగ్రీవుఁడ నెడివానరుని, ఆతనిమంత్రులమగు మమ్మునుఁజూచెను. అన్న చే రాజ్యమునుండి తఱుమఁబడి ఋశ్యమూకమున నున్న సత్యసంధుఁడగు వానరరాజయిన సుగ్రీవునికి మంత్రులమైన మేము పరిచర్య చేయు చుంటిమి. అంత నారబట్టలఁగట్టినవారును, మేటివింట్లను దాల్చినవారునై వ

యారాజపుత్రులగు రామలక్ష్మణు లిద్దఱును ఋశ్యమూకపర్వతము యొక్క మనోహరప్రాంతమునకు వచ్చిరి.వానరరాజగు సుగ్రీవుఁడును విండ్లు దాల్చిన యాపురుషశ్రేష్ఠులం జూచి, వారు వాలిచేఁ బంపఁబడిన బంటులేమో యని వెఱచినవాఁడై, యాపర్వతంపుఁగొనకు నెగిరి, యచ్చటనుండినవాఁడై, వాక లెవ్వరో కనుఁగొనిరమ్మని నన్నే వారి కడకుఁ బంపెను. నేనును సుగ్రీవునియానతిని గొని, రూపలావణ్యము లతోఁగూడిన యారాజపుత్రులకడకుఁ బోయి దోసిలి గట్టికొని నిలిచి, వారివాస్తవ స్థితిని గనుఁగొని, వారికి మాయెడఁ గల ప్రేమ వెల్లి విరియ, నాపురుషోత్తముల రాజపుత్రుల నిరువురిని నా మూఁపుమీఁద నెక్కించికొని, మాయేలికకడకుఁ దెచ్చివిడిచి, వానరేంద్రుఁ డయిన మా రాజగు సుగ్రీవునికి వారివాస్తవస్థితి నెల్ల నెఱింగించితిని. అంత వారొండొరులు గలిసి కొంతతడవు ముచ్చటలాడఁగా వారికి మేరలేని పరస్పరవిశ్వాసము గలిగెను.

ఒండొరులమీఁదఁ బ్రేమగల యా వానరేంద్రనరేంద్రులు ముందు నడచిన వృత్తాంతముఁ దెల్పుకొని యొండొరులను నమ్మిన వారైరి. అంత లక్ష్మణుని యన్నయగు రాముఁడు, ఎక్కువ పరాక్రమముగల తనయన్నచేఁ దనయాలిని లాగికొని తఱుమఁబడి పర్వతమున దుఃఖపడుచున్న సుగ్రీవుని "చెలికాఁడా! నీవు చింతపడవలదు. నేను నీశోకము మాన్పెదను" అని యూరడించెను. ఆయద్భుతమైన మగఁ టిమిగల రామునికి నీవియోగముచేఁ గలిగియుండు వ్యసనమును లక్ష్మణుఁడు సుగ్రీవుని కెఱిఁగించెను. వానరరాజగు ఆసుగ్రీవుఁడును లక్ష్మణుఁడు తెలిపినసంగతిని విని పర్వమునందు రాహుగ్రహచే మ్రింగఁబడిన సూర్యునిమాడ్కిఁ గడు వెలవెలపోయెను. అప్పుడే రావణుండు నిన్నెత్తుకొని పోవునపుడు, నీదేహమున వెలుఁగుచుండిన సొమ్ములను ఒలిచి, నీవు పైటకొంగునఁగట్టి క్రిందవైచిన సొమ్ములమూటను వానరులు సంతసముతోఁ దెచ్చిచూపిరిగాని, నీ వే దిక్కునకుఁ బోయినది యెఱుఁగరైరి. ఆకాశమునుండి పడునప్పుడు మ్రోగుచుండిన యాసొమ్ములను రామున కిమ్మని సుగ్రీవుఁ డీయఁగా, నే నాసొమ్ములమ్రోలను దెచ్చి శోకముచేఁ దెలివిదప్పియున్న యా రామునిముందట నర్పించితిని. దేవ తలమాడ్కి వెలుఁగునట్టి యారాముఁడు చూడఁదగియుండు నాసొమ్ము

లను తనతొడమీఁద నుంచుకొని పలుతెఱఁగుల విలపించెను. ఆ సొమ్ము లను జూచిచూచి పలుమాఱు వెలవెలపోయి దుఃఖించెను. ఆ తొడవు లా రామునకు శోకాగ్నిని మఱింత హెచ్చుఁజేసెను. అంతట దశరథ సూనుఁడు తాను గడుధైర్యవంతుఁడయ్యు నీవియోగశోకముఁ దాళఁ జాలక మూర్ఛిల్లెను. అప్పుడు నేనును బలువిధముల నోదార్చి మాటి మాటికి లేవనెత్తి కూర్చుండఁబెట్టితిని. అంత రాఘవుండు లక్ష్మణసమే తుఁడై యాభూషణములను బలుమాఱు తాను జూచి, మాటిమాటికి మా కంబఱకుఁ జూపించి, పలుతెఱఁగుల విలపించి, యా తొడవులను గడపట సుగ్రీవునిచేత నుంచెను.

అగ్నిపర్వతము సదా మండుచున్న గొప్పమంటచేత నెఱియు నట్లు, ఓ దేవీ! రాఘవుఁడును నీవర్ణనాభావముచే దుఃఖాగ్నియందు మలమల మాడుచున్నాఁడు. దక్షిణాగ్ని గార్హపత్యాహవనీయము లనెడు మూఁడగ్ను లగ్నిహోత్ర గృహమును దపింపఁజేయునట్లు, నీనిమిత్తమైన జాగరమును, శోకమును, చింతయు రామునిఁ దపింపఁ జేయుచున్నవి. గొప్ప భూకంపముచే గొప్పకొండ యూఁగులాడు నట్లు, నీయదర్శనముచే రాఘవుఁడు ధైర్యంబేది వణఁకుచున్నాఁడు. ఓ రాజపుత్రీ! యిక్ష్వాకునందనుఁ డెన్నియో యొప్పినకానలను, నెల యేళ్లను, ఏళ్లను దిరిగినను, నిన్నుఁ జూడక మది సంతసముఁ బొసి యున్నాఁడు. ఓ జానకీ! ఆ పురుషోత్తముఁడు వేగమె వచ్చి రావణుని మిత్రబంధు పరివారసహితముగా వధించి నిన్నుఁ బొందఁగలఁడు. నీవు విచారము వాయుము.

అంతట రాముఁడు వాలిని జంపునట్లును, సుగ్రీవుఁడు నిన్ను వెదకి యిచ్చునట్లును వారిద్దఱుగలిసి యేర్పాటుచేసికొనిరి. వెంటనే వానరరాజగు సుగ్రీవుఁ డారాజపుత్రులను దోడ్కొని చని వాలిని యుద్ధమునకుఁ బిలిచెను. ఆ యుద్ధమున రాఘవుఁడు సుగ్రీవునికి బాస టయ్యెయుండి వాలిని సంహరించి సుగ్రీవుని వానరరాజ్యమునఁ బట్టాభి షిక్తుం జేసెను. ఓ దేవీ! రామసుగ్రీవుల కిద్దఱి కివ్విధమునఁ జెలిమి గలిగెను. నేను హనుమంతుఁడను. వారు పంపఁగా నిచ్చటికి వచ్చిన దూత నని యెఱుఁగుము.

సుగ్రీవుఁడు రాజ్యమును బొంది, బలవంతులైన వానరశ్రేష్ఠుల నందఱను బిలిపించి, నిన్ను వెదకుటకై యన్ని దెసలకుఁ బంపెను. పర్వతోత్తమములఁ బోలిన వానరవీరులు పరాక్రమశాలియగు వానరేంద్రునియానతి గొన్నవారై భూమండలమున నన్ని వైపులకుఁ దఱలిరి. ఆవానరవీరులును, మేమును భూమియెల్ల నీనిమిత్తమై తిరుగుచున్నాము. కాంతిమంతుఁడును, బలవంతుఁడునైన యంగదుఁడను పేరుగల వాలినందనుఁడు వానరసేనలో నేను మొదలుగాఁగల మూఁడవ పాలుసేనను గైకొని దక్షిణదిశకుఁ బయనమాయెను. మేము వింధ్యపర్వతము సొచ్చి పర్వతదుర్గములందును, నెలయేళ్లయొడ్డులందును నిన్ను వెదకుచు నొక గుహ చొచ్చితిమి. అచ్చట దారితెలియమిచే మేము దుఃఖాక్రాంతులమై పెక్కు రేయింబగళ్లు గడపితిమి. మాకు వానరరాజొక్క నెల గడువొసఁగెను. ఆగడువులోపల మేము రానియెడల, మాకు మరణము దండనముగా విధింపఁబడియుండెను. మేమంద అమును కార్యము కాకపోవుటచేతను, గడువు మీఱిపోవుటచేతను, వానరేంద్రునివలని వెఱపుచేతను ప్రాణముల విడువ నిశ్చయించితిమి. అప్పు డంగదుఁడు ప్రాయోపవేశముచేసిన నేను మొదలగువానరవీరుల నందఱినిఁ జూచి, శోకసాగరమునఁ బూర్ణముగా మునిఁగినవాఁడై "నీవేల కనఁబడకపోవలెను? రాముఁడు వాలి నేల చంపవలెను? సుగ్రీవుఁడు పంపఁగా వచ్చిన మన కాసీత యేల కనఁబడకపోవలెను? మన మెల్లరు ప్రాయోపవేశమేల చేయవలెను? జటాయువు ప్రతికియుండిన నాతఁడే రామునికి సీతాదేవివృత్తాంతము చెప్పియుండునే. ఆతఁ డేల చావవలెను?" అని విచారపడెను.

అప్పుడు మే మందఱమును రాజు నుత్తరువు మీఱుటచే నిరాశులమై ప్రాణముల విడువ సిద్ధముగా నుండఁగా, వీర్యవంతుఁడును, గొప్పవాఁడునైన యొకపక్షీంద్రుఁడు పనియున్న వాఁడువోలె నచ్చటి కేతెంచెను. అతఁడు జటాయువునకుఁ దోఁబుట్టువు. సంపాతియను పేరు గలవాఁడు. ఆతఁ డంగదునిమాటవలనఁ దనతమ్ముఁడు మృతినొందిన వార్త విన్నవాఁడై, "ఓ వానరోత్తములారా! మాతమ్ముని నెవ్వఁ డెచ్చటఁ జంపెను? నాకుఁ జెప్పవలయు" నని యడిగెను. అంగదుఁడును "జటాయువు నీనిమిత్తమై జనస్థానమున రావణునితోఁ బోరుచేయుట,

ఆపోరున క్రూరకర్ముఁడగు రావణాసురుఁడు నిన్నుఁ జంపుట మొదలగు సంగతులను దెలిపెను. అంతట సంపాతి జటాయువువధమును విని దుఃఖించినవాఁడై, ఓ దేవీ! నిన్ను రావణునింట నున్న దానిఁగాఁ దెల్పెను.

నీదర్శనమునం దాసక్తిగలవారలైన యంగదుఁడు మొదలగు వానరవీరు లందఱును సంపాతిచెప్పిన సంతోషదాయకమైన వార్తను విని, వేగిరమే ప్రాయోపవేశము విడిచిలేచి, వింధ్యపర్వతమ్మునుండి బయలుదేరి దక్షిణమహాసముద్రముయొక్క యీవలిగట్టుచేరి, మొదట హర్షసంతోషములఁ బొందిరిగాని యీవల "దీనినెట్లు దాఁటి యీలంకా పురిం జేరఁగల" మని సముద్రము దాఁటుటకు వెఱచి విచారగ్రస్తులైరి.

అప్పుడు నేను వానరసైన్యము సముద్రము దాఁట వెఱచి యుండుటనుజూచి, యోర్వరాని భయమును విడిచిపెట్టి నూఱు యోజనములదవ్వు గల సముద్రమును దాఁటి, రాక్షసులచే నిండి యున్న లంకాపురిని రాత్రి ప్రవేశించితిని. రావణునిఁ జూచితిని. దుఃఖార్ణవమున మునిఁగియున్న నిన్నును జూచితిని. ఓ పతివ్రతా! నడచినది నడచినట్లు నీకంతయు నెఱిఁగించితిని. నేను రాముని కడనుండి వచ్చినదూతను. రాముఁడు నన్నుఁ బంపఁగా నిన్ను వెదకుటకై యిచ్చటికి వచ్చితిని. నేను సుగ్రీవునిమంత్రిని వాయుపుత్రుఁడను. నా యందు సందియము వదలి నాతో మాటాడుము.

ఓ దేవీ! పరాక్రమశాలియైన నీప్రియునికి మేలొడఁగూరుటయం దాసక్తిగలవాఁడనై, సుగ్రీవుని యానతిఁబట్టి నేనొక్కఁడను మాత్రమే యిచ్చటికి వచ్చితిని. నేను కామరూపం బెత్తి నీపోవిడి వెదకుచు నొంటిరిగా దక్షిణదిశను వెదకి సముద్రము దాఁటి వచ్చితిని. నీనాశము నిశ్చయించి విచారపడుచున్న నాతోఁ గూడవచ్చిన వానరవీరులను సంతోషపెట్టితిని. అదృష్టవశమున నా సముద్రతరణశ్రమము వ్యర్థము గానిదయ్యె. అంతియకాక, నీదర్శనమువలనఁ గలిగిన ఖ్యాతిని సైతము

కకుత్థ్సవంశతిలకుండును, విలుకాండ్రందఱి లోపల నుత్తముఁడును నైన నీనాథుఁడును, గురుపూజ చేయువాఁడును, చక్కనిరాజ చిహ్నములు గలవాఁడునైన లక్ష్మణుఁడును సేమముగా నున్నారు.

పొందెదను. ఓ వైదేహీ! రఘుపుంగవుఁడు వేగమే వచ్చి రాక్షసాధిపుని రావణుని సమూలముగా వధించి నిన్నుఁ బొందఁగలఁడు.

వైదేహీ! మాల్యవంత మను పర్వతవరం బొండు గలదు. నాతండ్రియగు కేసరియనువానరుఁ డప్పర్వతవరమునుండి గోకర్ణమునకుఁ బోవుచుండఁగా నచ్చట నుండు దేవర్షులు పురికొల్పఁగా, పవిత్రమయిన వారుణతీర్థమున శంబసాదనుఁడను నసురుని సంహరించెను. నాతండ్రి యగు కేసరునిపత్నియందు వాయుదేవుని బీజమువలనఁ బుట్టినవాఁడను. స్వకార్యముచేతనే హనుమంతుఁడని ప్రఖ్యాతి చెందినవాఁడను. ఓ దేవీ! నీకు నమ్మికపుట్టునిమిత్తమై భర్తయొక్క గుణములను వర్ణించి చెప్పితిని. ఓ పతివ్రతా! రాఘవుఁడు నిన్ను వేగిరమే యిచ్చటినుండి తోడ్కొనిపోఁగలఁడు."

అని హనుమంతుఁడు యుక్తములైన యానవాలులతోఁగూడఁ జెప్పఁగా, శోకముచేఁ గృశించియున్న రాముని పత్ని యతనిని రాముని దూతనుగా నెఱిఁగి, యాహనుమంతునివాక్యశ్రవణముచే నెక్కువ యానందము నొందినదై, "నేటి కింతమాట వింటినిగదా" యని వంకరతెప్పవెండ్రుకలుగల నేత్రములనుండి యానందబాష్పములను గార్చినదాయెను. మఱియు చుట్టునెఱుఁగను, నడుమఁ దెల్లగ నుండునట్టి నిడివి కన్నులుకలదగు ఆసీతాదేవియొక్క మోము రాహువుచే విడువఁ బడిన రిక్కలరాయనిమాడ్కి వెలిఁగెను. అప్పు డాదేవి యతఁడు హనుమంతుఁ డనువానరుఁడే కాని, తానంతకుమున్ను తలఁచినచొప్పున కామరూపుఁడయిన రావణుఁడు గాఁడని తలఁచినదాయెను.

తర్వాత హనుమంతుఁ డింపుచూపుగలదగు సీతనుగూర్చి, "ఓ మైథిలీ! యీ సంగతియెల్ల నీకు విస్తరించిచెప్పితిని. ఇఁకనైన నమ్ముము. ఇఁక నేనేమి చేయుదును? నీ కేమి చేయవలెనని తోఁచుచున్నది? నేను మఱలిపోయెదను. ఓ మిథిలాధిపునికూఁతురా! నుహర్షులప్రేరణవలన నాతండ్రియగు కేసరి శంబసాదనుం డను రాక్షసునిఁ జంపినతర్వాత, నాతనిపత్నియందు వాయుదేవునికి జన్మించినవాఁడను. సామర్థ్యమున నాతనినే పోలినవాఁడను" అని సీతాదేవితోఁ జెప్పెను.

36-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవి కంగుళీయకము నొసఁగుట

ఎక్కువ పరాక్రమము గలవాఁడగు వాయునందనుఁడయిన హనుమంతుఁడింకను సీతాదేవికి నమకము గలిగింపఁ గోరినవాఁడై "ఓ పాతివ్రత్యమహిమగలదానా! యేను వానరుఁడను. వివేకియగు రాముని కిదూతను. ఓదేవీ! రాముని ముద్దుటుంగర మిదిగో చూడుము. నీకు నమ్మిక పుట్టుటకై యాధీరుఁడగు రామభూవిభుఁడొసఁగఁగా, నేను దీని నీకుఁ జూపఁ దెచ్చితిని. దీనిని జూచినపిదపనైనను నన్ను నమ్ముము. దీని మూలమున నీవ్యసనము దొలఁగెనుగదా" అని సీతతో ననెను.

ఆసీతాదేవియుఁ బెనిమిటియొక్క ముద్దుటుంగరమును జేతఁ దీసికొని తదేకదృష్టితో నవలోకించి, సాక్షాత్తుగాఁ దనభర్త వచ్చినట్లు తలఁచి సంతసించెను. అప్పుడు తామ్రశుక్లాయతనేత్రమైన యామె ముఖము రాహువునోటినుండి వెలువడిన చంద్రబింబమువాఁడ్క వెలిఁగెను. అంతట సిగ్గుగలదియు, ముగుదయునునైన సీతాదేవి పెనిమిటి వృత్తాంతము దెలియుటచే మిక్కిలి యుప్పొంగినదయి, హనుమంతు నాదరించి యతనితో నిట్లనియె.

ఓ వానరశ్రేష్ఠుఁడా! నీవు శూరుఁడవు. నీవు సకలకార్యనిర్వాహ సమర్థుఁడవు. అన్నియు నెఱిఁగినవాఁడవు. కావుననే మొనగాఁడని పేరొందిన నీవొక్కఁడవు మాత్రమే నూఱుయోజనములవ్వ గల యీకడలిని గోపదతుల్యముగా దాఁటి, యీఘోరరాక్షసులయునికి పట్టగు లంకాపురము చొచ్చితివి. ఓ వానరపుంగవా! నీకు సముద్రముఁ జూచిన భీతియు, రావణునిఁ జూచినఁ దత్తరపాటును లేకుండెను గావున నీవు సామాన్యవానరుఁడవు గావని తోఁచెడి. వానరశ్రేష్ఠా! సర్వజనుల మనోభావముల నెఱుఁగఁగల ప్రసిద్ధుఁడయిన రాముఁడు నిన్నుఁ బంపెను గనుక నేను నీతోడ సంభాషించెదను. శత్రువులకు లొంగనివాఁడగు రాముఁ డొక్కనిగుణమును బరిశీలింపక, ముఖ్యముగా వానిపరాక్రమము నెఱుఁగక నాకడకు దూతనుగాఁ బంపియుండఁడు.

ధర్మమునడుపువాఁడును, ప్రతిజ్ఞ తప్పనివాఁడునైన రాముఁడును, నెక్కువ మగటిమిగలవాఁడును, సుమిత్రకు సంతోషమెసఁగఁ జేయు

వాఁడునైన లక్ష్మణుఁడును దైవానుగ్రహమువలన క్షేమముతో నున్నారుగదా! కకుత్స్థవంశోద్భవుఁడైన రాముఁడు క్షేమముతోనుండు నేని, అతఁడలిఁగినచో ప్రలయకాలమునఁ బైకిలేచిన యగ్నిహోత్రుని మాడ్కి సముద్రములచేఁ జుట్టఁబడియున్న భూమండలమును గాల్చి వేయును గదా! వారిద్ద ఱేమో సుకలనైనను తిరస్కరింపఁగలవారే. అయినను, నాదుఃఖములు తీరుకాలము రాలేదుకాఁబోలు. రాముఁడు నావియోగవ్యసనముచేఁ గృశింపకున్నాఁడుగదా? వెతలఁగుందకున్నాఁడు గదా! నన్నుఁ గనుఁగొనుటకై చేయవలసిన పనులుచేయుచున్నాఁడు గదా! దైన్యమొందకున్నాఁడుగదా! డెందమునందుఁ గలవరపడి కార్యములందుఁ దప్పిపోవఁడుగదా! రాజపుత్రుఁడు పౌరుషకార్య ములను జేయుచున్నాఁడుగదా? పరంతపుఁడైన రాముఁడు జయా కాంక్షతో మిత్రులందు సామదానములనెడి యిటు తెఱఁగులగు నుపాయ ములను, శత్రువులందు దానభేదదండములనెడి త్రివిధోపాయములను బ్రయోగించుచున్న వాఁడే? ఈతఁడు చెలికాండ్రను సంపాదించు చున్నాఁడే? చెలికాండ్రతనిచెలిమిఁ గోరుచుండురే? ఈతఁడు పనుల యందుఁ దనమిత్రులను ముందుగాఁ బిలుచుచున్నాఁడే? చెలికాం డ్రితనిని తమపనులందు ముందుగాఁ బిలుచుకొనిపోవుదురే? రాఘవుఁడు దేవతలఁ బ్రార్థించుచు, వారి యనుగ్రహమును గోరుచుండునే? ఆతని కార్యములకు దైవమనుకూలమై యున్నదే? ఓవానరాధిపా! దేశాంత రమున నుండుటఁబట్టి, నాపై రాఘవుఁడు ప్రేమలేనివాఁడుగా నుండఁడు గదా! నన్నేమైన నాప్రియుఁ డీదుఃఖమునుండి విడిపింపఁబోవనున్నాఁడే? ఎల్లప్పుడు సుఖములను బొందఁదగినవాఁడును, దుఃఖము లనుభవింపఁ దగనివాఁడునైన నానాథుఁడు మీఁతిన వ్యసనము నొందియుఁ గృశించి పోవఁడుగదా? కౌసల్యాసుమిత్రల యొక్కయు, భరతునియొక్కయు క్షేమవృత్తాంత మప్పుడప్పుడు తెలియుచున్నదిగదా? గారవింపఁదగిన రాఘవుఁడు నన్నుఁగూర్చిన శోకముతో వెతలఁ బడుచుండునుగదా? రాముఁడు నాతలంపుతోనేయుండి వేఱొకతెను గోరఁడుగదా? నన్నే విధముననైన నీ దుఃఖాబ్ధినుండి దరిజేర్చునుగదా? సోదరులందుఁ బ్రేమ గల భరతుఁడు నానిమిత్తమై భయంకరమయిన యక్షౌహిణీబలమును మంత్రులయధికారమున నుంచి పంపునుగదా? వానరుల కధిపుఁడును,

కాంతిగలవాఁడునైన సుగ్రీవుఁడు నన్ను విడిపించుకొని పోవు నిమిత్తమై ! దంతములు నఖములు నాయుధములుగానుపయోగించెడి శూరులయిన వానరులఁ దోడ్కొనివచ్చునా? శూరుఁడును, సుమిత్ర కానంచప్రదుఁడును, శస్త్రాస్త్రవేదియు నైనలక్ష్మణుఁ డిచ్చటికి వచ్చి రాక్షసులను బాణ పరంపరలతో రూపుమాపఁగలవాఁడుగదా? లక్ష్మణాదులు స్వల్పకాలము ననే దగదగవెలుఁగు భీకరాస్త్రములు ప్రయోగించి రావణుని బంధు మిత్రపరివారముతోడ సంహరింపఁబడుటను చూడగలనుగదా? బంగారు వన్నెగలదియు, తామరపువ్వుంబోలు నెత్తావిగుబాళించునదియునైన యీరామునిముద్దుమోము నావియోగదుఃఖముచే నెఱ్ఱనై, నీరులేక యెండకెండిన కమలమువలె వాడుపాఱకున్నదిగదా ? ధర్మమునకు లోపము వాటిల్లఁగూడదనుతలంపుచే రాజ్యము విడిచినప్పుడును నన్నుఁ గాలినడకతో నడపించుకొని వచ్చినప్పుడును, తగ్గనిధైర్యమును నా నాథుఁడు విడువకయున్నాఁడుగదా? ఓదూతా! రాముని కిప్పుడు స్నేహ విషయమున నాకంటెఁ దల్లిగాని, తండ్రిగాని సాచ్చుగాదు. తుదకు సమమును గాదు. నాప్రియుఁడు నన్నుఁగొనిపోవుప్రయత్నము చేయు చున్నాఁడా యను సంగతి తెలియుటకుఁ బ్రాణముతో నుండఁగోరు చున్నాను" అని సీతాదేవి యింపుగులుకు గొప్ప యర్థముగల మాట లను జెప్పి, యావానరేంద్రునివలన రామునిఁగూర్చిన శ్రవ్యవాక్య ముల వినఁగోరినదై తనవాక్యములను జాలించినదాయెను.

పగతురచే నోర్వరాని మగటిమిగల వాయునందనుఁడు సీతా దేవి యడిగిన మాటలను విని, చేయెత్తి మ్రొక్కుచు బదులు సెప్పెను: "ఓ కమలనేత్రీ! రామునికి నీ విచ్చటనుండు సంగతి తెలియదు. కాఁ బట్టియె ఇంద్రుఁడు శచీదేవినింబోలె రాముఁడు నిన్నును దోడ్కొని పోవకున్నాఁడు. నేను నీ వృత్తాంతమును గొనిపోయి చెప్పినవెంటనే వానరబలగము తోడ్కొని వేగిరమే రాఁగలఁడు. రాముఁడు బాణ ములఁబెక్కింటిని ప్రయోగించి దాఁటనలవికాని సముద్రమును బంధించి యావల సముద్రమునుదాఁటివచ్చి లంకాపురిలోని రాక్షసులను నిర్మూ లముచేయఁగలఁడు. ఆ రాముఁడు వచ్చినప్పుడు మృత్యుదేవత యడ్డు పడినను, దేవాసుర లాటంకపెట్టినను, వారి నందఱిని పిలుకుమార్పఁ గలఁడు. ఓ దేవీ! రాఘవుఁడు నీవియోగవ్యసనమున మునిఁగిన

వాఁడై సింహముచేఁ బీడింపఁబడిన యేనుఁగుమాడ్కిఁ గడుఁబరితపించుచు, సౌఖ్యము లేకయున్నాఁడు. ఓ దేవీ! చక్కని కన్నులును, దొండపండువంటి పెదవియు, సొగసుకుండలములను గలదై, యిప్పుడే యుదయించిన నిండుచందురునింబోలియుండు నారామునిమోమును నీవు తప్పకచూతువని నేను వాసముచేయు మలయ, వింధ్య, మేరు, మందర, దర్దుర, కందమూలఫలముల సాటిగాఁ జెప్పెదను. నామాట నిక్కమని నమ్ముము. ఓ వైదేహీ! నాకపృష్ఠమునందు దేవేంద్రుఁడునుంబోలె, ప్రస్రవణపర్వతమునఁ గూర్చుండిన యారాఘవుని నీవు వేగిరము చూడఁగలవు: ఓ దేవీ! రాఘవుఁడు నంజుడు దినఁడు. మధ్యము ద్రాసఁడు. మఱియేమియనిన, ఆరణ్యకవిధియందుఁ జెప్పినచొప్పున దానుదెచ్చిన కందమూలఫలముల నైదుభాగములుచేసి, యందు నాలుగుభాగములను దేవ, పితృ, అతిథి, భూతముల కొసఁగి, మిగిలిన యైదవభాగమును తాను బ్రతిదినమునను గుడుచుచుండును. మఱియు నారాఘవుఁడు నీయందు మనస్సు దవిలియుండుటచేతఁ దన యొంటిమీఁద వాలిన యీఁగలనేని, దోమలనేని, తక్కిన పురుగులనేని, దనదేహముమీఁదఁ బ్రాకుపాములనేని తోలనే తోలఁడు. ఆ రాఘవుఁడు కామపరవశుఁడయి, యెల్లప్పుడు నిన్నే తలఁచుచు, ఎల్లప్పుడు నిన్నుఁగూర్చి వగచుచు వేఱొక్కసంగతి నావంతయయినను దలఁపఁడు. పురుషోత్తముఁడైన యారామున కెల్లప్పుడు నిద్దురపట్టుటయే లేదు. అట్లొక్కవేళఁ గొంచెము కన్నులుమూసినను, ఉలికివడ్డట్టు లేచుచు "హా! సీతా!" యని యింపుమాటను బలుకుచుండును. మనోహరమగు నొక్కపువ్వునేని, పండునేని, లేక మఱేవస్తువునేనిఁ జూచినయెడ, "ఓసీ ప్రియురాలా!" యని నిట్టూర్పులు విడుచుచు, నీతో మాటాడినట్లు మాటాడును. ఓ దేవీ! మహాధీరుఁడయిన రాజపుత్రుఁడగు రాముఁడు నిశ్చలనియమము గలవాఁడై నిన్నుఁగూర్చియే పరితపించుచు, నిన్నుఁగూర్చియే కలవరించుచు, నిన్నుఁ బడయుటకై ప్రయత్నము లొనరించుచున్నవాఁడు.

అని యిట్లు హనుమంతుఁడు రామునిగుణశ్లాఘ చేయుట విని యెక్కువ సంతసించినవాఁడై, దుఃఖానుభవమున రామునిఁ బోలినవాఁడై, శరత్కాలమువచ్చి రాకయుండునప్పుడు మేఘములనడుమ నప్పుడప్పుడు

మఱుగుపడుచుఁ బ్రకటముగను అప్రకటముగను నుండు చంద్రబింబ| ముతోఁ గూడిన రాత్రివలె నుండినదాయెను.

37-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవికి స్వస్వరూపము చూపుట

నిండుచంద్రునిఁబోలు మొగముగల సీతాదేవి యాహనుమంతుని పలుకులు విని, ధర్మార్థముల ననుసరించి యాహనుమంతునితో నిట్లనియె :

"ఓ వానరా! నీ విప్పుడుచెప్పినమాటలు విషముగలిపిన యమృతముగా నున్నవి. రాముఁడు ననుఁ బాసినపిదప మఱొక్కతెయందు డెంద ముంచకున్నాఁడనుటచే నాకానందమును, ఎల్లప్పుడు నా వియోగదుఃఖమే పరమార్థముగా నెంచియున్నాఁడనుటచే నాకు వ్యసనమును గలిగినవి. దైవము బలవత్తరము. దైవము నిండుసుఖమునకుఁగాని, భీకరమయిన యాపదకుఁగాని పురుషునిఁ ద్రాటఁ గట్టినచందమున నీడ్చికొనిపోవును. వానరోత్తమా ! విధి యెవరికిని దప్పించుకొన శక్యముగాదు. మాకు విధి చాలమిచేతనేకదా యిప్పుడు రామలక్ష్మణులును నేనును ఈవిధముగా వెతలలోఁ జిక్కియున్నాము. చూడుము. మానవుఁడు సముద్రమునఁ బయనము చేయుచు, నావపగిలినయెడ, నీటఁబడి యీఁదుచుఁ గడుమనలసటతో గట్టు చేరుచందమున, రాఘవుఁడు శోకసాగరమున నీది యెన్నఁటికి దరి చేరఁగలఁడో! రాముఁడు రాక్షసులను సంహరించి, రావణునిఁ బిలుకుమార్చి, లంకాపురము మొదలంట ధ్వంసముచేసి, యెన్నఁడు ననుఁ జూడనున్నాఁడో! ఓ వానరపుంగవా! యీసంవత్సరము ముగియువఱకే నేను జీవించియుందును. ఇప్పుడు పదియవనెల గడవవచ్చినది. ఇఁక రెండునెలలు మిగిలియున్నవి. ఈ రెండు నెలలే రావణుఁడు గడువొసఁగెను. ఈలోపలనే రామునిఁ ద్వరపడునట్లు నీవు చెప్పవలసినది. రావణునికడఁగొట్టు తమ్ముఁడగు విభీషణుఁడు ననున్న మఱల రాముని కర్పింపమని యెన్ని యో తెఱంగుల వేఁడెను. కాలపాశమును బొందిన యా రావణుని మృత్యుదేవత సంగరమున వెదకుచున్నది గావున నతఁడా విభీషణునిమాటలను బెడచెవిని బెట్టినవాఁడు.

విభీషణునిపెద్దకూఁతురు నల యను నామె తనతల్లి పంపఁగా నాకడకువచ్చి యీసంగతి నాకుఁ దెలిపెను. వానరశ్రేష్ఠా! నామగండు త్వరలోనే నాకడకు రాఁగలఁడు. ఏలయన, నామనస్సును బరిశుద్ధముగా నున్నది. ఆరామునియం దుత్సాహము, మగతనము, దిట్టతనము, మెత్తనితనము, కృతజ్ఞత, శత్రువులను లోఁబఱచుకొనుట, తేజస్సు మొదలగు గొప్పగుణము లున్నయవి. జనస్థానమునఁ దమ్మునితోడ్పాటు సైతము లేక పదునాలుగువేలమంది రక్కసులను జంపినట్టి యారాముని కేపగ తుఁడు వెఱవకుండునా? ఆపురుషోత్తముని వ్యసనములందుఁ బెట్టి కదలించుట కెవనికిని వీలుగాదు. శచీదేవి యింద్రుని ప్రభావము నెఱిఁగిన చందమున, నేనును రఘువంశవీరుని ప్రభావము నెఱిఁగినదానను. ఓవానరా! రాముఁడనెడి సూర్యుఁడు తనబాణసమూహమనెడి కిరణములను బ్రసరింపఁజేసి, శత్రువులయిన రాక్షసులనెడి యుదకమునింకింపఁజేయఁగలఁడు."

అని పలుకునదియు, రామునినిమిత్తమయిన వ్యసనమునఁదవిలి చిక్కినదియు, కన్నులనిండఁ గన్నీరు పెట్టుకొన్నదియునైన యాసీతాదేవిని గూర్చి హనుమంతుఁ డిట్లనియె:

"ఓదేవీ! నీవు లంకాపురమున నున్నావన్న వృత్తాంతమును జెప్పిన వెంటనే, రాముఁడు వానరభల్లూకబలముతోఁగూడిన గొప్పసేనను తోడ్కొని వేగిరముగా రాఁగలఁడు. కాదంటివేని, ఓసుందరవదనా! నిన్నిప్పుడే యీదుఃఖమునుండి తొలఁగించెదను. ఓపుణ్యవతీ! నీవిప్పుడు నావీఁపుమీఁద నెక్కుము. నిన్ను వీఁపుమీఁద నెక్కించుకొని సముద్రమును దాఁటెదను. ఈలంకాపురమును రావణసమేతముగా నల్లె గడ్డతోడఁ బెల్లగించికొనిపోవుటకు నాకు శక్తి గలదు. అగ్నిహోత్రుఁడు దనయందు వేల్చిన హవిర్భాగమును దేవేంద్రున కర్పించినట్లు, నేనును నిన్నుఁ బ్రస్రవణపర్వతము మీఁద నున్న రాముని కొసఁగెదను. వైత్యవధమునఁ బూనికగలిగియున్న విష్ణువునుబోలె రావణసంహారమునకై పూనికగలిగియున్న వాఁడును, నీడర్శనమునం దుత్సుకముతోనుండువాఁడును, ఆశ్రమమున నుండువాఁడును, బలవంతుఁడునునై, నాగరాజముమీఁద నెక్కిన దేవేంద్రుని బోలినవాఁడయిన రాముని లక్ష్మణసమేతముగా నిప్పుడే చూడఁగలవు. ఓదేవీ! నావీఁపుమీఁద నెక్కుము.

ఓసుందరీ! ఉపేక్ష సేయకుము. రోహిణి చంద్రునితోఁ జేరినట్లు నీవును రామునితోడికూడికను గోరుము. సూర్యచంద్రులతో మాటాడుదాని వలె నావీఁపుమీఁద నెక్కి మహాసముద్రమును, ఆకాశమును దాఁటుము. ఓచక్కని యంగములు గలదానా! నిన్ను వీఁపుమీఁద నెక్కించుకొని యిచ్చటనుండి నేను పయనమైపోవునపుడు నా పరుగు నందుకొనుటకు లంకాపురనివాసులగు రాక్షసులలో నెవ్వరును జాలిన వారు కారు. ఓజానకీ! నే నిచ్చటికెట్లు సముద్రము దాఁటి వచ్చితినో, అట్లే నిన్నెత్తికొని యాసలివైపునకు దాఁటిపోయెదను, చూడుము నా ప్రభావము!"

అని హనుమంతుఁడు చెప్పిన వింతమాట విని, సీతాదేవియు సంతోషముచే మేనఁ బులకలెత్తఁగా, హనుమంతు నుద్దేశించి, "హనుమంతుఁడా! నీవింతదవ్వు నన్నెట్లు మోఁచికొని పోవఁగలవు? వానరోత్తమా! అదేకదా కోతిచేష్టయనునది. వానరేశ్వరా! నీదేహము కడుఁజిన్నది. నీవెట్లు నన్నామనుజేంద్రునికడకుఁ గొంపోవఁగలవు?" అని చెప్పెను.

కాంతిమంతుఁడగు మారుతనందనుఁ డయిన హనుమంతుఁడు సీతాదేవి మాటలను విని, తన్నామె క్రొత్తగాఁజేసిన యవమాన మని తలఁచినవాఁడై, "యీ నీలలోచనయగు వైదేహికి నాబలిమిగాని, మహిమగాని తెలియనట్లున్నది. కాని యిప్పుడు నాయథారూపము చూపెదను" అని తనలోఁ దాననుకొని, యాసీతాదేవికిఁ దనరూపము చూపి నమ్మకముగలిగింపఁ గోరినవాఁడై యా చెట్టుమీఁదినుండి క్రిందికి దుమికి, మేరుమందర పర్వతములతో సాటిగాఁ బెరిగి యగ్నిహోత్రుని మాడ్కి వెలుఁగుచు నెఱ్ఱనిమోమును, వజ్రాయుధమువంటి కోఱలును, గోళ్లును బొడసూపఁ జూపరకు వెఱపు పుట్టించువాఁడై, యాసీతాదేవి ముందట నిలిచి, "యోదేవీ! ప్రాకారతోరణ గోపురాదులతోడఁ గూడిన యీలంకాపురము దీనియేలికతోఁ గూడఁ మోఁచికొనిపోవ నాకు శక్తిగలదు. కావున మనస్సును దృఢపఱచుకొని, కుశంకలు మాని, నావీఁపుమీఁద నెక్కివచ్చి, యా రామలక్ష్మణులవ్యసనముఁ దీర్పుము" అని సీతతోఁ జెప్పెను.

తామరతేకులమాడ్కి వెడల్పు కన్నులుగలదగు సీతాదేవియు భీమునింబోలు మారుతుని యాకారసపుత్రుడగు హనుమంతునితో వెండియు నిట్లనియె: "ఓ వానరవీరుఁడా! నీయొక్క శౌర్యబలమును, వాయువుగతివంటి గతిని, అగ్నిహోత్రునివెలుగువంటి వింతవెలుఁగును నే నెఱిఁగియే యున్నాను. వానరశ్రేష్ఠుఁడా! నీవు తప్ప మఱెవ్వఁడు సామాన్యుఁడీ యపారమైన సముద్రమును దాఁటి, యీ లంకాపురికి రాఁగలఁడు? సముద్రమును దాఁటుటకు నన్నెత్తికొనిపోవుటకును నీకు శక్తిగలదు. అది నిక్కమే. మహత్తుని కార్యసిద్ధి విషయమై యాలోచన యవశ్యముగాఁ జేయవలసినదియేకదా! కోఁతులమేటి! నేను నీతోడ వచ్చుట యుక్తముగాదు. నీవు వాయువేగముతోఁ బోవువాఁడవు. ఆ వేగమునకు నేను భ్రమసి మూర్ఛపోదును. ఆకాశమున నీవు వేగముతోఁ బోవునప్పుడు, నే నాకాశమునఁ బైకిఁబోవఁ బోఁక, వెఱచి నీ వీఁపుమీదినుండి సముద్రమునఁ బడినను బడుదును. అట్లు తిమిలు, మొసళ్లు, చేఁపలు నిండిన సముద్రమునఁబడి, స్మృతిఁ బాసితినేని, ఆ సముద్రమునందలి జంతువులకు మంచియాహార మయ్యెదను.ఓ శత్రుసంహారకా! నీవు నన్నుఁ గాపాడుచుఁ గొనిపోవలయుఁగదా. అట్లు కాపాడఁదగిన నన్నుఁ గొనిపోవునప్పుడు నీ ప్రాణమునకే విపత్తు సంభవింపవచ్చును గావున నేను నీతోడ రాను. నీవు నన్ను గొనిపోవుట చూచి, దురాత్ముఁడయిన రావణుఁడు నిన్నును నన్నును బట్టుకొనిరమ్మని యానతియ్యఁగా, భీకరవిక్రమముగల రాక్షసులు నిన్ను వెంబడింతురు. వారు పెక్కు మొనవాలులు, గుదియలుచేతఁబట్టి యాకాశమున నిన్నుఁ జుట్టుకొన్నప్పుడు, ఓ శూరుఁడా! రక్షింపఁదగిన నన్నొకదానిని వీఁపు మీఁదఁ బెట్టుకొని వారితో నెట్లు యుద్ధము చేయఁగలవు? అట్లు వారితోఁ బోరుటకుఁ బోయిన నే నెక్కడఁ గ్రిందఁబడుదునో యని నీవు సంశయపడవలసియుండును. ఆకాశమున నిన్ను ముట్టడించురాక్షసులంప తాయుధములు గలవారు. నీవో నిరాయుధుఁడవు. నీవు నిరాయుధుఁడవై, సాయుధులైన యారాక్షసులతోఁ బోరాడను, నన్నుఁ గాపాడను నెట్లు చాలుదువు? వానరశ్రేష్ఠా! క్రూరపుఁబనులుచేయు నా రక్కసులతో నీవు యుద్ధముచేయుసప్పుడు, నేను భీతిల్లి, నీ వీఁపు మీఁదనుండి క్రిందఁబడుదును. వానరోత్తమా! శత్రువులకు భీతిని

గలిగించువారును, బలశాలురును, గొప్పవారునైనందున, వారందఱు గలిసి యుద్ధమున నిన్నెట్టకేలకు జయింపనైనను జయింతురు. అట్లు వారు జయింపలేకున్నను, నీవు వారితో యుద్ధముచేయుచు నిలఁబడినప్పుడు, నీ పృష్ఠభాగమునుండి జాఱిపడిన నన్నా క్రూరరాక్షసులు గొంపోవనైనను పోవుదురు. లేదా, నీచేతినుండి నన్నొడిసి తీసికొని పోవనైనను పోవుదురు. వధింపనైనను వధింతురు. వారిని నే నోడింపనా యని యందువేమో, అయినను యుద్ధమున గెలుపోటములు తికమలు గావు. అట్లు నేను క్రిందఁబడుననియు, నీవే గెలుతుననియు నెంచుకొన్నను, రాక్షసుల బెదరింపులకు దిగులుపడి నేనే మృతినొందవచ్చును. అట్లయ్యెనేని, నీ ప్రయత్నము వ్యర్థమగును. పోనీ నేను సముద్రమునఁ బడను; మృతినొందను. నీవే యెల్ల రాక్షసులను గెల్వఁజాలుదువుగాక! అట్లయిన రాముఁడు రాక్షససంహారము చేసినాఁడనిన కీర్తి యాతనికి రాదుగదా! (146)
ఆ సంగతి యటుండనిమ్ము. రాక్షసులందఱు చేరి నన్నుఁ గొనిపోయి, వానరులుగాని, రామలక్ష్మణులుగాని కనుఁగొనని తావున దాఁచ వచ్చును. అంత నానిమిత్తమై చేసిన నీప్రయత్న మెల్ల విఫలమైపోవును. మహోత్సుఁడగు రాముఁడు నీతోఁగూడ నిచ్చటికి వచ్చుటలో నెక్కువయుపయోగము గలదు. ఓ మహాబాహువా! నీయొక్కయు, ధీరుఁడగు రాముని యొక్కయు, ఆతని తమ్ములయొక్కయు, నీయేలిక యగు సుగ్రీవునియొక్కయు, ఇందఱియొక్క జీవితములు నా జీవితాధీనములైయున్నవి. ఆ రామలక్ష్మణులు నానిమిత్తమయిన వంతలలోఁబడి చిక్కి తామును ఋక్షవానరసమేతముగాఁ బ్రాణములఁ దొఱఁగుదురు. ఓ వానరులమేటీ! భర్తయందలి భక్తినే మునుకొని నాపైనిమిత్తశరీరమును దప్ప వేఱొక్కనిశరీరమును దాఁకను. రావణుఁడు నన్నుఁ దెచ్చునప్పుడు వానిదేహసంస్పర్శము గాలేదా యుపేక్షించి నేనేమి చేయ నసమర్థురాలనై, నాథునిఁబాసి, చెయ్యవలసిన దోడ్డియుఱికిని గనుక నేనప్పుడు రావణుని దేహముఁ దాఁకవలసివచ్చెను. రాముఁడిచ్చటి కేగుదెంచి రావణుని బంధుజనసమేతముగా సంహరించి నన్ను గొనిపోవుట యతని కుచితకార్యము. నే నారయఁగా రాముని పరాక్రమముఁ గూర్చి వినియున్నాను, చూచియున్నాను. దేవగంధర్వ పన్నగరాక్షసులలోపల నారామునితో సమానులు లేరు. యుద్ధరంగ

V.R. NARLA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

మునఁ జిత్రవర్ణంపుఁబిల్లు దాల్చినవాఁడు, బలశాలి, దేవేంద్రుని బోలు విక్రమశాలియునై, గాలిచే రేఁపఁబడిన యగ్నిహోత్రునిమాడ్కి నుండు నా రామునిఁ దమ్మునితోఁగూడ నెవ్వఁడు చూచి ధైర్యముతో యుద్ధము జేయఁగలఁడు? శత్రువులను మర్దించువాఁడును, మదించిన దిగ్గజముం బోలువాఁడును, ప్రళయకాలసూర్యునిమాడ్కి వెలుఁగువాఁడును, బాణములనెడి కిరణములు గలవాఁడునునైన రాముఁడు లక్ష్మణసమేతముగా వచ్చి యుద్ధరంగమున నిలిచినప్పు డెవ్వఁ డెదిరింపఁగలఁడు. కావున, వానరశ్రేష్ఠా! రాముని లక్ష్మణునితోను, సుగ్రీవాదివానరవీరులతోను నిచ్చటికి శీఘ్రముగాఁ దోడ్కొనివచ్చి, రామవియోగవ్యసనముచేఁ జిక్కియున్న నామనసునకు సంతోషముఁ గలిగింపుము" అని సీత యాహనుమంతునితోఁ జెప్పెను.

38-వ సర్గము

సీతాదేవి హనుమంతుని కానవా లిచ్చుట

అంత మాటలలోఁ జమత్కారియైన వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు సీతాదేవి చెప్పినమాటలను విని యామాటలకు మనసున నుప్పొంగినవాఁడై యా సీతాదేవింగూర్చి యిట్లనెను:

"చక్కనిచూపుగల యోదేవీ! నీవు మాటాడినమాట మిక్కిలి యుక్తముగను, స్త్రీస్వభావమునకును, పతివ్రతలనడవడికిని మిక్కిలి తగియున్నది. ఓదేవీ! నావీఁపుమీఁద నెక్కియైనను నూఁయలయోజన ములదవ్వు గల సముద్రమును దాఁటుట స్త్రీలకుఁ గష్టమేకదా. చక్కని నడతతోఁ గూడినదానవగు ఓ జానకీ! రామునిఁదప్ప మఱొక్కపురుషునిఁ దాఁకనని యే రెండవకారణము చెప్పెతివో, ఆ మాట మహాధీరుఁడయిన యారాముని ధర్మపత్నివైన నీకుఁ దగియున్నది. దేవీ! నీవు తప్ప మఱెవ్వతె యిట్టిమాటను జెప్పఁగలదు? ఓ దేవీ! నాయెదుట నీ వురివేసికొనఁ బోయినసంగతియు, రావణుని నీవు దిరస్కరించిన మాటలును, నీవు నాకుఁ జెప్పినమాటలు నేనిగలవో, అవియెల్లను విస్తరముగా రామునికి నే నెఱిఁగించెదను. ఓదేవీ! పెక్కుపాయముల చేతను, రామునియిష్టముఁ జేయఁగోరికచేతను, ప్రేమరసార్ద్రమైన మనసుచేత నీమాటను బలికితిని. లంక ప్రవేశింప నలవికానిదియు, సము

ద్రము దాట నలవికానివియు నగుటవలనను నేను సమర్థుడ నగుటవల
నను నే నిట్లు పలికితిని. ఇప్పుడే రాఘవునితోఁ జెప్పఁగోరెదనని రాము
నందలి భక్తిస్నేహములంబట్టి పలికితినిగాని, వేఱొకకారణమునంబట్టి
కాదు. ఓ నిర్దోషురాలా! నీవు నాతోడ నచ్చట కీష్టపడవేని, రామునఁ
డెట్లుఁగఁగల యొకయానవా లిము."

అని యిట్లు హనుమంతుఁ డడుగఁగా, దేవపుత్రికంబోలు సీతా దేవి రహస్యవృత్తాంతము చెప్పవలసివచ్చెనని కన్నీటిచే నక్షరములు తడఁబడుచుండ, మెల్లగా నతనితో నిట్లనియెను:

ఓ వానరేంద్రుఁడా! నేను ముందు చిత్రకూటపర్వతప్రాంత మున నీశాన్యమూలయందుఁ బెక్కు పుష్పఫలములచే నిండిన సిద్ధా శ్రమమునం దుండఁగా, ఈ చెప్పఁబోవు మేటి యానవాలు జరిగెను. దీనిని నామాటగా నాప్రియుని కెఱిఁగింపుము:

"ఓ నాథా! పలుతెఱంగులపువ్వుల నెత్తావిచే గుబాళించునట్టి యా చిత్రకూటాద్రిలోని యుపవనములందు విహరించి, జోఁకచెమ్మట గాఱుటచేఁ దడిసినదానినై, నీతోడమీఁదఁ గూర్చుంటిని. అప్పుడు మాంసాశగల యొక కాకి నాస్తనములనడుమ ముక్కుతో గీఱెను, అప్పు డాకాకిమీఁద మంటిపెళ్ల యొకటి విసరివైచి దానిని తోలితిని. ఆబలిభుక్కు మాంసముఁగోరినదై యదఱిన నన్ను గీఱుచు నచ్చటనే డాగియుండెనుగాని, యావలికిఁ బోవదయ్యె. తర్వాతఁ గొంతసేపటికి మఱల నాకాకి నాచీర నూడఁదీయఁ బోయెను. నేను కాకిని దోలుటకై మొలనూలిని లాగిపట్టి, కాకి నుఱిమిచూచి, దాని వెంబడించి తఱుమఁ బోయి యుండునప్పుడు నీవు నన్నుఁజూచితివి. నీవు నన్నుఁ బరిహాసము చేసితివి. అప్పుడు నే నా కాకిమీఁదఁ గోపముతోనుండఁగా, నీపరి హాసముచే సిగ్గుపడినదానినై నీతోడమీఁద వచ్చి కూర్చుంటిని. అప్పుడు నీవు నాకోపము నివ్వళింపఁజేసి నన్ను బుజ్జగించితివి. అప్పు డాకాకి మఱల నన్ను గీఱెను. దానిరంపు పడలేక, కోపముతో దానిని తోలఁ బోయితిని. దానినిఁ దోలఁజాలక కండ్లనుండి కన్నీరుగార్చుచుండఁగా, నీవు నాకన్నీటిని దుడిచి, నాకుఁ గోప మా వాయసమువలననే వచ్చి నది యని యెఱిఁగితివి" యని నామాటగా చెప్పుము. ఓ హను మంతుఁడా! తర్వాత నేను బడలికచే నాథునితోడమీఁద దలయుంచు

కొని చాలసేపు నిద్రించితిని. నేను నిద్ర లేచినతర్వాత భరతాగ్రజుఁడు నాతొడ మీఁదఁబరుండి నిద్రించెను. అప్పుడా వాయసము మఱల నచ్చటికి వచ్చి, నాథునితొడమీఁద నిద్రించి యప్పుడ లేచి కూర్చుండిన నన్ను మఱల స్తనములనడుమ గీఱెను. అది యవ్విధముగాఁ జలము పట్టి పలుమాఱు గీఱుటచే నా స్తనములనుండి రక్తముగాఱ నారంభించి, యారామునిపైఁబడఁగా, నతనియొడలెల్లఁ దడిసెను. నే నా బలిభోజనునిబారి కోర్వఁజాలక నానాథుఁడు సుఖనిద్ర చెందియున్నను లేపితిని. ఆ నానాథుఁడు నిద్ర లేచి, స్తనములనడుమ నవ్విధమున 'గీఱఁబడియున్న నన్నుఁ జూచి, నాగుఁబొమువలె బుసకొట్టుచు నిట్లనియెను:

"ఓ యేనుఁగుతొండమువంబోలు తొడలుగలదానా! నీ స్తన మధ్యము నెవ్వఁడు గోళ్లతో గీఱెను? ఎవఁ డలిఁగిన యెదుతలల పాముతోఁ గ్రీడించుచున్నాఁడు?" అనుచు, నెత్తుటఁ దడిసిన వాడి గోళ్లతోఁ గూడినదై నాయెదుటనేయున్న వాయసమునుఁ జూచి, తాను తెలివిగలవాఁడగుటచే "అతఁడు దేవేంద్రునిపుత్రుఁడు కాకాసురుఁడనువాఁడనియు, భూమికి వచ్చియున్నాఁడనియు, వేగమున వాయువుం బోలినవాఁ" డనియు నెఱిఁగినవాఁడయి, కోపముచేఁ దనగ్రుడ్లను గిరగిరఁద్రిప్పుచు నావాయసముమీఁదఁ గ్రౌర్యముఁబూని, తనయాసనము నుండి యొకదర్భనుద్రుంచి, దానియందు బ్రహ్మాస్త్రము నభిమంత్రించి, యావాయసముపైఁ బ్రయోగించెను. ఆదర్భ ప్రళయకాలాగ్నివలె మంటలచే వెలుఁగుచు నాకాశమునఁ బరుగిడుచుండు నావాయసమును వెంబడించెను. ఆకాకాసురుఁడు బ్రహ్మాస్త్రముచే వెంబడింపఁబడి పలుతెఱఁగులఁ బోవుచు శరణుగోరినవాఁడై యన్నిలోకములందును దిరిగెను. తండ్రిని శరణుచొచ్చెను. అతఁడు నాకు శక్తి చాలదని చెప్పెను. పిమ్మట దేవతల నందఱను శరణుచొచ్చెను. వారును మావలనఁగావని చెప్పిరి. పిదప మహర్షులను శరణుచొచ్చెను. వారును, మేము నిన్ను రాముని యస్త్రమునుండి రక్షింపఁజాలమనిరి. ఇట్లు కాకాసురుఁడు ముల్లోకములందుఁ దిరిగి యెచ్చటను శరణుగానక భూమియందుఁ బడి యారామునే శరణుజొచ్చి, "ఓ దయాళూ! నీవే కాపాడవలె" నని వేఁడెను. మిక్కిలి దిగులుపడి విచారమునొంది తన్నే శరణుచొచ్చిన యట్టి కాకాసురునిఁజూచి, రాముఁడు జాలినొంది చంపఁదగిన యతనిని మన్నింపఁ

గోరినవాఁడయి "ఓ కాకాసురుఁడా! ప్రయోగింపఁబడిన బ్రహ్మాస్త్ర మూరక మఱలించుట యేరికిని వశముగాదు. కావున నీకుడికంటిని దాని కడ్డముగా నుంచుము. ఆ యస్త్రము నీ నేత్రమును మాత్రము గైకొని నీ ప్రాణములను వదలిపెట్టును" అని చెప్పెను. కాకాసురుఁడట్లు తననేత్రమును దాని కడ్డముగా నుంచెను. ఆ బ్రహ్మాస్త్రము కాకాసుని కుడికంటినిమాత్రము గైకొనిపోయెను. ఇట్లు కాకాసురుఁడు తనకుడికంటి నొసఁగి, ప్రాణములఁ దప్పించుకొన్నవాఁడై, రామునకును, దశరథనృపాలునికిని నమస్కరించి, శూరుఁడయిన రామునియానతిఁ బడసి తనయథాస్థానమునకుఁ బోయిచేరెను. ఓ హనుమంతుఁడా! ఈ కథను వినిపించి నామాటలనుగా మఱికొన్నింటిని జెప్పుము. "ఓ పుడమిజేఁడా! నీవు మునుపు నానిమిత్తమయి సామాన్యమైన కాకిపై బ్రహ్మాస్త్రమును బ్రయోగించినవాఁడవు. ఇప్పుడు నిన్ను వంచించి నన్నుఁ దెచ్చిన యీక్రూరరాక్షసు నేల యేమియుఁ జేయకున్నావు? ఓ పురుషోత్తమా! నీవు కడునుత్సాహము పూని నాయెడఁ గృపచేయుము. నాథా! నిన్ను నాథునిగాఁ బడసి యున్నను, ఇప్పుడు నాథుఁడు లేనిదానికైవడి నెంచఁబడుచున్నాను. ఓరామా! ఒరులదుఃఖముల మాన్పుటయే ప్రధానగుణమని నీవలననే నే నింతకు ముందు వింటిని. ఓ నాథా! నీవు ఎక్కువ శౌర్యము, ఉత్సాహము, బలమునుగలవాఁడవనియు, సాగరముమాడ్కి లోఁతయినవాఁడవనియు, ఇంద్రునివలెఁ బరాక్రమశాలివనియు, సముద్ర పర్యంత ముఁడు పుడమి కేలికవనియు నే నెఱుఁగుదును. అయినను, ఏలయూరకున్నావు?" అని నే నడిగినట్లుగాఁ జెప్పుము.

ఓ వానరేంద్రా! రాఘవుఁడస్త్రజ్ఞులలో మేటియయియుండియు, ఆడినమాటతప్పనివాఁడై యుండియు, బలిమిగలవాఁడయి యుండియు, ఈ రాక్షసులమీఁది కేల బాణములఁ బ్రయోగింపకున్నాఁడు? యుద్ధ రంగమున రాముని బాణవేగము నడ్డగింప దేవతలును, గంధర్వులును, అసురులును జాలరు. దేవతలును జాలరు. అట్టిశూరుఁడైన యారామునికి నాపైఁ బ్రేమగలదేని, ఏల కఱకుటమ్ములతో నీరాక్షసులనంపఁజాలి నుగ్గుసేయఁడు? పోనీ రాఘవుఁడు రాకున్న, బలవంతుఁడును, శత్రుసంహారియునైన లక్ష్మణుఁడైనను తనయన్నయనుమతిని గైకొని యేల

నన్నుఁ గాపాడరాఁడు. వాయ్వగ్నులతో సాటియగు తేజస్సుగల వారలగు ఆపురుషశ్రేష్ఠు లిద్దఱును గూడిరేని, దేవతలు సైతము వారి నెదిరింపఁజాలరు. అట్టిబలశాలురైన యారామలక్ష్మణు లేల నన్ను పేక్ష సేయుచున్నారు? వా రంతటి శూరులైయుండియు నట్లుపేక్షచేయుట చూడఁగా, నేదో గొప్పపాపము చేసితిననియు, దానికి ఫలముగా నిప్పు డిట్లు వెతల ననుభవించుచున్నాననియు ననుకొందును. ఇందుకు సందియము లేదు."

అని జానకి కన్నులనుండి కన్నీళ్లు విడుచుచుఁ జెప్పినమాటలను విని, ఎక్కువ వెలుఁగుగల హనుమంతుఁ డామె కిట్లనియె:

"ఓదేవీ! నేను ప్రమాణముచేసిచెప్పెదను. రాముఁడు నీవియోగ వ్యసనముచేఁ దనశరీరకరక్షణవిషయమునఁగాని, నీ వున్న దేశము వెదకు విషయమునఁగాని యపేక్ష పెట్టకున్నాఁడు. రాముఁడట్లు వ్యసనములలోఁ దగిలియుండుట చూచి లక్ష్మణుఁడును సదా వగలపాలయియున్నాఁడు. ఎట్టకేలకు నిన్నుఁ గనుఁగొంటిని. ఇది విచారపడుటకుఁ దరుణముగాదు. ఓ పతివ్రతా! నీ విమ్మహార్తమునచే దుఃఖములకంతము గాంచఁగలవు. ఓదేవీ! ఎక్కువబలిమిగలవారును, పురుషసింహులునైన రాచకొమరులగు రామలక్ష్మణు లిరువురును నిన్నుఁ జూచుటయందుఁ గోరికగలవారైయున్నారు. నేను పోయి చెప్పఁగానే వారువెంటనే వచ్చి యీలంకాపురమును గాల్చి బూది చేయుదురు. ఓ వితివికన్నులదానా! రాఘవుఁడు యుద్ధరంగమున ద్రోహియైన రావణుని బంధుసమేతముగా సంహరించి, నిన్నుఁ దనపురమునకుఁ దోడ్కొనిపోవఁగలఁడు. రాముని కేమి చెప్పవలెనో, బలవంతుఁడగు లక్ష్మణుని కేమిచెప్పవలెనో, పరాక్రమశాలియగు సుగ్రీవునికి నేమి చెప్పవలెనో, తక్కిన వానరుల కందఱకు నేమేమి చెప్పవలెనో, అసంగతులెల్ల నాకుఁ జెప్పుము."

అని హనుమంతుఁ డడుగఁగా, దేవకన్యకంబోలు సీతాదేవి వెతనొందుచు నా హనుమంతునితో నిట్లనియెను:

"లోకనాయకుఁడయిన యేసుతుని ధీరశాలగు కౌసల్య కనెనో, ఆ నానాథుని నానిమిత్తమై క్షేమమడుగుము; శిరముతో మ్రొక్కుము. ఎవఁడు సోదరవాత్సల్యముచే సుందరాంగనలను, పుష్పమాలాద్యులను, సర్వవిధములైన యుత్తమవస్తువులను, విశాలమైన భూమండల

మున నితరులకు లభ్యముగాని యైశ్వర్యమును, ఉత్తమసుఖములను విడిచి, తల్లిదండ్రులయనుమతి వడసి, యన్న యడవికి వచ్చినప్పు డాతనిని వెంబడించివచ్చెనో, ఎవనిచే సుమిత్రాదేవి సుపుత్రుఁ గన్నది యయ్యెనో, సింహమువలె గొప్పమూఁపును, నిడుదచేతులును, చక్కని మనసును, ఇంపుగులుకుచూపుం గలవాఁడైన యెవఁడు నన్నుఁ దల్లి వలెను, రాముని దండ్రివలెను భావించియుండువాఁడో, ఆసూరుఁడైన లక్ష్మణునికి రావణుఁడు నన్నపహరించినది తెలియదు. లేకున్న నత్తఁ డూరకయుండియుండునా? ఆ లక్ష్మణుఁడు పెద్దలకు శుశ్రూష చేయువాఁడు; సౌందర్యవంతుఁడు; అన్నిపనులుచేయఁగలవాఁడు; మితముగా మాటాడువాఁడు; నా మామకుఁ బ్రియనందనుఁడు; సుగుణములచే నతనికి సాటివచ్చువాఁడు; నాకును, నానాథునికిని సదా మిక్కిలి యిష్టుఁడు; ఏదైన నొక్కపని చెప్పిన నాకార్యభారము నంతయుఁ దానే వహించువాఁడు. రాముఁ డీ లక్ష్మణునిఁ జూచినయెడ నెన్నఁడో గతించిన తండ్రిని సైతము తలపెట్టఁడు. మఱియు లక్ష్మణుఁ డెల్లప్పుడు మెత్తనివాఁడు; వంచనలేనివాఁడు; నేర్పరి; రామునికి నెచ్చెలి. అట్టి యాలక్ష్మణునితో నాక్షేమమును దెలుపవలసినది. ఓవానరోత్తమా! నీ మాట విని, నాప్రియుఁడు రాముఁడును, లక్ష్మణుఁడును వచ్చి నాదుఃఖముఁ బాపునట్లు చేయవలసినది. ఓహరిశ్రేష్ఠుఁడా! నే నిఁక నొకనెలమాత్రమే ప్రాణముతో నుందును. ఒకనెల కావల ప్రాణములతో నుండను. ఇది సత్యము. పాపాత్ముఁడగు రావణుఁడు వంచనతోఁ దెచ్చి నిర్బంధించియున్న నన్నుఁ బాతాళమునుండి కాశికిని దెచ్చినట్లు లంకాపురినుండి కొనిపోయి కాపాడవలసినదని నామాటగా రాఘవునితోఁ జెప్పవలసినది" అని చెప్పి, తాను చీకకొంగునఁ గట్టియున్న శ్రేష్ఠమైన యాశిరోరత్నమును దీసి, "దీనిని రాముని చేతి కిమ్ము" అని యాహానుమంతునిచేత నిచ్చెను.

ఆసూరుఁడగు హనుమంతుఁడు తనచేయి యాచూడామణి రంధ్రమునందు దూఱమిచేఁ గొనవ్రేలికి గ్రుచ్చుకొన్నవాఁడై, సీతాదేవికిఁ బ్రవర చెప్పి, ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి, యా సీతాదేవిప్రక్కన వినయముతోడ నిలఁబడెను. మఱియు హనుమంతుఁడు సీతాదర్శనముచే గలిగిన సంతసముతోఁ గూడినవాఁడై, రాముని

మనస్సునఁ దలఁచుకొని, జానకి యొసఁగిన మణి నెత్తుకొని, గాలిచేఁ బై కెగుచఁ గొట్టఁబడి మఱుల క్రిందఁబడిన పర్వతముపై వడి మనమునఁ గుదురుబా టొందినవాఁడై ప్రయాణమునకు సిద్ధపడినవాఁడయ్యెను.

39-వ సర్గము

హనుమంతుఁడు సీతను వీడ్కొనుట

అంతట సీతాదేవి చూడామణిని హనుమంతునిచేతి కిచ్చి, "వానరశ్రేష్ఠుఁడా! యిది రామునికిఁ జక్కఁగాఁ దెలిసిన యానవాలు. ఈమణి నా పెండ్లియప్పుడు నాతల్లిచే దశరథమహారాజుసన్నిధిని నాతండ్రియైన జనకమహారాజుచేతినుండి కైకొని నాతల్లిచేత నాకు శిరోభూషణముగా నొసఁగఁబడినదిగనుక, దీనిని చూచినమాత్రమున వీరుఁడైన రాముఁడు నాతల్లిని, నాతండ్రిని, దశరథనృపాలుని జ్ఞప్తికిఁ దెచ్చుకొనఁగలఁడు. వానరశ్రేష్ఠా! నీవు మిక్కిలి యుత్సాహము గల వాఁడవు కావున, ఈ పని నీవలననే కావలయును. ఓ హనుమంతుఁడా! నీవు ప్రయత్నము పూని నాదుఃఖముఁ బోకార్పుము. నీవు పట్టుదల గలిగి చక్కఁగాఁ బ్రయత్నము చేయుదువేని, నాదుఃఖ ముపశమించును" అని హనుమంతునితోఁ జెప్పెను.

పగతురకు వెఱపుగలిగించు మగఁటిమిగల యావాయునందనుఁ డట్లేయని ప్రతిజ్ఞ సేసి, జానకిని శిరంబుతో మ్రొక్కి పయనముగాఁగా, సీతాదేవి కన్నీటిచే డగ్గుత్తికతో "ఓ హనుమంతుఁడా! రామలక్ష్మణులకును, సుగ్రీవునికిని, అతనిమంత్రులకును, పెద్దలగు వానరులందఱికిని నానియమమురీతిని, నాక్షేమమును జెప్పుము. గొప్పబాహువులుగల వాఁడైన యారాఘవుఁడు నన్నెట్లీదుఃఖసాగరమునుండి దరి చేర్చునో, అట్టులు నీ వారామునితోఁ జెప్పి పనియగునట్లు చేయవలయును. ఓయీ! కీర్తిమంతుఁడగు రాముఁడు నన్ను బ్రతికియుండఁగనే కొనిపోయి యాదరించునట్లు నీవుచెప్పి, యా మాటచెప్పిన వానిపుణ్యమునఁబొమ్ము. సదా యుత్సాహవంతుఁడవగు నీమాటలను విన్నమాత్రముననే యా రామునిపరాక్రమమెట్లు నన్నుఁ బడయుటకై పోచ్చునో, నీవు నావృత్తాంతముఁ జెప్పఁగానే యెట్లాతఁడు తన పరాక్రమముఁ జూపఁ బ్రయత్నించునో, అట్లు నీవు చెప్పవలసినది" నాసందేశముగల మాట

లను వీరుఁడగు రాముఁడు నీవలన విని ఉచితమయిన పరాక్రమకార్యమున కయి యత్నింపఁగలఁడు" అని మాటతితో ననెను.

హానుమంతుఁడు సీతాదేవిపలుకులు విని, దోసిలియొగ్గి నెత్తి నిడికొని, "దేవీ! రాముఁడు భల్లూకవానరవీరులతోఁగూడి యిచ్చటికి వచ్చి, యుద్ధరంగమున శత్రువుల నందఱను బరిమార్చి నీశోకమును బోఁగొట్టఁగలఁడు. మానవులలోఁగాని సురాసురులలోఁగాని, రాముఁడు బాణము లేయునప్పు డెదుట నిల్చి వానినిఁ బడఁగొట్ట శక్తిగలవాఁడు ముల్లోకములందును లేఁడు. ఓ దేవీ! ముఖ్యముగా నీనిమిత్తమై సూర్యునైనను, ఇంద్రునైనను, వివస్వంతునిపుత్రుఁడయిన యమునినైనను రాముఁడు యుద్ధరంగమున నెదిరింపఁజాలును. ఓ జానకీ! నీనిమిత్తమే రాముఁడు చతుస్సముద్రపర్యంతము వ్యాపించియుండు పుడమిని బాలింపఁగోరుచున్నాఁడు" నీ నిమిత్తముగనే రాముఁడు జయము నొందఁగలఁడు. అని సీతకు బదులు చెప్పెను.

అంతట సీతాదేవియు హానుమంతుఁడుచెప్పిన నిక్కపుమాట విని, దానిని గారవించి, ప్రయాణమయిన యా హానుమంతునిఁ జూచి, నెయ్యము మీఱ భర్తమీఁది యనురాగముఁ దెల్పుమాటను జెప్పఁగడఁగి, "ఓ శత్రువుల నణఁగఁద్రొక్కువాఁడా! నీ కిష్టమయ్యేనేని, యొకదిన మిచ్చట జెట్లమఱుఁగుననుండి మార్గాయాసము దీర్చుకొనుము. రేపు బయలుదేఱి పోదువు. అదృష్టహీనురాలైన నాసన్నిధిని నీవుండుటచేత నాయొక్క యీ యపారశోకము కొంత తగ్గును. వానరశ్రేష్ఠా! నీవు పోయి రాముని దోడ్కొని మఱలి వచ్చునంతలో నా జీవిత ముండుట సందియము. వానరా! నిన్ను చూడకపోవుటవలనఁ గలుగు చింత దహించుదానివలెఁ గనఁబడుచు, దుఃఖములలో మునిఁగి యున్న నన్ను మఱింతశోకమున ముంచఁగలదు. వీరుఁడవగు వానరేంద్రా! వానరసేనలుగాని, ఆ రాజశ్రేష్ఠులిద్దఱుగాని యెట్లీదాఁట రాని మహాసముద్రమును దాఁటఁగలుగుదురు? ఏలయన, ఈమహా సముద్రమును దాఁటుటకు నీకైనను, గరుత్మంతునికైనను, వాయు దేవునికైనను శక్తి గలదు కాని యొరులకట్టి శక్తి గలదే? కావున వా రెట్లు సముద్రమును దాఁటగలరని వారివిషయమున నాకు గొప్ప సంది యము గలుగుచున్నది. ఓ వానరశ్రేష్ఠా! నీవు కార్యజ్ఞుఁడవు గావున

నిట్టి దురూహమగు కార్యసాధనవిషయమున నీ వేమి యుక్తి చెప్పెదవు? నే నుండలేదా? నేను నిన్ను మోచికొనిపోయెదనందువేమో? అది వాస్తవమే! నీవొక్కఁడవుమాత్ర మీ కార్యమును సాధింప శక్తుఁడవే. అయిన, దానివలనికీర్తి నీకుఁ గదా కలుగును. కావున రాముఁడు గొప్ప సేనలతో వచ్చి సమరమున రావణునిఁ బరిమార్చి జయశాలియయి స్వపురమునకుఁ బోవునేని అది నాకుఁ గీర్తికరమగును. ఓ వానరపుంగవా! శత్రుసేనలఁ బరిమార్చెడునట్టి యీ కాకుత్థ్సుఁ డీలంకాపురమును గఱుకుటమ్ములతోఁ గప్పి నన్నుఁ గొనిపోయెనేని, అది యీరాముని మగఁటిమికిఁ దగిన దగును. అని యందు మొనగాఁడును, మహోధీరుఁడునయిన యీ రాముని పరాక్రమము సార్థకమగునట్లు నీవు మాటలఁ జెప్పవలయును" అని యనెను.

అని సీతాదేవి యర్థము పొసఁగునట్లును, ఒకదాని కొకటి పొందిక గలిగియుండునట్లును, సకారణముగాను జెప్పినమాటను విని, మారుతి యీ దేవితోఁ గడపటిమాటయొక్కటి యిట్లనియె.

"ఓ దేవీ! వానరసేనలకుఁ బ్రభువును, వానరశ్రేష్ఠుఁడును, బలశాలియునైన సుగ్రీవుఁడు నిన్ను రాముని తోఁ జేర్పఁ దలపెట్టి యున్నాఁడు. ఓవైదేహీ! రాక్షససంహారియైన యీ వానరరాజు వానరులగుంపుతోఁగూడి యిచ్చటికి రాఁగలఁడు. ఓ దేవీ! మగటిమిగలవారును, సత్తువగలవారును, బలిమిగలవారును, మనస్సంకల్పముంబోలు గమనముగలవారును నైన పెక్కువానరవీరులు సుగ్రీవునియాజ్ఞయందున్నారు. వారు స్వర్గమర్త్యపాతాళములం దెక్కడికైనను బోవఁగలరు. వారు పనులం దధైర్యము నొందరు. వారు పలుమా ఱాకసంబునఁ బఱతెంచి, చతుస్సముద్రపరివేష్టితమై యున్న వనపర్వతములతోఁ గూడిన భూమండలమును జుట్టివచ్చియున్నారు. ఓదేవీ! సుగ్రీవునికడ నాకంటె హెచ్చినవారును, నాతో సమానులును నున్నారే కాని, నాకంటెఁ దక్కువ వాఁడొక్కఁడును లేఁడు. నేనే యిక్కడికి వచ్చినప్పుడు, నాకంటె మహాబలవంతులైన వారిసంగతి చెప్పవలయునే? ప్రాయికముగా దూతకృత్యములకుఁ దక్కువవారి నంపుదురుగాని గొప్పవారి నంపరుగదా? ఓదేవీ! విచారము వలదు; శోకము మానుము. ఆ వానరపుంగవు లొక్కయెగురున నిచ్చటికి

రాఁగలరు. చంద్రసూర్యులమాడ్కిఁ దేజరిల్లువారును, ఎక్కువ బలిమి గలవారునైన పురుషశ్రేష్ఠులగు ఆ రామలక్ష్మణు లిద్దఱు నావీఁపుమీఁద నెక్కి నీదగ్గఱకు రాఁగలరు. పురుషశ్రేష్ఠులగు ఆ రామలక్ష్మణు లిద్ద ఱును గూడివచ్చి లంకాపురమునందలి రాక్షసులను బాణప్రయోగము చేసి సంహరింపఁగలరు. ఓ చక్కని నడుముగలదానా! రఘునందనుఁడగు రాముఁడు రావణునిఁ బరిజనముతోడఁ దెగటార్చి, నిన్నుఁ గైకొని తన పురమునకుఁ బోఁగలఁడు. ఓ దేవీ! యూఱడిల్లుము. నీకు మేలయ్యెడు. సమయము నిరీక్షించుచుండుము. వేగిరమేమండుచున్న యగ్నిహోత్రుని వలె వచ్చెడు నా రాముని జూడఁగలవు. ఈ రాక్షసేంద్రుఁడు పుత్ర బంధుమంత్రిపరిజనములతోఁగూడ సమరమున మడిసిన తోడనే, రోహిణి చంద్రునితోఁ జేరినట్లు, నీవు రాముని తోఁ జేరఁగలవు. దేవీ! మైథిలీ! నీవు వేగిరమే దుఃఖమునకుతుద గాంచఁగలవు. రాముఁడు త్వరలో వచ్చి రావణునిఁ జంపఁగా నీవు చూడఁగలవు."

వాయునందనుఁడగు హనుమంతుఁ డిట్లెఱుఁగున వైదేహి నోదార్చి, పయనముచేయ మదిఁ దలఁచి, వెండియు సీతాదేవి నుద్దేశించి, "దేవీ! శత్రుసంహారియు, సమర్థుఁడునునైన రాముఁడును, లక్ష్మణుఁడును విండ్లు దాల్చి లంకాపురద్వారమునకుఁ జేరువకు వచ్చిరని నీవు సత్వర ముగ వినఁగలవు. గోళ్లు కోఱలు నాయుధములుగా నుపయోగించు వారును, సింహవ్యాఘ్రములవిక్రమముఁ బోలు విక్రమముగలవారును, మదపుటేనుఁగుల డీకొనువారునునైన శూరులగు వానరులిచ్చట గుంపు గూడి యుండుటను జూడఁగలవు. ఓపూజ్యరాలా! పర్వతములను మేఘములను బురుడించు వానరవీరులీమలయ పర్వతలంకాపురములం దనేకముగాఁ గిలకిలారవములు సేయఁగా నీవు చూడఁగలవు. ఓ దేవీ! ఆ రాముఁడును వాఁడియైన మారునితూఁపులచే నాయపట్టున గాడ నేయఁబడి, సింహముచే నలఁపఁబడిన యేనుఁగుకైవడి నింపు దక్కి యున్నాఁడు. ఓ దేవీ! దుఃఖింపకుము. నీమనసునందలి వ్యసనము మానుము. శచీదేవి దేవేంద్రునితోఁ గలిసినచందమున, నీవును మగ నితోఁ గూడఁగలవు. రామునికంటె మించినవాఁడుగాని, లక్ష్మణునితో సమానుఁడుగాని మఱెవ్వఁడున్నాఁడు? వా రిరువురు అగ్నివాయువు లతో సమానులు. అట్టివారు నీకుఁ దోడైయున్నారు. ఓదేవీ! రాక్షసుల

గుంపున కాటపట్టయి కడుభీకరమైయున్న యీలంకాపురమున నీ వింకఁ గొన్ననాళ్లే యుందువు. నీమగఁడు వేగమే రాఁగలఁడు. నేనిచ్చటినుండి బయలుదేరి రామునికడకుఁ బోవువఱకు నోర్చియుండుము. నామాట విన్నమాత్రముననే రాముఁడు పయనమై రాఁగలఁడు" అని సీతాదేవి నూరడించినవాఁడయ్యెను.

40-వ సర్గము

హనుమంతుఁడు ప్రయాణమగుట

కడుదిట్టయగు వాయునందనునిపలుకులు విని, దేవకన్యకంబోలు సీతాదేవి, మఱల హనుమంతు నుద్దేశించి, "సగము మొలిచిన పైరుతోఁ గూడిన చేను వానగురియుటచే నవనవలాడునట్లు, ఓవానరా! ఇంపు మాటలు పలుకుచుండు నిన్నుఁ జూచి నేను కడుమోదమందుచున్నాను. ఆపురుషోత్తముని వెతలచేఁ జిక్కిన యీయంగములతోనైనను దాఁకఁ గలుగునట్లుగా నాయందు దయసేయుము. వానరగణసార్వభౌమా! కాకాసురునిపైఁ దృణమున బ్రహ్మాస్త్ర మభిమంత్రించి ప్రయోగించిన యానవా లొసఁగుము. అంతియకాక, నే నొక్కనాఁడు రాఘవుని చేరువ నుండఁగా నాబొట్టు కరిగిపోయెను. అప్పుడు తాను నామోమున మణిశిలతోఁ దిలకము దీర్చెను. ఓ హనుమంతుఁడా! నాప్రియు నావిషయమును జ్ఞప్తికిఁ దెచ్చుకొమ్మనుము. ఓ హనుమంతుఁడా! పరాక్రమమున నింద్రవరుణులఁబోలినవాఁడయ్యు నారాముఁడు నేను రాక్షసులనడుమ నుండుట కెట్లు సమ్మతించియున్నాఁడో? "ఓ రాఘవా! సముద్రమునఁబుట్టిన యాదివ్యమైన శిరోరత్నమును బదిలముగాఁ గాపాడి, నిన్నుఁబాసియుండు వేళలందు దీనిని నీకు మాఱుగాఁ జూచుచుంటిని. అట్టి నీటిఁబుట్టిన యాదివ్యరత్నమును నీకడకుఁ బంపితిని. నే నిఁక నిట్టివంతలందుఁ జిక్కి జీవముతో నుండఁజాలను. ఈయోర్వరాని వ్యసనములను, మర్మభేదకములైన ఈరాక్షసకాంతల రోత మాటలను నీనిమిత్తమై యోర్చియున్నాను. ఓ శత్రుసంహారకా! నే నిఁక నెలదినములుమాత్రము ప్రాణముతో నుందును. ఈ ఒకనెల కావల నిమిషమైనను బ్రాణముతో నుండఁజాలను. ఈరాక్షసేంద్రుఁడు కటికివాఁడు; వీనికి నాయందు సౌమ్యదృష్టి లేదు. నీవో కాలవిలం

బము చేయుచున్నావు. నే నిక క్షణమయిన జీవింపఁజాలను అని నా మాటగా నారామునితోఁ జెప్పుము" అని తనకు మేలుగావించుమాట చెప్పెను.

అంతట గొప్పవెలుఁగుగలవాఁడగు వాయునందనుఁడయిన హనుమంతుఁడు వై దేహి కన్నీరువిడుచుచు దీనముగాఁజెప్పిన మాటను విని, "ఓ వై దేహీ! సత్యముగాఁ జెప్పెదను. రాముఁడు నీయెడఁబాటువలన దేహసౌఖ్యమం దాశలేనివాఁడై, యెల్లప్పుడు వగలఁ బొగులుచుండును. రాముఁడు దుఃఖములలో మునిఁగియుండుటచే లక్ష్మణుఁడు తానును మనోవేదనలఁ జెందుచుండును. ఎట్టకేలకు నిన్నుఁ గనుగొంటిని. ఇది వ్యసనపడుటకుఁ దరుణము గాదు. ఓభామినీ! యీనిమిషమునఁనే దుఃఖములకంతమును గాంచఁగలవు. శత్రుసంహారులగు ఆ పురుషశ్రేష్ఠులైన రాజపుత్రు లిద్దఱును నిన్నుఁ గాంచుటయం దుత్సాహముగలిగి యున్నారు. కావున నామాట విన్నతోడనే వారు బయలుదేరివచ్చి యీలంకాపురము బూడిసేయఁగలరు. ఓవిశాలాక్షీ! రామ లక్ష్మణు లిద్దఱు బవరమున రావణుని బంధుసమేతముగాఁ దెగటార్చి నిన్నుఁ దనపురమునకుఁ గొనిపోవఁగలరు. ఓనిర్దోషురాలా! రాముఁ డెఱుఁగఁ గలదియు, నెయ్యముగలిగించునదియునైన మఱేయొక యూన వా లొసఁగుము" అని సీతాదేవి నడిగెను.

"ఓ వానరోత్తమా! నేను ముందే యుత్తమమగు నానవా లొసఁగితిని. రాముఁ డీ చూడామణిని జూచినంతటనే, నీమాటల నమ్మ గలఁడు" అని సీతాదేవి హనుమంతునితోఁ జెప్పఁగా, వానరశ్రేష్ఠుఁ డయిన హనుమంతుఁడు మణిశ్రేష్ఠమైన యా శిరోరత్నమును గైకొని సీతాదేవికి సాష్టాంగప్రణామము లాచరించి పయనమాయెను.

అప్పుడు సీతాదేవి కడువేగముతో నెగుర బ్రయత్నము చేయుచు, దేహము పెంచుచున్న యాహనుమంతునిఁ జూచి, కన్నీళ్లు మోమునఁ గ్రమ్ముచుండ, కన్నీటిచే డగ్గుత్తిక పుట్టుచుండ, మాటలు తడఁబడుచుండ, హనుమంతు నుద్దేశించి, "ఓహనుమంతుఁడా! సింగము లంబోలు నన్నదమ్ములగు రామలక్ష్మణులకును, సుగ్రీవునికిని, వాని మంత్రులకును నాక్షేమవృత్తాంతముఁ జెప్పుము. ఆరాముఁడు నన్నీశోకసాగరమునుండి దరిఁజేర్చువిధమున నీ వారామునికిఁ జెప్పవలసినది. ఓహను

మంతుఁడా! వీవు రామునికడఁ జేరి యోర్వరాని నావగ పెంపును, రక్కసులు బెదరించురీతిని బాగుగఁ జెప్పవలసినది. నీకు మార్గమున మేలు గలుగుఁగాక!" యని సీత దీవించెను. అంత హనుమంతుఁడు సీతచెప్పిన సంగతులు దెలిసికొన్న వాఁడై, వచ్చినపని నెఱవేర్చుకొన్న వాఁడగుటఁ జేసి మనమున నుప్పొంగుచు, కార్యము కొంత మిగిలియున్నదానినిగాఁ దలఁచి, యాకొఱవపని చూచుటకై యుత్తరదిశవైపు పోవ మనసునఁ దలఁచెను.

41-వ సర్గము

హనుమంతుఁడశోకవనము పాడుచేయుట

ఆ హనుమంతుఁడు సీతాదేవిచే మేలుమాటలచే గారవింపఁ బడినవాఁడై మఱలి యాప్రదేశమునుండి వెడలివచ్చి యివ్విధమునఁ జింతింపఁ దొడఁగెను. "నే నిచ్చటికి రెండు పనులనిమిత్తము వచ్చితిని. అందొక్కటి సీతాదేవిని గాంచుట. మఱియొకటి శత్రువులబలిమి మొదలగువాని నెఱుఁగుట. ఆరెంటిలో ముఖ్యమయిన గొప్పకార్యమగు సీతయొక్క దర్శనమయినది. ఇఁక శత్రుబలము నెఱుఁగుట యనెడి కొంచెపాటి కార్యము మిగిలియున్నది. ఇచ్చట రాక్షసేంద్రునిబలము తెఱఁగు నెఱుఁగుకార్యమున సామదానభేదోపాయములు దప్పఁ గడ పటిదగు నాలవయుపాయ మిచ్చట యుక్తముగాఁ గనఁబడుచున్నది. రక్కసులయందు సామము (బ్రతిమాలుట) అక్కఱకు రాదు. ఈ రాక్షసులు ధనికులు గనుక దానోపాయమునకు వీరు లొంగరు. వీరు బలగర్వితులు గనుక భేదోపాయముచే వీరిని సాధించుట కడుదుర్లభము. కావున వీరియందు బలిమి చూపుటయే యుక్త మని నాకుఁ దోఁచుచున్నది. రావణబలపరిజ్ఞాన రూపమైన యీకార్యమునఁ బరాక్రమము చూపుట కంటె మేలగు వేఱొక యుపాయ మున్నట్లు తోఁపలేదు. నేను యుద్ధమున రాక్షసవీరులఁ గొందఱిని వధించితినేని, అప్పుడైనను వీ రెట్టకేలకు మెత్తఁబాటు నొందుదురు. అయినను "వచ్చినపని సీతాన్వేషణగదా! అది యైనపిదప నిక్కడఁ జేయవలసినపని లేదే" యనిన, ఆనతిచ్చిన పని చేసిన తర్వాత, ఆకార్యమునకు భంగము లేకుండఁ బెక్కు కార్యములను జేయువాఁ డెట్టిపనినైనను జేయఁగలఁడు. మఱియు నొకకారణము

స్వల్పకార్యమునకైనను సాధకము గానేరదు. కర్తవ్యమగు కార్యమును బెక్కు లెఱఁగుల సాధింప నెఱఁగినవాఁడర్థసాధనమునఁ జాలినవాఁడగును. నే నిచ్చటనే నిర్ణయముచేసికొని, ఆత్మబలశత్రుబలతారతమ్యము నెఱఁగినవాఁడనై, యావల వానరేంద్రునిపురమునకుఁ బోవుదునేని, అప్పుడు రాజు నుత్తరువు చెల్లించినవాఁడ నగుదును. ఇప్పుడు నాకు రాక్షసులతో నెవ్విధమునఁ బోరు సులభముగా వచ్చునో, అట్టిపని నొనరింపవలయును. అట్లు యుద్ధము జరిగినపుడే రావణుఁడు తనవారిబలమును నాబలమును బరిశీలింపఁగలఁడు. అట్లు పరిశీలించినవాఁడై, యా రావణుఁడు మంత్రివర్గసైన్యములతోడ యుద్ధరంగమునకు వచ్చెనేని, అప్పుడా రావణునిమనసున నుండెడి యభిప్రాయమును, అతనిబలమును దెలిసికొని యచ్చటినుండి వెడలిపోయెదను. నందనవనమును బోలినదియు, కన్నుల కింపయినదియు, మనోహరమైనదియు, పెక్కుచెట్లును తీఁగెలును గలదియునైన యీ క్రూరుని దగు నుపవనమును కాఱుచిచ్చెండుటడవినిం గాల్చినట్లు ధ్వంసముచేసెదను. ఈ వనమును నేను బాడుచేయఁగా, రావణుని కాగ్రహము రాఁగలదు. అంతట నతఁడు రథగజతురగపదాతులతోను సకలాయుధములతోను గూడిన గొప్పసేనను నాపైకిఁ బంపఁగలఁడు. అప్పుడు గొప్ప పోరు జరుగఁగలదు. ఆపోరునం దొరులచేనోర్వరాని పరాక్రమముగల నేను భీకరబలులగు రాక్షసులతో యుద్ధముసేసి, రావణుఁడు పంపిన యాసేన నెల్లఁ దెగటార్చి, సుఖముగాఁ గిష్కింధాపురికిఁ బోయి సేరెదను.

అని తలఁచి, భీమపరాక్రముండగు హనుమంతుఁడు వాయువు వలెఁ జెలరేఁగినవాఁడై, తనతొడల గొప్పబల్మిచే నాపనమునందలి చెట్లను బడఁద్రోయ నారంభించి, మదించిన పెక్కుపక్షులకూఁతలతోఁ గూడినదియు నానావిధములయిన వృక్షములతోను తీఁగెలతోను నిండినదియునగు ఆపనంబునందలి చెట్ల నన్నింటిని విఱిచెను. హనుమంతుఁ డాపనమునందలి చెట్లను విఱుచుటచేతను, తామరకొలఁకుల రేవులం బడఁగొట్టుటచేతను, పర్వతశిఖరములను నుగ్గుచేయుటచేతను, ఆపనముచూడ నింపుగాక యుండెను. ఆపనమునందలి పక్షు లెల్ల బెదరి కూఁత లిడెను. ఎట్టని చిగుళ్లను హనుమంతుఁడు గోసిపాఱ

వేయుటచే నెండకు వాడిపోయెను. కావున వనము కాఱుచిచ్చుచేఁ గాల్పఁబడినయట్లు వాఁడినచెట్టును తీఁగెలునుగలదై సొంపుదక్కి యుండెను. తీఁగె లాధారవృక్షములనుఁడి లోలఁగినవై నాథునిఁ బాసిన యాఁడువాండ్రవలె నల్లలాడుచుండెను. ఆహానుమంతుఁడు తీఁగెలయిండ్లను, చిత్రంపుటిండ్లను నాశముచేయఁగా, మహాసర్పములను, వ్యాఘ్రాదిక్రూరమృగములను బడఁగొట్టఁగా, ఱాతియిండ్లను, సామాన్య గృహములను ఇడియఁగొట్టఁగా, ఆ గొప్పయుపవనము రూపుసెడిన దాయెను. రావణునియంతఃపురస్త్రీలకు భోగములపెంపుమూలమున రక్షకమయిన యా ప్రమదావనమునందలి యశోకవృక్షముల గుంపుతో నిండిన వనప్రదేశము హానుమంతుఁడు పాడుచేయఁగా విచారపడఁదగిన తీఁగెల జొంపములతోఁ గూడినదాయెను. ఆ హానుమంతుఁడు బలశాలి యగు రావణుని మనస్సున కప్రియము గలిగించి, తానొక్కఁడె మహా బలవంతులు పెక్కండ్రతో యుద్ధముచేయఁ గోరినవాఁడై శౌర్య లక్ష్మిచే వెలుఁగుచు నా యశోకవనబహిర్ద్వారమునఁ జేరినవాఁడయ్యెను.

42-వ సర్గము

రావణుఁడు హానుమంతునిమీఁదికి రాక్షసులను బంపుట

అంతటఁ బక్షులకూఁతలకు, చెట్లు విఱుగుటనయ్యెడు పెళ పెళ ధ్వనులకును లంకాపురమునందలి జనులంద ఱులికిపడి తత్తరపాటు నొందిరి. ఆవనములందున్న మృగపక్షులు భీతిల్లి కూఁతలిడుచు నలుదెసలకుఁ బాఱినవి. మఱియు రాక్షసులకుఁ గ్రూరములయిన దుశ్శకునములు గలిగెను. చెట్లు విఱుగునప్పటి పెళపెళలకు నిద్రా భంగము గలుగుటచే వికృతపురూపములుగల రాక్షసస్త్రీలు మేలొక్కని, విఱువఁబడియుండు ఆవనమును, వీర్యవంతుఁడైన గొప్పవానరునిఁ జూచిరి. ఎక్కువసత్త్వయు బలిమియుఁగలవాఁడును, నిడుదచేతుల వాఁడునైన యావానరోత్తముఁ డా రాక్షసకాంతలను జూచి, వారికి వెఱపుగలిగించు కడుగొప్ప యాకారమును దాల్చెను.

అంతట నారాక్షసకాంతలు పర్వతముమాఱి నెత్తయినవాఁడును, దీర్ఘ కాయుండు, బలవంతుఁడునునైన వానరునిఁజూచి, జానకి నుద్దేశించి "ఓ సీతా! ఈతఁడెవ్వఁడు? ఎవనికుమార్తుఁడు? ఎచ్చటినుండి యెందు

నిమిత్తమై యిచ్చటికి వచ్చినాఁడు? నీవేల యితనితో నింతసేపు మాట లాడుచుంటివి? నల్లని కడకన్నులుగలదానా, యీతఁడు నీతో నేమి ముచ్చటి లాడెను? ఓవిశాలాక్షీ! యిది యెల్ల మా కెఱిఁగింపుము. ఓ సుందరీ! నీకు భయమువలదు." అని సీతాదేవి నడుగఁగా, సర్వాంగ సుందరి యైన పతివ్రతయగు సీతాదేవి "రాక్షసాంగనలారా, భీమ రాక్షసుల మాయల నెఱుఁగ నెవరికి శక్తి గలదు? ఈతఁ డెవ్వఁడో, ఏమిచేయఁగలఁడో, అది మీరే యెఱుఁగుఁడు. పామునకే పాము కాళ్లు తెలియునుగాని యొరులకుఁ దెలియదు. ఇది నిక్కము. నేనును వీనిం జూచి యెఱిఁగితిని. ఇతఁ డెవ్వఁడో నాకును దెలియదు. వానర రూపముఁ దాల్చి వచ్చిన రాక్షసుఁడేమో యని తలఁచెదను" అని ప్రత్యుత్తర మొసఁగెను.

సీతాదేవిచెప్పిన పలుకులువిని కొందఱు రక్కసకాంతలు మూల మూలలకుఁ బరుగెత్తిరి. కొందఱు నిల్చిననిలువున నిలఁబడిరి. కొందఱు రావణుని కీ వృత్తాంతముఁ దెలుపఁబోయిరి. అట్లు కొందఱు వికృత రూపలగు రాక్షసకాంతలు రావణునిసన్నిధానమున విరూపుఁడయిన భయంకరుఁడగు వానరునిం గూర్చి చెప్పఁబూని "ఓమహారాజా!" వెఱ పించు రూపముగల యొక వానరుఁ డశోకవనమునఁదుమ సీతతోడ ముచ్చటలాడి నిలిచియున్నాఁడు. వానిశౌర్యము మితి మీఱియున్నది. మే మాజింకకన్నులదగు సీతాదేవిని ఆవానరుంగూర్చి యెన్ని విధముల నడిగినను, అతఁ డితఁడని చెప్పకున్నది. అతఁ డింద్రునిదూతయో, కుబేరునిదూతయో, సీతాదేవిని వెదకునిమిత్తమై రామునిచేఁ బంపఁ బడిన దూతయో మే మెఱుఁగము. నానావిధమృగగణములతో నిండిన తమ ప్రమదావనము నాతఁడు పాడుచేసెను. ఆ వనమున నతఁడు పాడు చేయని తా వొక్కటి లేదు. అయినను ఆ సీతాదేవి గూర్చుండి యున్న వృక్షప్రదేశము మాత్ర మాతఁ డేమి చేయలేదు. ఆ ప్రదేశ మును బాడు సేయకుండినది యా సీతాదేవి రక్షణముకొఱకో, లేక బడలికనో మాకుఁ దెలియదు. అతఁడు బడలికచే నా ప్రదేశము వదలి నాఁడనుట యుక్తముగాఁ దోఁపలేదు. అంత వనము పాడుచేసిన యాతఁ డా సీతాదేవియున్న ప్రదేశముమాత్రము విడువ నేల? సీతా దేవి యే వృక్షము క్రిందఁ గూర్చుండియున్నదో, మెత్తనిచిగుళ్లును

బువ్వాలునుగల ఆ గొప్ప శింశుపావృక్షమును మాత్రము విఱువలేదు. ఆ వానరుఁడు సీతాదేవితో మాటాడెను. ప్రమదావనమెల్లఁ బాడు సేసెనుగావున నుగ్రుఁడా, యవ్వానరుని కుగ్రదండనము నీవు విధింపుము. రాక్షసులగురిపు నేలువాఁడా, నీవు మనసునఁగోరిన తనదైన యా సీతతో బ్రతుకఁ గోరువాఁ డెవ్వఁడు మాటాడును?" అని రావణునితోఁ జెప్పిరి.

రాక్షసస్త్రీలమాటలను విని మహాకాంతిగల రాక్షసరాజగు రావణుఁ డాజ్యాహుతింబ్రజ్వరిల్లు నగ్నిహోత్రునిమాడ్కి మండిపడి, కన్నులు గిరగిఁదిప్పుచు వెలుఁగుచున్న దీపములనుండి జ్వాలలతోఁ గూడిన చమురుబొట్లనుకై వడిఁ గన్నులనుండి కన్నీటిబొట్లు గార్చుచు, శౌర్యమునఁ దనకు సాటివచ్చువారును, శూరులునైన కింకరులును పేరుగల రాక్షసుల నాతని వధింపుఁడని యానతిచ్చెను.

గొప్ప పొట్టలును కోఱలును గలవారును, భయంకరరూపులును మహాబలులును యుద్ధమునం దెక్కువ యపేక్ష గలవారునునగు నెనుబదివేలమంది కింకరులును కూటముద్గరము లను నాయుధములను దాల్చినవారై, హనుమంతునిఁబట్టుకొనఁ గోరి వేగిరమే వచ్చిరి. ఆకింకరులట్లు మహావేగముతో వచ్చి, అశోకవనద్వారదేశమున ధైర్యవంతుఁడై నిల్చియున్న వానరవీరునిఁ జూచి, మిడుత లగ్నిహోత్రుని మీఁదఁ బడునట్లు ఆ హనుమంతునిమీఁదఁ బడిరి. ఆ కింకరులు విచిత్రములగు గదలను, పసిఁడి పొన్నులు దగిలించినగుదియలను, సూర్యునిఁ బోలె ధగధగ వెలుఁగు శరములను, గుదియలను, అడ్డకత్తులను, శూలములను, చిల్లకోలలను, ఈఁటెలను, తోమరములనుగైకొని యా హనుమంతునిఁ జుట్టుకొని, యాయుధములతోఁ గొట్టుచు ముందు నిలిచిరి.

కాంతిగలవాఁడును, ప్రతాపశాలియు, పర్వతసదృశుఁడునైన హనుమంతుఁడును తోఁకను నేలమీఁదఁ గొట్టి దేహమును బెంచి, లంకాపుర మడలునట్లు కడు ధీరముగా భుజ మప్పళించెను. మాఱు మ్రోఁత వినఁజేయు ఆ నాయప్పలింత విన్నమాత్రమున నాకసమునఁ బాఱుచున్నపక్షులు క్రిందఁ బడినవి.

అప్పుడు హనుమంతుఁడు "ఎక్కువ బలశాలురగు రాముఁడును, లక్ష్మణుఁడును అందఱికంటె మించినవారై యున్నారు. వాలివధముచేసి

రామునిచేఁ గాపాడఁబడిన మారాజగు సుగ్రీవుఁడును సరోత్కృష్టుఁడై యున్నాఁడు. నే నెట్టికార్యమైనను చులకనగాఁ జేయఁగలకోసలరాజగు రామునియొక్కదూతను. నేను హనుమంతుఁ డను పేరివాఁడను; శత్రు సేనలఁ బరిమార్చువాఁడను; వాయుపుత్రుఁడను. వేయిమంది రావణు లతో సైతము యుద్ధమున బాలతోఁ గొట్టుచుఁ జెట్లతో మోదుచుఁ బోరాడుదు. నే నీ లంకాపురమును బాడుసేసి, సీతాదేవికి మ్రొక్కి, యామెకడ నుత్తరవుగైకొని, పనినెఱవేర్చుకొన్నవాఁడనై రాక్షసు లందఱు చూచుచుండఁగా బయలువెడలి పోయెదను" అని యార్భటము సేసెను.

అంత హనుమానుని యాగంభీరనాదముచే కింకరనామకులగు రాక్షసులందఱు మిక్కిలి యులికిపడినవారై, సంధ్యాకాలమేఘము మాడ్కిఁ బెచ్చు పెరిగి యున్న యాహనుమంతుని వీక్షించి, రాజాజ్ఞ యైనందున నిర్భయులై నానావిధములైన యాయుధములను జేతఁ బట్టి యాతని ముట్టడింపఁగా, నాహనుమంతుఁ డొక్క యెగురున ద్వార మున నుండు నినుపగుదియకడకుఁ బోయి, గరుడుఁడు మినమినలాడు పామును ముక్కునఁగఱచుకొన్న చందమున నాగుదియ నెత్తుకొన్న వాఁడై, యాకాశమున నిలిచి దానిని గిరగిరద్రిప్పి యాకింకరులనెడి రాక్షసవీరుల నందఱఁ బరిమార్చి, యుద్ధముఁగోరినవాఁడై మఱల ద్వారదేశముపై నుండెను. ఆకింకరులలోఁ గొందఱు భయంకరుఁడైన హనుమంతునిచేతినుండి తప్పించుకొని రావణునికడకేగి, "మహారాజా! కింకరులందఱు వీరుఁడైన యాహనుమంతునిచేత మడిసిరి" యని విన్న వించిరి. అంత రావణుఁడు కింకరబలమంతయు హనుమంతునిచే మడియుట విని, కన్ను లెఱ్ఱచేసి పరాక్రమమున సాటిలేనివాఁ డగుటచేత యుద్ధ మునఁ బగతురకు గెల్వనలవికాని ప్రహస్తకుమారుని హనుమంతునిఁ బట్టితెమ్మని పంపెను.

43-వ సర్గము

హనుమంతుఁడు చైత్యపాలురను నుగ్గుసేయుట

అంతట హనుమంతుఁడు కింకరులనెడి రాక్షసులను సంహరించి, "నేను ప్రమదావనము పాడుచేసితి. రాక్షసులకులదేవాలయరూప

మగు నగరును పాడుసేయనైతిని. కావున నిప్పు డాభయంకరమగు నగరును నిట్లే ధ్వంసముచేసెదను" అని తలఁచినవాఁడై తనబలిమిఁ జూపుచు మేరుపర్వతశిఖరముమాడ్కి సున్నతమైన కులదేవతాలయ రూప మగునగరు కొన కెక్కెను. అట్లు హనుమంతుఁడు పర్వతము బోలు నగరుపై కెక్కి, యుదయించిన సూర్యునివలె వెలుఁగుచు, గట్టిదగు చైత్యప్రాసాదముఁ గదలించి, శౌర్యలక్ష్మిచేఁ బ్రజ్వరిల్లుచుఁ బారియాత్రపర్వతసదృశుఁడై, దేహమును బెంచుచు, లంకాపురమున నిండునట్లును, ఆకాశమునఁ బాఱు పక్షులు క్రిందఁబడునట్లును చైత్య పాలకులు మూర్ఛిల్లునట్లును కర్ణకఠోరముగా నుండునట్లును గట్టిగాబుజ మప్పళించెను. అట్లు అప్పళించి "అస్త్రవేత్తయగు రాముఁడును, మహా బలుండగు లక్ష్మణుఁడును, రాముని చే వాలిసంహారరూపసాహాయ్యము చేసి కాపాడఁబడిన సుగ్రీవుఁడును సరోత్కృష్టులై యున్న వారు. నేను విచిత్రశక్తిగల కోసలదేశాధీశ్వరుఁడగు రాముని దూతను. వాయు పుత్రుఁ డనుపేరివాఁడను. శత్రుసేనలఁ జక్కాడువాఁడను. నేను బాలతోను, చెట్లతోను శత్రువులను గొట్టునప్పుడు వేవురు రావణు లైనను నాతో సమముగా యుద్ధము చేయనేరరు. నే నీ లంకాపురమును ధ్వంసముచేసి, జానకీదేవిని బ్రణమిల్లి, పనిఁజూచుకొన్నవాఁడనై యంబరు రాక్షసులు చూచుచుండఁగా మాపురమునకుఁ బోయిచేరె దను" అని చైత్యపాలురతోఁ బలికి, రక్కసు లంద ఱులికిపడునట్లు గొప్పధ్వనిని జేసెను.

గొప్పమేనులు గలవారగు చైత్యరక్షకులు మూఁడుగురు ప్రాస తోమర ఖడ్గపరశ్వధాదులగు పెక్కుటడిదములను గైకొని, యాహాను మంతునిఁ జుట్టుకొని, విచిత్రములయిన గదలతోను బంగారుపూస్తులు వేసిన గుదియలతోను సూర్యునిమాడ్కిఁ దేజరిల్లు బాణములతోను ఆహనుమంతునిఁ గొట్టిరి. ఆ హనుమంతుని చుట్టు నిల్చియున్న యా రాక్షసగణము గంగానదియందలి కడువెడల్పయిన నీటిసుడివలెఁ జూపర కగపడెను.

ఆరాక్షసుల బాణములపోటున కా హనుమంతుఁ డలిగినవాఁడై యెత్తు శిఖరముగల ప్రాసాదముయొక్క కనకమయ స్తంభము నొక్కటి పెళ్లగించి, దానిని గిరగిరద్రిప్పి మఱియొక్క స్తంభముమీఁదఁ

గొట్టఁగా నా స్తంభము లొండొంటి నొఱసికొనుటచే నచ్చట నిప్పుపుట్టి యానగరంతయు నంటుకొని మండ నారంభించెను. అంతట వానరపుంగవుఁడగు హనుమంతుఁడు ప్రాసాదము మండుటఁ జూచి, ఇంద్రుఁడు వజ్రాయుధముతో నసురులను బొలియించున ట్లాప్రాసాదరక్షకులను నూఱ్వురను జంపి, యాకాశమున నుండి శౌర్యలక్ష్మిచే వెలుఁగుచు, ఆరాక్షసుల నుద్దేశించి "ఓరాక్షసులారా! నాపంటిబలశాలురగు వానర వీరులు పెక్కు వేవురు మాఱేఁడగు సుగ్రీవునివశమున నున్నవారు. వారు మేమును సీతాదేవినిమిత్తమై భూమండల మెల్లఁ దిరుగుచున్నారము. మాలోఁ గొందఱు పదేనుఁగులబలమును, మఱికొందఱు నూఱేనుఁగుల బలంబును, వేఱుకొందఱు వేయియేనుఁగుల బలమును, మఱికొంద ఱోఘబలమును, తక్కిన కొందఱు వాయుబలమును, వేఱొకకొంద ఱెన్నరాని బలమునుగలవా రయియున్నారు. దంతనఖాయుధులగు ఈ పెక్కుకోట్ల వానరులతోఁ గూడినవాఁడై, మీకంద ఱకు సంహర్తయైన సుగ్రీవుఁడు రానున్నాఁడు. అతఁడు వచ్చెనేని, ఈలంకాపుర ముండదు; మీరుండరు; రావణుఁ డుండఁడు. ఓరాక్షసులారా! మీకందఱకుఁ జేటునకే యీ మహాధీరుఁడయిన యిక్ష్వాకువంశస్థుఁడయిన రాముని తోఁ బగ పూనితిరి. ఇది మీకు మేలునకుఁ గాదు" అని దిట్టతనముతోఁ బలికెను.

44-వ సర్గము

హనుమంతుఁడు ప్రహస్తసుతునిఁ జంపుట

రావణుఁ డానతియ్యఁగా యుద్ధరంగమున కెల్ల నలవికాని వాఁడగు, గొప్పకోఱలుగల ప్రహస్తపుత్రుఁడగు జంబుమాలియను వాఁడు ఎట్టనిబట్టగట్టి యెట్టనిపూవులదండలఁ దాల్చినవాఁడై, కన్నులు గిరగిర ద్రిప్పుచుఁ బగతురకు వెఱపు పుట్టించుచు, వజ్రాయుధముఁ బోలు గొప్పవింటిని, వడిగాఁబోఁగల బాణములను గైకొని, వింటి నారిని వేగముతో మీఁటఁగా, ఆవింటినారిమ్రోఁత దిక్కులందును, విదిక్కులందును, ఆకసమునందును నిండెను.

ఉత్సాహవంతుఁడైన హనుమంతుఁడు ఖరములుపూన్చిన రథమునఁ గూర్చుండివచ్చిన యాజంబుమాలిని జూచి యుప్పొంగి కిలకిల

ధ్వనిని జేసెను. అంతట నిమదచేతులవాఁడగు జంబుమాలి అశోకవన ద్వారస్తంభములమీఁది దూలముపైఁ గూర్చుండియున్న వానరశ్రేష్ఠుఁ డైన హానుమంతునిఁ గఱకుటమ్ములచేఁ బెక్కుతావులందు మోఁదెను. అర్ధచంద్రబాణముతో ముఖమునను, చెవులుగల యొకబాణముతోఁ ధలమీఁదను, పది కఱకుటమ్ములచేఁ జేతులందును మోఁదెను. ఆప్రహస్తునిచే మోఁదఁబడి రక్తముగ్రమ్మిన యాహానుమంతునిముఖము చుట్టు నెఱ్ఱనై శరత్కాలమున సూర్యరశ్మి గ్రమ్మఁగా వికసించిన యెఱ్ఱితామర పువ్వువలెను, ఎఱ్ఱగందపుఁబూఁతగల యాకాశమునందలి మహాపద్మము వలెను నుండెను.

హానుమంతుఁ డా ప్రహస్తపుత్రుని బాణములమోదులకుఁ గడునలిగినవాఁడై, తనప్రక్కన నున్న కడువిశాలమైన యొక గొప్ప బండను వేగముతోఁ బెళ్లగించి, బలముకొలఁదిని విసరివేసెను. జంబు మాలియు నా గొప్పబండను బదిబాణములచేఁ దుత్తునియలుచేసెను. హానుమంతుఁడు తనకార్యముచెడినది చూచి, ఓర్వరాని పరాక్రమము గలవాఁడగుటచేఁ బగతునియవమానము సైరింపలేక, చేరువనున్న యొకవ్రాఁకును బెళ్లగించి, గిరగిర ద్రిప్పుచుండఁగా, బలవంతుఁడగు జంబుమాలి యది చూచి, నాలుగుసాయకములు ప్రయోగించి యా వ్రాఁకును బడఁగొట్టి, మఱియొదుబాణముల నాతనిభుజమునను, ఒక్క బాణము నాతనిఱొమ్మునను, పదిబాణముల నెదురుఱొమ్మునను గొట్టెను. ఆహానుమంతుఁడు దేహమంతయు బాణములు నిండఁగాఁ గడునలుక గదుర వేగముతో నాద్వారపుగుదియను బెళ్లగించి, బలిమి చెలరేఁగఁ గడువేగిరముగాఁ బల్లటు త్రిప్పి యాజంబుమాలి వెడదఱొమ్మునఁ బడనేసెను. ఆగుదియమోదున కాప్రహస్తునికిఁ దలగాని, చేతులుగాని, తొడలుగాని, రథముగాని, గుఱ్ఱములుగాని, ఆయుధములుగాని కనిపింప వయ్యెను. అట్లు జంబుమాలి హానుమంతునిచే మోదఁబడి, పిండి చేయఁబడిన సొమ్ములతో నేలఁగూలెను. అంతట కింకరులును జంబుమాలియుఁ జచ్చిరన్నమాటను విని రావణుఁడును కినుక గదుర నెఱ్ఱని కన్నులుగలవాఁడై, బలవంతుఁడగు ప్రహస్తపుత్రుని మరణవార్తా శ్రవణజన్యకోపముచేఁ గన్నులు గిరగిరఁ ద్రిప్పుచు, మీఱిన బలపరాక్రమంబులుగల మంత్రిపుత్రుల నేడ్వురను వానిమీఁదికిఁ బంపెను.

45-వ సర్గము

హనుమంతుఁడు మంత్రిపుత్రుల నేడ్వురఁ బరిమార్చుట

రాక్షసాధిపతియగు రావణుఁ డానతియ్యఁగా, నగ్నిహోత్రుని చందమునఁ దేజరిల్లువారును, విలుకాండ్రును, బలశాలురును, విలువిద్దె నేర్చినవారిలోను, అస్త్రజ్ఞులలోను మేటులును, ఒండొరుల జయములు గోరువారును, ఎన్నఁ రాని మగఁటిమిగలవారునునై న మంత్రిపుత్ర లేడ్వురును, సువర్ణాలంకృతములును, ధ్వజపతాకములు గట్టినవియు, ఉఱుమువంటి గమనమునందలి మ్రోఁతగలవియు, గుఱ్ఱములు గట్టిన వియునై న యరదములమీఁదఁ గూర్చుండి, కనకభూషణాలంకృత చాపములను జేతులఁ బట్టి, విండ్లనారులను మీటుటంజేసి, మెఱుపులతోఁ గూడిన మొగుళులంబోలె వెలుఁగుచుఁ గడువేడ్కమీఱ స్వభవన ములనుండి తఱలిరి. కింకరులు హనుమంతునిచే హతులై రన్నమాట విని, వారితల్లులు "అక్కటా! మాకొడుకులు మడిసిరిగా" యని బంధు మిత్రజనోపేతముగా నేడ్చుచుఁ దత్తరపాటునొందిరి. మేల్మి తొడవులఁ దాల్చిన యామంత్రిపుత్ర లేడ్వురను నేను ముందు నేను ముందని పోటీలువేసికొని వనద్వారదేశమున నున్న యా హనుమంతునిపైకిఁ గవిసి, క్రొక్కారుమబ్బు లుఱుములు మెఱుములు చెలరేఁగ వర్షముఁ గురిపించినట్లు, రథనేమిధ్వానము లుఱుములవలె మిన్ను ముట్ట బాణ వర్షములఁ గురిపించిరి.

ఆరాక్షసులు ప్రయోగించిన యమ్ము లా వానరవీరునిమేను గ్రమ్మఁగా నతఁడు జడివానచేఁ గ్రమ్మఁబడిన పర్వతేంద్రునికైవడిఁ జూపట్టెను. వేగముగా నడచునట్టి శూరుఁడయిన యాహనుమంతుఁడు రాక్షసులు ప్రయోగించు శరములు తనకుఁ దగులకుండునట్లును, రథ వేగమునఁ దనపై బాణములఁ బ్రయోగింప వీలులేకుండునట్లును జేసి, విలుకాండ్రగు నారాక్షసులతో యుద్ధక్రీడ సల్పుచు నాకసమున నింద్ర ధనుస్సులతోఁ గూడిన మేఘములచేఁ జుట్టఁబడిన సర్వసమర్థుఁడగు వాయువుంబోలినవాఁడై, యంద ఱులికిపడునట్లొక్క గొప్ప బొబ్బపెట్టి, రాక్షససేన సడలించుచు, ఆ రక్కసుల వధింపఁ దలఁచి, కొందఱి నఱి చేతులతో నప్పళించి, కొందఱిని గాళ్లతోఁ గ్రుమ్మి, కొందఱిని బిడికిళ్లతో

గ్రుద్ది, కొందఱని గోళ్లతోఁ జీల్చి, కొందఱని ఱొమ్ముతోఁ దాఁకి, కొందఱని దొడల నడుమ నలిపి రూపుమాపెను. మఱికొంద ఱాతని యట్టహాసము విని యచ్చటనే నీల్గిరి. అట్లు మంత్రిపుత్రు లందఱు సచ్చి, నేలఁ గూలఁగా, వారిసైన్యమెల్ల వెఱపుచే దిగులుపడి పదిదిక్కులకుఁ బాఱెను. వారియేనుఁగులు వికృతస్వరములతో నఱచినవి. వారువ ములు ద్రెళ్లినవి. విఱిగిన ఱిక్కెములును, గూండ్లును, గొడుగులును గల రథములచే నాయుద్ధభూమి నిండినదాయె. నెత్తుటివెల్లువలు మార్గములందుఁ బొఱఁజొచ్చెను. అప్పుడు లంకాపురమునఁ బలువిధము లైన యార్తనాదములు పుట్టెను. ఆయోర్వీశాని మగఁటిమియు, హెచ్చుబలిమియుఁగల వానరవీరుఁడగు హనుమంతుఁడు తనమీఁదికి రేఁగిన యా మంత్రిపుత్రుల నేడ్వురను బిలుకుమార్చి, వెండియు నితర రాక్షసులతోఁ బోరాడఁగోరి యాద్వారదేశమునే పొందెను.

46-వ సర్గము

రావణుఁడు సేనాధిపతుల నేవురను బంపుట

ఎక్కువబలశాలియు హనుమంతుఁడు మంత్రిపుత్రుల నేడ్వురను గూడ సంహరించె నన్నవార్త విన్నవాఁడైన రావణుఁడు లోలో పలఁ గొంత దిగులొంది, చాలసేపు యోజించి, విరూపాక్షు, యూపాక్షు, దుర్ధర, ప్రఘస, భాసకర్ణు లనెడి యేవుర సేనాధిపతులను రావించి, నీతిశాస్త్రము నెఱిఁగినవారును, వాఁడిమగలును, యుద్ధరంగ మున వాయువేగముంబోలు వేగముగలవారును, హనుమంతునిఁబట్టి తెచ్చుటయందుఁ బూనికిగలవారును నైన యాసేనాధిపులంజూచి, "ఓ సేనాధిపతులారా! మీరు పెక్కుగుఱ్ఱములును ఏనుఁగులును తేరులును, గొని, విస్తారమయిన కాల్బలంగమును దోడ్కొనిపోయి యా వానరుని శిక్షింపవలయును. మీ రా వానరునిఁ గదిసినప్పుడు మెలఁకువతో మెలఁగి, దేశకాలములకుఁ దగినపని చేయవలసినది. ఆతని యద్భుతంపుఁ గార్యమును బరికించి చూడఁగా నతఁడు సామాన్యమైన వానరుఁడు గాఁడని తోఁచెడిని. మనవధ నిమిత్తము ఇంద్రునిచే తపో బలమువలన సృజింపఁబడిన యెక్కువబలముగల దగు మహాభూతమై యుండవలెను. మనమందఱము గలిసి యింతకుమున్నెందఱినో నాగ

గంధర్వయక్షదేవాసురమహర్షులను జయించితిమి. కావున వాళ్లే తప్పక మన కేదోయొక హాని చేసియుండవలయును. మీరు జాగ్రత్తతో నుండి యీవానరుని బట్టుకొనవలసినది. మీరును ధైర్యసాహసములు గల యీవానరుని నలక్ష్యము చేయవలదు. తొల్లి వాలిసుగ్రీవులు, బలశాలియగు జాంబవంతుడు, సేనాధిపతియగు నీలుడు, తక్కుగల మైందద్వివిదులు మొదలగు విస్తారపరాక్రమముగలవారలగు పెక్కండ్రు వానరులను జూచితిని. కాని, వారికంత బలపరాక్రమములును, బుద్ధియు, బలిమియుఁ బట్టుదలయు, గొప్ప యీకారమును లేవు. ఇది యెద్దియో యొక్క పెనుభూతము వానరరూపముతో నున్నదని యెంచెదను. మీ రెక్కువ పట్టుదల గలిగి, యీతనిఁ బట్టవలయును. స్వర్గ మర్త్య పాతాళములందు దేవాసురమనుష్య లనెడి మల్లోకములవారును యుద్ధరంగమున మీయెదుట నిలువఁజాలరు. అయినను, జయాపజయ ములు నిక్కములు గావు గావున, యుద్ధమున జయముఁగోరు నృపాలుఁడు పట్టుదలతోఁ దనప్రాణసంరక్షణము చేయవలయును" అని వారి కానతిచ్చెను.

మిగుల శూరులైన యీసేనాధిపతు లేవురును, రాజాననుమతి గొని, రథములను, మదించినయేనుఁగులను, వేగముగలగుఱ్ఱములను, బలములనుగొనివాఁడియైన యస్త్రశస్త్రములనుబట్టి అగ్నివలెఁ దేజరిల్లుచు నతివేగముతోఁదరలి యగ్నిహోత్రునిమాడ్కి వెలుఁగుచుఁ, దన తేజస్సుచేఁ గిరణములుగల సూర్యునిమాడ్కి వెలుఁగువాఁడయి, మిక్కుటమగు నుత్సాహము, పట్టుదలయుఁ గలిగి యెక్కువతెలివియు, వేగమును, గొప్పదేహమును, శక్తియుఁ గలవాఁడయి ద్వారప్రదేశ మునన్న యీవానరునిఁ జూచిరి.

ఆసేనాధిపతు లేవురును హనుమంతునిఁ జూచినవెంటనే నలు దెసల నతనిని ముట్టడించి, పలుతెఱఁగులగు భయంకరములైన యడిదము లతో నాహనుమంతునిఁ గొట్టఁబూనిరి. అప్పుడు ఉక్కువియు, వాఁడిమి గలవియు, పచ్చనికొనలుగలవియు, కలువరేకులవన్నె గలవియునైన యైదుబాణములచే శత్రువులకు లొంగనివాఁడగు దుర్ధరుఁడు హనుమంతునినెత్తిని గొట్టెను. హనుమంతుఁడా దెబ్బలకుఁ గడు నలిగి, పదిదెసలును మాఱుమ్రోగునట్లు కిలకిలధ్వనిసేయుచుఁ బైకెగురఁగా,

మొనగాఁడగు దుర్ధరుండును రథమునఁగూర్చుండి విల్లెక్కఁ బెట్టి, కఱకు టమ్ములను గ్రుమ్మఱించుచు నాహానుమంతుని నెదురుతాఁకెను. శరత్కాలమున గాలి వర్షించుచుండు మేఘమును జెదరఁ గొట్టునట్లు హానుమంతుఁడును రాక్షసుఁ డేయు నమ్ముల నెల్ల నివారించి, వానిబొణముల తాఁకుళ్లకు నొచ్చినవాఁడై, యుద్ధమునం దెక్కువ పట్టుదల పూని, తనదేహముఁ బెంచెను. అట్లు పెంచి పర్వతమున మెఱుపురాశి పడినట్లుగా, ఆదుర్ధరుని రథమునఁ గడు వేగముతోఁ బడి, యాతనితేరి గుఱ్ఱముల నేనిమిడింటినిఁ బరిమార్చి, తేరియిరుసు విఱిచి మూలఁద్రోసి, యా దుర్ధరుని మర్దింపఁగా, నాతఁడు క్రిందఁబడి ప్రాణములను వదలెను. అట్లు దుర్ధరుఁడు నిహతుఁడగుటఁ జూచి, శత్రువులకు లొంగనివారును, శత్రువులను హింసించువారునైన విరూపాక్ష యూపాక్ష లిరువు రలిగినవారలై, యాకసమునకుఁ గుప్పించి హానుమంతుని రెండుఓరకళ్లతో నెదురుఓమ్మునఁ బొడిచిరి. బలశాలియు, మగఁటిమి నింద్రునిఁ బోలువాఁడునైన హానుమంతుఁడును, బలశాలురైన యా విరూపాక్ష యూపాక్షులబొణములను బడఁగొట్టి, తాను గ్రించికిదిగి, యొక్కచెట్టు నూడఁబెఱికి యారాక్షసుల నిద్దఱను దల పగులఁగొట్టెను. అట్లు వారు మువ్వురు నాహానుమంతునిచేఁ జంపఁబడుటఁచూచి, బలశాలురగు ప్రఘస భాసకర్ణ లనువారిర్వురును జుట్టుకొనిరి. వారిలోఁ బ్రఘసుఁ డొక వైపున వాఁడియంచుగల పట్టసముతో నా హానుమంతునిఁ గొట్టెను. భాస కర్ణుఁడు మఱొక్కప్రక్కన నాహానుమంతుని శూలముతోఁ బొడిచెను. హానుమంతుఁ డా రాక్షసులచే నట్లు గొట్టఁబడి, సర్వాంగములనుండి కాఱిన నెత్తుటిచే మేను దడియ, బాలసూర్యనిమాడ్కి వెలుఁగుచుఁ గడుఁగినిసి, మృగములు, సర్పములు, వృక్షములునుగల యొకపర్వతశిఖ రము నూడఁబెఱికి, దానిని వారియిరువురినెత్తిని వేసి వారిని బరిమా ర్చెను. అట్లు సేనాధిపతు లేవురను మడిసినతర్వాత, హానుమంతుఁడు గుఱ్ఱములతో గుఱ్ఱములను, ఏనుఁగులతో నేనుఁగులను, బంటులతో బంటులను బరిమార్చి, రథములతో రథములను విఱిచి, దేవేంద్రుఁ డసురులను బడఁగొట్టునట్లు తక్కినసైన్యమును బరిమార్పఁగా, నాయుద్ధ భూమియంతయు నాచతురంగబలముల శవముల రాసులు రణభూమియం

దంతటను దారికడ్డువడియుండెను. ఆహనుమంతుఁ డట్లు సేనానాయకుల నేవురను బీచమడఁచి, వారిబలములను జక్కాఁడి, మఱల ద్వారమునెక్కి ప్రజానాశము సేయుటకై సంకల్పించిన యమునిమాడ్కి వెలుఁగుచుండెను.

47-వ సర్గము

హనుమంతుఁ డక్షకుమారునిఁ జంపుట

రావణుఁడు తనసేనాధిపతు లేవురను బలఁగముతోఁగూడ హనుమంతునిచేత మడిసిరన్న వార్త విన్నవాఁడై, తనముందర నున్నట్టి, యుద్ధగర్వితుఁ డయినందున యుద్ధము నెదురుచూచు నక్షకుమారుని వైపు చూచెను. ప్రతాపవంతుఁడును, బంగారుమయంబయిన వింత ధనుస్సుగలవాఁడునై న యక్షకుమారుఁడు, రావణుఁడు కనుసైగచేతనే తన్ను ప్రోత్సాహపఱప, యజ్ఞవేదికయందు బ్రాహ్మణోత్తములు మంత్రపూర్వకముగావేల్చిన హవిస్సులచేఁ బెంపొందిన యగ్నిహోత్రుని కెవడిఁ బెకెగిరెను. అట్టి రాక్షసవీరుఁడగు అక్షకుమారుఁడుప్పొంగి, బాలసూర్యనిమాడ్కిఁ బ్రజ్వరిల్లునదియు, అపరంజితోఁ జేసిన గవాక్షములు గలదియు, అతినూత్రమయినతపముచే సంపాదింపఁబడినదియు, మేలిమి భూషణములచే నలంకరింపఁబడినదియు, రత్నభూషణాలంకృతమయిన పెక్కేఁములతోఁ గూడినదియు, మనోవేగమువంటి వేగముతోఁబోవు చక్కని యెనిమిదిగుఱ్ఱములు పూన్చినదియు, దేవతలకును రాక్షసులకును దిరస్కరింపరానిదియు, అడ్డములేక సంచరించునదియు, సూర్యనిమాడ్కిఁ దేజరిల్లునదియు, ఆకాశమునఁ బోవునదియు, చక్కఁగా నిర్మింపఁబడినదియు, అమ్ములపొదులును, ఎనిమిదికత్తులుగూడిన పలకయుఁగలదియు, వరుసలుగాఁ దీర్పఁబడిన శక్తులతోను, తోమరముల తోను గూడినదియు, విండ్లు, బాణములు మొదలగు అన్నియుపకరణములతోను, వెండిబంగారుమయములగుటచేఁ జంద్రసూర్యులమాడ్కిఁ దేజరిల్లు వాగెలుమున్నగువానితోను గూడినదియు, సూర్యనిఁబోలునదియునై న రథమునెక్కి, గుఱ్ఱములయు, ఏనుఁగులయు, మహారథములయు రొదలను భూమ్యాకాశములందు నిండించుచు, కవచములు మున్నగునవి ధరించిన సేనలు కూడరాఁగా, అశోకవనద్వారమున నున్న

సమర్థుఁడైన యాహనుమంతునిఁ దాఁకెను. సింహమువంటి చూపుగల యాయక్షకుమారుఁడు జనసంహారమునకై పూనిన ప్రలయకాల యమునిఁ బోలియున్న యావానరునిఁ జూచి యాశ్చర్యమును తత్తర పాటును గలవాఁడై, యాతనిని గౌరవదృష్టితోఁ జూచెను.

ఎక్కువబలిమిగల యారావణపుత్రుఁడగు అక్షకుమారుఁడు గొప్పదిట్టరియయిన యావానరునివడిని, శత్రువులందుఁ జూపిన మగఁటిమిని తనబలిమినిజూచుకొని, నెమ్మనిపడి, వసంతర్తువునందలి సూర్యుని మాడ్కి వృద్ధినొందెను. యుద్ధమునఁ గదలని యక్షకుమారుఁడు పొగడఁదగిన పరాక్రమముగలవాఁడును, యుద్ధమునఁ బగతురకు లొంగనివాఁడునునై న యాహనుమంతునిఁ జూచి యలుక గదురఁగా నాతనిమీఁద మూఁడు కఱకుటమ్ములఁ నేసెను. హనుమంతుఁ డహంకారియై యలసటను గొనక, శత్రువులనోడించుటచే వెల్లడియైన బలిమి గలవాఁడగుటంజేసి, యామూఁడుబాణములను సరకుచేయకుండెను. అంతట నక్షుండు మనమున వేడ్కపూని వింటిని బాణములను గొని, బంగారుమయములై న వంకీలు, భుజకీర్తులు, కుండలములును వెలుఁగు చుండ నోర్వరాని మగఁటిమిగలవాఁడై యావానరుం దాఁకెను. అక్షకుమారహనుమంతులకు నిరువురికిని దేవాసురులకు సైతము వింతగొల్పు నట్టి సాటిలేని పోరు జరిగెను.

హనుమంతునికిని అక్షకుమారునికిని జరిగిన పోరు చూచి భూమి మ్రోఁగెను. సూర్యుఁ డెండగాయఁ డయ్యెను. గాలి వీవదయ్యె. కొండ లదరెను. ఆకసము మ్రోఁగెను. సముద్రము గలఁగెను. గుఱి చూచుట, బాణముల జోడించుట, వానిని విడుచుట యీవిషయము లను జక్కఁగా నెఱిఁగినట్టి మొనగాఁడగు నక్షకుమారుఁడు చక్కని కొనలుగలిగి, తొక్కలతోఁగూడి, బంగారుములుకులుగలవై విషముతోఁ గూడిన పాములంబోలియున్న మూఁడు వాఁడియమ్ములను బల్మఱు హనుమంతునితలమీఁదఁ బడనేసెను.

ఆ అక్షకుమారుఁ డేసినబాణములను హనుమంతునితలఁ దాఁకి యచ్చటనుండి నెత్తురు గాఱి కన్నులందు జాఱిపడఁగా నాహనుమంతుఁడు గన్నులు గిరగిరఁ ద్రిప్పుచు నప్పుడే యుదయించిన సూర్యబింబము మాడ్కియు, బాణములు గ్రుచ్చుకొనుటచేఁ గిరణపంక్తులతోఁగూడిన

సూర్యనిపగిదియుఁ గానఁబడెను. అట్టిసుగ్రీవునిమంత్రులలో మేటి యగు హనుమంతుఁడు, వింతవింతలైన యాయుధములను జేతఁ బట్టి, చిత్రమైన వింటిని దాల్చివచ్చిన రాక్షసేంద్రపుత్రుఁడైన యక్షకుమారునిఁ జూచి, గగ్గురుపాటు పుట్ట యుద్ధమునకుఁ బూనినవాఁడై గొప్ప బొబ్బరింత పెట్టెను. ఆహనుమంతుఁ డట్లఱచి, మందరపర్వతపుఁ గొనయం దున్న కిరణములుగల సూర్యనిమాడ్కి వెలుఁగుచు, నాగ్రహ ముప్పొంగఁ దననేత్రాగ్నిజ్వాలలచే నాయక్షకుమారుని, అతని బల వాహనములతో సైతము మండునట్లుఁ జూచెను.

అంతట బాణములఁ బ్రయోగించువింత విల్లుదాల్చిన యక్ష కుమారుఁ డనెడి వానకాలపుమబ్బు, మేఘము పర్వతోత్తమముపై వర్షిం చునట్లు, హనుమంతుఁడనెడి పర్వతముపై బాణములనెడి వర్షముం గురిపించెను. అంత మేఘగర్జనంబోలు కంఠనాదముగల యాహనుమం తుఁడు యుద్ధరంగమున హెచ్చుచుండు నాయక్షకుమారునివీర్యమును, తేజమును, బలిమిని, దిట్టతనమును జూచి, తనకు సాటియగువాఁడు యుద్ధమునకు వచ్చెఁగదా యని యుప్పొంగి గట్టిగా నఱచెను. అక్ష కుమారుఁడు పసితనమువలన యుద్ధమునందు పరాక్రమ మడర, కోపము విజృంభింప, నేత్రములు గోపముచే నెఱ్ఱనై వెలుఁగుచుండ గడితోఁ గప్పిన గొప్పనూతికడకు గజం బేగుదెంచున ట్లా యుద్ధమున నెదురు లేని హనుమంతునిఁ గదిసెను. అట్లతఁడు మారుతింగదిసి యతనిమీఁద లెక్కలేని బాణములఁ బ్రయోగింపఁగా, మారుతియు మేఘగర్జనముఁ బోలు నొక్క హుంకారము చేసి, పగతురు వెఱచునట్లు చేతులు కాళ్లను జాడించి నిమిషములో నింగి కెగసెను. రథమునెక్కిన వాఁడును, రథికులలో మేటియు, వెలుఁగుగలవాఁడును, రాక్షసశ్రేష్ఠుఁ డును బలవంతుఁడునునైన యక్షకుమారుఁడు మేఘుఁడు పర్వతము మీఁద వానలవాన గురిపించునట్లు శత్రువుపై బాణముల వర్షించుచు నింగికెగిరిన కపీంద్రుని వెంబడించి తాను నెగిరెను. మనోవేగుఁడును, యుద్ధమునఁ బగతురకు నోర్వరాని విక్రమము గలవాఁడునైన యా హనుమంతుఁ డక్షకుమారుఁ డేయుబాణములు దేహమున గ్రుచ్చుకొన కుండునట్లు నేర్పుతోఁ దప్పించుకొనుచు, బాణములనడుమ గాలివలెఁ జొచ్చుచు, శరములబారికిఁ దప్పించుకొనుచు నాకాశమార్గమునఁ

దిరుగుచుండెను. అట్లు వాయుపుత్రుఁడు దిరుగుచు, వింటినిఁ జేతఁబూని, యుద్ధమునందుఁ బట్టుపలగలిగి, పలుతెఱఁగులైన బాణములచే నింగిని గప్పుచున్న యాయక్షకుమారుని గౌరవముతోఁ జూచి, మనమునఁ జింత నొందెను.

గొప్పస్థైర్యశాలియయిన అక్షకుమారుఁడు ప్రయోగించిన బాణములచే నాహనుమంతునిఱొమ్ము వ్రయ్యలుకాఁగా, పనులతెఱఁగులకలరూపు నెఱిఁగిన నిడుపుచేతులవాఁడయిన యాకపీంద్రుఁడు యుద్ధరంగమున శత్రువులను లోఁబఱచుకొనువాఁడయిన యాయక్షకుమారుని విషయమై "బాలసూర్యనిభలెఁ దేజరిల్లువాఁడు, మహాబలముగలవాఁడునైన యీఅక్షకుమారుఁడు పిన్నవాఁడయ్యు, పెద్దవానివలెనే యుద్ధమున గొప్పపని చేయుచున్నాఁడు. ఇతఁడు యుద్ధసంబంధికార్యములన్నిటిచేఁ బ్రకాశించువాఁడు గావున నితనిఁ జంపుటకు మనసురాకయున్నది. ఈతఁడు గొప్పధీరుఁడు; గొప్పవీరుఁడు; జాగ్రత్తగలవాఁడు; యుద్ధమున గొప్పకష్టములను సైత మోర్చువాఁడు. యుద్ధకార్యములందలి యెక్కువ నేర్పుచేత నీతనిని మునులును, యక్షపన్నగులును సదా పొగడుచుందురు. ఇతనికిఁ బూనికయు మగఁటిమియు హెచ్చుటచే నితఁడు నాయెదుటనే నిలఁబడి నన్ను జూచుచున్నాఁడు. వడిగాఁబోవు నట్టి యీతనిపరాక్రమమునకు దేవాసురులు గూడ మనసునఁ గడగడ వణఁకుదురు. ఇతనిశౌర్య మప్పటప్పటికి హెచ్చుచున్నది. కావున నితని నిప్పుడే వధించుట యుక్తమని తోఁచుచున్నది. మండుచున్ననిప్పు నుపేక్షించుట తగదుగదా" అని యోచించి తనయెదిరియొక్క బలిమి పెంపును జూచి, తానుజేయవలసిన పనులరీతినిగూర్చి యాలోచించుచు, వడినిఁబూని, ఆయక్షకుమారుని వధింపఁదలఁచెను.

శూరుఁడయిన వాయునందనుఁడగు హనుమంతుఁ డట్లు తలఁచి, యాకాశమునఁ దిరుగుచు, వలపటికి దాపటికి నీడ్చినను రథముయొక్క బరువుమోయఁగలవియు, మేలుఁకునతోను, గడువేగముతోనుఁ బోవు నవియునైన యాయక్షకుమారునితేరిగుఱ్ఱముల నెనిమిదింటి నఱచేతితో నప్పళించి చంపెను. ఇట్లు హనుమంతుఁడు అక్షకుమారుని తేఁకిగుఱ్ఱములను గూల్చి, తేరియిరుసును విఱిచి, కాడి యెగురఁదన్ని బీభత్సము చేయఁగా, నది యాకాశమునుండి క్రిందఁబడెను.మహారథుఁడయిన యక్ష

కుమారుఁ డా రథమును విడిచి, వింటిని వాలు జేతఁదీసికొని యాకాశ మున కెగిరెను. అప్పు డయ్యక్షకుమారుఁ డెక్కువతపోబలముచేఁ దన దేహామును నేల విడిచి స్వర్గమునకుఁ బోవుచున్న ఋషివలెఁ గనఁబడెను. వెంటనే తండ్రినిబోలు పరాక్రమముగల హనుమంతుఁడు గరుడుని యొక్కయు వాయువుయొక్కయు, సిద్ధులయొక్కయు సంచారముగల యాకాశమున సంచరించుచున్న యాయక్షకుమారుని వెంబడించి యతనికాళ్లను గట్టిగాఁ బట్టుకొనెను. గరుడుఁడు సర్పమునుబోలె తండ్రివలె మొనగాఁడయిన హనుమంతుఁడు అక్షకుమారుని పాదముల గట్టిగాఁ బట్టుకొని పలుమాఱు గిరగిరఁ ద్రిప్పి యాకాశమునుండి యుర్వి భూమియందుఁ గూలునట్లు వేగముతో విసరివేసెను. అక్షకుమారుఁ డట్లు హనుమంతుఁడు గూలనేయఁ గ్రిందఁబడి, కాలుసేతులు, నడుము, మెడయు విఱుగఁగా, ఎముకలు పొడియయి, కన్నులు చితుకఁగా, కీళ్లువీడిగి, ప్రక్కయొమికలు కుదుళ్లుతొలఁగి, నోట నెత్తురు గ్రక్కెను. హనుమంతుఁ డంతటితో విడువక క్రిందఁబడిన యతనిని గాళ్లతోఁ ద్రొక్కి చంపి, రాక్షసాధిపుఁడయిన రావణుని కెక్కువ భీతిని గలిగించెను. అట్లు హనుమంతునిమూలమున అక్షకుమారుఁడు మడియఁగా, ఇంద్రాది దేవతలును, పన్నగయక్షులును, జ్యోతిశ్చక్రమునందుఁ దిరిగెడి తపోధనులయిన ఋషులును దుష్టాత్ముఁ డయిన యక్షకుమారునిఁ జంపి నందు కాశ్చర్యపడినవారలై, యా హనుమంతునిఁ బలుతెఱఁగులఁ గొనియాడిరి. హనుమంతుఁ డట్లు నెత్తుటివలె నెఱ్ఱనైన నేత్రములు గలిగినవాఁడును, జయంతునిమాడ్కి ప్రకాశించువాఁడునైన అక్షకుమా రునిఁ బరిమార్చి, జననాశమునకై నడుముకట్టినయమునివలెఁ గ్రోధముచే మండిపడుచు, మఱల నాతోరణమునకే పోయిచేరెను.

48-వ సర్గము

రావణుఁ డింద్రజిత్తును బంపుట

తరువాత మహాధీరుఁడగు రావణుఁడు హనుమంతునిచే నక్ష కుమారుఁడు చంపఁబడె నన్నవార్త వినినను, ధైర్యవంతుఁ డగుటచేఁ బుత్రశోకము నణచుకొని మనస్సున నెమ్మదిపూని పరాక్రమమున దేవేంద్రునిబోలు కోపవంతుఁడగు నింద్రజిత్తును బంపఁగోరి, "ఓరి

నాయనా! నీవు అస్త్రముల నెఱిఁగినవాఁడవు. శస్త్రవేత్తలలో శ్రేష్ఠుఁడవు; సురాసురులకైనను శోకము గలిగించువాఁడవు; ఇంద్రాదిదేవతలయెడ సామర్థ్యమును జూపినవాఁడవు; బ్రహ్మదేవుని యనుగ్రహమునఁజేసి బ్రహ్మాస్త్రముబడసినవాఁడవు. ఇంద్రాదిదేవతలైనను ఋసురులైనను నీయస్త్రముల కోర్చి యుద్ధరంగమున నిల్చి యుద్ధము చేయఁజాలరైరి.యుద్ధమునందు నీతోఁ బోరుసేసి యాపద నొందనివాఁడొక్కఁడును లేఁడు. నివొక్కఁడవే బాహాబలము గలవాఁడవు, తపోమహిమచేనొప్పిన వాఁడవు. దేశకాలవిభాగముల నెఱిఁగినవాఁడవు. బుద్ధిమంతులలో మేటివి. యుద్ధములందు నీకు పరాక్రమముచే సాధింపరాని దొక్కటియు లేదు. తెలివితో యోచించి చూచి నీకుఁ జేయనలవికాని పనియొక్కటియు లేదు. నీయస్త్రబలమును దేహబలమును నెఱుఁగనివాఁడీముల్లోకములందును లేఁడు. నీబలపరాక్రమములును, అస్త్రబలమును నాబలపరాక్రమమును, అస్త్రబలమును బోలినవి. యుద్ధములందుఁదప్పక జయమునొందునట్టి నీవు యుద్ధమునకుఁ బోతివేని, అప్పుడు నామనస్సు విచారము నొందదు. కింకరు లందఱు మడిసిరి. జంబుమాలి నీల్గెను. మంత్రిపుత్రులును, శూరులైన యయిదుగురు సేనానాయకులును జచ్చిరి. గుఱ్ఱము లేనుఁగులు రథములు గల నిండుబలములును మడిసెను. నీయనుఁగుఁదమ్ముఁడగు నక్షకుమారుఁడును నిహతుఁడయ్యెను. ఓశత్రుసంహారకా! నాకు నీబలిమియుఁ దెంతనమ్మక మున్నదో అంతనమ్మకము వారియందు లేనేలేదు. కింకరులు మొదలగువారి నంపఁతీని బరిమార్చిన హనుమంతునిదేహబల బుద్ధిబలములను, లోపలిచేవను, మగఁటిమిని జూచి, స్వబలమును బరికించి, యాత్మబలమునకుఁదగిన యుత్సాహము పూని శత్రువును బరిమార్పుము. శత్రుసంహారివైన నీ వా హనుమంతునిచేరువకుఁ బోయినప్పుడు మనసేనలకునాశము కలుగక మునుపే, స్వబలమును పరబలమును జక్కఁగా గమనించి, ఓ యస్త్రవేత్తలలో శ్రేష్ఠుఁడా! శత్రువును జంపఁబూనుము.

ఈహనుమంతుఁడు సేనలను గుంపుగుంపుగా నొక్కఁచెట్టునఁగొట్టువాఁడు కాఁబట్టి, సేనలు నిన్నుఁ గాపాడఁజాలవు గనుక సేనలఁదోడ్కొని పోకుము. ఇతఁడు వాయువేగమును మించిన వేగముగలవాఁడు గనుక నితనిమీఁదికి నిస్సారమైన వజ్రాయుధమును గొని

పోకుము. ఇతఁడు నిప్పువలె మండువాఁడు గనుక నితనిని బిడికిళ్లతో గ్రుద్దుటకును వీలుకాదు. కావున నీవిషయమును జక్కఁగా యోచించి, నీపని నెఱవేఱుటకై, నెమ్మదితోఁ గూడినవాఁడవై, దేవతాసంబంధ ములగు నస్త్రములను స్మరించుచుఁ బోయి, మొఱవ పోకుంమనట్లుగాఁ గార్యములను జేయఁబూనుము. ఓరి నాయనా ! నీవు పసివాఁడవు గావున నిన్నుఁ బంపుట యనుచిత్తి తలం పుచితముగాక యుండవచ్చును. అయినను, ఇట్లు తనవాఁకుండఁగా ముఖ్యుఁడు పోవుట రాజనీతిధర్మములకును, వానినాచరించు క్షత్రియులకును యుక్తముగాదు గనుక నిన్నుఁ బంపుట యుక్తము. ఓ శత్రువుల నణఁచువాఁడా ! సకలాస్త్ర ప్రయోగమునను నీకు సామర్థ్య మున్నది. కావున నీవు తప్పక యుద్ధము చేయవలయును. యుద్ధమున గెల్పును గోరవలయును" అని రావణుఁ డింద్రజిత్తును బురికొల్పెను.

దేవతలతో సాటియగు మహిమగలవాఁడును, ధీరస్వభావము గలవాఁడును, బుద్ధిమంతుఁడును, శూరుఁడునునైన యా యింద్రజిత్తు యుద్ధమునకుఁ బోవుటకై తండ్రికిఁ బ్రదక్షిణ మాచరించి, తనబంధు మిత్రులగు రాక్షసులు మర్యాదలు చేయుచుండ, యుద్ధమునకై గర్వించినవాఁడగుటచే వేడ్కఁపూనినవాఁడై యుద్ధమునకు తఱలెను. విలుకాండ్రలో గొప్పవాఁడు, శస్త్రములయు, అస్త్రములయు ప్రయోగోపసంహారముల నెఱిఁగినవారిలో మేటియునైనవాఁడును, తామర రేకులంబోలు కన్నులుగలవాఁడును నైన యింద్రునిఁ బురుడించునట్టి యింద్రజిత్తట్లు తఱలి, పర్వకాలములందలి కడలివలె నుప్పొంగి యిలు వెడలి, గరుడునిఁబోలు మగటిమిగలిగి తెల్లనివాఁడికోఱలచే నొప్పిన నాలుగు సింహాములు పూన్చినదియు, అన్నియుపకరణములతోఁ గూడి నదియు, నడ్డులేకుండఁ బోవునదియునైన యరదమెక్కి యా హను మంతుఁ డున్న వైపునకు వేగముతో వెడలిపోయెను. వానరులలో శూరుఁడగు హనుమంతుఁ డా యింద్రజిత్తు రథధ్వనిని, వింటినారి చప్పుడును విని, తనకు సాటియగు వీరుఁడు వచ్చుచున్నాఁడని కడు వేడ్కతో నుప్పొంగుచుండఁగా, నింతలోపల యుద్ధవీరుఁడైన యింద్ర జిత్తు కడు గొప్ప వింటిని, కఱకుటమ్ములను గొని యా హనుమంతుని మీఁదికి గవిసెను. యుద్ధమునందలి వేడ్కతో బాణములు చేతఁబూని

యింద్రజిత్తు పోరునకు రాఁగా, నప్పుడు దిక్కులెల్ల మసకగ్రమ్మిన ట్లుండెను. భయంకరమృగములు మాఱుగొంతులతోఁ గూసెను. పక్షులన్నియు నెక్కువ మక్కువచేత చదల గుంపుగూడి యఱచినవి. ఆకాశమునఁ దిరుగు నాగయక్షులును, నక్షత్రమండలనివాసులగు మహర్షులును ఇంద్రజిత్తు హనుమంతుల యుద్ధచాతుర్యమునుఁ జూడవచ్చిరి. ఉత్సాహవంతుఁడైన హనుమంతుఁడు రథమువిూఁదఁ గూర్చుండి వేగముతో వచ్చుచున్న యింద్రజిత్తును జూచి, పెడబొబ్బ పెట్టెను. ఇంద్రజిత్తన్నకో దివ్యరథారూఢుఁడై యాశ్చర్యము గలిగించెడి ధనుస్సును దాల్చి నారివిూటెను. ఆవింటినారిమ్రోఁత మేఘగర్జనసదృశముగా వినిపించెను. అప్పుడు మిగుల హెచ్చువేగమును, బలమును గలవారును, సమరమునం దొండొరులకు వెఱవనివారునునైన యాహనుమదింద్రజిత్తు లిద్దఱు మచ్చరముపూని దేవేంద్రాసురేంద్రులుం బోలె నొండొరులను దాఁకి యుద్ధముచేయఁబూనిరి. అట్లు వారు యుద్ధము చేయుచుండఁగా హనుమంతుఁడు మహారథుఁడును, శూరుఁడును, మేటి విలుకాఁడును, యుద్ధమునం దాఁకితేఱినవాఁడునైన యా యింద్రజిత్తు ప్రయోగించిన బాణములను బడఁగొట్టి, చూచుట కలవికాని వాయు మార్గమునఁ దిరుగుచుండెను. అంతట పగతురమొనగాండ్రను జంపఁగల యింద్రజిత్తు వాఁడియైన నిమిషకొనలుగలవి, చక్కనియొక్కలుగట్టి నవియు, బంగారపు వింత ములుకులుగలవియు, ముందుకు చక్కఁగా వంగినవియు, వజ్రాయుధపు తాఁకుడుతో సరియగు తాఁకుడుగలిగినవియు నైన బాణములను హనుమంతునివిూఁదఁ బ్రయోగించెను. ఇంద్రజిత్తుయొక్క రథచక్రముల చప్పుడును, భేరీమృదంగాది వాద్యముల మ్రోతలను, ధనుష్టంకారమును విని, మఱలఁ బైకెగిరి, ఆతఁడేయు బాణములగుఱి తప్పునట్లు, బాణములనడుమఁ దిరుగుచు, ఉత్సాహవంతుఁడును, యుద్ధమున నేర్పరియునైన హనుమంతుఁడు ఇంద్రజిత్తేయుబాణముల కెదుటఁ గనఁబడి చేతులు చాపుచు, మఱలఁ బైకెగురుచునుండెను. ఇవ్విధముగా నిద్దఱును జనులందఱి కాశ్చర్యకరమైన యుద్ధము గావించిరి. హనుమంతునియెడ నింద్రజిత్తునకు సందు దొరకదయ్యెను. అట్లే యింద్రజిత్తునెడ హనుమంతునికిని సందు చిక్కదయ్యె. దేవతలతో సాటియగు మగఁటిమిగల యామారుతాత్మజ

రావణాత్మజు లిద్దఱు నొండొరులకు వెనుదీయక పోరుసేయుచు నోర్వ
నలవికానివారైయుండిరి.

అప్పుడు తానుచూచికొట్టిన గుఱి తప్పుచుండఁగా, తాను
ప్రయోగించిన బాణములు వ్యర్థములుకాఁగా, బహుజాగ్రత్తతో గుఱి
చూచి, యేయునట్టి కడుధీరుఁడగు నింద్రజిత్తు వానరులలో మేటియగు
హనుమంతునియెడఁ దనబాణములు వ్యర్థములగుటచే నతఁడు మఱి
యింపు నలవికాకుండుట చూచి, యతనిం జంపుటకై తగిన యాలోచన
కొంతతడ వాలోచించి, తానస్త్రవేత్తలలో మేటి గనుక, తనప్రతాపము
వెలుఁగ, మగటిమి మెఱయ బ్రహ్మాస్త్రము వింట సంధించి యాహనుమం
తునిమీఁదఁ బ్రయోగించి యాతనిం గట్టివేసెను.

హనుమంతుఁడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకుఁ
గట్టువడినవాఁడై, చెయువులుదక్కి, క్రిందఁబడి, తాను బ్రహ్మాస్త్రమునకుఁ
గట్టువడెనని యెఱిఁగి, బ్రహ్మదేవుని వరప్రభావమువలనఁ గించిత్తేనియు
నొప్పిలేనివాఁడై, తనకు బ్రహ్మయొసంగిన వరముచేఁ దనకా యస్త్ర
బంధము ముహూర్తమాత్రమే యని తలఁచి యివ్విధమునఁ జింతించెను:

"ఈ యింద్రజిత్తు బ్రహ్మాస్త్రమునుండి విడిపించుకొనుటకు నాకు
శక్తిలేదని తలఁచి యీ యస్త్రముచే నన్నుఁ గట్టినాఁడు. నేనును బ్రహ్మ
దేవునియాజ్ఞ ననుసరింపవలయును. నస్త్రముచే నితఁడు బంధించి
నను, నాకేమో భీతిలేదు. నన్ను సదా బ్రహ్మయు, దేవేంద్రుఁడును,
వాయువును గాపాడు చుండుదురు. ఈ రక్కసులు నన్నుఁ బట్టుకొనుట
లోను నొక్కగుణ మున్నది. రాక్షసులు నన్ను రావణునిముందున
కీడ్చికొని పోవుదురు. దానివలన నాకు రాక్షసేంద్రునితో సంవాదము
గలుగును. కావున నన్ను వీరు పట్టుకొననీ. అదియు మంచిదే" అని
శత్రువీరుల నడఁగించువాఁడును, పరికించి పనిచేయువాఁడునై
యా వాయునందనుఁడు చెయువులు మాని, యాబాణత్రోవలోనే
దాపునకువచ్చి మిక్కిలి బెదరించుచుండఁ బెద్దయట్టహాసము చేసెను.

అంత నారాక్షసులాయస్త్రబద్ధుఁడై చెయువులుడిగిన వానిని మాను
మంతుని ముప్పిరిపేనిన నారత్రాళ్లతోను చెట్టుపట్టతోను గట్టిరి. అట్లు
వారు కట్టుచున్నను, తనకు రావణునితో సంభాషణము కలుగలిగెను
గదాయను నాతురతవలన శత్రువీరులు బిగించికట్టునట్టి పట్టును, హార

ANDHRA MEMORIAL LIBRARY
NARLA
D.P.R.I.
Acc. No.

చేయు నవమానము నోర్చియుండెను. అస్త్రముతో గట్టినకట్టు వేఱొక కట్టును సహింపదు గనుక, రాక్షసు లట్లుకట్టిన గోఁగునారపగ్గముల కట్టు టచే హానుమానుఁడు బ్రహ్మాస్త్రమునుండి విముక్తుఁ డయ్యెను. అంత శూరుఁడయిన యింద్రజిత్తు రాక్షసులచే నారపగ్గముతో గట్టఁబడిన యాహానుమంతునిఁజూచి, అస్త్రపుఁగట్టు మఱియొకకట్టు నోర్వదుగనుక, యాహానుమంతుఁడు బ్రహ్మాస్త్రముచే విముక్తుఁడని తెలిసికొని, "ఓరాక్షసులారా! మన మెంత తెలివితక్కువ పనినిఁ జేసితిమి. రాక్షసులు మంత్రగతింగూర్చి యోచింపరైరి. ఒక అస్త్రము కొట్టువడినయనంతరము, మఱల నింకొకయస్త్రము పాఱదు. ఇది తెలియక యందఱము మోస పోయితిమి" అని తనతోడి రాక్షసులతోఁ జెప్పెను. అప్పుడు హాను మంతుఁ డస్త్రమునుండి విముక్తుఁడయ్యె నొడలు తెలియనివానివలెఁ బడియుండెను. అప్పుడు క్రూరరాక్షసులు త్రాళ్లతో నతనిని జక్కఁగా బిగించికట్టి, కొయ్యలతోఁ గొట్టుచుఁ బిడికిళ్లతోఁ బొడుచుచు బరబర యీడ్చుకొనిపోయి యారాక్షసేంద్రుఁడగు రావణుని నగరునకుఁ జేర్చిరి. అంత నింద్రజిత్తు హానుమంతుఁ డస్త్రవిముక్తుఁడై నారపగ్గ ములతో బిగింపఁబడియున్నాఁడనియెఱిఁగి, బలవంతుఁడైన యాహాను మంతుని మఱించిన యేనుఁగుంబోలినవానిని మంత్రిసమేతుఁడై కూర్చుండి యున్న యారావణునికిఁ జూపి, మహారాజా! ఇదిగో ఆదుష్టాత్ముఁడని తెలిపెను. అచ్చట నప్పుడున్న రాక్షసులందఱు "నితఁ డెవ్వఁడు? ఎవ్వని కొడుకు? ఎచ్చటనుండి వచ్చినవాఁడు? ఇచ్చట వీని కేమిపని? వీఁ డెవని బంటు?" అనియు, మఱికొందఱు "ఇతనిఁ జంపుఁడు; కాల్పుఁడు; తినుఁడు." అనియుఁ గడునాగ్రహముతోఁ బలికిరి.

వా రట్లు మాటాడుచుండఁగా ఆమహాధైర్యశాలియగు హాను మంతుఁడు వెంటనే యామార్గముదాఁటి, రాక్షసేంద్రునియడుగుల సమీపమునఁ గూర్చుండియున్న బహుదినములనుండి కొల్వుకొల్చు నట్టివారలైన రాక్షసాధిపులను, రత్నములచే నలంకరింపఁబడిన దగు గృహమును జూచెను. ఎక్కువ వెలుఁగుగల యారావణుఁడు వెలుపు గలిగించు రూపు గలిగి, రాక్షసులచే నిటటు లాగఁబడుచుండు హాను మంతునిఁ జూచెను. వెలుఁగును బలిమియుఁ గలిగి, సూర్యునిమాడ్కిఁ దేజరిల్లుచున్న రావణాసురుని హానుమంతుఁడును జూచెను. అంత

రావణుఁడు కోపముచేఁ గన్నులందుఁ గెంజాయ గదుర నాహనుమంతునిఁ జూచి, చేరువఁ గూర్చుండియున్న గొప్పమంత్రులతో "ఇతఁడెవ్వఁడో కనుఁగొనుఁడీ" అని యానతి యొసఁగెను.

49-వ సర్గము

హనుమంతుఁడు రావణుని వర్ణించుట

అంత శత్రుభయంకరమైన పరాక్రమము గలవాఁడగు హనుమంతుఁడు యుద్ధమునకై రావణుఁడు రావలెనని తానుప్రయత్నించియు రావణుఁడు నీతినెఱిఁగినవాఁడు గనుక సింహాసనమునందుండియే యింద్ర 171 C
జిత్తుమూలమునఁ దన్ను బంధింపఁజేసి, యక్కడికి రప్పించెనుగదా యని యాశ్చర్యపడినవాఁడై, రావణుఁడు తన్ను రప్పించెనని కినుకచేఁ గన్ను లెఱ్ఱఁజేసి, యెదుటనున్న రావణునిఁ జూచెను.

ఆరావణుఁడు ధరించిన విలువగలదగు ముత్యాలసరములు గట్టిన కిరీటము సూర్యునివలెఁ దేజరిల్లుచుండెను. ఆతనియొడలియందలి భూషణములు వజ్రఖచితములును వెలలేని మణులు చెక్కినవియు, మనసుచే నిర్మింపఁబడినవో యనునటు తోఁపఁజేయునవియునై యుండెను. విలువగల పట్టుపచ్చడము నతఁడు గట్టెను. ఎఱ్ఱనిగంధమును, విచిత్రములైన పెక్కువిధములైన సువాసన ద్రవ్యములను బూసికొనెను. ఆతనిపదితలలును విశాలములును, చూడఁదగినవియునై, యెఱ్ఱనికన్నులును, భయంకరమైన చూపులునుగలిగి, వెలుఁగుచుండెడి వాఁడికోఱలును, వ్రేలాడెడి పెదవులును గలిగినవైయుండెను. ఱట్లు పదితలలతోఁ గూడిన రావణుఁడు నానాదుష్టమృగములతోఁ గూడిన శిఖరములుగల మందరపర్వతమువోఁ దేజరిల్లుచుండెను. ఆరావణుఁడు కాటుకప్రోవువలె నల్లనివాఁడును, ఱొమ్మునందుఁ బ్రకాశించు ముత్యాలహారమును పూర్ణచంద్రునిఁబోలు మోమునుగలవాఁడునగుటంజేసి, కొంగలతోఁగూడిన మేఘముమాడ్కి వెలుఁగుచుండెను. భుజకీర్తులు దాల్చినవాఁడును, చక్కనివాసనగల గంధము నలఁదుకొన్నవాఁడును నైనందున నాతని భుజము లైదుతలలపాములపాడ్కి వెలుఁగుచుండెను. బాగుగా నలంకరించుకొన్న జవరాండ్రు వింజామరలు చేతఁబట్టుకొని విసరుచుండఁగా, మంత్రాలోచన బాగుగాఁ జేయఁగలవారును బలముచే మదించినవారు

నైన దుర్ధరుఁడు, ప్రహస్తుఁడు, మహాపార్శ్వుఁడు, నికుంభుఁడునను నలువురు మంత్రులును, ఇంక ననేకులు బుద్ధికుశలతగలవారలగు మంత్రులును చుట్టు గూర్చుండియుండఁగా, రత్నములుచెక్కినదియు, మేటి పఱపు పఱచినదియునైన చిత్రమగు గొప్పసింహాసనమునఁ గూర్చుండి, నాలుగు సముద్రములచేఁ జుట్టఁబడిన మధ్యలోకమునుమాడ్కియు, సకల దేవతలచేఁ జుట్టఁబడిన దేవేంద్రునిమాడ్కియు మేరుపర్వతమున నీటితోఁగూడిన మబ్బుచందమునను వెలుఁగుచు నెక్కువ వెలుతురుతోఁ గూడి యారాక్షసవీరుఁడు సొంపుమీఱియుండెను. అప్పుడు వానర వీరుఁడు రాక్షసులు తన్ను బాధపెట్టుచున్నను, ఆబాధను గణనింపక, సింహాసనమునఁ బ్రకాశించుచున్న యారాక్షసరాజుం జూచి యెక్కువ యాశ్చర్యమునొంది యాతని కాంతికి మైమఱచినవాఁడై యివ్విధమునఁ జింతించెను.

"ఆహా! ఏమి ఈరావణునిరూపము! ఆహా! యేమి యితని ధైర్యము! యేమి యితనిబలము! ఆహాయేమి యితని ప్రకాశము!ఆహా! యేమి యితని సర్వలక్షణముకోడికూఁతిక! ఈతనికడ నన్యాయము మిక్కిలి హెచ్చుగా నుండదేని, ఇతఁడింద్రాది దేవతలను, స్వర్గలోకమును బరిపాలింపఁ గలవాఁడై యుండియుండును. ఇతఁడొనరించు జననింపితములగు క్రూరపుఁబనులచేతనే యితనిని జూచిన మాత్రమున దేవదానవమనుష్యులు భయంపడుదురు. ఇతఁడలిగెనేని, ప్రపంచమెల్ల నొక్కఁటె జలమయము గావింపఁగలఁడు" అని యీ మొదలగు పలు విధములైన యోచనల నాహానుమంతుఁడొనరించిన వాఁడయ్యెను.

50-వ సర్గము

రావణుఁడు హనుమంతుని నడుగుట

నిపుణచేతులవాఁడయిన లోకరావణుఁడగు (జనుల నేడ్పించు వాఁడయిన) రావణుఁడు తనయెదురనున్న హనుమంతునిఁజూచి, మోమునఁ గోపము గదురఁ బ్రతాపముతోఁగూడిన యా హనుమంతునిం గూర్చి, "తొల్లి నేను కైలాస పర్వతమెత్తినప్పుడు ఎవఁడు నాకు శాపమొసగెనో, ఆభగవంతుఁడగు నందికేశ్వరుఁడు ప్రత్యక్షముగా

నీకోతిరూపముదాల్చి వచ్చెనో, లేక బాణాసురుఁడో" యని మనసున సందేహపడి యాలోచించెను.

అట్లాలోచించి యారాక్షసాధిపుఁడు కోపముచేఁ గన్ను లెఱ్ఱన జేసి, మంత్రులలోఁ బెద్దయైన ప్రహస్తునిఁజూచి, "ఓమంత్రిశ్రేష్ఠా! యీ దురాత్ముఁ డెవ్వఁడో, ఎక్కడనుండి వచ్చినవాఁడో, ఎందుకు వచ్చినవాఁడో, రాక్షసకాంతలను బెదరించుటకును, అశోకవనము విఱుచుటకు నేమికారణమో, ఒరులకుఁ జొఱరాని మాపట్టణములోపలఁ బ్రవేశించుటచే నేమి ప్రయోజనమో, పోనీ, యుద్ధముచేయుట యెందుకో యడిగితెలిసికొనుము" అని సమయోచితముగను, అర్థగౌరవము గలిగియుండునట్లును గొప్పగాను ఆనతిచ్చెను.

ప్రహస్తుఁడు రావణుని యానతిని శిరసావహించి, "ఓవానరా! ఊఱటపడుము. నీకు మేలగు. భయము వలదు. ఇంద్రునికడనుండివచ్చిన దూతవా? అట్లుండెనేని, నీవు భయపడక నిజమును చెప్పుము. లేక యమవరుణ కుబేరుల కడనుండి వచ్చిన దూతవా? ఈవేగురూపముఁ దాల్చి మాపట్టణముఁ బ్రవేశించితివా? గెల్పు గోరువాఁడైన విష్ణువు నిన్ను దూతనుగాఁ బంపెనా? నీరూపము వానరరూపముగాని, నీ తేజస్సు వానరతేజస్సుగాదు. వాస్తవముగా నంతయుఁ జెప్పుము. నిన్నుఁ జంపక వదలెదము. లేక యసత్యము పలికితివేని, నీప్రాణములు నీవిగావు. లేక నీవెందు కిచ్చటికి వచ్చినాఁడవో ఆ సంగతి చెప్పుము" అని యడిగెను.

ఇట్లు ప్రహస్తుఁ డడుగఁగా వానరయూథనాథుఁడగు హను మంతుఁడు తాను రాక్షసులకు జేఁడయిన రావణునిమంత్రినిఁజూచి, "ఓరాక్షసేంద్రా! ఇంద్ర యమవరుణులదూతనుగాను. కుబేరునితోఁ బరిచయములేదు. నన్ను విష్ణువుపంపలేదు. నేను మాఱురూపముదాల్చ లేదు. నాది యీజాతియే. నేను వానరరూపముతోనే యిచ్చటికి వచ్చి నాఁడను. దొఱకని నలవికాని రాక్షసాధిపుని దర్శనమునిమిత్తమై వనము విఱుచుట యను కార్యముచేసితిని. అంత మీరుపంపిన యాబలవంతులగు రాక్షసవీరులందఱు నాతో యుద్ధముచేయఁగోరి నాపైకి వచ్చిరి. నాప్రాణరక్షణమునిమిత్తమై నేను వారితో నెదురుదిరిగి యుద్ధముఁ జేసితిని. దేవతలకేని, అసురులకేని అస్త్రములచే నన్నుఁగట్టుటకు వీలు

కాదు. బ్రహ్మదేవుఁడు నాకీవరము నొసఁగెను. రాజును జూడఁగోరి యీ
యస్త్రమునకుఁ గట్టువడినట్లుంటిని. రాక్షసులు నన్నుఁ బ్రాఁతో గట్టి
నప్పుడే నే నస్త్రబంధమునుండి విడివడితిని. నే నొకరాజకార్యముతో
నిచ్చటి కేతెంచితిని. పరాక్రమశాలియగు రామునికి నేను దూతను.
ఓప్రభూ! నేను నీ కొకహితవచనము చెప్పెదను వినుము" అని
చెప్పెను.

51-వ సర్గము

హనుమంతుఁడు రావణునికి నీతిచెప్పుట

మహాధీరుఁడగు కోఁతులమేటియైన హనుమానుఁడు గొప్పదిట్టరి
యైన యారావణునిఁజూచి, భయపడక, యాతనితో నర్థగౌరవముగల
వాక్యము నిట్లనియె:

"ఓరాక్షసాధిపా! నేను సుగ్రీవుని యాజ్ఞవలన నీలంకాపురమునకు
వచ్చితిని. నీతోఁబుట్టువగు వానరరాజు సుగ్రీవుఁడు నిన్ను క్షేమమడుగు
మనెను. మఱియు, ధర్మార్థములకు విరుద్ధముగాకయు, ఇహపరసుఖ
ములకు రెంటికిని సాధకముగా నుండునట్లు నీకుఁ దోడఁబుట్టువు
వంటివాఁడగు సుగ్రీవుఁడు చెప్పిపంపినసంగతిఁ దెలిపెద నాలకింపుము.

విస్తారములయిన గుఱ్ఱములు, ఏనుగులు, రథములు, కాల్బల
మును గల దశరథుఁడను జేఁడొక్కఁడుండెను. అతఁడు జగమునకుఁ
దండ్రివలెఁ జుట్టమును, నింద్రునిమాడ్కిఁ దేజస్సుగలవాఁడునునై
యుండెను. అతనికిఁ బెద్దకొడుకు రాముఁడని యొక్కఁడు గలఁడు.
అతఁడు నిడుదచేతులు గలవాఁడు, జనులకోరికలను దీర్చువాఁడు,
అన్నిపనులను జేయువాఁడు. అతఁ డొక్కకారణమువలనఁ దండ్రి
యుత్తరువు మీఁదఁ దనతమ్ముఁడగు లక్ష్మణునితోను, భార్యయగు సీత
తోనుగూడి దండకారణ్యమునకు వచ్చెను. ఆతఁ డెక్కువదిట్టతనము
గలవాఁడయ్యు దండ్రిమాట మీఱినచో దోషము సంభవించుననెడి
కారణముచే నరణ్యమునకు వచ్చెను. విదేహదేశము నేలికయగు మహా
ధీరుఁడయిన జనకమహారాజునకుఁ గూఁతురును రామునిపత్నియునై న
సీతాదేవి యచ్చట కనఁబడక పోయెను. ఆ రాజపుత్త్రుఁడగు రాముఁడు
తమ్మునితోఁగూడ నాదేవిని వెదకుచు ఋశ్యమూకపర్వతమునకు వచ్చి

సుగ్రీవునితోఁ జెలిమి చేసికొనెను. అప్పుడు సుగ్రీవుఁడు రామునికి సీతాదేవిని వెదకియిచ్చునట్లును, రాముఁడును వాలినిఁ జంపి సుగ్రీవునికి వానరరాజ్యము నొసఁగునట్లు నొండొరు లొక నియమము చేసికొనిరి. అట్లే రాముఁడు సుగ్రీవుని యన్నయైన వాలిని సంహరించి, సుగ్రీవుని వానరరాజ్యపట్టాభిషిక్తునిఁ జేసెను. ఓరావణా! నీవు ముందే యెఱిఁగిన వానరేంద్రుఁడగు వాలిని రాముఁడొక్క బాణముచేతనే కూలనేసెను.

సుగ్రీవుఁడును ఆడినమాట తప్పనివాఁడుగనుక, రాముని దేవియగు సీతనువెదకుటకై, పెక్కుఁడ్రు వానరుల సన్నిదిక్కులకును బంపెను. వారంద ఱీప్పుడు భూపాతాళస్వర్గలోకములందును ఆ సీతాదేవిని వెదకుచున్నారు. వారిలోఁ గొందఱు గరుత్మంతునంతటి బలము గలవారు, కొందఱు వాయుదేవునితో సాటి వచ్చువారు; అడ్డము లేకుండ వడిగాఁ బోవువారు; బలాఢ్యులును. నే నన్ననో హనుమంతుఁడను పేరుగలవాఁడను; వాయుదేవున కౌరసపుత్రుఁడను. నేను నూఱు యోజనముల దవ్వుగల సముద్రమును దాఁటి, యాసీతాదేవిని వెదకు నిమిత్తముగానే యీ లంకాపురమునఁ జొచ్చితిని. ఇచ్చటికి వచ్చి నీయింట వెదకఁగా, నా సీతాదేవి నిచ్చట గానవచ్చినది. ఓ గొప్ప పండితుఁడా! నీవు సకల ధర్మముల నెఱిఁగినవాఁడవు. తపస్సుచే సకలైశ్వర్యమును బొందినవాఁడవు. కావున, నొరునియాలి నపహరించుట తగదు. నీ బోటి బుద్ధిమంతులును న్యాయము దప్పినవియు, పెక్కుచెఱుపులు గలిగించునవియు, మొదలు చెఱచునవియునైన పనులందుఁ జొఱఁబడరు. రామలక్ష్మణులు కోపముతో నేసిన బాణములముందట నిలుచుటకు దేవాసురులలోఁ నెవ్వఁడును జాలఁడు. రామునికిఁ జేటొనర్చి, సుఖమును బొందఁగలవాఁ డొక్కఁడైన నుండఁబోఁడు.

ఓ రాక్షసేంద్రా! ఆ సుగ్రీవుఁడు చెప్పెడిమాట సీతనొసఁగుటచే ముందటితప్పు తొలఁగుటవలనను, అప్పటి యైశ్వర్యమునకు నేగిలేమి వలనను, రాఁబోవు మేలునకుఁ గారణమగుటవలనను భూతభవిష్యద్వర్తమానము లనెడి త్రికాలములందును హితమయినదియు, ధర్మమార్గమునుండి తప్పనిదియు, ప్రయోజనము నొసఁగునదియు నని యెంచి, యాన్యపాలునికి సీతాదేవి నప్పగించుము. ఇక్కడ సీత లేదని

మోసపుత్తువేమో? అట్లనుటకు వీలులేదు. సీతాదేవిని వెదకునిమి త్త మయి బయలువెడలిన వానరులకు దొరకని యా సీతాదేవిని నీగృహ మునఁ గనిపెట్టితిని. ఇఁకమీఁద నేపని మిగిలియున్నదో, దానిని జేయ రాఘవుఁడు గలఁడు. వంతయే ప్రథానముగాఁ గలదగు సీతాదేవిని నీగృహామునఁ జూచితిని. ఓ రావణా! ఆ సీతాదేవి నీయింటనున్న యైదుతలలుగలపామని తలఁపుము. విషముతోఁ గలిసిన యన్నమును జఠరాగ్ని బొత్తిగా జీర్ణమగులాగు చేయఁ జాలనియట్లు, దేవాసుర లలో నెవ్వరును ఆ సీతాదేవిని తమబలముచే దక్కించుకొనఁజాలరు. ఓ రావణా! నీవు బహుకాలము తపస్సుచేసి సంపాదించిన పుణ్యఫల మెయ్యదిగలదో, అది నీయాయుర్వృద్ధికైనది. అట్టి యాయుర్వృద్ధిక మైన పుణ్యఫలమును నశింపఁ జేసికొనుట యుక్తముగాదు. బ్రహ్మదేవుని వలనఁ జావులేకుండునట్లు వరమునఁ బడసిన నన్నేల యీ బెదరింపులు బెదరించెదవని యందువేమో? నీవు తపస్సులొనర్చి పడసిన దేవాసురుల వలన చావులేమి యను వరమే నీవధమునకు గొప్పకారణమాయెను. సుగ్రీవుఁడు దేవతగాఁడు; అసురుఁడుగాఁడు; రాక్షసుఁడుగాఁడు; దానవుఁడుగాఁడు; గంధర్వుఁడుగాఁడు; యక్షుఁడుగాఁడు; పన్నగుఁ డునుగాఁడు. కావున రాక్షసరాజా! నీవు సుగ్రీవునినుండి యెట్లు ప్రాణసంరక్షణము నేసికొనఁగలవు? ఓ రావణా! నే నిదివఱకు సంపా దించిన పుణ్యమెంతయోయున్నది. అదే నాప్రాణములను గాపాడదా యని యందువేమో. ధర్మఫలము, అధర్మఫలము నొక్కటేతడవ ననుభవమునకు వచ్చునా? లేక ధర్మము అధర్మమును బోఁగొట్టి తాను ప్రబలునాయని విచారించిన, ధర్మఫలమైన సుఖ మధర్మఫలమైన దుఃఖ ముతోఁ గూడ ననుభవమునకు రాదు.

ధర్మము సుఖమునే దానిఫలమునుగా ననువర్తించును. అట్లే యధర్మము దుఃఖమునే దానిఫలమునుగా ననువర్తించును. కాని ధర్మము అధర్మమును బాధింపఁజాలదు. కాఁబట్టి నీవు ముందుచేసిన ధర్మమిప్పు డొనరించిన యధర్మమును బోఁగొట్టఁజాలదు. ధర్మాధర్మ ములు రెండును దానిదాని ఫలముననుభవముచేతనే నశింపవలయును గాని వేఱొండుపాయములేదు. "అట్లే కానిమ్ము. నేను సంపాదించిన గొప్ప ధర్మమునకు ఫలము ననుభవించిన పిదపఁగాదా అధర్మఫలము

ననుభవించుట. అది యట్లు వచ్చినప్పటికిఁ జూచుకొందములే" యని యందువేమో; నీవుచేసిన ధర్మఫలమును బూర్తిగా ననుభవించితివి. ఇఁక నీ వొనరించిన పరదారహరణరూపమైన యధర్మముయొక్క ఫలమును శీఘ్రకాలములోపలనే యనుభవింపఁ గలవు.

రాక్షసాధిపా! రాముఁడు జనస్థానమునుఁ బాడుచేయుటను, వాలిని వధించుటను, రామసుగ్రీవు లొండొరులు చెలిమి యొనరించుకొనుటను జక్కఁగాఁ బరికించి, యాత్మహితమయిన తెఱఁ గాలోచింపుము. నే నొక్కఁడనే చతురంగబలముతో నిండిన యీలంకాపురమును రూపు మాపఁ గలను. అయినను శ్రీరాముఁడు సీతాదేవి నపహరించిన తన శత్రువును దానే యణఁగద్రొక్కెదనని వానరశ్రేష్ఠులయెదుటఁ బ్రతిజ్ఞ చేసినవాఁడు గనుక, నే నీ లంకాపురమును ధ్వంసమునేయుట యతనికి సమ్మతముగాదు. రామునికిఁ జెఱుపుచేయువాఁడు సాక్షాద్దేవేంద్రుఁడై నను సుఖము బొందఁజాలఁడను నపుడు నీబోటివానిసంగతి చెప్పవల యునే? ఓరాక్షసాధిపా! నీయింటను నీవశంబున నుంచుకొనియున్న ఏయువతి సీతనుగా నెంచియున్నావో, ఆయువతి సీతగాదు; లంకా పురమునెల్ల బూదిచేయుటకై వచ్చిన కాలరాత్రియని యెఱుఁగుము. ఆమె సీతరూపమెత్తిన యమపాశము. దానిని కావలయునని యేల మెడకుఁ దగిలించుకొనెదవు. ఈపనివదలి, యేది నీకు మేలగునో యట్టి పనినిగూర్చి యాలోచింపుము. సీతయొక్క తేజస్సుచేరగిలి, రాముని యాగ్రహముచేఁ జక్కఁగా మంటలెగసి ప్రాకారాదులతోఁ గూడ నెటియుచున్నది యీలంకాపురము చూడుము. వ్యర్థముగా స్వమిత్ర మంత్రిదాయాద సోదర పుత్రహిత దారాభోగములతోఁగూడ నీలంకా పురమును పాడుసేయించుకొనకుము. ఓ రాక్షసేంద్రుఁడా! నేను రాముని దూతను. నాకు రామునిశక్తి తెలియును; గనుక నేను పక్ష పాతము విడిచి నీకు హితము చెప్పెదను. కీర్తిమంతుఁడగు రాముఁడు స్థావరజంగమరూపములయిన సకలభూతములతోఁ గూడిన లోకముల నన్నింటి దహించి, మఱల నదేరీతిని సృజింపఁగలఁడు. విష్ణువుఁబోలు పరాక్రమముగల రామునికెదుట నిలిచి యుద్ధముచేయఁ గలవాఁడే దేవాసురయక్ష రాక్షససిద్ధవిద్యాధర గంధర్వ పన్నగ కిన్నరగరుడుల లోపల నెవ్వఁడును సర్వకాలసర్వావస్థలయందును లేఁడు. సర్వలోక

నాయకుఁడైన రాజేంద్రుఁడగు రామునికి గొప్పకీడు చేసితివి. కనుక నీవు ప్రాణములతోనుండుట గడుదుర్లభము. దేవ, దానవ, రాక్షస, గంధర్వ, విద్యాధర, యక్ష, పన్నగులెల్లరును యుద్ధములందు ముజ్జగములకేలికయగు రాముని యెదుట నిలువఁజాలరు. తనంతటఁ బుట్టిన నాలుగుమోములుగల బ్రహ్మదేవుఁడుగాని, త్రిపురములను సంహరించిన ముక్కంటియగు రుద్రుఁడుగాని, దేవతలకెల్ల ఱేఁడగు గొప్పయైశ్వర్యవంతుఁడయిన ఇంద్రుఁడుగాని యుద్ధములందు రాముని చేతఁ జిక్కినవానిని రక్షింపఁజాలరు." అని హనుమంతుఁడు ధైర్యముతోఁ జెప్పినట్టి హితవాక్యమును దనకప్రియమునుగా భావించి, సాటిలేని వీర్యముగల రావణుఁడు కినుకపూని కన్నులు గిరగిరఁద్రిప్పుచు నావానరవీరుని వధింప నాజ్ఞయొసఁగెను.

52-వ సర్గము

విభీషణుఁడు రావణునికి హితంబు సెప్పుట

రావణుఁడు మహాధీరుఁడగు హనుమంతునిపలుకు లాలకించి, యొక్కవ యాగ్రహముగలవాఁడై, యాహనుమంతుని సంహరింప నానతియిచ్చెను. దుష్టబుద్ధిగలవాఁడగు రావణుఁ డట్టి యానతిచేయఁగా, దూతకృత్యము చేయవచ్చినవాని కిట్టి దండన విధించుటకు సమ్మతింపక, పనిచేయఁదగినరీతి నెఱుఁగఁ గలవాఁడును, మాటలందుఁ జమత్కారియు నైన యావిభీషణుఁడు మంచిమాటలచేఁ గార్యము సాధింపనెంచినవాఁడయి, శత్రువుల జయించునట్టి తనయన్నయగు రావణుని తిన్నని మాటలచే గారవించి మిక్కిలి హితమైన వాక్యముల నిట్లనియె:

"రాక్షసాధిపా! శాంతపడుము. రోషమును విడువుము. కలఁక దేఱినవాఁడవై యీనామాటను వినుము. మంచిచెడ్డల నెఱిఁగిన యోగ్యులైన రాజులు దూతకు వధము దండనముగా విధింపరు. ఓ శూరుఁడా! యీవానరుని వధించుట రాజధర్మమునకు విరుద్ధమయినది; లోకమర్యాదను మీఱినది. నీకును తగనిది. నీవు సకల ధర్మముల నెఱిఁగినవాఁడవు. నెనరుగలవాఁడవు. రాజధర్మము లన్నిటియందు నిపుణుఁడవు. జనులలోపల మంచిచెడ్డల నెఱిఁగినవాఁడవు. వాస్తవార్థము నెఱిఁగినవాఁడవు. వివేకులైన నీబోంట్లే యిట్లు కినుక పూనుదురేని,

అప్పు డింతవఱకు శాస్త్రములందుఁజేసిన పరిశ్రమయెల్ల వ్యర్థమేకదా. కావున శత్రువులకు లోఁబఱచుకొన నలవికానివాఁడవు, శత్రువులను జంపువాఁడవునైన రాక్షసేంద్రుఁడా! ప్రసన్నుఁడవగుము. మంచి చెడ్డల విచారించి దూతకుఁ దగిన దండనను విధింపుము."

రాక్షసరాజగు రావణుఁడు విభీషణునిమాటలు విని, యెక్కువ యాగ్రహము పూనినవాఁడై, "శత్రుసంహారీ! పాపాత్ములను వధించుటలో నేమియుఁ బాపము లేదు. కావున పాపాత్ముఁడైన యీవానరుని వధించెదను" అని యుత్తరము చెప్పెను.

బుద్ధిమంతులలోపల శ్రేష్ఠుఁడయిన విభీషణుఁ డన్యాయమే మూలకారణముఁ గలదియు, ఎక్కువకోపముతోఁ గూడినదియు, దుష్టులవలంబించునదియునైన రావణునిమాటను విని, వాస్తవమైన ధర్మసూక్ష్మమును దెలుపునట్టి మాట పలికెను: "లంకాపురము నేలికవు, రాక్షసులకు రాజవునైన యోరావణా! శాంతింపుము. ధర్మార్థయుక్తమైన నామాట వినుము. ఓరాజా! అన్ని దేశములందును, అన్ని కాలములందునుండు పండితులు దూతలను జంపరాదని చెప్పుదురు. ఇతఁడు దూతమాత్రమేకాఁడు. అక్షకుమారాదులను జంపుటచే నితఁడు మనకు మాఱిన శత్రువు. అయిన వీనిని సంహరింపఁ గూడదాయనిన, పెద్దలు దూతవధము యుక్తముగాదని చెప్పుదురు. వారికి పెక్కుతెఱఁగులైన దండనములు శాస్త్రములందు విధింపఁబడియున్నవి. కరచరణాద్యవయవములందు వికృతిని గలిగించుట, కొరడాలతోఁ గొట్టుట బోడిగొట్టుట, గుఱుతుపెట్టుట యీ మొదలగువానిని దూతకు దండనములనుగా విధింతురుగాని, దూతను జంపుట నేనింతకుమున్ను విన్నది కూడ లేదు. మంచిచెడ్డలనెఱుఁగుటచేఁ గార్యము నెఱిఁగినవాఁడును, ధర్మార్థములందే ప్రవర్తించు తలంపుగలవాఁడునైన, నీయట్టివాఁడే యిట్లు కోపపడవచ్చునా? అదియుత్తమ మగునా? ఎప్పటికిని సత్పురుషులాగ్రహము నడఁచుకొందురుగదా. ధర్మశాస్త్రవాదమునందును, లోకాచారములందును, శాస్త్రవిషయములను బుద్ధితో గ్రహించుకొనుటయందును నీతో సమానుఁడు లేనేలేఁడు. నీవు దేవాసురులంబఱిలోపల నుత్తముఁడవు. ఈదూతను వధించుటలో శాస్త్రవిరోధ మొక్కటియే కాక ప్రయోజనమొక్కటియుఁ గనఁబడలేదు. ఎవ్వరీదూతను బంపి

నారో, వారియం దీదండనమును విధింపుము. ఇతండు మంచివాఁడు, లేక, చెడ్డవాఁడు కానీ, ఇతఁడు పరులచేఁ బంపఁబడినవాఁడు. స్వతంత్రుఁడుగాని యట్టి దూత యొరులకై యొరులు చెప్పిపంపిన సంగతిని జెప్పినవాఁడు గావున నతనిని వధించుట యుక్తము గాదు. అదియుఁగాక, ఇతనిని జంపిన, సముద్రముదాఁటి రాఁగల మఱియొకనిని మనము చూడలేము. చూడకపోయిన మనకేమి నష్ట ముందువేమో, యితఁడిచ్చట మనవలన మడిసిచో నిచ్చటి సంగతి రామలక్ష్మణులకుఁ దెలియఁబోదు. కావున వా రిచ్చటికి రాను వీలుపడదు. కనుక శత్రువినాశము గలుగఁబోదు. ఇతనిని జంపక విడిచితిమేని, ఇతఁడు సముద్రము దాఁటిపోయి సంగతి దెలుపఁగానే, రామలక్ష్మణు లిచ్చటికి వత్తురు. అప్పుడనాయాసముగా శత్రువధము చేయవచ్చును. శత్రుపట్టణముల గెల్చువాఁడా! పై కారణమువలన నితనిని జంప యత్నము సేయవలదు. నీ విం(ద్రా)దిదేవతలపై దాడివెడలుటకుఁ బ్రయత్నము చేయుము. యుద్ధముల కిష్టపడువాఁడా! ఇతఁడు నశించునేని, సముద్రము దాఁటిపోయి, చాలదూరమున నున్న గర్వితులైన ఆరాజపుత్రులను యుద్ధమునకయి పురికొల్పువాఁడగు దూత మఱొక్కఁడు లేఁడు. రాక్షసులమనసునకు సంతోషము గలిగించువాఁడా! శౌర్యము, పూనికి, దిట్టతనముగల దేవాసురులకైన గెల్వ నలవికాని నీవు నీయొక్క యుద్ధప్రయత్నము చెఱఁగొట్టుకొనుట యుక్తముగాదు. నీకు మేలుగోరువారును, మొనగాండ్రును, పెట్టుపోతలచే లోఁబడినవారును, సద్గుణములతో నిండిన సత్కులములందుఁ బుట్టినవారును, ధైర్యశాలురును, విలుకాండ్రలోపల మేటులునునైన చక్కని పనివాండ్రును, యుద్ధవీరులును, కోటికంటె హెచ్చుగా నీవశమున నున్నారు. ఆసేనలోఁ గొంత సేన నిచ్చి, నీదూతలను వారికడకుఁ బంపుము. వారు పోయి మూఢులైన యారాజపుత్రుల నడ్డగించి, శత్రువులందు నీప్రభావము తెలియఁబఱిపఁజాలుదురు" అని తమ్ముఁడగు విభీషణుఁడు చెప్పిన యుత్తమ ప్రియవచనములను విని, దేవతలకు శత్రువును, మహాబలుఁడును, రాక్షసవీరులకు ముఖ్యుఁడునునైన రావణాసురుఁ డతనిమాటకు సమ్మతించి యట్లు చేయఁ దలఁచెను.

53-వ సర్గము

రాక్షసులు హనుమంతునితోకకు నిప్పంటించుట

మహాబలుఁడగు రావణుఁడు దేశకాలములకుఁ దగినట్లుగా తమ్ముఁడగు విభీషణుఁడు చెప్పినమాటను విని, యతనితో నిట్లనియె: "ఓ విభీషణా! దూతవధము నింద్యమయినదని నీవు లెస్సఁగాఁ బరికించితివి. వధముకంటె నితరమైన దండనమేదియైనఁ దప్పక చేయవలయును. కోఁతులకుఁ దోఁక యిష్టభూషణముగదా. కావున నీవానరుని తోఁకకు నిప్పంటింపుఁడు. అట్లంగవికారముచేఁ జిక్కి దీనతతో మఱలిపోయిన యితనిని యితనిబంధుమిత్రదాయాదులు చూతురుగాక!" అని తమ్ము నితోఁ జెప్పి, తన పనివారిని జూచి, "ఈవానరునితోఁకకు నిప్పంటించి, యీతనిని బట్టణమున నూరేగింపవలయు" నని యానతి యొసఁగెను.

ఆరావణునిమాటను విని, రాక్షసులు కోపముచేఁ గృశించిన వారై, యా హనుమంతునితోఁకకు చినిఁగినవేలికలు చుట్టిరి. తోఁకకు వారట్లు వేలికలు చుట్టుచుండఁగా, కాఱుచిచ్చు ఎండుఁగట్టల నాశ్రయించి వర్ధిల్లురీతిగా మహావానరుఁడును తనదేహమును పెంచెను. ఆరాక్షసులాహనుమంతుని తోఁకకు గట్టిగా గుడ్డలుచుట్టి, నూనెలోఁ దడిపి నిప్పంటించిరి. బాలసూర్యనిమాడ్కి వెలుఁగుమోముగల వాఁడగు హనుమంతుఁడు కోపముచే నిండిన మనస్సుతోఁ గూడిన వాఁడై, మండుచున్న యాతోఁకతోనే యారాక్షసులను గూలనేసెను. ఆలంకాపురమున నుండు రాక్షసులందఱు స్త్రీలు, బిడ్డలు, ముసలి వాండ్రతోఁగూడ మండుచున్న యాహనుమంతునితోఁకను జూడఁ బోయిరి. అప్పుడు వారు వచ్చి పట్టఁగా, హనుమంతుఁడు దానుశూరుఁడైనను సమయమునకుఁ దగినయోచన యొక్కటి చేయఁ దొడఁగెను.

"ఈ రాక్షసులు నన్నుఁ గట్టినను, నాకు వీరు చాలరు. ఈ బ్రాహ్మ్లు త్రెంచుకొని నేను మఱల వీరిని జంపఁగలను. నా యజమానుని మేలు కోరి యిచ్చటఁ దిరుగుచుండు నన్ను రాక్షసులు దమప్రభువు నుత్తరమునుబట్టి కట్టివేయుదురేని నేను జేసినపని కిదిబదులుచేయుశెంత మాత్రము కానేరదు. నే నొక్కఁడనే యుద్ధరంగమున వీరినందఱిని

మట్టుపెట్టఁగలను. అయినను తానే రావణుఁడు మున్నగువారిఁ జంపఁ దలఁచి యున్నందున నేను వీరు కట్టుకట్టులు మొదలగునవి యోర్చి యున్నాను. నేను రాత్రి పట్టణములోపలఁ బ్రవేశించితిని గనుక, దుర్గ రక్షణవిశేషమును దెలిసికొనుచు బాగుగఁ జూడలేదు. అవశ్యముగాఁ దెల్లవాఱఁ బట్టణమంతయు చూడవలయును. వీరు నన్నుఁ బట్టుకొని నాతోఁకను వెలిఁగించి త్రిప్పుటచే నేను మఱిలఁ బట్టణ మెల్ల బాగుగాఁ జూచినట్లగును. 'కావున వీరు నన్ను బంధించి తోఁకను వెలిఁగించి తమ యిచ్చచొప్పున నొప్పింపసీ. నామనసు కే మాత్రము శ్రమలేదు" అని హనుమంతుఁడు తనలోఁ దా ననుకొనెను.

అంతటఁ గ్రూరపుఁబను లొనర్చు రాక్షసులు మహాబలవంతుఁ డయ్యుఁ దనయాకారమును కొంచెపఱిచి యుంచుకొనియున్న యా హనుమంతునిఁ గట్టి సంతోషముతోఁ గూడినవారలై, శంఖభేరీవాద్య ముల ప్రొఁతలచేతను, తమచేతిచప్పట్లచేతను, గొప్పయఱుపులచేతను బట్టణమెల్ల మాఱుమ్రొగునట్లు చేయుచు, నాహనుమంతునిఁ బుర మంతయుఁ ద్రిప్పిరి. అట్లు వా రీడ్చికొని పోవుచుండఁగా, వాయునంద నుఁడు పట్టణమెల్లఁ దిరిగి, విచిత్రములైన యేడంతస్తుల మేడలను, చలువరాలతోఁగట్టఁబడిన భూప్రదేశములను, చక్కఁగాఁ దీర్చికట్టిన యింటిముంగిళ్లను, రాజబాటలలోనికిఁబోవు చిన్నసందుగొందులను, రహస్యద్వారములను, మేఘములంబోలు నున్నతగృహాములను జూచెను. నాలుగు రాజమార్గములు గలియుచోటులందును, నాలుగుకాళ్లమండ పములందును, రాజమార్గములందును జేరి యాలంకాపురమునందలి రాక్షసులందఱు "ఇదిగో చారు!" డని యరచిచెప్పుచుండిరి. ఆ పట్ట ణము నందలి స్త్రీలు, బాలురు, ముదుసలు లచ్చటచ్చటఁ గుతూహల ముతోఁ గూడినవారై, మండుచున్న తోఁకతోఁ గూడిన యాహను మంతునిఁ జూడఁబోయిరి. ఆ హనుమంతుని తోఁక మండుచుండఁగా, వెట్టి చూడ్కులుగల రాక్షసస్త్రీలు సీతాదేవికడకుఁ బోయి "ఓసీతా! నీతో మాటలాడుచుండిన యెఱ్ఱిమూఁతిగల కోఁతితోఁకకు చింపి గుడ్డలు చుట్టి, నిప్పంటించి వాని నిదిగో కొనిపోవుచున్నారు చూడుము" అని యామె దిగులుపడునట్లు చెప్పిరి.

విశాలాక్షియగు సీతాదేవియు క్రూరరాండ్రయిన యా రాక్ష సులుచెప్పిన యామాటను విని, తనప్రాణమే పోయినట్లు తలఁచినదై, శోకమున మునిఁగి యగ్నిహోత్రుని కడకుఁబోయి, యా హనుమంతు నికి మంగళముగోరినదై, పరిశుద్ధమనస్సుతో నగ్నిహోత్రుని నివ్వి ధమున నుపాసనచేయఁ దొడగెను. "ఓ యగ్నిహోత్రుఁడా! నే నొనర్చిన పతిశుశ్రూష యుండునేని, నే నొనరించిన తపస్సుండునేని, నాయొక్క పాతివ్రత్య ముండునేని, హనుమంతునికిఁ జల్లనివాఁడ వగుము. జ్ఞానము గలవాఁడగు ఆరామునికి నాయందు దయగలదేని, అదృష్ట శేషముండునేని, ఓయగ్నిహోత్రుఁడా! హనుమంతునియెడఁ జల్లనివాఁడ వగుము. రాముఁడు తనతోఁడిచేరికను గోరుచున్నదానినైన నన్ను మంచినడవడితో నుండుదానినిగా నెఱుఁగునేని, అగ్ని హోత్రుఁడా! హనుమంతునికిఁ జల్లనివాఁడవగుము. సత్యముఁదప్పని వాఁడైన సుగ్రీవుఁడు నన్నీ దుఃఖమనెడి కడలిని దరింపఁజేయునేని, హనుమంతునికి జల్లనివాఁడ వగుదువు గాక" అని యివ్విధమున సీతా దేవి యగ్నిహోత్రునిఁ బ్రార్థింపఁగా, అగ్నిహోత్రుఁడు వేఁడిమంటలు గలవాఁడయ్యు, కదలక, గుండ్రనిజ్వాలలుగలవాఁడై యా సీతాదేవికి క్షేమము దెల్పువానికైవడి జ్వలించెను. హనుమంతునితండ్రియగు వాయుదేవుఁడును తోఁకయంచలి నిప్పుతోఁ జేరినవాఁడయి, సీతాదేవికి నెమ్మదిఁదెల్పువానికైవడిఁ జల్లగా వీచెను.

అప్పుడు హనుమంతుఁడు తనతోఁక యెఱియునప్పు డిట్లు చింతిం చెను: "ఈయగ్నిహోత్రుఁడు చక్కఁగా నెఱియుచున్నను, నాకు బాధ గలిగింపకున్నాఁడు. మంట లప్పటికప్పటికి హెచ్చుచున్నవి. కాని నాకు బాధ కనఁబడలేదు. తోఁకకొనయందు మంచుగడ్డ పెట్టినట్లున్నది. దీనికిఁ గారణమేమో తెలియలేదు. నేను సముద్రమున దాఁటునప్పుడు రాముని ప్రభావమువలననే పర్వతరూపమయిన యాశ్చర్యము చూచి తిని. ఆరాముని ప్రభావముచేతనే యీ యగ్నిహోత్రుఁడు నాయెడఁ జల్లనివాఁడుగనున్నాఁడు. సముద్రునికిని ధీమంతుఁడగు మైనాకునికిని అంత త్వరపా టుండునపుడు, అగ్నిహోత్రుఁడు మాత్రమేల యట్లుం డఁడు? సీతాదేవియొక్క దయాళుత్వముచేతను, రాముని తేజస్సు

చేతను, వాయువుతోడి చెలిమిచేతను నన్నగ్నిహోత్రుఁడు దహింప కున్నాఁడు"

వానరోత్తముఁ డివ్విధమున గొంతతడ వాలోచించి, పర్వత శిఖరముమాఁడ్కి నెత్తయినదియు రాక్షససంచారము మెండుగా లేనిది యునైన గోపురద్వారముమీఁదికెగిరి దుమికి, మఱల నుత్సాహము పూని, క్షణములోపలఁ బర్వతసమానుఁడై, మఱల మిక్కిలి చిన్నదైన రూపము నొంది కట్లనెల్లఁ ద్రెంచివైచెను. అట్లు కట్లు విడిపించుకొని మఱలఁ బర్వతాకారుఁడై, యన్నివైపులఁజూచి, గోపురద్వారమున నున్న గుదియను జూచెను. నిడుదచేతులవాఁడగు హనుమంతుఁడు కాఱినుముతోఁ జేయఁబడిన యాగుదియను గైకొని, ఆ పురద్వార రక్షకుల నందఱిని బరిమార్చి, యుద్ధమునఁ బగతురకు భీతి గలిగించు పరాక్రమము గలవాఁడై, మఱల లంకాపురము నంతయుఁ జూచుచుఁ బ్రజ్వరిల్లుచున్న తోఁకయందలి యగ్నిజ్వాలలతో వెలుఁగుచు వేయి కిరణములచేఁ బ్రకాశించుచున్న సూర్యునిమాఁడ్కిఁ దేజరిల్లుచుండెను.

54-వ సర్గము

హనుమంతుఁడు లంకను గాల్చుట

అంత హనుమంతుఁడు వచ్చిన కార్యమును నెఱవేర్చుకొన్న వాఁడై, పూనిక హెచ్చుచుండుటచేత మిగత కార్యముఁ గూర్చి యాలోచించెను: "ఇప్పుడు నా కిచ్చటఁ జేయవలసిన పని యేమి మిగిలి యున్నది? ఈ రాక్షసులకు మఱింత శోకముగలిగించు పని యిఁక మిగిలియున్నది. రావణునికి మిక్కిలి ప్రియమైన యశోకవనము పాడు సేసితిని. గొప్పరాక్షసులను సంహరించితిని. సేనలో నొక్కపాలు ధ్వంసముచేసితిని. ఇఁక కోట దగులఁబెట్టుట యొక్కటి మిగిలి యున్నది. కోటను బాడుసేసినయెడల, మీఁదికార్యము సులభముగా సాధింప వచ్చును. కొంచెపాటి ప్రయత్నము చేసికొని యీపని చేసితినేని, నేను బడిన శ్రమము సార్థకమగును. అంతియకాక, నాతోఁకయందు మండుచున్న యగ్నిహోత్రుని నీమేటిగృహములచేఁ దనివి నొందించుట యుక్తము."

అని యాలోచించి, హనుమంతుఁడు వెలుఁగుచున్న తోఁక గల వాఁడగుటంజేసి మెఱుపుతోఁగూడిన మేఘముమాడ్కి వెలుఁగుచు, లంకాపురమునందలి రాక్షసులయొక్క యిండ్లమీఁదను సంచరించెను. ఇట్లు లంకయందలి యుద్యానములయందును, ఇండ్లమీఁదను, మేడల మీఁదను చూడ్కి నిగుడించుచు నిర్భయముగా విచ్చలవిడిఁ దిరుగు చుండెను.

వాయువేగుఁడగు హనుమంతుఁడు ప్రహస్తునినగరుపై కెగిరి యచ్చటఁ జిచ్చుపెట్టి, యచ్చటినుండి లేచి, మహాపార్శ్వనియింటి మీఁదికి దుమికి ప్రలయకాలాగ్నిజ్వాలంబోలు మంటను దానికిఁ దగి లించెను. మహాతేజస్సుగల హనుమానుండు వజ్రదంష్ట్ర శుకసారణేంద్ర జిత్తులయు, జంబుమాలి సుమాలులయు, రశ్మికేతుసూర్యశత్రువు లయు, హ్రస్వకర్ణ, హ్రస్వదంష్ట్రులయు, రోమశ, యుద్ధోన్మత్త, ధ్వజ గ్రీవులయు, భయంకరుఁడయిన విద్యుజ్జిహ్వనియొక్కయు, హస్తి ముఖ, కరాళ, పిశాచ, శోణితాక్ష, కుంభకర్ణ, మకరాక్ష, యజ్ఞశత్రు, బ్రహ్మశత్రు, నరాంతక, కుంభ, నికుంభులయు మేడలయందన్నిటియం దును వరుసగా నిప్పుపెట్టెను. ఇట్లు నిప్పుపెట్టునప్పుడు విభీషణుని గృహముమాత్రము విడిచిపెట్టి, తక్కిన వారియిండ్లనెల్ల నొకదానిపై నుండి మఱియొకదానిపైకి దుముకుచు నన్నియిండ్లను వరుసగా దహించెను.

ఆతఁడు శ్రేష్ఠములగు నాభాగ్యవంతులయిన రాక్షసుల మేడలం దున్న వారివిలువగల వస్తువులనెల్లను దహించెను. శౌర్యలక్ష్మీవంతుఁ డైన యా హనుమంతుఁడు ఆ రాక్షసులగృహముల నన్నింటిని దాఁటి, రాక్షసేంద్రుఁడగు రావణాసురుని గృహముజేరెను. అంతట నానా విధములగు రత్నములు చెక్కినదియు, మేరుపర్వత మధ్యభాగము మాడ్కి శోభిల్లునదియు, మేలిమివస్తువులచే నన్నింటిచే శోభిల్లునదియు నైన యా రాక్షసరాజగృహమునఁ దనతోఁకయందు వెలుఁగుచున్న యగ్నిహోత్రుని నుంచి, ప్రలయకాలపుజలదముమాడ్కి గర్జనము చేసెను. హనుమంతునితోఁకయం దున్న యగ్నియు వాయువుతోడి చేరికవలన మఱింత వడియు బలిమియుగలదై, ప్రలయకాలాగ్ని హోత్రునిమాడ్కిఁ బ్రజ్వరిల్లెను. జ్వలించుచున్న యగ్నిని వాయు

వాగృహాములందుఁ బర్వఁజేసెను. అగ్నిహోత్రుఁడును వాయుసం యోగమునఁ గడువడితోఁ బర్వఁజొచ్చెను. పుణ్యము ముగియునప్పు డాకాశమునుండి క్రిందఁబడు సిద్ధుల గృహాములమాడ్కి బంగారు కిటికీలు గలవియు, ముత్యాలతో నలంకరింపఁబడినవియు, పెక్కురతన ములు పొదిగినవియు నైన యా రాక్షసుల గృహము లెల్లఁ గూలినవి. రాక్షసులందఱు తమ యిండ్ల కంటుకొన్న యగ్నిని జల్లార్చి కాపాడు కొనుటయం దుత్సాహము తగ్గఁగా, తమసంపదలెల్ల బూదియై పోవఁగా "అక్కటా! యీ యగ్నిహోత్రుఁడే కోఁతిరూపముతో మనపురమునకు వచ్చెనా?" యని గొప్పరొద చేసిరి.

కొందఱు చంటిబిడ్డలు చంకనున్నస్త్రీ లేడ్చుచు మేడలమీఁది నుండి క్రిందఁగూలిరి. కొందఱుస్త్రీలు తలవెండ్రుకలు విడియఁబోసి కొని, యగ్ని చేఁ జుట్టఁబడిన మేడలనుండి క్రిందఁగూలుచు, ఆకాశము నందలి జలధరములనుండి క్రిందఁబడిన మెఱుపులచందమునఁ బ్రకాశిం చిరి. ఆహానుమంతుఁ డప్పుడు తాను నిప్పుపెట్టుటచే వదలిపోవుచున్న వజ్రములు, మాణిక్యములు, వైడూర్యములు, ముత్యాలును గలిగిన యిండ్లను, ఆయిండ్లనుండి వేఁడిమికిఁగరఁగి పాఱుచున్న బంగారుమొదలగు లోహాములనుజూచెను. ఆయగ్నిహోత్రుని కెన్నికష్టులు, ఎంత గడ్డి దొరకినను తనివిగలుగలేదు. ఆహానుమంతుఁ డెన్నియిండ్లు దహించినను తనివి నొందఁడయ్యె. ఎందఱు రాక్షసులు గూలినను భూమి తనివినొంద కుండెను. ఆ యగ్నిహోత్రునిజ్వాలలు కొన్ని తావులందు మోదుగు పువ్వులమాడ్కియు, కొన్నిప్రదేశములందు మంకెనపువ్వులమాడ్కియు, కొన్ని చక్కట్లయందు కుంకుమపువ్వు పగిదియుఁ బ్రజ్వరిల్లినవి. అంత బలవంతుఁడగు హానుమంతునిచే లంకాపురమున కాధారమైన త్రికూట పర్వతశిఖరమున నుంచఁబడిన భీకరవిక్రమముగల యగ్నిహోత్రుఁడు తనజ్వాలలగుంపు నంతటఁ బర్వఁజేసి, వాయువుతోడ్పాటుచేఁ బ్రలయ కాలాగ్నిమాడ్కి నప్పటప్పటికి వృద్ధిఁబొంది, పొగ లేకుండఁ బైకిఁ బోవుచు రాక్షసుల శరీరములందలి క్రొవ్వుచే వృద్ధినొందిన జ్వాలలచే మిన్నుముట్టుచుఁ గోటిసూర్యప్రకాశమానమై, లంకాపురమంతయు వ్యాపించి, పిడుగువంటి గొప్పధ్వనులతో బ్రహ్మాండమును భేదించు చున్నదో యన్నట్లు తోఁపఁజేయుచు నాకాశమునకు వ్యాపించి,

యోర్వారాని వేడిమిగలదై, మోదుగుపువ్వుంబోలు జ్వాలలకొనలు గలిగి యత్యంతాభివృద్ధినొందుచుండెను. మొదటమొదటఁ గాలిచల్లారిన యిండ్లనుండి లేచిన పొగచేఁ బర్వఁబడి వరుసలుతీరిన మేఘములు నల్ల కలువలమాడ్కి మెఱసినవి.

ఆ లంకాపురమునందలి యుత్తమరాక్షసు లందఱు లంకాపురము సకలజీవరాసులతోను, వృక్షాది స్థావరములతోను దగ్ధమయినది చూచి "ఈతఁడు వజ్రాయుధముఁ దాల్చిన దేవేంద్రుఁడో, యముఁడో, వరుణుఁడో, వాయుదేవుఁడో, రుద్రుఁడో, అగ్నియో, సూర్యుఁడో, కుబేరుఁడో, చంద్రుఁడో, కాలుఁడోకాని యెంతమాత్రము వానరుఁడు గాఁడు. అందఱికి సృష్టికర్తయై, అన్నిటికిఁ బోషకుఁడై, నాలుగు మోములచే వెలయు బ్రహ్మదేవునియొక్క ప్రకోపమే రాక్షసుల వినాశముచేయుటకై వానరరూపముతో నిచ్చటికి వచ్చెనో! త్రివిధ పరిచ్ఛేదము (పుట్టుట పెరుగుట నశించుట యను మూఁడుతెఱఁగులైన విభాగము) లేనిదియు, కన్నులు మొదలగు నింద్రియములకు గోచరము గానిదియు, మనస్సునకుఁ గూడ నూహింప రానిదియు, అద్వితీయమైన దియు నైన విష్ణుతేజస్సే తన యసాధారణ మాయచేఁ గోఁతిరూపము దాల్చి యిప్పుడిచ్చటికి వచ్చినదో!" అని పలికిరి.

ఆ లంకాపురమునందలి రాక్షసులు తమగుఱ్ఱము లేనుఁగులు రథములు, పక్షిమృగవృక్షములును బంధుమిత్రపరిజనులును మడియుటఁ జూచి, యెలుఁగెత్తి "అయ్యో! తండ్రీ! అయ్యో! కొడుకా! అయ్యో! నాథుఁడా! అక్కటా! చెలికాఁడా! హా! భోగములతో నిండిన మిక్కిలి పరిశుద్ధమైన యీ ప్రాణమా!" యని మిగులనోర్వరాని దగుటచేఁ గడు భీకరమైన రోదనము గావించిరి. అగ్నిజ్వాలలచేఁ జుట్టఁబడినదియు, యుద్ధవీరులయు, భటులయు నాశముచే సొంపు దఱిగినదియు, హనుమంతుని కోపాతిశయమునకుఁ జెడినదియునైన యాలంకాపురము శాపగ్రస్తమైనది పోలెఁ బ్రకాశహీనమాయెను. ఆలంకాపురమునందలి రాక్షసులు తత్తరపాటును వెఱపును గలవారై దుఃఖపడుచుండుటను, అంతట నగ్నిజ్వాలలు పర్వియుండుటను జూచి, హనుమంతుఁడు లంకాపురము బ్రహ్మదేవునిశాపముచేఁ బాడుపడినభూమియో యని తలఁచెను. హనుమంతుఁ డవ్విధమున వృక్షశ్రేష్ఠములతో నిండినవనమును బాడు

చేసి, సమరమునందు గొప్పరాక్షసుల నందఱను బరిమార్చి మేటి యింద్లచే నొప్పిన యాలంకాపురమునుగాల్చి తాను దలఁచిన కార్య్యము నెఱవేఱుటచే స్తిమితుఁడై త్రికూటశిఖరముకొన ప్రదేశముచేరి, తోఁక యందు మండుచున్న యగ్నిజ్వాలలుగలవాఁడు గనుక వేయికిరణము లచే వెలుఁగు సూర్య్యనిచంచమునఁ దేజరిల్లెను. ఇట్లు వనభంగము, రాక్షససంహారము, గృహదాహామునుజేసి తానువచ్చిన కార్య్యము పూర్తియగుటచేత నిఁక రామునికడకుఁ బోవలసినదని తలఁచినవాఁడయ్యెను. వనధ్వంస రాక్షసవధ గృహదహనములను జేసి విరాజిల్లుచున్న యాహానుమంతుని వాయువేగముఁ బోలువేగముగల వానిని జూచి దేవగంధర్వసిద్ధకిన్నరమహర్షులు మున్నగువారు మిగులస్తుతించిరి. మఱియు వారంవఱు అంతటనుగాల్పఁబడిన యాలంకను జూచుచుమిగుల నాశ్చర్య్యపడిరి. ఇట్టివింత కార్య్యమును జేసిన యాహానుమంతునిఁ జూచి, "యితఁడు ప్రలయకాలాగ్నియో" అని సకలభూతములును వెఱచినవి. హానుమంతుని యద్భుతపరాక్రమముఁ జూచి సకలభూతములును మిక్కి మిన్నాఁగిన యుత్తమప్రీతినిఁ జెందినవి.

౫౫-వ స ర్గ ము

హానుమంతుఁడు సీత నశించెనని వగచుట

మహాబలుఁడగు వానరశ్రేష్ఠుఁడయిన హానుమంతుఁడు లంకాపురము నెల్లదహించి, యావల తనతోఁకను సముద్రమున ముంచి చల్లార్చెను. అట్లతఁడు చల్లార్చి, యల్లాముచుండు రాక్షసులతోఁ గూడినవై, రూపుచెడి యెల్లవైపుల నెఱియుచున్న లంకాపురమును బరికించుచుండఁగా, నతనికి గొప్ప భయమును, మనస్సున నొకవిధమైన యేవగింపును గలిగెను. తరువాత నతం డిట్లని చింతించెను.

"లంకను దహించుచు నేనెంత నీచపుఁబని చేసితిని! ఏమహాత్ములు మండుచున్న నిప్పును నీటితోఁ జల్లార్చునట్లు తమ మనస్సులందుఁ బుట్టిన కోపమును, జ్ఞానము తెచ్చుకొని యణఁచుకొనుచున్నారో, అట్టి పురుషశ్రేష్ఠులే పుణ్యాత్ములనఁబడుదురు. క్రుద్ధుఁడైన యేమానవుఁడు పాపము నేయఁడు? క్రుద్ధుఁడైనవాఁడు గురువులను సైతము సంహరించును. కోపవంతుఁడు పరుసని మాటలతో సాధువులను నిందించును.

కోపము వచ్చినవాని కీమాట చెప్పవచ్చును, ఈమాట చెప్పరాదని తెలియదు. కోపవంతునికిఁ జేయరాని పని యని యొక్కటి లేదు. చెప్పరాని మాట యని యొక్కటి లేదు. పాము పాఁతదైన తనపై కుబుసమును విడుచునట్లు, ఏమానవుఁడు తనమనస్సునఁ బుట్టిన కోపము నోర్పుతో నాఁపుకొనునో, అతఁడే పురుషుఁడని చెప్పఁబడును.

సీతాదేవి యిచ్చటనున్న సంగతి మఱచి, బుద్ధిహీనుఁడనై, లజ్జమాని, కడు పాపిష్టుఁడనై, లంకాపురమును జిచ్చుపెట్టి, స్వామిని వధ మొనర్చినవాఁడనైతిని. ఛీ! యీనా బ్రదుకెల! మూఢుఁడనై నేను లంకాపురము దహించితిని గనుక సీతాదేవియుఁ దప్పక దహింపఁబడినది యైయుండును. సీతాదేవియు దగ్ధురాలై యుండునేని, నాచేని కార్యము పాడై పోయినదే! ఏకార్యము నిమిత్తమై యింతప్రయత్నమో, ఆకార్యము చెడిపోయెను. నేను లంకాదహనము చేయుచు సీతారక్షణమును గావింపనైతిని. సీతను వెదకుట, రావణుని పురము పరిక్షించుట, సీతను జూచుట, ఆసంగతి రామునికిఁ దెల్పుటయను నింత గొప్ప కార్యము రామునికిఁ దెలుపుట మాత్రము కడమగాఁ చేయఁబడినది. కాని నేను క్రోధపరవశుఁడనై యీకార్యమును మొదలంటఁ జెరిచితిని. జానకి దప్పక యీమంటలోఁ గలిసిపోయియుండును. ఏలయన, ఈలంకాపురమున నేను దహింపని ప్రదేశమొక్కటి లేదు. పట్టణమంతయు బూదిసేసితిని. నాబుద్ధిలోపమువలన నీకార్యము సెడియుండునేని, నే నిచ్చటనే ప్రాణములఁ దొఱఁగుట యుక్తయుని తోఁచెఁడిని. ఇప్పుడు నే నగ్నిలోఁ బడుదునా? లేక, బడబాముఖమునఁ జొత్తునా? సాగరమునందుఁ బడి యచ్చటి జలజంతువులకు నాదేహ మర్పింతునా? కార్యమంతయుఁ జెడఁగొట్టిన నేను ప్రాణములతోనుండి యేతీరున వానరుల తేనినిగాని నరోత్తములగు రామలక్ష్మణులఁగాని చూడఁగలను? ముల్లోకములందును వానరస్వభావము చపలమని ప్రసిద్ధమైనదే కదా! కాఁబట్టియే నేను క్రోధరూపమైన లోపమున నీకార్యము చెడఁగొట్టితిని గాదే! రజోగుణ సంబద్ధములగు కార్యములెల్ల నొకని యధికారమునకు లొంగియుండవు. ఈ రజోగుణవంతుఁడు దృఢమనస్కుఁడై యుండఁడు. నేను సీతారక్షణము చేయఁగలవాఁడనై యుండియు, పొగరుచేత సీతాదేవినిఁ గాపాడలేనివాఁడనైతిని. సీతాదేవి వినాశ

మొందిన, రాజశ్రేష్ఠులైన రామలక్ష్మణులును వినాశమొందుదురు. వారి వినాశవార్త విన్నచో సుగ్రీవుఁడు బంధుసమేతముగాఁ బ్రాణములను వదలును. ధర్మస్వభావముగల భరతుఁ డీమాటను విని, సోదరప్రేమ గలవాఁడగుటచే శత్రుఘ్నసమేతముగాఁ బ్రాణముల వదలు ననుట కొకసందియ మున్నదే? కడు ధర్మనిష్ఠగల యిక్ష్వాకువంశమెల్ల నాశమొందఁగా, జనులందఱు దుఃఖమునొంది, మనసున తహతహపడుచు వినాశము నొందుదురు. కావున నేను అదృష్టహీనుఁడనై, ధర్మార్థములకు దూరుఁడనై క్రోధరూపమైన పాపమునకు లోఁబడినవాఁడనై తప్పక లోకమునకే చేటు దెచ్చి పెట్టినవాఁడనైతిని."

అని హనుమంతుఁడు వగచుచుండఁగా, ముందు జరిగినట్టి మంచి శకునములే కలిగెను. అట్లవి కలుగఁగా మఱల హనుమంతుఁ డివ్విధమునఁ జింతించెను: "నేను తలఁచినదియెల్ల సరిగాదు. సుందరములైన యన్ని యంగములుగల సీత తనప్రతాపముచే నశింపకయ యుండ వచ్చును. అగ్ని యగ్నిహోత్ర మేమియుఁ జేయదు. ఎక్కువ ప్రతాపముగల యారామునిదేవిని దనపాతివ్రత్యమహిమచే రక్షింపఁబడు దాని నగ్నిహోత్రుఁడు తాఁకనైనను జాలఁడు. నిక్కముగా నారాముని ప్రభావముచేతను, సీతాదేవియొక్క పుణ్యవిశేషముచేతను దహించు స్వభావము గలవాఁడయ్యు నీయగ్నిహోత్రుఁడు నన్ను దహింపఁడయ్యె. భరతుఁడు మొదలగు సోదరులకు ముగ్గురికిఁ బరదేవతయు, రాముని మనసున కెక్కినదియు నైనది గనుక, ఆదేవి యెట్లు నశించును? దహించు స్వభావము గలవాఁడయ్యు, ఈపావకుఁడు నాతోఁక నెట్లు దహింపకున్నాఁడో, అట్లే యా సీతాదేవిని గూడ దహింపకుండునుగాని యామె నాతఁ డెట్లు దహించును? దేవీ ప్రభావమునఁ జేసియే సముద్రమధ్యమున మైనాకపర్వతము గనఁబడుటచేత నాయగ్నిహోత్రుఁ డా సీతాదేవి నేమియుఁ జేయఁజాలఁడు. ఆమె తనయొక్క తపస్సుచేతను, సత్యము పలుకుటచేతను, భర్తనుబప్ప వేఱొకనిని ధ్యానింపమిచేతను ఆయగ్నిహోత్రుని దహింపఁగలదు గాని, ఆమె నగ్నిహోత్రుఁ డేమియుఁ జేయఁజాలఁడు" అని హనుమంతుఁడు సీతాదేవియొక్క ధర్మప్రభావమును వర్ణింపుచుండఁగా, చారణులంద ఱాకాశమునఁ గూడి, రాక్షసుల గృహమునఁ జిచ్చు పెట్టినట్టి హనుమంతుఁడు జనులకుఁ జేయ నలవికాని

గొప్పపనిని జేసెను. ఈ లంకాపురము నలువైపులకుఁ బరుగెత్తు రాక్షసకాంతలతోఁ యార్తనాదములతోఁ గూడినదై, జనకోలాహలములచే నిండి, పర్వతగుహంబోలె శబ్దించుచున్నది. అగడ్తలు, ప్రాకారములు, వెలుపటి ద్వారములు మొదలగు వానితోఁగూడ నీలంకాపురమంతయు మండిపోయినది. ఇంతపురమెల్ల దగ్ధమైనను సీతాదేవి దహింపఁబడకయున్నది. ఇదియే మాకు గొప్పవింతగా నున్నది" అని చెప్పుకొనుచుండుటను హనుమంతుఁడు వినెను. ఆహనుమంతుఁడు ఫలమును జూపినట్టి శకునములచేతను, విశేషగుణము గలవైన సీతా పాతివ్రత్య రామప్రభావాది సుగుణములచేతను, ఋషివాక్యముల చేతను సీత క్షేమముతో జీవించియున్నదని యెఱిఁగి డెందమున నానందము నొందెను. అటుతర్వాత వానరుడు తానుదలఁచిన కార్యమెల్ల నెఱవేర్చికొన్నవాఁడై, సీతాదేవి యపాయము లేకున్నది యెఱిఁగి, మఱల తానును ప్రత్యక్షముగాఁ జూచి, మఱలుటకే పయనమాయెను.

56-వ సర్గము

హనుమంతుఁడు లంకనుండి ప్రయాణమగుట

తర్వాత హనుమంతుఁడు శింశుపావృక్షముక్రిందఁ గూర్చుండియున్న సీతాదేవినిగాంచి, యామెకు నమస్కరించి, "దేవీ! దైవాధీనముగా నీకేమియు హాని కలుగకుండుట చూచుచున్నాను" అని చెప్పి, ప్రయాణమున కాయితము సేయుచుండెను. అట్టి హనుమంతుని సీతాదేవి పలుమాఱు చూచి, భర్తయం దనురాగముతోఁ గూడినదయి యతనితో నిట్లనియె:

"ఓ శత్రువీరుల సంహరించువాఁడా! నీవొక్కఁడవే రాక్షస సంహారపూర్వకముగాఁ నన్నుఁ గొంపోవుకార్యమును సాధింపఁ జాలుదువు. అయినను, ఈబలము గనఁబఱచుట నీకుఁ గీర్తికరమె కాని రామునికిఁ గాదు. శత్రుబలమును నుగ్గుసేయఁగల కాకుత్థ్సుండు లంకాపురమును శరములతో నిండించి, నన్నుఁ గొనిపోయెనేని, అది యాతనికిఁ దగియుండును. మహాధీరుఁడును, యుద్ధవీరుఁడునైన యారాముని విక్రమమున కేది తగునో, ఆకార్యమును నీవు సేయవలసినది."

అని యర్థగౌరవము గలిగియుండునట్లును, సకారణముగను, ప్రేమ యుక్తముగను సీతాదేవి చెప్పినమాటను విని, "ఓదేవీ! కాకుత్థ్సుఁడు వానరశ్రేష్ఠసమేతుఁడై వచ్చి, యుద్ధరంగమున శత్రువులను బరిమార్చి, నీశోకము మాన్పగలఁడు" అని శత్రుసంహారియగు హనుమంతుఁడు సీతాదేవి నూఱడించి, ప్రయాణము సేయఁదలఁచి, సీతాదేవికి నమస్కరించి, తనయేలికను దర్శనము చేయఁగోరినవాఁడై, యరిష్టమను పేరుగల పర్వతోత్తమము నెక్కెను. ఆయరిష్టపర్వత మున్నతములైన పద్మకములనెడు చెట్లతో నిండిన నల్లనివనములవరుసలతోఁ గూడినదియు, శిఖరములనడుమ మేఘములు వ్రేలుచుండుటచేత నుత్తరీయము వేసికొన్నట్లు లుండునదియు, శుభము లొసఁగెడి సూర్యకిరణములచే నను రాగముచేత నిద్ర లేపఁబడినదో యన్నట్లు లుండునదియు, నేత్రములో యన్నట్లులుండు పైకిలేచిన కావిఱాలతోఁ గూడినదియు, నీటిప్రవాహముల మంద్రధ్వనులుగల దగుటచేత నధ్యయనము చేయఁ బ్రారంభించినట్లుండునదియు, తిన్నని పలువిధములైన సెలయేళ్ల చప్పుడులు గలదగుటచే గానముచేయునదివోలె నుండునదియు, మిక్కిలి పొడవైన దేవదారువృక్షము లుండుటచేఁ బైకిఁ జేతులెత్తినదో యన్నట్లుండునదియు, చఱియలనుండి పడు నీటిధ్వనులచే నంతట నఱచుచున్నట్లుండునదియు, చెదరిపోవునట్టి శరత్కాలమేఘములు గలదగుటచే వణఁకుచున్న ట్లుండునదియు, గాలికి నెగురఁగొట్టఁబడిన వెదుళ్లును బొంగువెదుళ్లు నుండుటచేఁ గూయుచున్నట్లుండునదియు, భయంకరములైన విషవంతములగు సర్పములు బుసకొట్టుచుండుటచే వేఁడినిట్టూర్పులు విడుచునట్లుండునదియు, గుహలందు మంచు దట్టముగాఁ గ్రమ్మియుండుటచే నింద్రియముల బంధించి, సమాధియం దున్నట్లు తోఁపఁజేయునదియు, మేఘశకలములంబోలు తిప్పలతోఁగూడిన దగుటచే నన్ని వైపుల దారి నడచిపోవుచున్న దానింబోలెఁ గనఁబడునదియు, ఆకాశము నొఱయుచున్న కొనలుగల దగుటంజేసి, యాకాశమున నొడలు విఱుచుకొనునట్లుండునదియు, హనుమంతుని కాళ్లతాఁకుళ్లచేఁ బలువైపులకుఁ జెదరిన పెక్కుగుహాలుగల శిఖరములచే శోభిల్లునదియు, మఱ్ఱి, తాడి, అశ్వకర్ణము లను చెట్లతోను పలువిధములైన వెదుళ్లతోను గూడినదియు, వెడల్పుగాఁ బర్విన పూఁచిన తీఁగలచే నలంకరింపఁబడినదియు,

బహువిధములగు మృగములతోఁ గూడినదియు, కావిఱాలతోఁ గూడిన యూఁటలుగలదియు, తీఁగెలయు చెట్టులయు గుంపులతోఁ గూడినదియు, సింహములకు నునికిపట్టయన గుహలుగలదియు, పులులగుంపులతో నిండినదియు, పెక్కుసెలయేళ్లతోఁ గూడినదియు, ఱాలగుంపులచే కిష్టమైనదియు, మహర్షి, యక్షు, గంధర్వ, కిన్నర, పన్నగులు నివాసము చేయునదియు, తియ్యని దుంపలును, ఫలవృక్షములును గలదియునై యుండెను. హనుమంతుఁడు రామదర్శనమందలి యుత్సాహము తన్నుఁ బురికొల్పుచుండఁ గడువడితోఁ గూడినవాఁడై యట్టి రమ్యమైన యరిష్టపర్వతము నెక్కెను. ఆహనుమంతుని యడుగుల క్రిందఁబడిన యారమ్యమయిన యరిష్టపర్వతముయొక్క చరియలందలి ఱాళ్లు పొడిపొడియై గొప్ప చప్పుడుతోఁగూడ నలుదెసలకుఁ జెదరి పడిపోయెను.

శూరుఁడైన హనుమంతుఁడు పర్వతోత్తమ మెక్కి, ఆ లవణ సముద్రముయొక్క దక్షిణతీరమునుండి యుత్తరపుగట్టును బొందఁగోరినవాఁడై, తనదేహమును బెంచినవాఁడాయెను. హనుమంతుఁడు తనదేహము నట్లు పెంచి పర్వతముకొనకెక్కి, మత్స్యములు, పాములు మున్నగు జలజంతువులచే భయంకరమై యుండుసాగరమును జూచి, తాను వాయునందనుఁ డగుటచే నతనివలె వడిగాఁ బోవువాఁడై, యా యుప్పుకడలి దక్షిణపువైపునుండి యుత్తరపుగట్టునకుఁ బోవఁబూనెను. ఆ హనుమంతుఁ డెగురుటకై కాళ్లూనినందున నాయరిష్టపర్వతము తన యందు వసించు జీవరాసులతోడను, వడఁకుచున్న శిఖరములతోడను, పడుచున్న మ్రాఁకులతోడను నేలకుఁ గ్రుంగుచు గొప్పధ్వని గలిగించెను. ఆహనుమంతుని తొడలవేగముచే పుష్పములుగల వృక్షములన్నియు విఱిగి చిందరవందరలై, పిడుగు గడిచినవి వోలె నేలఁ గూలినవి. ఆపర్వతపు గుహలలోనుండు ఎక్కువ బలిమిగలవగు సింగములును పీడితములై యాకాశము బ్రద్దలగునట్లు గర్జించినవి. ఆపర్వతమునందలి విద్యాధర స్త్రీలు భయముచేఁ దాముమాఱయిన వస్త్రములును, భూషణములును గలవారలై పర్వతమునుండి యకస్మాత్తుగాఁ బైకెగిరిపోయిరి. మిటి మిఱుకుచున్న పొడుగుగుగలవియు, బలిమిగలవియు, మండుచున్న వాఁడి నాలుకలును, మహావిషమును గలవియునైన గొప్పపాములు తలయు

మెడయు నలిగి క్రిందఁబడి చుట్టలు చుట్టుకొనెను. కిన్నరులు, పన్నగులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు ఆపర్వతశ్రేష్ఠ మట్లు కదలుట చూచి, యాకాశమున కెగసిరి. పదియోజనముల వెడల్పును, ముప్పది యోజనముల యెత్తును గల యాయరిష్టపర్వతము బలిమిగల హను మంతునికాలియదుమునకు నలిగినదై యెత్తయిన వృక్షములుగల శిఖ రములతోఁ గూడఁ బాతాళమునకుఁ గ్రుంగి, భూమిమట్టమునకు సమ మాయెను. అప్పుడు హనుమంతుఁ డనాయాసముగా భీకరమయిన గొప్పయలలచే దరిదాఁకుచున్న యుప్పునీటి సముద్రమును దాఁటఁ బూనినవాఁడై యాకాశమున కెగిరెను.

57-వ సర్గము

హనుమంతుఁడు సముద్రము దాఁటివచ్చుట

చంద్రుఁడనెడి తెల్ల గలువగలదియు, సూర్యుఁడనెడి బెగ్గురుపక్షి గలదియు, తిష్యశ్రవణనక్షత్రములనెడి నీటికోళ్లతోఁ గూడినదియు, మేఘములనెడి పాచితీఁగెలు పచ్చికపడియలుం గలదియు, పునర్వసు నక్షత్ర మనెడి సొరచేపలు గలదియు, అంగారకుఁ డనెడి గొప్ప మొస లియు, ఐరావతం బనెడి గొప్పదీవియు, స్వాతియనెడి హంససంచారముం గలదియు, వాయుసమూహ మనెడి యలలు గలదియు, చంద్రకిరణము లనెడి చల్లని నీళ్లుగలదియు, యక్షులు, పన్నగులు, గంధర్వులు ననెడి వికసించిన కమలములు గలువలును గలదియునై, యపారమై రమ్యమ యిన యాకాశమను సముద్రమును, వాయువేగముగల హనుమంతుఁడు శ్రమము లేకయే సముద్రమును పొగయోడవలె దాఁటఁబూనెను.

గొప్పయాకారముతోఁ గూడినవాఁడై యాకాశమునఁ బోవు చుండు వాయుపుత్రుఁ డయిన హనుమంతుఁడు ఆకాశమును క్రింగు వాని కైవడియు, చంద్రుని నొఱచువానిపగిదియు, సూర్యమండలము తోను నక్షత్రమండలముతోను గూడ నాకాశమును గొనిపోవు నట్లును, మేఘములగుంపు నీచ్చుకొని పోవునట్లును పోవుచుం డెను. గొప్పమేఘములు హనుమంతుని కూడికవలనఁ దెల్లనివియు, నెఱ్ఱనివియు, నీలములైనవియు ; పసుపుపచ్చనివియు, ఆకుపచ్చనివి యునై ప్రకాశించెను. అట్టి మేఘమండల మధ్యమున హనుమం

తుఁడు మాటిమాటికిఁ జొఱఁబొఱుచు, మఱల వెలుపలికి వచ్చుచుఁ జంద్రునిమాడ్కిఁ దెలిసియుఁ దెలియకయు నుండెను. మఱియు శూరుఁడయిన హనుమంతుఁడు దెల్లనిబట్ట కట్టినవాఁడై పలుమబ్బులగుంపులందలి దారినిబోవుచు, మేఘమండలమునడుమఁ బోవునప్పుడు అదృశ్యుఁడును, మేఘములనుండి వెలువడినప్పుడు దృశ్యుఁడునై చంద్రునికైవడిఁ బ్రకాశించెను. ఇట్లు శౌర్యతేజములు గలవాఁడయిన హనుమంతుఁడు గరుడునివలె నాకాశమునఁ బోవుచు, మేఘములనడుమఁ జొచ్చుచు, వానినుండి వెలువడుచు, ఉరుమువలె బొబ్బవెట్టుచు రాక్షసవీరుల నందఱిని సంహరించి, తనపేరు వెల్లడిపఱచి, లంకాపురము నెల్ల చీకాకుపఱచి, రావణునికి వ్యసనము గలిగించి, భయంకరసేన నెల్ల నొప్పించి, సీతాదేవికి మ్రొక్కి, మఱలి సాగరమధ్యము నొంది, మైనాకపర్వతమును వీడ్కొని, యల్లెత్తాటినుండి విడువఁబడిన బాణముమాడ్కి వేగముతో వచ్చి మేఘసదృశమగు మహేంద్రపర్వతశ్రేష్ఠమును జూచి, సమీపమునకు వచ్చితి నన్న సంతసముతోఁ గిలకిలధ్వనిని జేయఁగా, ఆ కిలకిలధ్వని పడిదిక్కులందును నిండెను. చెలికాండ్రదర్శనోత్సాహము గలవాఁడై ఖగమార్గమున వచ్చు హనుమంతుఁడు పలుమాఱు సింహనాదము చేసెను. తోఁక యాడించెను; ఆ గొప్పనాదమునకు సూర్యమండలమును ఆకాశమును బ్రద్దలగునట్లు తోఁచెను.

హనుమంతుఁడు వచ్చునప్పుడు సముద్రపు టుత్తరతీరమునఁ గూర్చుండియుండిన శూరులైన బలవంతులగు వానరులందఱు గాలిచేఁ ద్రోయఁబడుచున్న మేఘము యొక్క గర్జనమువం బోలు గర్జనమును ఊరువేగమును విన్నవారై, తమమిత్రునిఁ జూచుటయం దాశతోనుండిరి.

వానరులలో గొప్పవాఁడగు జాంబవంతుఁడు మనస్సునందు మిక్కిలి యుప్పొంగి, తక్కిన వానరుల నందఱను జూచి, "హనుమంతుఁడు తప్పక కార్యము సాధించుకొని వచ్చెను. దీనికి సందియము లేదు. అట్లితఁడు కార్యమును సాధించుకొనక వచ్చియుండునేని, ఇవ్విధముగా నాదము చేసియుండఁడు" అని చెప్పెను.

ఆవానరులందఱు ఆమహోత్సుని బాహువేగమును, తొడల వేగమును, విజయనాదమును విని యానందముచే నచ్చటచ్చట గంతులు వైచిరి. హనుమంతునిఁ జూడఁగోరి చెట్లకొనలనుండి పైచెట్లకొనలకును,

పర్వతశిఖరములనుండి పై పర్వతశిఖరములకును నెగిరిదుముకుచు నందఱు గూడిరి. చెట్లకొనలందలి కొమ్మలను బట్టుకొని, వాని తొమ్మలను బట్టలను బోలె విసరిరి. గాలి కొండలగుహలందు నిండినదై ధ్వనించుచందమున, బల్మిగల హనుమానుఁడు సమీపమునకు వచ్చి గొప్పబొబ్బరింత పెట్టెను. మబ్బులగుంపు మాడ్కి వచ్చుచున్న యా హనుమంతునిఁ జూచి, వానరులందఱు చేతులు జోడించికొని నిలఁబడిరి. అటుతర్వాతఁ బర్వతము మాడ్కి గొప్ప యాకారముగలవాఁడైన హనుమంతుఁడు సంతసముచే నిండినవాఁడై పెక్కు వృక్షములతో దట్టమయిన యా మహేంద్ర పర్వతశిఖరమునందు రమ్యమైన సెలయేటిపట్టున తొక్కలు దెగిన పర్వతము మాడ్కి నాకాశమునుండి పడెను.

అంత వానరోత్తము లందఱు డెందములం దుప్పొంగి, యా మహోత్సుండైన హనుమంతు ననామయముగ వచ్చినవానినిఁ జుట్టుకొని, యెక్కువ ప్రీతి నొందినవారలై, కందమూలఫలములు దెచ్చి మర్యాద చేసిరి.

ఆ హనుమంతుఁడును జాంబవంతుఁడు మొదలగు పెద్దల కెల్లను, యువరాజగు నంగదునికి నమస్కరించి, తానును జాంబవదంగదుల చేతను, తక్కిన వానరులచేతను మర్యాదలువడసినవాఁడై, "చూచితిని సీతాదేవి" నని సంగ్రహముగాఁజెప్పెను. అట్లు చెప్పి, హనుమంతుఁడు కార్యసిద్ధిచే సంతుష్టుఁడై యంగదుని చేయిపట్టుకొని, మనోహరమైన యొక మహేంద్రపర్వతప్రదేశమునఁ గూర్చుండి వానరశ్రేష్ఠులందఱు వినునట్లు, "పతివ్రతయగు సీతాదేవి లంకాపురమున నశోకవనమున నుండఁగాఁ జూచితిని. భీతిని గలుగఁజేయు రాక్షసు లామెకుఁ గావలి యుండిరి. ఆమె ఒంటిజడఁ దాల్చి, రామునిదర్శనమందే యాసక్తి గల్గినదౌటచే నుపవాసములు చేయుచున్నందున డస్సినదియు, జడలు దాల్చినదియు, మాలిన్యము గలదియు, భర్తృవియోగశోకముచేఁ జిక్కినదియునై యుండెను.

వానరు లందఱు గొప్పయర్థము గలదియు, అమృతముఁ బోలినదియునైన "చూచితిని" అనుమాట వినఁగానే మోదము నందిరి. వానరులలోఁ గొందఱు సింహనాదము గావించిరి. కొందఱు అవ్యక్త నాదముజేసిరి. కొందఱు గర్జన చేసిరి. కొందఱు కిలకిలధ్వనిని గావించిరి.

కొందఱు ప్రతిగర్జనము చేసిరి. కొందఱు లావై నిడుపు గలిగి చక్కనై యున్న తమతోఁకలను బైకెత్తి నేలమీఁద బాదిరి. మఱికొందఱు వానరులు సంతసముతోఁ బర్వతశిఖరములనుండి యెగిరిదుమికి యేనుగుం బోలెడి యా హనుమంతునిఁ దడవిరి.

అనంతరము సీతను జూచితి నని చెప్పి, వానరుల మధ్యమునఁ గూర్చుండియున్న హనుమంతునిఁ గాంచి అంగదుఁడు "ఓ వానరోత్తమా! బలవీర్యములందు నీకు సమానుఁ డెవ్వఁడున్నాఁడు? నీవొక్కఁడవే సముద్రమును దాఁటి సీతను జూచి మఱలి వచ్చితివి. ఆహా! నీ స్వామిభక్తి యెంతటిది! నీధైర్య మెంతటిది! నీమగఁటిమి యెంతటిది! దైవానుగ్రహముచే నీవు పతివ్రత యని పేరెన్నిక గన్న సీతాదేవిని గాంచితివి. దైవానుగ్రహమున శ్రీరాముఁడును సీతా విరహజనితమైన శోకమును విడువఁగలఁడు." అని హనుమంతుని శ్లాఘించెను. తరువాత నంగదుఁడును జాంబవంతుఁడును, నడుమఁ గూర్చుండియుండఁగా, తక్కిన వానరు లందఱును హనుమంతుఁడు సముద్రము దాఁటుట, లంకాపురము సొచ్చుట, సీతాదేవిని గాంచుట మొదలగు సంగతులు వినఁగోరి, యాతని మోముపైపుననే మోరలెత్తి చూచుచు, దోసిళ్లుకట్టికొని, చుట్టునుండు బండలపైఁ గూర్చుండిరి. వానరోత్తములచేఁ బరివేష్టితుఁడయిన యా యంగదుఁ డప్పుడు దేవతలచేఁ బరివృతుఁడైన వేల్పుటేనిమాడ్కిఁ బ్రకాశించుచుండెను. కీర్తిమంతుండగు హనుమంతుఁడును, బొగడ్తపురులను దాల్చిన ప్రసిద్ధుఁడైన యంగదుఁడును వానరగణముతోఁ గూర్చుండియుండఁగా నా పర్వతశిఖరము దేదీప్యమానమై యుండెను.

౬౩-వ సర్గము (63rd Sarga)

◆ హనుమంతుఁడు తనవృత్తాంతము దెల్పుట ◆

తర్వాత నామహాబలులగు హనుమంతుఁడు మొదలుగాఁగల వానరోత్తములందఱు మహేంద్రపర్వతశిఖరమున నెక్కువ యానందముతో ముచ్చటలాడుచుండఁగా, జాంబవంతుఁడు సంతోషము నొందినవాఁడై, తనయందుఁ బ్రేమగలవాఁడయిన వాయునందనుఁడగు హనుమంతునిఁ జూచి, "నీ వెట్లు లంకయందు సీతాదేవిని గాంచితివి?

ఆమె యచ్చట నెవ్విధమున నున్నది? క్రూరపుఁబనులు సేయువాఁడగు ఆరావణుఁడా దేవియం దెట్టినడత చూపుచున్నాఁడు? ఓ గొప్పవాన రుఁడా! యీ సంగతి యెల్ల మా కున్నది యున్నట్లు చెప్పాము. నీవలన నీ సంగతి విన్నవారమై యీవల చేయవలసిన కార్యముగూర్చి యాలోచింతము. మన మచ్చటికిఁ బోయినప్పు డేమి సంగతి రామునికడ విన్నవింప వచ్చును? ఏది దాఁప నగును? బుద్ధిమం తుఁడా! అవి యెల్ల మాకు వివరించి చెప్పుము" అని యడుగఁగా, హనుమంతుఁడు సంతోషముచే మేను గగుర్పా టొందినవాఁడై, సీతా దేవికి శిరముతో మ్రొక్కి, యీ జాంబవదాదులతో నిట్లు తన సముద్ర తరణాది వృత్తాంతము చెప్పఁదొడఁగెను:

నేను సముద్రముయొక్క దక్షిణపుగట్టును జేరుకోరికతో నేమఱు పాటు చెందక మీయెదుటనే కదా మహేంద్రపర్వతమునుండి యీ కా శమున కెగిరితిని. నేను పోవుచుండఁగా నా కొక ఘోరరూపము విఘ్నముమాడ్కి నడ్డపడెను. బంగారు శిఖరములు గలదై మిగుల మనోహరమైన యొక పర్వతము నా దారి కడ్డముగా నిలిచి, నాగమన వేగము నాఁపఁగా, అది నన్నాఁపవచ్చిన దని యెంచి, కనకశృంగము గల పర్వతోత్తమమును దాఁకి క్రిందఁ ద్రోయవలసినదని యెంచి, నాతోఁకతో నా పర్వతము నొక దెబ్బ గొట్టఁగా, సూర్యునిఁబోలె వెలిఁగెడి యీపర్వతశిఖరము వేయితునుకలై చిందరవందరలయి చెదరి పోయెను. అట్టి నా మహోత్సాహమును జూచి "ఓరినాయనా" యని నామనస్సున కానందము గలిగించువానిమాడ్కి నింపుగాఁ బిలిచి యీ పర్వతుఁ డిట్లనియె:

"ఓ హనుమంతుఁడా! నేను నీకుఁ బినతండ్రిని. నీతండ్రికిఁ జెలికాఁడను. నావేరు మైనాకుఁ డందురు. నేను సముద్రములోపల నుండువాఁడను. పుత్రుఁడా! తొల్లి గొప్పపర్వతముల కెల్ల రెక్క లుండెను. అవి రెక్కలు గల వగుటచే దమ యిచ్చచొప్పునఁ దిరు గుచు, వాలినచోట నుండు నూళ్లను, జనులను బాధించుచుండినవి. అప్పుడు దేవేంద్రుఁడు పర్వతముల చెడ్డనడనడిం జూచి, కడు నలిగిన వాఁడై వజ్రాయుధముతో వేలకొలఁది పర్వతముల రెక్కలను ఖండిం చెను. అట్లు దేవేంద్రుఁడు పర్వతముల రెక్కలు నఱికుచు వచ్చు

నప్పుడు పుణ్యాత్ముఁడయిన నీ తండ్రి నన్నుఁ గొనివచ్చి యీ మహా సముద్రమునఁ ద్రోసెను. కావున నీ తండ్రివలన నేను దప్పించుకొంటిని. ఓశత్రుసంహారీ! రాముఁడు ధర్మపోషకులలో నుత్తముఁడు. మహేంద్ర సమవిక్రముఁడు. అట్టి రామునికి నేనును సాహాయ్యము చేయవల యును. కావున నీవు నాయెడఁ గొంత తడవు విశ్రమింపుము" అని మైనాకుఁడు చెప్పఁగా, నేనును పని తొందర యెఱిఁగించి, యీ మహా త్ముని చే నుత్తరవు గైకొన్నవాఁడనై తఱలితిని. ఆ మైనాకుఁడును గొప్ప మానవశరీరముతోను శైలరూపముతోను నంతర్ధానము నొం దెను. నేనును ఎక్కువ వేగముపూని, మిగిలినదారిపట్టి చాలదవ్వు పోయితిని.

అప్పుడు నేను సముద్రమధ్యమున నాగముల తల్లి యగు సుర సను జూచితిని. ఆ దేవి నన్నుఁ జూచి, "ఓ వానరోత్తమా! దేవతలు నిన్ను నా కాహారముగా నియమించిరి. కావున నేను నిన్ను భక్షింపఁ గోరెదను. నీవు బహుకాలమునకు మునుపే నా కాహారముగా నేర్పడి తివి" అని చెప్పఁగా, నేనును చేతులు జోడించుకొని, యడఁకువతో నిలఁబడి, మోమున విన్నఁదనము దోఁప నా సురసను జూచి "కాంతి మంతుఁడయిన దశరథపుత్త్రుఁడగు రాముఁడు తమ్మునితోను, భార్య యగు సీతతోను గూడి దండకావనమునకు వచ్చెను. దురాత్ముఁడగు రావణుఁడు ఆ రాముని దేవి యగు సీత నపహరించెను. ఆ రాఘవుని యానతినిబట్టి నేను సీతాదేవికడకుఁ బోవుచున్నాఁడను. నీవా రాముని పాలనలోని దేశమందున్నావు. నీవును అతనికి సహాయపడవలసినది. అట్లుచేయనంటివా, నేను సీతాదేవినిఁ జూచి వచ్చి యాసంగతి రాము నికిఁ దెలిపి, పిమ్మటవచ్చి నీనోటఁబడెదను. సత్య ప్రతిజ్ఞ చేసెదను" అని నేను పలికితిని. ఆ కామరూపిణియగు సురస నేను చెప్పిన మాటను సహింపకయ; "ఎవ్వఁడు గాని నన్ను మీఱి పోఁజాలఁడు. ఇది నాకు బ్రహ్మదేవుఁ డొసఁగిన వరము" అని చెప్పి, తననోటిని పదియోజనముల వెడలుపుగలుగునట్లు తెఱచెను. నేను నాదేహమును పదియోజనముల వెడల్పుగలుగునట్లు పెంచితిని. మఱల నాసురస నా కాకారమునకుఁ దగినట్లుగా తననోటిని దెఱచుటచూచి, నేను క్షణములోపల వాఁడేమును గుఱుచపఱచి బొటనవ్రేలియంతటివాఁడనై, యా సురస నోటి

RAMA MEMORIAL LIBRARY ACC. No.

లోపల దూరి మఱు క్షణములోపల బయటికి వచ్చితిని. అంత సురస స్వస్వరూపము దాల్చి నాయెదుట నిలఁబడి "సాధువయిన యోహరి శ్రేష్ఠుఁడా! నీకు కార్యసిద్ధి యగును. సుఖముగాఁ బోయి రమ్ము. సీతాదేవిని మహోత్సుఁడగు రాముని తోఁ జేర్పుము. నిడుపచేతులుగల యో వానరశ్రేష్ఠుఁడా! నిన్నుఁ జూచుటచే సంతోషమందితిని. నీవు సుఖముగా నుండుము" అని చెప్పి యంతర్ధానము నొందెను. నా యీ వింతకార్యమును జూచి, సకలభూతములును బాగు బాగని కొని యాడిరి.

తర్వాత నేను గరుడునిమాడ్కి విశాలమైన యాకాశమున కెగిరి పోవుచుంటిని. అట్లు పోవుచుండఁగా నానీడ నేదియో లాగి పట్టెను. అచ్చట నేమియు నాకంటికిఁ గనఁబడలేదు. నాగతివేగము తగ్గుటచేఁ బదిదిక్కులు చూడఁగా, నాగమనము నడ్డగించినది యేదియో కనఁబడకుండెను. అప్పుడు "ఇది యేమి వింతగా నున్నది! ఉన్నట్టుండి నాగమనమున కిట్టి యాటంకము గలిగె" నని కొంత తడవు చింతించి, క్రిందివైపు చూడఁగా, సముద్రమున నీటిపైన వెలికిలఁ బరుండియున్న భీకరయైన రాక్షస స్త్రీయొకతె యగపడె. అంత నారాక్షసి యట్టహాసము చేసి, గొప్ప బొబ్బరింత పెట్టి, ధైర్యముతోఁ గూడి, తత్తరపాటు మాని, "ఓ గొప్పమేనివాఁడా! యెక్కడికిఁ బోవుచున్నావు? నేను బహుదినములుగ నాహారము లేక యాఁకలిచే డస్సియున్నాను. నీవు నాకు మంచియాహారమవై నా యాఁకలిని దీర్పుము" అని నిష్ఠుర ముగాఁ బలికెను. అట్లే కానిమ్మని యా రాక్షసిమాట కొప్పు కొని, దానినోటివెడల్పుకంటె నెచ్చు వెడల్పుగలుగునట్లు నాదేహ మును బెంచితిని. అదియు నన్ను మ్రింగుటకై తననోటిని వెడ ల్పుగాఁ బెంచెను. నేను కోరిన రూపము దాల్పఁగలవాఁడనని కాని, నే నింత గొప్ప రూపము గార్యార్థమై యెత్తి యున్నానని కాని యది యెఱుఁగదయ్యె. వెంటనే నేను నాదేహమును నిమిషము లోపల సంకోచపఱచి, దానినోటిలోపలఁ బ్రవేశించి దానిహృదయము నెత్తికొని పైకెగిరితిని. అట్లెగిరి, దానిఁ బొమ్మును జీల్చి వెలుపలికి రాఁగా, పర్వతమువఁ బోలినయారాక్షసి చేతులు వ్రేలవైచికొని సముద్రమునఁ బడెను. అప్పు డంతరిక్ష సంచారులయిన సిద్ధచారణులు మొదలగువారు

"క్రూరరాలైన సింహికను హనుమంతుడు శీఘ్రముగా వధించె"నని సంతోషముతోఁ జెప్పుకొనుచుండిరి.

నే నాసింహికను జంపి, యాప్రాణాంతకమైన కార్యమును దలఁచుకొని, బహుదూరమేగి, పర్వతములచే నలంకృతమైయున్న లంకా పురప్రాంతపుసముద్రపు దక్షిణతీరముఁ జేరితిని. సూర్యుఁడస్తమించు వఱకు నచ్చట నొక పర్వతమున నుండి ప్రొద్దు గూఁకినతోడనే సర్వ రాక్షసులకు నివాసస్థలమైన లంకాపురమును భీకరపరాక్రములగు రక్షక భటులయిన రాక్షసులకుఁ దెలియకుండఁ బ్రవేశించితిని. అప్పుడు ప్రలయకాలపు మబ్బువలె గొప్పరూపము గలదైన యొక రాక్షసభామ యట్టహాసముచేయుచు నాముందటికి వచ్చి నిలఁబడెను. మండుచున్న అగ్నిహోత్రునివలె వెలుఁగు శిరోజములు గలదగుచు, నన్నుఁ జంపఁ గోరియున్న యాభీకరరాక్షసిని యెడమచేతి పిడికిలితో నొక గ్రుద్దు గ్రుద్ది క్రిందఁద్రోచి, ప్రదోషకాలమునఁ బట్టణమునఁ బ్రవేశించుచుండ, అప్పు డారాక్షసి, నాకు వెఱచినదై, "ఓవానరా! నేను లంకాపురమను. నన్ను నీవు పరాక్రమముచే గెలిచితివి కావున, ఈ లంకాపురమునందలి రాక్షసుల నందఱి నడ్డు లేకుండ గెల్వఁ గలవు." అని చెప్పెను.

అంత, లంకాపురమున రాత్రియంతయు రావణునియంతఃపుర మున వెదకియు, సీతాదేవిని గాంచనైతిని. నే నట్లు సీతాదేవిని గాంచక, శోకసముద్రమును బొంది దానికి దరిగానక, మఱలఁ జూతునని వెదక నారంభించి, కడునెత్తయిన బంగారు ప్రాకారముతోఁ గూడిన యుద్యాన వనమొక్కటి చూచితిని. ఆ యుద్యాన వనప్రాకారముమీఁది కెగిరి దుమికి, ఆవనమునందున్న పెక్కువృక్షములను జూచితిని. ఆవనము నడుమ గొప్ప శింశుపావృక్షమొక్కటి కలదు. ఆ చెట్టుక్రిందఁ జూడఁగా బంగారుమయమయిన యరఁటితోఁట గనఁబడెను. పతివ్రతయు, తమ్మి రేకులంబోలు కన్నులు గలదియు, శ్యామవర్ణయు, ఉపవాసములచే బెండుపాఱిన మోముతోఁ గూడినదియు, ఆరావణుం డపహరించుకొని వచ్చినప్పుడు ధరించియున్న యొంటిచీరనే కట్టుకొన్నదియు, తలవెండ్రు కలు నిండుగా దుమ్ముచేఁ గ్రమ్మఁబడినదియు, దుఃఖసంతాపముచేఁ జిక్కిన యవయవములతోఁ గూడినదియు, భర్తయొక్క హితమునే కోరు నదియు నైన సీతాదేవి మాంసరక్తములం దాశగల యాఁడుపులులచేఁ

జుట్టఁబడిన యాఁడుజింక చందమున, అసహ్యకూపములుగల క్రూర రాక్షసాంగనలచేఁ గావలికాఁచబడుచు, ఆ శింశుపావృక్షము చేరువ గూర్చుండియుండఁగాఁ జూచితిని. ఆసీతాదేవి తన్ను రాక్షసాంగనలు చుట్టు గూర్చుండి మాటిమాటికి బెదరింపుచుండఁగా, రావణుఁడు తన్నుఁ బలువిధముల వేఁడికొన్నను, వానిని గోరక, రాక్షసస్త్రీలు పెట్టెడి కాఱి యల నోర్వఁజాలక, ఒంటి జడనుదాల్చి, భర్తనుగూర్చియే చింతించుచు నేలమీఁదఁ బరుండి, శిశిరర్తువునంచలి తామరతీఁగమాడ్కి నింపుదఁగి నదై, మరణమునకు సిద్ధురాలై యుండఁగా, నే నట్టిస్థితిలోనున్న యా దేవిఁగాంచి, యా శింశుపావృక్షముననే దాఁగి యుంటిని. ఆ సమయ మున రావణుని యింటినుండి మొలనూళ్లయుఁ గాలియందెలయుఁ జప్పుడుతోఁ గూడిన యొకకోలాహలమును వింటిని. ఆ చప్పుడు విని నేను మిక్కిలి యులికిపడినవాఁడనై, నారూపమును విడిచి, యొకపక్షి వలెఁ జిన్నిరూపుదాల్చి దట్టమైన యాకులుగల యాశింశుపావృక్షము యొక్క కొమ్మయందే దాగియుంటిని.

తర్వాత మహాబలవంతుఁడగు రావణుఁడు తనభార్యలఁ దోడ్కొని, యాసీతాదేవి యున్నచోటి కేగుదెంచెను. ఆసీతాదేవి ఆవచ్చెడు గొప్పబలిమికాఁడయిన రాక్షసునిఁజూచి, తొడలను ముడుచు కొని, పీనస్తనములను జేతులతోఁ గప్పుకొని, యొక్కువ భయము మనమునఁ దోఁప నులికిపడి యిటటు చూచుచు, ఎవరిని శరణు గానక వణఁకుచు జాలిమాపఁదగినదై కడువ్యసనముతోఁగూడి తలవంచియుండె. అట్టియా సీతాదేవినిజూచి, రావణుఁడు తానును తలవంచి నమస్కరించి, "ఓదేవీ! నన్ను దయతోఁ జూడు"మనియు, ఓగర్వముపట్టినదానా! ఇఁక రెండు నెలలలోపల నీ వహంకారముచే నన్నుఁ గోరవేని, నీరక్తమును గుటగుట త్రాగుదు"ననియు నయభయములచే బెదరించెను.

సీతాదేవియు చెమతలంపుగలవాఁడయిన రావణునిమాటను విని, మిక్కిలి యాగ్రహముపూనినదై, హితవాక్యముల నిట్లనెను: "ఓరాక్షసాధమా! ఇక్ష్వాకు వంశమునకు నాయకుఁడయిన దశరథమహా రాజునకుఁ గోడలును, ఎక్కువ ప్రతాపముగల రామునికిభార్యను నైన నన్ను నీ విట్లనరాని మాటల ననుచున్నాఁడవే? నీనాలుక తునిగి యేల క్రిందఁబడక యున్నది? ఓరి కులహీనుఁడా! నాపెనిమిటి దగ్గఱలేని

యప్పుడు నీశౌర్యము చూపుచున్నాఁడవు. ఓరీ పాపాత్ముఁడా! నీవు నామగఁడు లేనియప్పుడు నన్ను దొంగవలె నెత్తికొని పాఱివచ్చితివే! ఇప్పుడేల బింకములు కొట్టుచున్నావు? ఓరీ! నీవు రామునితో సాటి యగుదువే? రాఘవుఁడు యజ్ఞములందుఁ బూజింపఁదగినవాఁడు. సత్యము పలుకువాఁడు. యుద్ధములందు సామర్థ్యము చూపువాఁడు. అట్టి రామునికి నీ వే విషయమున సాటియగుదువు? నీ వతనిని కొలుచుట కైనను దగవు." అని నిష్ఠూరపు మాటలాడఁగా, పంక్తికంధరుఁడు కాటియందుంచిన నిప్పుకైవడిఁ గోపముచే మండిపడినవాఁడై గుండ్రనైన తనగ్రుడ్లను ద్రిప్పి, తనకుడిచేతి పిడికిటిఁ బైకెత్తిపట్టి సీతాదేవిని జంపఁ బూనెను. అప్పుడు స్త్రీలందఱు గగ్గోలు సేసిరి. దురాత్ముఁడయిన రావణునితోఁగూడవచ్చిన యాతని భార్యలలోఁ బెద్దదైన మండోదరియను నామె మదనాతురుఁడయిన రావణుని నివారించి, "దేవేంద్రునిఁబోలు మగఁటిమిగల యోనాథా! యీసీతతో నేమి సుఖమనుభవింతువు? నీకడ దేవగంధర్వయక్షకిన్నర కన్యకలు పెక్కండ్రున్నారు. వారితో రమింపుము" అని సమాధానపఱచెను. అంత నందఱు రాక్షసకాంతలును రావణుని నిమ్మళపఱచి, స్వగృహమునకుఁ దోడ్కొనిపోయిరి. దశగ్రీవుఁడు వెడలిపోయినవెంటనే యాసీతాదేవికిఁ గావలియున్న రాక్షసకాంత లందఱు కడునిష్ఠూరంపు బెదరుమాటలతో నామెను నిందించిరి. ఆసీతాదేవి వారిమాటలను దృణప్రాయముగా నెంచెను. వారిమాటలును, బెదరింపులును ఆమెకడ నిరుపయోగము లాయెను. తర్వాత నారాక్షసులందఱు దమమాటలు మొదలగునవి యామెకడ సాగకుండుటఁ జూచి, యుత్సాహము మాని, యాదేవియొక్క మనోనిశ్చయమును రావణుని కెఱిఁగించి, తమవాగ్బాణము లామెయందు దూఱవిచేఁ బూనికిలేనివారై, యామెచుట్టును పరుండి నిద్రించిరి. అందఱు నిద్రించుచుండఁగా, తన భర్తృహితమునే కోరునట్టి సీతాదేవి తన దురవస్థను గూర్చి మిక్కిలి వగచి కన్నీరు విడిచెను.

ఆ సమయమున ఆరాక్షసులనడుమ నున్న త్రిజటయను నొక రాక్షసి, రాక్షసకాంతల నుద్దేశించి యిట్లనియె: "ఓ చెలులారా! మీరు నన్నుఁ దినుఁడు. సీత నశింపదు. జనక రాజపుత్రికయు, దశరథునికిఁ గోడలును, రాముని దేవియు నైన సీతాదేవి నేమియు ననకుఁడు. నే

నిప్పుడే భయంకరమై మేనికి గగ్గురుపాటు పుట్టించునట్టి దైన యొక కల గంటిని. అది రాక్షసులకు చేటును, ఈ సీతయొక్క భర్తకు జయమును గలుగునని సూచించుచున్నది. మన మిప్పుడు జానకిని వేడుకొందము. ఆమె యనుగ్రహించు నేని, ఈ రాక్షసులసమూహమును రాఘవుని బారినుండి తప్పించి కాపాడఁగలదు. ఇదే యిప్పుడు నాకు యుక్తముగా దోఁచుచున్నది. నే నిప్పు డే సీతాదేవిం గూర్చి యిట్టి స్వప్నము గాంచి తినో ఆసీతాదేవి సకలదుఃఖములఁ బాసి యుత్తమసుఖము నొందగల జనకాత్మజయగు సీత ప్రణతులగు వారియెడఁ బ్రసన్నురాలు కాగలదు." అని చెప్పఁగా, సీత తనమగని గెల్పువార్త యాలకించుటచే మనమున మోదమంది, యీమాట వాస్తవ మగునేని, మిమ్ము నంబఱిఁ గాపాడెద నని చెప్పెను.

నేనును ఆసీతాదేవియొక్క యట్టి క్రూరదశను జూచి, మనమున నెమ్మది నొందక, "ఈజానకితో మాటాడుట కేది యుపాయమని యోచించితిని. అట్లు యోచించి యొకవిధమున నిర్ణయించుకొని యిక్ష్వాకువంశమును మొదలిడి కొంతవఱకుఁ గీర్తించితిని. రాజర్షులెల్లరు మెచ్చునట్టి నేను జెప్పిన మాటలను విని, సీతాదేవి కండ్లనీరు దృష్టిని గప్పఁగా, "ఓ వానరశ్రేష్ఠుఁడా! నీ వెవఁడవు? నీ వెవనినిమిత్త మిచ్చటికి వచ్చినాఁడవు? ఎట్లు వచ్చినాఁడవు? నీకు రాముని తోఁ జెలిమి యెట్టిది? ఇది యెల్ల నాకు నెఱిఁగింపవలయు" నని యడుగఁగా, నేనును ఆ దేవి కిట్లని చెప్పితిని.

"ఓ దేవీ! నీమగఁ డగు రామునికి సహాయుఁడును, భయం కరమైన పరాక్రమము గలవాఁడును, బలవంతుఁడును, శత్రువులను సంహరించువాఁడు నైన సుగ్రీవుఁ డను వానరేంద్రుఁ డొక్కఁడు గలఁడు. నే నా సుగ్రీవుని బంటను. నన్ను హనుమంతుఁ డందురు. సత్కార్యాచరణపరాయణుఁడగు నీప్రియుఁడగు రాముఁడు నన్ను నీ కడకు దూతనుగాఁ బంపఁగా, నేను వచ్చినాఁడను. ఓకీర్తిమతీ! యీ ముద్దుటుంగరము పురుషశ్రేష్ఠుఁడగు దశరథపుత్రుఁడైన శ్రీరాముఁడు నీ కానవాలుగా నిచ్చి పంపెను. ఓదేవీ! నేను నీవు చెప్పిన పని యెల్లఁ జేయఁగలను. నే నేమి చేయవలెను చెప్పుము. నిన్నిప్పుడే యీ రామ లక్ష్మణులకడకుఁ గొనిపోయెదను. ఏమిబదులు చెప్పెద" వని యడిగితిని.

దాని కామె "రాఘవుఁడు రావణుని సంహరించియె నన్నుఁ గొనిపోవును గాక!" అని చెప్పెను. అంత నేనును పతివ్రతయు, పూజ్యురాలునైన సీతాదేవికి నమస్కరించి, "దేవీ! రామునిమనస్సునకు సంతోషము గలిగించు ఆనవా లొక్కటి యొసఁగుము" అని యడిగితిని. అంతట సీతాదేవి నాచేత నొకశిరోరత్నము నొసఁగి, "ఓ హనుమంతుఁడా! నీ వీ రత్నమునుగొంపోయి శ్రీరాములచేతనిమ్ము. ఇది చూడఁగానే యాతఁడు నిన్ను గారవించును" అని చెప్పి, యంతియకాక మహావ్యసనమునొందిన దయి కొంత వర్తమానమును చెప్పెను. తర్వాత ఆమె చెప్పినసంగతి మనస్సున నిల్పుకొన్నవాఁడనై, సీతాసందర్శనజనిత సంతోషము మన మున నతిశయిల్ల నా సీతాదేవికిఁ బ్రణమిల్లి ప్రదక్షిణము గావించి ప్రయాణసన్నాహము చేయుచుండగా, సీతాదేవి వెండియు నన్నుద్దేశించి, "ఓ హనుమంతుఁడా! రామలక్ష్మణులకు నా సంగతి యెఱిఁగించి, వారు సుగ్రీవునితోఁ గూడ త్వరగావచ్చునట్లు చేయవలసినది. నే నిఁక రెండునెలలు మాత్రమే ప్రాణములతో నుందును. పిమ్మట నన్నీ క్రూరుఁడగు రావణుఁడు ప్రాణములతో నుంపఁడు. ఈలోపల రాముఁడు రాఁడేని నేను దిక్కులేనిదానివలె నీ రావణునిచేతఁ జిక్కి ప్రాణముల విడువవలసియుండును. కావున వేగిరముగా వారు వచ్చునట్లు చేయవలసినది" యని మాటిమాటికి నాతోఁ జెప్పెను.

ఆ సీతాదేవి చెప్పిన మాటలను వినఁగా, నాకు రాక్షసులపై నాగ్రహము హెచ్చెను. తర్వాత నేను జేయవలసిన పని యేమని యాలోచించితిని. నేను పర్వతముతో సమాన మగునట్లు నాదేహమును బెంచి, రాక్షసులతోఁ బోరు సేయఁగోరి యశోకవనమెల్ల పాడుచేసితిని. ఆ వనమందలి చెట్లు విఱుగఁగా నచ్చట నున్న మృగములును, పక్షులును భయపడి నలుదెసలకుఁ బాఱఁజొచ్చెను. ఆ యల్లకల్లోలమును విని యచ్చట నిద్రించుచున్న వికృతంపు మోములు గలవారగు రాక్షస స్త్రీలందఱు మేలొక్కని, నన్నుఁ జూచి, దిగులుచే నంద ఱొక్కటిగాఁ గూడి రావణునికడ కేగి, "మహాప్రభూ! ఎవఁడో దుష్టుఁడగు వానరుఁ డొక్కఁడు అశోకవనముఁ బాడుచేయుచున్నాఁడు. ఆతనికి నీబల శౌర్యము లిట్టి వని తెలియ ట్లున్నది. రాజేంద్రా! నీకుఁ జెఱుపు సేసిన యా మదించిన వానరుని వధింపఁ జాలినవారిని బంపుఁ" డని విన్నవించిరి.

ఆ రాక్షసస్త్రీలవాక్యములను విని, రాక్షసరాజగు రావణుఁడు శత్రువులచే గెల్వ నలవికానివారును, తన యిష్టముప్రకారము నడచువారునైన కింకరు లనెడి యెనుబదివేలమంది రాక్షసులను నా మీఁదికి యుద్ధమునకై పంపెను. ఆ రాక్షసు లందఱు శూలములు రోఁకళ్ళు మొదలగు నాయుధములఁ గైకొని నామీఁదికి రాఁగా, వారి నందఱిని నే నయ్యశోకవనద్వారమునందలి గుదియతో బరిమార్చితిని. నేను సంహరింపఁగా మిగిలిన రాక్షసులు రావణాసునికడకుఁ బోయి, "ఓ ప్రభూ! కింకరు లందఱు మడిసి" రని చెప్పిరి. వారట్లు చెప్పఁబోవఁగా, నాకును ఇంకఁ గొన్ని పాడుచేయ వలసినదని యొక తలంపు పుట్టెను. ఆనగర మధ్యమునఁ బురమున కెల్ల నలంకార భూతమైయున్న నగరుమీది కెక్కి, దానిని బాడుసేసితిని. రావణుఁడును, కింకరులు మడిసి రన్న వార్త విన్న వెంటనే, భయంకరరూపులును, శత్రువులకు భయంకరులునైన రాక్షసులను దోడిచ్చి, జంబుమాలి యను రాక్షసునిఁ బంపెను. చతురంగబలముతో వచ్చిన యుద్ధవీరుఁడైన యా జంబుమాలిని గదు భయంకరమైన యాగుదియతోనే కూల్చితిని. జంబుమాలియుఁ గూలె నన్న వార్త వినఁగానే రావణుఁడు బలవంతులైన మంత్రిపుత్రుల నేడ్గురను చతురంగబలముతోఁ బంపెను. వారినిగూడ గుదియతోఁ బరిమార్చితిని. వారును మడిసి రన్న వార్త విని యుద్ధమునఁ బరాక్రమము చూపువారును, శూరులునునైన యేవురు సేనానాయకులను బంపెను. నేనును వారి నందఱిని వారిసేనలను బిలుకుమార్చితిని. రావణుఁడు సేనాధిపు లేవురు సైతము మడిసి రన్న వార్తను విన్న వాఁడై పెక్కురు రాక్షసులను దోడిచ్చి మహాబలుఁడైన యక్షకుమారునిఁ బంపెను. ఆ యుద్ధవీరుఁడయిన మండోదరీపుత్రుఁడగు అక్షకుమారుఁడు కవచము దాల్చి, ఖడ్గము చేతఁబట్టి యాకాశమున కెగిరి, నాపై బాణములను ప్రయోగించుచుండఁగా, నే నాతనికాళ్లను బట్టికొని పలుమాఱు గిరగిర త్రిప్పి క్రిందఁబడవేసి చూర్ణము సేసితిని. అక్షకుమారుండును మడిసె నన్న వార్తను వినినవాఁడయి, బలవంతుఁడును, యుద్ధమునఁ బగతురకు లొంగనివాఁడునునైన రావణుఁడు తన రెండవకుమారుండగు ఇంద్రజిత్తును బంపెను. నేనును ఆ రాక్షసబలము నంతయుఁ జీకాకుపఱచి, ఆ యింద్రజిత్తుతో యుద్ధము చేసి, యాతని తేజము

తగ్గించి, యెక్కువ ముదము నొందితిని. రావణుడును ఇంద్రజిత్తు తప్పక నన్ను వధింపగలడను గొప్ప నమ్మక ముంచి యెక్కువ క్రొవ్వు గల రాక్షసవీరులతో గూడ నా యింద్రజిత్తు నంపియుండె. ఇంద్రజిత్తు నాబల మోర్వరాకయుండుటను, తనబలము క్రుంగుటను జూచి, అతి వేగముతో బ్రహ్మాస్త్రము ప్రయోగించి నన్ను బంధించెను. అంత రాక్షసు లందఱు నన్ను గోగునారపగ్గములతో గట్టి రావణునిసమీపమునకుఁ గొనిపోయిరి. అప్పుడు రావణుఁడు నన్నుఁజూచి, "ఓ వానరా! నీ వేల లంకకు వచ్చితివి? ఏల వనము ధ్వంసము చేసితివి? ఏల రాక్షసులను వధించితివి?" అని యడిగెను.

"ఓ రాక్షసేంద్రా! సీతాదేవిని వెదకునిమిత్తమే నేను లంకాపురము సొచ్చితిని. నేను వాయుదేవున కౌరసపుత్రుఁడను. వానరుఁడను. నాపేరు హనుమంతుఁడు. నేను సుగ్రీవునిమంత్రిని. రాముని దూతనుగా వచ్చినవాఁడను. ఆ సుగ్రీవుఁడు కొంతసంగతి చెప్పి పంపఁగా, నేను నీకడకు వచ్చితిని. ఎక్కువ ప్రతాపము గల సుగ్రీవుఁడు నీ కుశలమడిగి, నీతోఁ గొంత సంగతి చెప్పుమని చెప్పి పంపెను. ఆసంగతి ధర్మార్థకామములతోఁ గూడినదియు, నీకు మే లొసఁగునదియునైయున్నది. "నేను విస్తారసృష్టములు గల ఋశ్యమూకపర్వతమున నుండఁగా, యుద్ధవీరుఁడయిన శ్రీరాముఁడు సీతాదేవిని వెదకుచు నాతోఁ జెలిమి యొనరించికొని, "సీతాదేవి నెవ్వఁడో రాక్షసుఁ డపహరించెను. ఆమెను వెదకి తెచ్చి యిచ్చుటకై నీవు సకలవిధముల సహాయపడవలె" నని కోరెను. నేనును వానరరాజ్యమును వాలి యపహరించెను కావున వాలివధము నొనరించి నారాజ్యము నిప్పింపవలసినది యని కోరితిని. తర్వాత మే మిరువురము అగ్ని సాక్షికముగా చెలిమి యొనరించికొంటిమి. రాముఁడు వాలిని సంహరించి, వానరరాజ్యము నా కొసఁగెను. నేనును వాగ్దత్తము చొప్పున శ్రీరామునకు సీతాదేవిని వెదకి తెచ్చి యీవలయును గదా. ఓ రావణా! నీకడ సీత యుండునేని వెంటనే తోడ్కొనివచ్చి రామున కప్పగించుము. నీవు తడవుచేసితివేని వీరులగు వానరులు నీసైన్యమును నిన్ను నుమట్టుపెట్టుదురు. వారిప్రభావమెవ్వరికిఁ దెలియదు? వారు దేవతలచేఁ బలువఁబడి వారికి సాయము చేయఁబోవుదురు గనుక నీవు వారిచేతఁ జిక్కకమునుపే సీతాదేవిం

దెచ్చి రామున కర్పింపుము" అని తనమాటగా నాతోఁ జెప్పింపంపెను అని నేను రావణాసురునితోఁ జెప్పితిని. కుపితుఁడై యారావణుఁడు నన్ను దహించున ట్లుఱిమిచూచి, నాప్రభావ మెఱుగనివాఁడగుటచే నన్ను వధింపఁ దన భటుల కాజ్ఞ యొసఁగెను. అప్పు డచ్చట రావణునికిఁ దమ్ముఁడయిన విభీషణుఁ డను నొక్కఁడు సభలోఁ గూర్చుండి యుండెను. అతఁడు బుద్ధిమంతుఁడు, యోగ్యుఁడును గనుక, నానిమిత్తముగ రావణుని వేఁడికొని, "రాక్షసశార్దూలా! యీదండనము విధింపకుము. నీవు చేయునట్టి పని రాజనీతికి విరుద్ధముగానున్నది. దూతను వధింపరాదని శాస్త్రములు మొఱ లిడుచున్నవి. హితము చెప్పినట్టి దూత తనయజమానుఁ డెంత చెప్పి పంపెనో, అది యంతయు నట్లే చెప్పెను. ఆతనిమాటలలో నెంత తప్పిదమున్నను, వాని కేదియో విరూపము గలిగించి పంపవలయునేకాని, వధించుట యెంతమాత్రము శాస్త్రసమ్మతము గాదు" అని చెప్పఁగా, రావణుఁడు తనబంటులను బిలిచి; యీతనితోఁకను గాల్చివేయుఁడని యానతిచ్చెను. అంత నోర్వరాని పరాక్రమము గల యా రాక్షసులు వేడ్క పూని, నాతోఁకకు చింపి గుడ్డలతునుకల నెల్లఁ జుట్టి నూనెలోఁ దడిపి యగ్ని రగిలించి నన్నుఁ గొయ్యలతోఁ గొట్టుచుఁ బిడికిళ్లతో గ్రుద్దుచు, వీథులవెంబడి నూరేగింపఁ బూనిరి. రాజద్వారమునకుఁ జేరినవెంటనే నేనును అంతకు ముందున్న గొప్పరూపమును కుఱుచపఱచి, యాకట్లను పదలించికొని, యథాప్రకారమైన శరీరము నందినవాఁడనై, యా రాక్షసుల నందఱిని ఇనుపగుదియతోఁ గూల్చితిని. తర్వాత నా నగరద్వారమున నెగిరి నాతోకయందు మండుచున్న యగ్నిహోత్రునితో లంకాపురము నంతయుఁ బ్రాకారగోపురములతోఁ గూడఁ బ్రలయకాలాగ్నిహోత్రునిమాడ్కిఁ దత్తరింపక దహించితిని. నే నా లంకాపురమున దహింపనితావు గోపాదమంత యైనను లేమిచేత సీతాదేవి కూడ భస్మమాయెనో యని తెఱచి, వ్యర్థముగా రామునికార్యము చెడఁగొట్టితినే యని విచారమునం దుండఁగా, "ఈ లంకాపురమెల్లఁ గాలినను, సీతాదేవికి హాని కలుగలేదు. ఇదేమివింత!" యని యాకాశమునఁ జారణులు చెప్పుకొనియెడి వార్తను వింటిని. నేను వారివింత మాటను వినుటచేతను, కొన్ని శుభశకునములును గలుగుట చేతను

తోఁక మండుచున్నను, అగ్ని నన్ను దహింపకుండుటచేతను, చల్లని గాడ్పులు వీచుటచేతను సీతాదేవి క్షేమముతో నున్నదని యెఱిఁగిన వాఁడనై, యామెను మఱలఁ జూచి, యామెకడ నుత్తరువు తీసికొని, యచ్చట నున్న యరిష్టపర్వత మెక్కి మిమ్ముఁ జూడఁ గోరికతో మఱల వాయుమార్గమున కెగిరి, వాయువు, సూర్యచంద్రులు, గంధర్వులు, యక్షకిన్నరాదులు తిరిగెడి మార్గమున వచ్చి యిచ్చట దిగి మిమ్ముఁ జూచితిని. రామునిప్రభావముచేతను, మీతేజస్సుచేతను, సుగ్రీవుని కార్యసిద్ధి యగునిమిత్తము నే నీకార్యము చేసితిని. అచ్చట, నేఁ జేసి నదియెల్ల నెఱిఁగించితిని. ఇప్పుడు నేఁ జేయక విడిచినకార్య మెద్ది కలదో, అది యెల్ల మీరు చేయుఁ డని చెప్పెను.

59-వ సర్గము

హనుమంతుఁడు లంకలోని సంగతులఁ జెల్వుట

హనుమంతుఁడు తనరాకపోకలవృత్తాంతమునంతయు నెఱిఁగించి మఱికొంతసంగతి చెప్పఁబూనెను: రాఘవుని ప్రయత్న మీడేరెను. సుగ్రీవుని పట్టుదలయు సఫలమయ్యెను. ఆసీతాదేవియొక్క పాతివ్రత్యము చూడఁగా ఆ సీతాదేవియొక్క పాతివ్రత్యముచే సాధింప రానిది యొక్కటియు లే దని నాకు నిశ్చయము గలిగెను. అయిన నేల యా సీతాదేవి రావణుని భస్మముచేయ లే దనిన, రావణుఁ డును సకలవిధములుగా తపస్సుచేసి, కోపము వచ్చిన, లోకము లను దహింపను, సంతోషము వచ్చిన, లోకములను రక్షింపను జాలిన వాఁడు. ఆతఁడు సీతాదేవియొక్క యంగము స్పృశించినను, ఆ తపో మహిమచేతనే మండిపోవకుండెను. అట్లయినచో, సీతాదేవిశీలము దుర్బలము గదా. అట్టి శీలము మన కెందు కుపయోగపడు నని తలఁపఁ బోకుఁడు. జానకి కెవ్వఁడైనఁ జే టొనరించి, కోపము వచ్చునట్లు చేసె నని, ఆదేవి తనకోపపాత్రమైన యతని భస్మముచేయును గాని, అగ్ని జ్వాలయైన నాతీయనఁ జేతితోఁ దాఁకినవాని నేమియుఁజేయఁజాలదు. అట్లయినచో భృత్యుఁడు గెల్చిన రాజు గెల్చినట్లే కదాయగును. సీతా పాతివ్రత్యప్రభావసాయముచే మనమే రావణుని గెల్చి సీతాదేవిం దోడ్కొనియే రామలక్ష్మణులను జూత మనిన, ఇప్పుడు కార్యమెంత మాత్రమయి యున్నదో మీకుఁ దెలిపితిని. జాంబవంతుఁడు మొదలగు

వారంద ఱొప్పుకొన్నచో, అట్లు పోయి, రావణుని జయించి, సీతను దోడ్కొ-ని వచ్చియే రామలక్ష్మణులం జూచుట యుక్తము. మనము చాలుదుమో చాలమో యని సంశయింపవలదు. రాక్షసులసమూహ ముతో నిండిన లంకాపురము నంతయుఁ బాడు సేయుటకును, మహాబలుఁ డగు రావణాసురుని వధించుటకును నే నొక్క-ఁడనే చాలుదును. శూరులును, బలవంతులును, అస్త్రవిద్యనేర్చినవారును, పట్టుదల గల వారును, వీర్యము గలవారును, జయాపేక్షగలవారునునైన మన మిందఱ మున్నప్పుడు, ఆ రావణుని గెల్చుట కొక సందియ మున్నదే. నే నొక్క-ఁడనే యుద్ధరంగమున రావణుని సేనలతోను, కాల్బలము తోను, సోదరులతోను, పుత్రమిత్రపరివారముతోను సంహరింపఁ గలను. ఆ రావణుఁడు ప్రయోగించెడు బ్రహ్మాస్త్రము, ఐంద్రాస్త్రము, రౌద్రా స్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రమును, ఇంద్రజిత్తు ప్రయో గించు చూడ నలవికాని యస్త్రముల నన్నింటిని నివారించి, యాలంక లోని రాక్షసులనందఱను వధింపఁ గలను. మీ రాయనుజ్ఞయైనచో నా రావణునిపుత్రు నింద్రజిత్తును గూడ జయించెదను. నేను తఱచుగ బాలవాన గుఱిపించితినేని, అది యుద్ధరంగమునందు దేవతలను గూడ సంహరింపఁ గల దనునప్పు డాక్రుక్క-డిరాక్షసులు నా కొక లెక్క-లోనివారే. సముద్రమైనను జెల్లెలికట్టదాఁటును. మందర పర్వతము కదలను వచ్చును. శత్రుసేన యుద్ధరంగమున జాంబ వంతుని గదలింపఁ జాలదు. రాక్షసులగుంపు లన్నిటిని, వారికంటె గొప్పవారిని ఈ వాలినందనుఁ డయిన యంగదుఁ డొక్క-ఁడే నాశము చేయఁగలఁడు. పనసనీలులతోడలతాఁకుడునకు మందరపర్వతము గూడ తుత్తునియలై పోవును. అట్లుండ నీ రాక్షసులు వారిబలిమి కేపాటివారలు? ఈ మైందద్వివిదు లశ్వినీదేవతల పుత్రులు. మహాబలులు. దేవాసురగంధర్వయక్షపన్న గగరుడులలోపల నీమైందద్వివిదుల కెదుట నిలిచి యుద్ధము చేయువాఁ డెవ్వఁడును లేఁడు. వీ రిరువురును బ్రహ్మ దేవుని వరమువలన నెక్కు-వ బలము గలిగినవారు. వీ రమృతము భక్షిం చిన వారు. వానరులందఱిలోపల శ్రేష్ఠులు. అశ్వినీదేవతలమో మోటము నకై సర్వలోక సృష్టికర్తయగు బ్రహ్మ ఎవరివలనను మరణము లేకుండు నట్లు వీరికి వరమొసఁగెను. వీరులయిన యీ వానరశ్రేష్ఠు లిరువురు| వర

బలమువలన గర్వించినవారలై, సురల గొప్పసేనను సంహరించి, యమృతమును ద్రాగిరి. అందఱు వానరులటుండనీ. వీరిద్ద ఱలిగిరేని, చతురంగ బలముతో నిండిన లంకాపురమును ధ్వంసము చేయఁగలరు. నేనే రాక్షసుల నందఱిని జంపి, లంకాపురము నంతయుఁ గాల్చి బూదిచేసితిని. మఱియు రాజమార్గములందుఁ జేరి, మహాబలులగు రామలక్ష్మణులు అందఱికంటె మించినవారలై యున్నారు. వానర రాజగు సుగ్రీవుఁడును రామునిసాయమువలన సరోత్కృష్టుఁడై యున్నాడు. నేను కోసలేంద్రుఁడగు రామునికి దాసుఁడను. నేను వాయుపుత్రుఁడను. నాపేరు హనుమంతుఁ డందురు" అని లంకాపుర మెల్ల చాటితిని. చెఱ నడత గలవాఁడయిన రావణునియశోకవనమధ్యమున శింశుపావృక్షము క్రింఁద బతివ్రతయు, దీనతను బొందినదియు, రాక్షసకాంతలచేఁ జుట్టఁబడినదై దుఃఖసంతాపముచేఁ జిక్కినదియై మేఘములచేఁ జుట్టఁబడిన దౌటవలనఁ గాంతిలేక యుండు చంద్రరేఖమాడ్కిఁ బ్రకాశింపక యుండునదియు, దేవేంద్రుని భార్యయగు శచీదేవి నహుషునిచే నిరోధింపఁ బడినట్లు రాక్షస్త్రీలచే నిరోధింపఁబడినదై యున్నను, రామునందే చెలిమి గలిగి, ఎల్లప్పుడు రామునే తలంచుచు, ఆశచి దేవేంద్రునందే మనస్సు గలిగి యుండినట్లు రామునందే మనస్సుగలదై రావణుఁ డపహరించిననాటి యాయెంటిబట్టనే కట్టుకొన్నదై, దుస్స్మ్రమియుండ, దుఃఖసంతాపములచే మనమున సంతసము లేనిదై, భర్తయొక్క మేలుగోరుటయందే యాసక్తి గలదై, రాక్షసులు చుట్టుగూర్చుండి మాటిమాటికి బెదరించుచుండఁగా, దైన్యము నొంది, భర్తను గూర్చిన చింతయే ముఖ్యముగాఁ గలదై, నేలమీఁదఁ బరుండి హిమవంతర్తువునంచలి తామరతీఁగ మాడ్కి శోభలేనిదై, రావణునినుండి మనస్సును మఱలించి, మరణము నకు సిద్ధపడినదియునై యుండునట్టి సీతాదేవిని గాంచి, యామెకు నమ్మిక కలిగించి, యామెతో మాటాడి నాయభిప్రాయ మంతయు నెఱిగించితిని. రామసుగ్రీవులకుఁ జెలిమి కలిగె నని చెప్పినవార్తను విని, యాదేవి మిక్కిలి సంతసించెను. ఆమె యొక్క యొక్కొక ఆచారమును ఎక్కొక పతిభక్తియుఁ దప్పుచేసినట్టి యారావణు నేల వధింపకున్న దనిన, తన భర్త యైన రాముఁడు రావణుని సంహరించుటకు నిమిత్తమాత్రముగా నుండవలె ననియే. ఆదేవి యసలే చిక్కిన దేహముగలది. దానికి

భర్తృవియోగము తోడుగాఁగా, పాడ్యమినాఁ డధ్యయనము చేసెడి విద్యార్థియొక్క విద్యవలెఁ గృశించి యున్నది. ఓ వానరపుంగవులారా! సీతాదేవి యిట్లు దుఃఖమే ముఖ్యముగాఁ గలదై యున్నది. అచ్చటి సంగతియెల్లఁ జెప్పితిని. ఇఁక నేమి చేయవలెనో దాని నాలోచింపుఁడని హనుమంతుఁడు వానరుల కందఱకుఁ జెప్పినవాఁడయ్యెను.

60-వ సర్గము

అంగద జాంబవంతులకు సంభాషణము

అంగదుఁడు హనుమంతుని మాటను విని, వానరులం జూచి "ఓ వానరులారా! మీరు సీతను జూచినవారైనను, సీతాదేవిని దొడ్కొనక రాముని కడకుఁబోయి "అయ్యా! మేము సీతను జూచితిమి కాని తేన యితిమని చెప్పుట మీపరాక్రమమునకు యుక్తముగా" దని తోఁచెడిని. దాఁటుటయందుఁ గాని, శత్రువులను బరిమార్చుటయందుఁ గాని మనతో సమానుఁ డీ దేవాసురులలోపల లేఁడు. హనుమంతుఁడు రాక్షసవీరుల నందఱి నివ్విధమునఁ బరిమార్చునప్పుడు మన కిఁక నాటంక మేమి యున్నది? జానకిని దొడ్కొనియే పోవుదము" అని చెప్పెను.

జాంబవంతుఁ డను వానరశ్రేష్ఠుఁడు వాలిపుత్రుని సంకల్పమును విని, యెక్కువమోదము నొంది, "రాజపుత్రా! నీ వాలోచించినతెఱఁగు యుక్తము గాకపోలేదు. అయినను రాముని యభిప్రాయ మెట్లున్నదో, అట్లే మనము కార్యము నడపించుట యుక్త మని తలఁచెద" నని అంగదునకు బదులు చెప్పెను.

61-వ సర్గము

వానరులు మధువనంబు ప్రవేశించుట

తర్వాత, అంగదుఁడు మొదలగు శూరులయిన వానరులును, కపిశ్రేష్ఠుఁ డయిన హనుమంతుఁడును జాంబవంతుని మాటయే మంచిదని యెప్పుకొనిరి. అంత వానర వీరులందఱు సంతోషభరితులై హనుమంతుని ముందిడుకొని మహేంద్రపర్వతమువదలి గొప్పరూపమును, ఎక్కువబలిమియుఁ గలిగినవారలును నైనందున మేరుమందరపర్వతములను, క్షుబించిన గొప్పయేనుఁగులను బోలినవారై, యాకాశమును

గప్పుచు వచ్చుచున్నారో యనిపించుచు, సకలభూతములచే గౌరవింప బడుచున్నవాఁడును, ధైర్యవంతుఁడును, ఎక్కువబలమును వడియుగల వాఁడును నైన హనుమంతుని దృష్టులపై నెక్కించికొని మోయు చున్నారో యనునట్లు రెప్పవాల్పక యతనిని ప్రేమతోఁ జూచుచు, శ్రీరాముని కార్యసిద్ధిని, దానిమూలమున గొప్పకీర్తిని నిశ్చయించుకొని పనినెఱవేర్చినవారును, కార్యసాధనముచేత నితరులకంటె గొప్ప వారును, రామునకుఁ బ్రియవృత్తాంతము చెప్పఁబూనినవారును, యుద్ధ మునందెక్కువ కోరికగలవారును, రామునికిఁ బ్రత్యుపకారము చేయు టకు నిర్ణయించుకొన్నవారును, గొప్పమనస్సుగలవారునునై యాకాశ మునకెగిరి దుముకుచు, సకల జంతువుల మనసున కింపొదవునదియు, ఎవరికిని లోపలికిఁ బోవ వీలుకానిదియు నైన సుగ్రీవునియొక్క మధు వనమును బొందిరి. వానరేంద్రుఁడగు సుగ్రీవునియొక్క ఆమధువనము నతనిమేనమామయగు దధిముఖుఁడను వానరవీరుఁ డెల్లప్పుడు కాపాడు చుండును. ఆ వానరులందఱు వానరేంద్రునిమనమునకు మిక్కిలి సంతోషప్రదమైన యా మధువనమును చొచ్చినంతనే మిక్కిలి యుత్సా హముగల వారలైరి.

అంత నావానరు లందఱు ఆ గొప్ప మధువనమును జూచి యుప్పొంగి, యంగదుని మధ్యము గ్రోల ననుమతియిమ్మని కోరిరి. అంతట నంగదుఁడును జాంబవంతుఁడు మొదలగువారి యనుమతిఁ గైకొని, మధ్యముగ్రోలుటకు వారికాజ్ఞ యొసఁగెను. అంత వానరు లందఱు అంగదునియానతిచేఁ బ్రేరితులయి, మిగుల మోదమునుబొంది, మేన గగుర్పాటు గలుగఁగా గంతులు వైచుచుండిరి. కొందఱు పాటలు పాడిరి. కొందఱు ముందుకు వంగిరి. కొందఱు చిందులు త్రొక్కిరి. కొం దఱు పకపకనవ్విరి. కొందఱు పైనుండి క్రిందఁబడిరి. కొందఱు తిరుగు లాడిరి. కొందఱు దుముకులాడిరి. కొందఱు వదరుచుండిరి. కొంద ఱొండొరులను బట్టుకొనిరి. కొంద ఱొండొరులను దాఁటుచుండిరి. కొంద ఱొండొరులను మాటలాడుకొనుచుండిరి. కొంద ఱొండొరు లతో విహరించిరి. కొంద ఱొకచెట్టునుండి మఱొక్కచెట్టుపైకి దుమి కిరి. కొందఱు చెట్టుకొననుండి నేలమీఁదికి దుమికిరి. హెచ్చుబలిమిగల కొందఱు నేలనుండి చెట్టుకొనలకెగిరిరి. ఒకవానరుఁడు పాటపాడు

చుండఁగా, మఱొక్క వానరుఁడు పకపక నవ్వుచు వానిమీఁదికి వచ్చెను. నవ్వువానికడకు నొకఁడు వికవిక నవ్వుచు వచ్చెను. ఏడ్చువానికడ కెగఁబడుచు నొక్కఁడు వచ్చెను. ఆ యెగఁబడివచ్చువాని కడ కింకొక్కఁ డార్చుచువచ్చెను. అవ్వానరసేన యివ్విధమున మద్య పానముచే మితిమీఱిన చేష్టలుగలదై, మిగులఁ గలఁతఁజెందియుండెను. ఆ వానరులలో మద్యపానముచేయనివాఁడును, మత్తుగొననివాఁడును, ఆ మద్యపానముచేఁ దనివినొందనివాఁడును నొక్కఁడైనను లేఁడయ్యెను.

ఆవనమును గాపాడుచున్న దధివక్త్రుఁడనువాఁడు, వానరులం దఱు వనపాదపములందలి మద్యమును గ్రోలుటను, ఆవృక్షములందలి యాకులను, పువ్వులను రాలఁగొట్టుటను జూచి, కోపముఁజెంది వారి నందఱి నడ్డగించెను. ఆ వానరులందఱు రేఁగి యాదధివక్త్రు నదలిం పఁగా, వనపాలుఁడును, ముసలివాఁడునయిన యెక్కువ తేజస్సుగల వానరవీరవృద్ధుఁడగు దధిముఖుఁడు వారిని బొఱఁదోలి వనమును గాపాడఁదలఁచి, కొంచఱేని ధైర్యముతో నిష్ఠురముగా మాటలాడెను. మఱి కొంచఱేని గట్టిగా నఱచేతులతోఁ గొట్టెను. కొంచఱితోఁ గలిసి జగడమాడెను. కొంచఱేని బ్రతిమాలెను. ఆదధిముఖుఁడు బలవంత ముగా నడ్డగించినను, భయము లేనివారలై యావానరవీరు లందఱు గూడి యాదధిముఖునిఁ జుట్టుకొని, గర్వముచే మాటలాడినఁ దప్పి దము వచ్చునని తలంపక యతిశయించి, యతనిని గోళ్లతో గీఱుచుఁ బండ్లతోఁ గొఱుకుచు, చేతులతోను పాదములతోను బొఁదుచు, ఆ గొప్ప మధువనమునందలి యనుభవయోగ్యములైన యన్ని పదార్థము లను కాఁజేసిరి.

62-వ సర్గము

వానరులు మధువును గ్రోలుట

వానరశ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు "వానరులారా! మీరు నిర్భయులై మద్యము గ్రోలుఁడు. మీదారికెవ్వఁ డడ్డమువచ్చినను వారినందఱను వధించెదను" అని చెప్పఁగా, వానరోత్తముఁడగు అంగ దుఁడు "వానరులారా! కార్యమును నెఱవేర్చికొని వచ్చిన యీ హను మంతుఁడొక్కవేళఁ జేయరానికార్యమును జెప్పినను జేయవలసినదే.

అట్లుండ, ఈ మంచికార్యమును జేయుట కేమి సంశయమున్నది? కావున మీరు యథేష్టముగా మధ్యము ద్రాగుడు" అని ప్రోత్సాహపఱి చెను. అంగదునినోటినుండి వచ్చిన మాటను విని వానరశ్రేష్ఠులందఱు 'మంచిది మంచిది' యని సంతోషపూర్వకముగా నంగీకరించి, యంగదుని గారవించిరి.

అట్లు ఆతనిని గారవించిన తర్వాత వానందఱు నదీప్రవాహము మాడ్కిఁ గడువడితో మధువనమునఁ బ్రవేశించిరి. అట్లు ప్రవేశించి, వనరక్షకుల నందఱ నదలించి బెదరించి, యంగదుని యుత్తరువును బట్టియు, సీతాదేవిని చూచుటవినుటలం బట్టియు ధైర్యముగలవారై, యావనమునంతలి తేనెనంతయుఁ ద్రాగి, తియ్యని పండ్లను దినిరి. తమ్మదలించుటకై వచ్చిన వనపాలుర నందఱిని గొట్టిరి. వానరులందఱుగూడి బానెడు తేనెను దెచ్చిపెట్టుకొని యందఱు దానిని ద్రాగిరి. కొందఱు తేనెను ద్రాగిరి. ఇతరులు కొట్లాడుచుండిరి. కొందఱు వానరులు తేనెను గ్రోలి, తేనెపెరలను బారవైచిరి. తేనెమైనముఁ దిని క్రొవ్విన వారై యొండొరులను గొట్టుకొనిరి. కొందఱు వానరులు మిక్కిలి మత్తులై, చెట్లమొదటి కొమ్మలను బట్టుకొని నిలిచిరి. కొందఱు వానరులు చెట్లక్రింద నాకులను బఱచుకొని పరుండిరి. కొందఱు వానరులు మైకముచే నోడలెఱుఁగక వెఱ్ఱివారివలెఁ బడియుండిరి. కొందఱు సంతోషముచేఁ బులకాంచిత గాత్రులైరి. కొంద ఱొండొరులను ద్రోసికొనిరి. కొంద ఱోడలెఱుఁగక తొట్రుపాటు చెందిరి. కొందఱు సింహనాదము సేసిరి. కొందఱు సంతోషసూచకముగాఁ గూఁతలుపెట్టిరి. కొందఱు నేలమీఁదఁ బడుండిరి. కొందఱు చెప్పరాని యసహ్యపుఁబనులఁ జేసి నవ్విరి. మఱికొంద ఱట్టి యితరకార్యములను జేసిరి. మఱికొంద ఱట్టి పనులను జేసి, తాము చేసినవానిని గూర్చి చెప్పుకొనిరి.

దధిముఖునిసేవకు లందఱు భయంకరులయిన యావానరులు బెదరిపఱిగా వెఱచి మూలమూలలకుఁ బాఱిపోయిరి. వారు మోకాళ్లు పట్టి వెనుకకువంచి అపానము చూపఁబడిరి. ఇట్లల్లఁ బీడితులై వారు మిగుల క్లేశమునుచెంది నవారయి దధిముఖునికడకువచ్చి, "హనుమంతుఁ డాజ్ఞ యొసఁగఁగా వానరులందఱు బలాత్కారముగా మధువనము నంతయుఁ బాడుసేసి"రని చెప్పిరి. దధిముఖుండును వానరవీరులందఱు మధువన

మును ధ్వంసముచేసినందు కలిగినవాఁడై, తనసేవకులగు వానరులనూఱు డించి "మీరిక్కడికి రండు, మనము పోదము. అచ్చట మద్యముద్రాగి మదించియున్న యావానరవీరుల నందఱను మనసామర్థ్యముచే నివారింత"మని చెప్పి వారిం దోడ్కొని యావానరవీరులమీఁదికిఁ బోయెను. వీరులగు వనరక్షకులును దధిముఖునిమాట విని యాతనితోడ మఱల వారి మీఁదికిఁ బోయిరి. దధిముఖుండును గొప్పచెట్టు నొక్కటి పెళ్ళగించి చేతఁబట్టుకొని వారిం గొట్టఁబోయెను. వాని సేవకులగు వనపాలురును తమయజమానిమాటను మనమున నిడుకొని తమచేతులలో ఱాలను, చెట్లను, కొండలను ఎత్తికొని, చెట్లమీఁదను, నేలమీఁదను గూర్చుండియున్న యావానరవీరుల నందఱను జూచి వారిమీఁదికి దుమికిరి.

ఆదధిముఖుండు తమమీఁదికిఁ గోపముతో వచ్చుచున్నాఁడని యెఱిఁగి, హనుమంతుఁడు మొదలగు వానరవీరులంద ఱాతనిమీఁదికిఁ గవిసిరి. వారిలో నంగదుఁడు కుపితుఁడై, చెట్టొక్కటి చేతఁ బట్టుకొని వచ్చి దధిముఖుని రెండుచేతులతో బాఁదెనుగాని, ఆతఁడు తనతండ్రి మేనమామయగుటచేఁ దనకు మన్ననచేయఁ దగినవాఁడని మదోద్రేకముచే నెఱుఁగక యతనిని క్రిందఁద్రోసి, తనబలిమికొలఁదిని గ్రుద్ది వాని యెముకలు పొడియగునట్లు చేసెను.

ఆదధిముఖుఁడు చేతులు, దొడలు, మూఁపులు విఱిగి, శ్రమ చెంది, రక్తమునఁ దడిసి, కొంతతడవు మూర్ఛచెంది, కొంతసేపటికిఁ దెలివినొంది యాగ్రహముతో వారిని గొయ్యలతోఁ గొట్టఁబోయెను కాని, వారు తిరిగి కొట్టరాఁగా, వారికి వెఱచి యెట్టకేలకు వారిచేతుల నుండి విడిపించికొని, యావలికివచ్చి తన పనికాండ్రగు వనపాలురను బిలిచి రహస్యముగా, "వీరిక్కడ నిట్లే యుండనిండు. మనము రాము నితోఁగూడనున్న మనరాజగు సుగ్రీవునికడకుఁ బోయి, ఇది యంతయు యంగదుని దోషమని చెప్పెదము. అంత వానరేంద్రుఁడు కుపితుఁడై యీ వానరవీరుల నందఱిని బరిమార్పింప గలఁడు. ఈమధువనము మనరాజగు సుగ్రీవుని కిష్టమైనది. తాతముత్తాతలనాఁటినుండి వచ్చినది. అందమైనది. దేవతలకు సైతము చొచ్చుటకు వీలుగానిది. ఇట్టి వన మును వానరవీరులు పాడుచేసి రన్న వార్త విన్నతోడనే, సుగ్రీవుఁడు

మద్యపానాసక్తులైన ఆయువులతీతిన ఈవానరుల నందతీని వీరి స్నేహితులను గూడ సంహరింపఁగలఁడు. వీరు రాజు నుత్తరువును మీఱిన వారు గనుక ఈక్రొవ్వినవారి నందతీని సంహరింపవలయును. వానరేంద్రుండు వీరిని సంహరించె నేని, మన కసి తీఱును" అని చెప్పి వనపాలురను దోడ్కొని, నిమిషములో సూర్యపుత్రుఁడగు సుగ్రీవుఁడున్న తావునకుఁ బోయిచేరి, రామలక్ష్మణులను, సుగ్రీవునిఁ జూచి, సమభూమిపై నిట్టనిలువునఁ బడెను. అట్లు మహాధీరుఁడైన దధిముఖుఁడు వనపాలురతోఁ గూడ నేలఁబడి, విన్నని మొగముతోఁ గూడినవాఁడై సుగ్రీవుని మంగళ పాదములకు మ్రొక్కి, వానిని గట్టిగాఁ బట్టుకొనెను.

63-వ సర్గము

దధిముఖుఁడు సుగ్రీవునికడకు వచ్చుట

అంత వానరేంద్రుఁడగు సుగ్రీవుఁడు నేల సాగిలఁబడి మ్రొక్కిన యాదధిముఖునిఁ జూచినతోడనే మనమున సులికిపడినవాఁడై, "ఓదధిముఖా! లేలెమ్ము. ఏల యిట్లు నాపాదములమ్రోల సాగిలఁబడితివి? నీ కభయ మొసఁగెదను. సంగతి యంతయు విస్తరించి చెప్పు" మని యా దధిముఖుని నడిగెను.

ఆమహాత్ముఁడగు సుగ్రీవుఁ డట్లు సమాధానపఱుపఁగా, వివేకవంతుఁడగు దధిముఖుఁడు లేచి యతనితో నిట్లనెను:—"మహారాజా! ముందు ఋక్షరజుఁడుగాని వాలిగాని నీవుగాని యథేష్టముగా ననుభవింపని మధువనమునందలి మధువును వానరవీరులు గ్రోలిరి. వనపాలురు వారిని బెదరించినను సరకుసేయక యచ్చటి ఫలములను భక్షింపుచు మధువు నింకను గ్రోలుచున్నారు. కొంచెము మిగిలియున్నదానినిగూడఁ గొందఱు పాఱఁబోయుచున్నారు. కొందఱు దానిని సైతము ద్రాగుచున్నారు. మేము పోయి యడ్డగించినచో మాపైఁ గనుబొమ్మలు చిట్లించుచున్నారు. వానరపుంగవు లట్లు కోపగించుకొని కొట్టఁబోయిన వనపాలురను గూడ బెదరించి యావలికిఁ దఱుముచు, కొందఱిని చేతులతో బాదిరి; కొందఱిని మోకాళ్లతోఁ గ్రుమ్మిరి; కొందఱిని నేల మీఁదఁ బడఁద్రోసియిచ్చవచ్చినట్లు బరబరయీడ్చిరి; కొందఱు నాకాశము వెపున కెగుశఁదన్నిరి; కొందఱి కపానమునుఁ జూపిరి. ఓ మహారాజా!

నీవు జేఁడవై యుండినను, శూరులైన వనపాలుర నిట్లు నొప్పించి, వానర వీరులు మధువనమునందలి మద్యమును యథేష్టముగాఁ గ్రోలు చున్నారు."

ఇట్లు దధిముఖుఁడు వానరరాజగు సుగ్రీవునితో మొఱ పెట్టు కొనుచుండుట చూచి, శత్రుసంహారియు, గొప్పబుద్ధిమంతుఁడు నైన లక్ష్మణుండు సుగ్రీవునిఁ గాంచి, "హరీశా! యీవనపాలుఁడగు దధి ముఖుఁ డెందుకు వచ్చినవాఁడు? ఏమి సంగతికై యీతఁడిట్లు విచార ముతో మొఱఁబెట్టుకొనుచున్నాఁ" డని యడుగఁగా, సుగ్రీవుఁడును లక్ష్మణున కిట్లనియె:

ఓ యార్యా! లక్ష్మణా! దధిముఖుఁడు వచ్చి, "దక్షిణదిక్కున వెదకి వచ్చిన అంగదుఁడు మొదలగు శూరులైన వానరులు మధువనము నందలి మధువును గ్రోలి" రని చెప్పుచున్నాఁడు. పనినెఱవేర్చుకొనక వచ్చియున్నచో, వారిట్టి పనికిఁబూనరు. వారు కృతకార్యులై వచ్చుటం బట్టియే మధువనముఁ జొచ్చి, యీవనమంతయుఁ బాడుసేసి, యచ్చట నున్న మధువును గ్రోలియుందురు. వా రెప్పుడు వనము చొచ్చిరో, అప్పుడే కార్యమయినట్లే. దానికి సందియము లేదు. హనుమంతుఁడే, మఱి యొక్కఁడుగాఁడు సీతాదేవిని జూచి యుండవలయును. హనుమంతుఁడు తప్ప వేఱొక్కఁ డీకార్యమును సాధించి యుండఁజాలఁడు. ఆ హను మంతునియందే కార్యసాధనశక్తియు, బుద్ధియు, ప్రానికయు, మగతన మును, శాస్త్రానుభమును నున్నవి. ఏకార్యమునకు జాంబవంతుఁడును, అంగదుఁడును, హనుమంతుఁడును ముఖ్యులుగా నుందురో, ఆకార్య మెన్నఁటికిని జెడిపోవదు. ఈతఁడు దధిముఖుఁ డనువానరుఁడు; ప్రసిద్ధి కెక్కిన పరాక్రమము గలవాఁడు. ఇతఁడు అంగదాదులగు వానర వీరులు మధువనమునఁ బ్రవేశించి, మధువు గ్రోలిరనియు, వనరక్షకులు నివారించినను, వారిని మోఁకాళ్లతోఁ గ్రుమ్మిరనియు నీ సంగతి చెప్పుటకై వచ్చినవాఁడు. మహాబాహువా! బాగుగా యోచింపుము. సీతను వీరు తప్పక చూచి వచ్చియుందురు. కావున వీరందఱు వచ్చి మధ్యమును గ్రోలుచున్నారు. అట్లు ప్రసిద్ధులైన వానరవీరులు సీతను గానక వచ్చియుందురే? ఋక్షరజసునికి బ్రహ్మదేవునిచే నొసఁగఁబడిన దివ్యమైన యీ మధువనమును బాడుసేసి యుండరు."

తన ధర్మము నడపువాఁడగు లక్ష్మణుఁడును, శ్రీరాముఁడును సుగ్రీవునినోటినుండి వచ్చిన శ్రావ్యమైన మాటను విని, మిక్కిలి యానందము నొందిరి. సుగ్రీవుఁడును దధిముఖుని యీ మాటను విని, వనరక్షకుఁడగు దధిముఖు నుద్దేశించి, కార్యము నెఱవేర్చినవారగు వానరవీరులు మధువనమునందలి మధ్యమును గ్రోలి రని నీవు చెప్పినమాటకు మిక్కిలి యుప్పొంగితిని. చెప్పినపని సాధించుకొని వచ్చినవా రొకతప్పిదమును జేసినను మన్నింపవలెను. కృతకృత్యులై వచ్చిన సింహవిక్రమముగల హనుమంతుఁడు మున్నుగాఁగల వానరవీరుల నందఱను జూచుటకును, వారు సీతాదేవిని గనుఁగొనుటకుఁ జేసినప్రయత్నమును రామలక్ష్మణులును నేనును వినఁగోరుచున్నాము. వారినిఁ బంపుము" అని చెప్పిపంపెను. తరువాత రామలక్ష్మణు లిరువురును గార్య మీఁడేరుటచే సంతోషభరితులై కన్నులు విచ్చికొనియుండుటను జూచి, సుగ్రీవుఁడును తన యంగము లన్నిటియందుఁ బులకలెత్తఁగా, కార్యసిద్ధి యాయెనని తలఁచినవాఁడయ్యెను.

64-వ సర్గము

వానరులు సుగ్రీవునికడకుఁ బోవుట

సుగ్రీవుఁ డిట్లెఱిఁగునఁ జెప్పగా, దధిముఖుఁడును సుగ్రీవునికిని రామలక్ష్మణులకును మ్రొక్కి తనతోడవచ్చిన వనరక్షకులగు శూరులైన వానరులతోఁ గూడినవాఁడై పైకెగిరి, ముం దెంత వేగముతో వచ్చెనో యదేవేగమున మధువనమునకుఁబోయి, మైకముడిసి లేచి మధువును దానితోఁగూడఁ జేర్చి త్రాగిన యుబకమును మూత్రరూపమున విడుచుచున్న యా వానరులఁ జూచి, చేతులుజోడించి యంగదునికడకుఁ జేరి, వినయముతోను, తిన్నదనముతోను, సంతసముతోనుగూడి యా యంగదునితో నిట్లనియెను: "ఓ నాయనా! యువరాజా! యీవనపాలురు మిమ్మడగించిరని వీరిపైఁ గోపింపకుఁడు. వీరు తెలియక మిమ్మడగించిరి. నీవు యువరాజవు. ఈవనమునకుఁ బ్రభువవు. మేము తెలియక మిమ్మడగించితిమి గనుక మాతప్పిదమును మన్నింపుఁడు. ఓ యనఘుఁడా! నేను. మీపినతండ్రికడ కేగి, "యీవానరు లందఱు వనమునకు వచ్చి మధువును గ్రోలి" రని చెప్పితిని. అతఁడు కోపగించుటకు బదులుగా

సంతోషపడి, వారినందఱిని వేగిరము మాకడకుఁ బంపుఁడని చెప్పి పంపె"నని యంగదునితో దధిముఖుఁడు చెప్పెను.

మాటలలో నేర్పరియగు అంగదుఁడును దధిముఖుఁడు చెప్పిన మాటను విని, వానరుల నందఱిని జూచి "వానరశ్రేష్ఠులారా! యీ సంగతి రామునికిఁ దెలిసినట్లున్నది. పనియైన వెనుక నిచ్చట జాగు చేయుట మనకుఁ దగదు. వానరవీరులారా! యథేష్టముగా మధువు గ్రోలి యలసటఁ దీర్చుకొంటిమి. ఇఁక మిగిలినపని యేమి? మాతండ్రి యగు సుగ్రీవుఁ డెచ్చట నున్నవాఁడో, అచ్చటికిఁ బోవుటయే. మీ రందఱు గూడి యెట్లు నన్నుఁజేయమందురో, అట్లు చేయువాఁడను. పని యందు మీకు లొంగినవాఁడను. నేను యువరాజనయి యున్నను, మీ కానతి యొసఁగఁజాలను. కృతకృత్యులైన మిమ్ము బెదరించుట యుక్తము గాదు" అని వానరులతోఁ జెప్పెను.

ఇట్లంగదుఁడు చెప్పినమాటను విని, వానరులందఱు మనసున నుప్పొంగి, "ఓ రాజపుత్రా! వానరశ్రేష్ఠా! రాజయి యుండియు నెవ్వఁడు నీవలె మాటాడును? లోకమున నధికారగర్వముచే మదించినవాఁడంతయుఁ దానే యని యెంచుట వాడుకగదా? ఈమాట నీకుఁ గడుఁదగి యున్నది గాని, మఱియొక్కనికిఁ గాదు. ఇట్టి నీ విధేయత యిఁక రాఁబోవు మేలునకుఁ దగిన యోగ్యతను దెల్పుచున్నది. మనయేలికయగు సుగ్రీవుఁ డెచ్చటనున్నాడో యచ్చటికిఁ బోవుట కుత్సాహము గలవారమై యేతెంచితిమి. నీయుత్తరవు లేక యీ వానరులందఱు మడుగెత్తి మఱియొకయడుగు పెట్టుటకైనను శక్తులము గాము. ఇది నిక్కమని చెప్పుచున్నాము" అని యంగదునితోఁ జెప్పిరి.

ఇట్లు వారు చెప్పఁగా, అంగదుఁడును "సరే బయలుదేఱి పోవుదము"అని చెప్పి పైకెగురఁగా, అతనిని, హనుమంతుని వెంబడించి తక్కిన వానరులునుగూడ నెగిరి, యంత్రములచే నెగురఁ జిమ్మఁబడిన పర్వతములమాడ్కి నాకాశమును సందులేకుండఁ గప్పి, వాయుప్రేరితములైన మేఘములచందమున గొప్పయలుపు లలుచుచుం గడువేగముతో నెగిరిపోయిరి.

అంగదుఁడు రాకమునుపే సుగ్రీవుఁడు కమలలోచనుఁడును, శోకపీడితుఁడునునైన రామునిఁజూచి, "ఓరాఘవా! యూఱడిల్లుము. తప్ప

కుండ వారు సీతను జూచిరి. గడువు మీఱిన తర్వాత వా రిచ్చటికి రాజాలరు. పనినెరవేర్పని వానరు లిట్టి పనికిఁ బూనుకొనవచ్చునుగాని యువరాజును నిడుదచేతులవాఁడునైన వానరో త్తముఁడగు అంగదుఁడు తప్పక దీనముఖుఁడై, మనసున భ్రమమును, వెఱపు నొందును. ఈ మధువనము మా పెద్దలనాఁటిది. వారిచేఁ గాపాడఁబడినది. ఇట్టి యీవనమును సంతోషింపని యంగదుఁడు ధ్వంసముచేసి యుండడు. మంచివ్రతముల నాచరించు నోరామా! మీఅడిల్లుము. కౌసల్య సుపుత్రజనని యయ్యెను. నామాట వినుము. హనుమంతుఁడే సీతను జూచియుండఁను. మఱొక్కఁడు కాదు. హనుమంతుఁడు తప్ప మఱొక్కఁ డీపనిని సాధింపఁ జాలఁడు. ఓ మతిమంతులలో శ్రేష్ఠుఁడా! సూర్యునియందే వెలుఁగు ఉండునట్లు ఆ హనుమంతునియందే కార్యసాధనశక్తియు, చాతుర్యమును, పూనికయు, ధైర్యము నున్నవి. జాంబవ దంగదులు ప్రేరకులుగాను, హనుమంతుఁడు చేయువాఁడుగాను నుండు కార్యము తప్పక యనుకూలించును. మీఅతిన విక్రమముతోఁ గూడినవాఁడా! నీవిపుడు చింతను వదలిపెట్టుము" అని శ్రీరామునితో సుగ్రీవుఁడు పలికెను.

తర్వాత హనుమంతుఁ డొనర్చిన కార్యసాధనముచేఁ గిష్కింధకు సమీపించి, కార్యమనుకూలించెనని తెలుపువారిమాఁడ్కి నఱచుచుండు వానరులయొక్క కిలకిలధ్వని యాకసమున సమీపముననే వినవచ్చెను. సుగ్రీవుఁడు వారి కిలకిలరవమును విని తనతోఁకను నిమపుగా నెత్తినవాఁడై మనసున హర్షము నొందెను. వానరులును శ్రీరామునిఁ జూడఁగోరినవారై, అంగద హనుమంతులను ముందుంచుకొని వచ్చిరి. అంగదుఁడు మొదలగు వానరులందఱు కడుమోదముతోఁ గూడినవారై వచ్చి, రామలక్ష్మణ సుగ్రీవులప్రోల వ్రాలిరి. మహాబాహువగు హనుమంతుఁడును రామునికి సాష్టాంగముగా దండమొఁచ్చి, సీతాదేవి పాతివ్రత్యనియమముగలదై, యక్షితగా నున్నదని యారామునికెఱిఁగించెను.తర్వాత సుగ్రీవలక్ష్మణులును ఆహనుమంతునియందే కార్యమనుకూలించుట నెఱిఁగి, సంతుష్టులై యాతనిని గౌరవముతోఁ జూచిరి. శత్రుసంహారియగు శ్రీరాముఁడును సీతాదర్శనవార్తాశ్రవణముచే సంతసించినవాఁడై హనుమంతుని మర్యాదచేసెను.

65-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవివృత్తాంతము రాముని కెఱిఁగించుట

తర్వాత వానరులందఱు చిత్రవనములు గల ప్రస్రవణపర్వతముఁ జేరి, యంగదుని మున్నిడుకొని, రామలక్ష్మణులకును సుగ్రీవునికిని బ్రణమిల్లి, సీతాదేవి రావణుని యంతఃపురమున నుంచఁబడి యుండుట, రాక్షసస్త్రీలు బెదరించుట, ఆదేవి రామునియం దనురాగము గలిగి యుండుట, ప్రతినయొనర్చుట మొదలగు వృత్తాంతములను దెలిపిరి. అంత రాముఁడు సీతాదేవి యక్షతయై యున్నదను వాక్యమును విన్న వాఁడై, "సీత యెచ్చట నున్నది? నాయం దెట్లున్నది? సీతం గూర్చిన యీసంగతి నాకు విస్తరించిచెప్పుఁ" డని వానరుల నడిగెను. అంత వానరులు సీతాదేవివృత్తాంతమును బాగుగనెఱిఁగిన హనుమంతుని నాసంగతి చెప్పుటకై పురికొలిపిరి.

మాటలందు నేర్పరియైన హనుమంతుఁడును వానరులమాటలను విని, సీతాదేవిని దాను జూచివచ్చిన తెఱఁగు చెప్పఁబూని యా రాము నితో నిట్లనెను: "ఓ రాఘవా! నేను సీతాదేవిని వెదకుటకై నూఱు యోజనముల దవ్వుగల సముద్రమును దాఁటితిని. దక్షిణ సముద్రము యొక్క దక్షిణతీరమున దుష్టస్వభావుం డయిన రావణుని దైన లంక యను పట్టణ మున్నది. ఓరామా! ఆ లంకాపురమున రావణుని యంతఃపురమునను, తనమనస్సెల్ల నీయందే యుంచికొనియున్న పతి వ్రత యయిన సీతాదేవిని గాంచితిని. అచ్చట నుద్యానవనమున నొక శింశుపావృక్షమున్క్రింద సీతాదేవి యున్నది. ఆమెకుచుట్టును రాక్షస స్త్రీలు కావలికాచుచు నెల్లప్పుడు ఆమెను బెదరించుచున్నారు. దుఃఖ ములకుఁ దగని యాదేవిని రాక్షసస్త్రీలు దుఃఖపెట్టుచున్నారు. ఆమె ఒంటి జడనుదాల్చినదై, మోమునఁ గళలేక మిమ్ముగూర్చియే చింతిం చుచు, నేలఁ బరుండుచు, మంచుకాలమందలి పద్మముమాడ్కి శోభ లేనిదై, రావణునియందు మనస్సు లేమిచే మరణమునొందుటకు సిద్ధపడు చుండఁగాఁ జూచి, తమయందు మనస్సుగలిగి యుండుట యెఱిఁగి, యిక్ష్వాకువంశము నెల్లఁ గీర్తించి తిన్నగా నాయందు నమ్మకము గలి గించుకొంటిని. తరువాత నాదేవితో మాటలాడి నేను గోనిపోయిన

యుంగరము వొసఁగితిని. ఆమెయు తమకును సుగ్రీవునికిని గల్గిన చెలిమి వార్తను విని యెక్కువ సంతోషము నందినది. ఓ పురుషశ్రేష్ఠా! ఈ సీతాదేవి పరపురుషుని తలంపకుండుట మొదలగు ఆచారములును, ఉగ్రతపస్సును, తమయందు భక్తియుఁ గలిగియున్నది. ఓ రాఘవా! మీరు చిత్రకూటమున నుండఁగా, తమరు వాయసముమీఁద బ్రహ్మాస్త్రము నేసినదియు, తమరు సీతాదేవియొక్కబొట్టు మాసిపోవఁగాఁ జెక్కిళ్లయందు మణిశిలతోఁ దిలకము దిద్దినదియుఁ జెప్పి యీవలనొక శిరోరత్నము నొసఁగె. "ఓహనుమంతుఁడా! దీనిని రాఘవునికిఁ జూపుము. అతఁ డెక్కువ యానందము నొందును. దీనిని జూచి నన్నుఁ జూచినట్లే యానందించు ననియు, ఇఁక ఒకనెలమాత్రము ప్రాణములతోనుందునుగనుక న న్నంతలో పిల్చుకపోవలయు ననియు"నాతోఁ గృశాంగియు, బతివ్రతయు, ఆఁడుజింకవలెఁ గదలెడి కన్నులుగలదియునైన ఆదేవి చెప్పెను. ఓ రాఘవా! నాతోఁ జెప్పిన సంగతి యిదియ. రాజపుత్రా! సముద్రముదాఁటు నుపాయము విచారింపుఁడు" అని హనుమంతుఁడు శ్రీరామునితోఁ జెప్పి, ఆ రామలక్ష్మణు లిద్దఱు నమ్మిక కలిగియున్నారని యెఱిఁగి, వారికి శిరోరత్నమునొసఁగి సీతాదేవి నోటి మాటగాఁ జెప్పిన మఱికొంత వృత్తాంతమును వరుసగాఁ జెప్పినవాఁడయ్యెను.

66-వ సర్గము

శ్రీరాముఁడు చూడామణిని జూచి దుఃఖించుట

హనుమంతుఁ డిట్లు చెప్పి యా మణి నీయఁగా, రాముఁడును దానింగైకొని యొమ్మున నుంచికొని, లక్ష్మణ సమేతుఁడై విలపించి, నేత్రములనుండి కన్నీరుధారలు ధారలుగాఁ గార్చుచు, సుగ్రీవునిం జూచి యిట్లనియె! "ఓ కపీంద్రా! వత్సలయగు అవు దూడమీఁది ప్రేమచే నెట్లు చన్ను చేఁపునో, అట్లు నామనస్సును ఈమణిశ్రేష్ఠముయొక్క దర్శనముచేఁ బ్రేమవలనఁ గరఁగుచున్నది. ఇది యెక్కడిది యనిన, ఈ మణిని నా మామగారు పెండ్లియప్పుడు వైదేహి కరణముగా నొసఁగెను. అప్పు డిది ఆ జానకి శిరస్సున ధరించినప్పు డెట్లు శోభిల్లుచుండెనో, అట్లే యిప్పుడును శోభిల్లుచున్నది. ఓ చెలికాఁడా! ఈ

రత్నము సముద్రమునఁ బుట్టినది. సజ్జనులచేఁ బూజింపఁబడినది. రాజ సూయయాగమునందుఁ గడుసంతుష్టుఁడైన దేవేంద్రుఁ డీ రత్నము మామామకు నొసఁగెను. ఇప్పు డీమణిశ్రేష్ఠదర్శనముచే మాతండ్రియు; మామగారును గనఁబడినట్లున్నారు. ఈమణి యా నాప్రియురాలి యొక్క శిరస్సునందు శోభిల్లుచుండును. ఈమణ్యవలోకనముచే నా ప్రియురాలే సమక్షమునకు వచ్చినట్లున్నది. నరుఁడు దప్పిగొన్న వానిని నీళ్లిచ్చి తనివినొందించునట్లు, జానకి నన్ను మాటలనెడి నీటిచేఁ దడుపుచు నాకేమిసంగతి చెప్పిపంపినది? ఓరి నాయనా! నాకుఁ బలుమా ఱా సంగతి వినిపింపుము"అని హనుమంతుని నడిగి, లక్ష్మణునిఁజూచి, "లక్ష్మణా! వైదేహి లేకయే వచ్చిన యీ సముద్రమునఁ బుట్టిన మణినిమాత్రము చూచుచున్నాఁడనే. దీనికంటుఁ గడు విచారకరమైనసంగతి మఱొక్కటి యున్నదా? సీత నారాక నెదురుచూచుచు నొకనెలదినములదాఁకఁ బ్రాణములతో నుండునేని, నాదేవి చాలకాలము బ్రదికియుండినదనియే చెప్పవలెను. ఓరినాయనా! నేను నల్లనికన్నులుగలదగు ఆసీతను బాసి యొక ఘడియైనఁ బ్రాణములతో నుండఁజాలను. ఓరి హనుమంతుఁడా! నన్నును నా ప్రియురాలగు సీతయుండు తావునకుఁ గొనిపొమ్ము. ఒక వేళ నాప్రియకాంత యెచ్చటనున్నదో తెలియక యుండిన నిమ్మళముగా నుండవచ్చును గాని, ఒకచోట నున్నదని సంగతి తెలిసిన తర్వాత నే నొకనిమిషమైన నుండఁజాలను. మిక్కిలి పిఱికిదియు, చక్కని పిఱుఁదులు గలదియు, సుగుణవతియునైన నాప్రియురాలగు సీత యాఘోర రాక్షసులనడుమ నెట్లున్నది? చీఁకటినుండి తొలఁగినను, మేఘములచేతఁ గప్పఁబడిన శరత్కాలచంద్రునిమాడ్కి రాక్షసులచేఁ జుట్టఁబడిన యా సీతాదేవియొక్క ముఖమును బ్రకాశహీనమై యుండును. హనుమంతుఁడా! సీత నాకేమి చెప్పిపంపినది? సవిస్తరముగా నిప్పుడు చెప్పుము. నీ మాటలను వినియయినను రోగి మందుచే జీవించినట్లు నేనును జీవించెదను. సౌందర్యవతియు, ఇంపుమాటలు పల్కునదియు, గొప్పపిఱుఁదులు గలదియు, నన్నుఁ బాసియున్నదియునైన సీత నాకేమి సంగతి చెప్పిపంపెను? తెలుపుము" అని హనుమంతుని శ్రీరాముఁడడిగెను.

67-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవి చెప్పినవృత్తాంతము రాముని కెఱిఁగించుట

మహాత్ముఁడగు రాముఁ డడుగఁగా, మారుతి సీతాదేవివృత్తాంత మంతయు రామున కెఱిఁగించెను: "ఓ పురుషశ్రేష్ఠా! ముందు మీరు చిత్రకూటపర్వతమున నున్నప్పుడు జరిగిన యొకవృత్తాంతము నాకు గుఱుతుగాఁజెప్పెను. అదేదియనఁగా, మీరు పర్ణశాలయందు నిద్రించు చుండఁగా, జానికి తమకంబు ముందుగా నిద్రలేచి కూర్చుండెను. అప్పు డొక కాకియాదేవి స్తనములనడుమ గీఱెను. తర్వాతఁ దా మామె తొడమీఁదఁ దలయుంచి పరుండి నిద్రించితిరి. మఱల నావాయసము వచ్చి, మాటిమాటికి నాదేవి స్తనమధ్యంబున ముక్కుతో గీఱి, యాదేవి కెక్కువ బాధను గలిగించెను. దేవి ఆపక్షియొక్క బాధనోర్వఁజాలక సుఖనిద్రయందున్న తమ్ము లేపెను. తమరును దేవియొక్క స్తనములందు గీఱినతెఱఁగుఁజూచి, నల్లత్రాచుమాడ్కిఁ గనలి, నిట్టూర్పు విడుచుచు, "ఓ పిఱికిదానా! ఎవఁడు నీ స్తనములనడుమ గీఱెను? ఎవఁ డుగ్రమయిన యైదు తలలపామువోఁ గ్రీడించుచున్నాఁడు?" అని చెప్పి, నెత్తుటఁ దడిసినగోళ్లతో యాదేవి కెదుటనే కూర్చుండియున్న వాయసమును జూచి, యతఁడు వాయువేగముగలవాఁడును, భూమియందుఁ దిరుగు చుండువాఁడును, పక్షిశ్రేష్ఠుఁడు నైన యింద్రుని పుత్రుఁడగు కాకా సురుఁ డని యెఱిఁగి, దానిమీఁది కోపముచేఁ గన్నులు గిరగిర త్రిప్పి, దానిని సంహరింపవలెనని నిశ్చయించుకొన్నవాఁడవై తాము కూర్చున్న యాసనమునుండి యొక దర్భను దీసి దానియందు బ్రహ్మాస్త్ర మభి మంత్రించి, యావాయసముపైఁ బ్రయోగించితిరి. ఆదర్భ ప్రళయ కాలాగ్నివలె ధగధగమండుచు నా కాకాసురునిమీఁదికిఁ బోయెను. అంత నాతఁడు దానికి వెఱచి పరుగెత్త నారంభింపఁగా, నాదర్భ వానిని వెంబడించిపోయెను. వాఁడు తండ్రిని, వేల్పుల నందఱను, మహర్షులను శరణు చొచ్చియు, ముల్లోకములను దిరిగియు శరణము గానక, మఱలఁ దమకడకే యేతెంచి తమ్ము శరణు చొచ్చెను. ఆకాకాసురుండు చంపఁ దగినవాఁడయ్యు, సాగిలఁబడి శరణు చొచ్చుటచే నతనియందుఁ గరుణ తలఁచి, తమరు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమూఁక మఱలదు గను

నతని దక్షిణనేత్రమును మాత్ర మా యస్త్రముచే సంహరించి, ప్రాణములతో విడువఁగా, నా కాకాసురుఁడు తమకును, దశరథమహారాజునకును నమస్కరించి, తమకడ సెలవుగైకొని నిజనివాసమునకుఁ జనియెను." అని తనమాటగా మీతోఁ జెప్పుమని చెప్పి నాతో వెండియు నిట్లనెను. "ఓ వానరోత్తమా! రాఘవుఁడస్త్రవేదులలో మేటియు, బలము, సుగుణములు గలవాఁడయ్యు రాక్షసులయం దేల యస్త్రములఁ బ్రయోగింపకున్నాఁడు? గరుడపన్నగ గంధర్వ సురాసురులలో నెవ్వరును రాముని నెదిరింపఁగలవారు లేరు. ఆరాఘవునికి నాయందు మక్కువ గలదేని, వాఁడియస్త్రములతో ననియం దారావణుని సంహరించి యుండును. తన యన్న యనుమతి గైకొని లక్ష్మణుఁడైనను వచ్చి యీ క్రూరరాక్షసుని సంహరింపరాదా? ఆ పురుషోత్తముఁ డేల నన్నుఁ గాపాడకున్నాఁడు?పురుషశ్రేష్ఠులగు రామలక్ష్మణులిద్దఱు వాయ్వగ్నులం బోలు తేజముగలవారు. దేవతలకైనను గెల్వ నలవికానివారు; సమర్థులు. అట్లుండియు నన్నేల యుపేక్షించియున్నారు? శత్రుసంహారులు, సమర్థులు నయ్యు, వారు నన్ను పేక్షచేయుట చూడఁగా, నాజన్మాంతర పాపకర్మము గొప్పగానున్న దని తోఁచెడి. దాని కే సందేహము లేదు."

అని సీతాదేవి కన్నీటితోడ దీనముగాఁ బలికిన మాటను విని, మఱల నేను ఆదేవి కిట్లని పలికితిని: "ఓదేవీ! నిక్కముగాఁ జెప్పెదను. రాముఁడు నీ వియోగశోకముచే నన్ని వస్తువులం దాశమాని చింతించుచుండును. రాముఁడు శోకపీడితుఁడై యుండునప్పుడు లక్ష్మణుఁడును వగలపాలగుచుండును. ఓదేవీ! యెట్టకేలకు నీపోబడి తెలిసెను. ఇది వ్యసనమునకుఁ దరుణము గాదు. ఈక్షణమునఁనే దుఃఖములకు ముగింపు గాంచఁగలవు. పరాక్రమవంతులును, మేటిమగలును నైన రామలక్ష్మణు లిరువురును నిన్నుఁ జూచు నుత్సాహముతో నున్నారు గావున, నేను పోయి చెప్పఁగానే వచ్చి లంకాపురమును ధ్వంసము చేయఁగలరు. మఱియు బవరమున రావణుని బంధుజనసమేతముగా మట్టుపెట్టి, నిన్ను స్వపురమునకుఁ గొనిపోవుదురు.ఇది నిక్కము. మఱియు రాముఁడు దెలియఁదగినదియు, అతనికి సంతోషము గలిగించునదియు నైన యొక యానవా లొసఁగుము" అని యడిగితిని. ఆదేవి దిక్కులెల్లఁ

జూచి, జడపైఁదాల్చునట్టి యుత్తమమణిని కొంగుముడినుండి విప్పి నా చేతఁ బెట్టను. రఘువంశోద్ధారకా! నేనును నీకుఁ జూపుటకై యాదివ్య మణిని గైకొని యాపూజ్యురాలగు సీతాదేవికి మ్రొక్కి ప్రయాణము నకుఁ ద్వరపడఁగా, సౌందర్యవతియైన జానకియు, ప్రయాణత్వరతో మేనిని బెంచుచున్న నన్నుఁ జూచి, కన్నులందుఁ గన్నీరు నిండఁగా, కన్నీటిచే మాటలు తడఁబడఁగా, నా పోకకై దిగులుపడి, దుఃఖవేగము నకు నొచ్చినదై "ఓహనుమంతుఁడా! మృగరాజులంబోలు రాజపుత్రులగు రామలక్ష్మణులకును, సుగ్రీవునికిని, వానిమంత్రులకును నా క్షేమము చెప్పుము. నిడుదచేతులవాఁడగు రాఘవుఁ డెట్లు న న్నీ శోకసాగరము నుండి గట్టెక్కించునో, అట్లు నీవు చెప్పవలసినది. ఈ నా ఘోర్వారాని దుఃఖమును, ఈరాక్షసస్త్రీల బెదరింపులను రామునికిఁ జెప్పవలసినది" అని దుఃఖముతో నీ వృత్తాంతమును జెప్పినది. నీవు ఈ వృత్తాంతమును విన్న వాఁడవై, సీతాదేవి పూర్ణక్షేమముతో నున్నదానిఁగా నెఱుఁగుము.

68-వ సర్గము

హనుమంతుఁడు సీతాదేవి చెప్పినసంగతి రామున కెఱిఁగించుట

"ఓ నరశ్రేష్ఠా! నేను ప్రయాణసంభ్రమమున నుండఁగా, మఱల నాదేవి నీయందలి యనురాగముచేతను, నాయందలి విశ్వాసముచేతను నన్ను గారవించి వెండియు నాతో నిట్లనియె: "ఓ వానరశ్రేష్ఠా! నే నిప్పుడు చెప్పిన తెఱఁగున బలువిధములుగా, ఆరామముఁ డెట్లు వడిగా వచ్చి యాహవమున రావణునిఁ బరిమార్చి నన్నుఁ బొందునో, ఆ ప్రకార ముగాఁ జెప్పవలెను. శత్రువులనణఁచునట్టి యోశూరుఁడా! నీకిష్ట మేని, యొక మఱుగుప్రదేశముననుండి కొంతయలఁత దీర్చుకొని రేపు బయలు వెడలి పొమ్ము. అదృష్టహీనురాల నైన నాకడ నీవు కొంతసేపుండినచో నీ నాదుఃఖమునకుఁ గొంతతడవు శాంతి యుండును. శౌర్యముగలవాఁడా! నీవు రామలక్ష్మణులను, సుగ్రీవాది వానరులను దోడ్కొని రాఁబోవ్రచున్నావు. నీవు వచ్చునంతలోపల నా ప్రాణములుండుట సందేహమే. దానికి యోచన యక్కఱ లేదు. మొదటనే దుఃఖములందుఁ జిక్కినదానను, దీనురాలను నైన నన్ను నిన్నుఁ జూడమిచే మరలుశోకము మఱింత దుఃఖములందుఁ ద్రోయును. ఓ వానరేంద్రా! నీకు సహాయులై

RAMA MEMORIAL LIBRARY NARLA D.P.R.I. Acc. No.

యుండు వానరులవిషయమున నిదిగో నాకొక గొప్పసంశయము గలుగు చున్నది. అదేదియనఁగా, ఆవానరసేనలుగాని, ఆరాజపుత్రులగు దశ రథతనయులుగాని, యెట్లీ సముద్రమును దాఁటఁగలరు? ఈసముద్రము దాటుటకు గరుడునికిని, నీకును, వాయువునకును మీకు మువ్వురకు మాత్రమే శక్తిగలదు. ఓకార్యవేత్తలలో శ్రేష్ఠుఁడా! నిర్వహింపనలవి కాని యీ కార్యము నెఱవేఱువిషయమునఁ దగిన యోచన యేమి యాలోచించెదవు? చెప్పుము. శత్రువీరుల సంహరించువాఁడా, నీ వొక్కఁడవే యీకార్యమును సాధింపఁజాలినవాఁడవు. నీబలాతిశ యము లోకప్రసిద్ధమైనది. రాముఁడు చతురంగబలముతో వచ్చి, యుద్ధ రంగమున రావణునిఁ బరిమార్చి, జయశాలియై నన్నుఁ దననగరము నకుఁ గొనిపోయెనేని, అది యారామునకుఁ గీర్తికరమైయుండును. నా నాథుఁడు లేనియప్పుడు, ఆ రాక్షసుఁడు న న్నెట్లు వంచనతోఁ దెచ్చెనో, అట్లు నా నాథుఁడును వానికి వెఱచి నన్నుఁ గొనిపోవుట యుక్తముగాదు. శత్రుసేనలను నొందునట్టి యా రాముఁడు లంకాపుర మును సేనలతో నిండించి, పురమెల్ల ధ్వంసముచేసి నన్నుఁ గొనిపోవు నేని, అది యతనికిఁ దగియుండును. ఓ శూరుఁడా! యుద్ధమున మొన గాఁడును, మహాధీరుఁడును నైన యా రాముని మగఁటిమికి యాతని కెట్లు యుక్తమగునో, అట్లు చేయుము."

అని సీతాదేవి యర్థగౌరవముతోను, హేతువుతోను, వినయముతోను జెప్పినమాటను విని నే నిట్లు బదులు చెప్పితి. ఓ దేవీ! వానరసైన్యములకెల్ల నాయకుఁడైన వానరశ్రేష్ఠుఁడగు బలవంతుఁడయిన సుగ్రీవుఁడు నిన్నుఁ గనుఁగొను విషయమున మిక్కిలి శ్రద్ధ వహించియున్నాఁడు. పరాక్రమవంతులును, సత్త్వయు, బలముంగల వారును, మనోవేగముతోఁ బోవువారును, ఆనతిచొప్పున నడచు వారును నైన వానరు లతనికడఁ బెక్కుండ్రున్నారు. వారు క్రిందను పైనను నడుమను ఆటంకములేకుండ సంచరింపఁగలరు. వా రెంతటి పనులం దైనను ముందు వెనుకలఁ జూడరు. వాయుమార్గమునఁ బోవునట్టివారును, మహోత్సులును, బలముచే గర్వించినవారునైన వానరులు పెక్కుండ్రు పలుమాఱు భూమండలమెల్లఁ జుట్టి వచ్చి

యున్నారు. వారిలోఁ గొందఱు నాకు సమానులును, కొందఱు నాకంటె హెచ్చినబలముగలవారు నున్నారేకాని, నాకంటెఁ దక్కువ బలముగలవాఁడు కలికమునకైనను లేఁడు. నేనే యిచటికి వచ్చినప్పుడు, వారు వచ్చు విషయమున నొక సందియమున్నదే. రాజులు చిల్లరపనులకు సామాన్యులనేకాని గొప్పవారి నంపరుగదా. కాఁబట్టి యోదేవీ! ఈ వ్యసనము వలదు. వానరశ్రేష్ఠులంద ఱొక్కయెగురులోనే యిచ్చటికి వచ్చి చేరుదురు. నరశ్రేష్ఠులగు రామలక్ష్మణు లిద్దఱు నావీఁపుమీఁద నెక్కి నవోదితులగు సూర్యచంద్రులమాడ్కిఁ దేజరిల్లుచు, మహాభాగ్యవంతురాలా! నీకడకు రాఁగలరు. సింహములంబోలు రామలక్ష్మణులు విండ్లనుదాల్చి యీలంకాపురద్వారమునకు వచ్చినప్పుడు నీవే చూడఁగలవు. గోళ్లు కోఱలు నాయుధములుగా నుపయోగించువారును, సింహశార్దూలములఁబోలు మొనగాండ్రును, మేటి యేనుఁగులబోలువారును నైన వానరులందఱు గుమిగూడి యిచ్చటికి రాఁగా, వారిని నీవే చూడఁగలవు. పర్వతములతోను మేఘములతోను సాటియగు వానరవీరులు లంకాపురమునందలి మలయపర్వతపు దరుల యందుఁ గూర్చున్నవారై, చేయఁబోవు సింహనాదమును త్వరలోనే నీవు వినఁగలవు. నీతోడ వనవాసము ముగించి మఱల నయోధ్యాపురమునకుఁ బోయి పట్టాభిషేకముచేసికొనిన రాఘవునిఁ ద్వరలోనే చూడఁగలవు" అని యిత్తెఱఁగున నేను ధైర్యపుటింపుమాటలు పలికి సమాధానపఱుపఁగా, తమ వియోగశోకముచే నొచ్చినదయ్యె జానకి నాయింపుమాటల విని కొంతతడవు నిమ్మళము నొందినదాయెను" అని హనుమంతుఁడు రామునకు సీతాదేవివృత్తాంతము నెఱిఁగించినవాఁడాయెను.

శ్రీమదాంధ్రవచనరామాయణమున సుందరకాండము సమాప్తము.

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1964—1000 ·కాపీలు.

DCL

AOUA102 B104

వచన గ్రంథములు

			ప్రతి	1-కి రూ.	పై.
కథాసరిత్సాగరము			...	12	50
ఆంధ్రవచనరామాయణము,	బాలకాండము		...	2	50
,,	అయోధ్యాకాండము		...	5	00
,,	ఆరణ్యకాండము		...	2	50
,,	కిష్కింధాకాండము		...	2	50
,,	సుందరకాండము		...	3	00
,,	యుద్ధకాండము		...	9	00
,,	ఉత్తరకాండము		...	3	50
ఆంధ్రవచనభారతము,	ఆదిసభాపర్వములు		...	6	00
,,	అరణ్యపర్వము		...	6	00
,,	విరాటోద్యోగపర్వములు		...	6	50
,,	భీష్మద్రోణపర్వములు		...	8	00
,,	కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు		...	6	00
,,	శాంతిపర్వము		...	8	00
,,	ఆనుశాసనికము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గల సంపుటము			8	00
ఆంధ్రకవిజీవితములు,	శ్రీగురుజాడ శ్రీరామమూర్తిగారు			7	00

సాక్షి, శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారిది.

ఇదియొక అపూర్వగ్రంథరాజము. కథగాదు, ప్రబంధముకాదు, నవల యంత కన్నగాదు. తెనుఁగుభాషలో నిదివఱి కెన్నడు చూచి యెరుఁగరు.

మొదటిభాగము	3 00	నాల్గవభాగము	3 00
రెండవభాగము	3 00	అయిదవభాగము	2 50
మూడవభాగము	3 00	ఆఱవభాగము	2 50

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్

పోస్టుబాక్సు 1372 292, ఎస్ప్లనేడ్, చెన్నపురి-1.

మతము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B104
పుస్తకం పేరు	శ్రీమద్భాగవత వాఙ్మయ ప్రవక్తలు సుందరకాండము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	213
పెద్ద సైజు పేజీలు	no
కొంత పేజీలు	5, DCiCi
లేని పేజీలు	no
తయారు చేసినది	M. Raji
పేజీలు విడదీసినది	M. Raji
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	yes